సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 286

మంగళవారం 6-1-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

పులిబిడ్డ..
చిన్నప్పటి నుంచి పోరాట పాఠాలు వింటూ పెరిగారు డెల్సీ రోడ్రిగ్స్ - ఫ్యామిలీలో

పదేళ్లలో 10 కోట్ల ఉద్యోగాలు
కొలువుల కల్పనకు పరిశ్రమ దిగ్గజాల ప్రయత్నం - బిజినెస్‌లో



కోపంగా ఉన్నానని మోదీకి తెలుసు!
రష్యా నుంచి భారత చమురు కొనుగోళ్లపై తాను ఆగ్రహంగా ఉన్నట్టు మోదీకి బాగా తెలుసని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు.
వివరాలు 6లో ▸

ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా కోర్టుకెళతా
పశ్చిమబెంగాల్‌లో చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సవాల్ చేస్తూ కోర్టుకు వెళ్తామని మమత ప్రకటించారు.
వివరాలు 6లో ▸

ఖలీద్, ఇమామ్‌లకు నో బెయిల్
ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితులైన ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌కు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించింది.
వివరాలు 6లో ▸

నేను వెనెజువెలా అధ్యక్షుడిని..
'నేను వెనెజువెలా అధ్యక్షుడిని. ఇంట్లో ఉండగా బంధించి తెచ్చారు. ఏ తప్పూ చేయలేదు' అని మదురో మన్‌హట్టన్ కోర్టులో చెప్పుకున్నారు.
వివరాలు 6లో ▸

• సీమ ఎత్తిపోతలకు చంద్ర 'గ్రహణం'..

ఇదిగో సాక్ష్యం!

ఈపీసీ కోరిన సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగానే ఇవ్వని బాబు సర్కార్

- పర్యావరణ అనుమతిపై 2024 నవంబర్ 5,2025 జనవరి 1న సమావేశాలు నిర్వహించిన కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఈఏసీ
- చంద్రబాబు సమాచారం ఇవ్వకపోవడంతో 2025 ఫిబ్రవరి 27న ఈఏసీ సమావేశంలో పర్యావరణ అనుమతి ఇవ్వని వైనం
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చీకటి ఒప్పందం వల్లే సీమ ఎత్తిపోతలను అడ్డుకున్న చంద్రబాబు
- ఇదే అంశాన్ని గతేడాది మార్చి 19న లోక్‌సభలో ప్రస్తావించిన వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

2లో

హే.. కృష్ణా

2లో

తెలంగాణలో మరో 16 ప్రాజెక్టులు!.. కృష్ణా జలాలపై ఏపీ హక్కుల పరిరక్షణలో చంద్రబాబు సర్కార్ ఘోర వైఫల్యం

372.54 టీఎంసీలు తరలించేలా 16 ప్రాజెక్టుల డీపీఆర్‌ల తయారీకి గతేడాది సెప్టెంబరు 16న తెలంగాణ సర్కార్ అనుమతి

ఆ ఉత్తర్వులు తక్షణమే నిలిపివేయాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లో కనీసం ఐఏ కూడా దాఖలు చేయని బాబు సర్కారు

కాళేశ్వరాన్ని కాదనలేదు

గోదావరిపై ఎన్ని ప్రాజెక్టులు కట్టినా పర్వాలేదు

ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో

ఈ ప్రభుత్వంలో అధికారులకు కోర్టులన్నా, కోర్టు ఆదేశాలన్నా

లెక్కే లేదు

పవర్‌ఫుల్ వ్యక్తి కింద పనిచేస్తున్నాం.. ఎవ్వరూ ఏమీ చేయలేరనుకుంటున్నారు

- తమను తాము చాలా గొప్ప వారిగా, శక్తివంతులుగా భావిస్తున్నారు.. ఏకంగా న్యాయస్థానాలతోనే ఘర్షణ పెట్టుకోవాలనుకుంటున్నారు
- ఇలాంటి అధికారులను ఎలా డీల్ చేయాలో మాకు బాగా తెలుసు.. విద్యాశాఖపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- కేజీబీవీల్లో పీజీటీల బదిలీపై మండిపాటు
- సర్వశిక్ష అభియాన్ పీడీపై సుమోటోగా కోర్టు ధిక్కార చర్యలు

10లో

గోదావరి జల వివాదానికి

3 'సుప్రీం' మార్గాలు!



2లో

మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం

ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్

హై-పవర్ కమిటీకి నిర్ణయాధికారం

తెలుగు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సూచన

సాక్షి టెన్త్‌క్లాస్ స్పెషల్



ఇంగ్లిష్ ప్రిపరేషన్ ప్లాన్, ముఖ్యమైన ప్రశ్నలు-సమాధానాలు, క్విజ్

- వివరాలు 11,12ల్లో ▸

అమెరికాలో రోడ్డు ప్రమాదం..

పాలకొల్లు దంపతుల మృతి

5లో

కిడ్నాప్.. దాడులు... ఆగడాలు

ఎంపీపీ ఉప ఎన్నికలలో ప్రజాస్వామ్యం ఖూనీ

వింజమూరు, బొమ్మనహాళ్‌లో పచ్చమూకల దాష్టీకం

గూండాగిరి, దౌర్జన్యాలతో ఏకపక్షంగా ఎన్నిక

3లో

- వింజమూరులో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అపహరణ
- మరో మహిళా ఎంపీటీసీపై దాడి.. ఇంకో ఎంపీటీసీ నిర్బంధం
- ఉదయగిరి టీడీపీ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అరాచకం
- టీడీపీ ఆగడాలతో వైఎస్సార్‌సీపీ సభ్యుల వాకౌట్
- బొమ్మనహాళ్‌లో సంఖ్యా బలం లేకున్నా టీడీపీ అభ్యర్థికి డిక్లరేషన్

రాష్ట్రాన్ని అరాచక రాజ్యంగా మార్చారు

ప్రజాస్వామ్యాన్ని చంద్రబాబు దారుణంగా ఖూనీ చేసి ఎన్నికలను బల ప్రదర్శనకు వేదికగా చేశారు

'ఎక్స్'లో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ధ్వజం

3లో

ఫ్యాక్టరీకి మామిడి రైతుల తాళం

- సీఎం సొంత జిల్లాలో ఘటన
- కిలో మామిడికి రూ.8 చెల్లిస్తామని చెప్పి రూ.4 ఇవ్వడంతో ఆగ్రహం
- బకాయిలు చెల్లిస్తేనే ఫ్యాక్టరీని తెరుస్తామని స్పష్టీకరణ

5లో

కోనసీమలో భారీ బ్లో అవుట్

- డ్రిల్లింగ్ చేస్తుండగా ఎగదన్నుకు వచ్చిన గ్యాస్
- 2 గంటల తరువాత భారీ విస్ఫోటనం.. కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో ప్రమాదం

10లో

క్లుప్తంగా...

రేవంత్‌రెడ్డి ప్రకటన వాస్తవమా? కాదా?

- దీనిపై చంద్రబాబు స్పష్టత ఇవ్వాలి
- రాయలసీమ సాగునీటి సాధన సమితి డిమాండ్

మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల (అర్బన్): తెలంగాణలోని రాజకీయ పార్టీలు పోటీపడి తమ రాజకీయ ప్రయోజనాల కోసం రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేయించడం దురదృష్టకరమని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి విమర్శించారు. నంద్యాలలోని సమితి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'బేసిన్లు.. బేషజాలు లేవు, తెలుగు రాష్ట్రాలు పరస్పర సహకారంతో ముందుకెళ్దాం' అని అప్పట్లో నాటి ఏపీ సీఎం వైఎస్ జగన్‌కు అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. ప్రస్తుత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన ప్రకటన నివ్వెరపరిచిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రకటన వాస్తవమా? కాదా? అనే విషయంపై చంద్రబాబు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ ప్రకటన రాయలసీమ ప్రజల హక్కులపై దాడే...

మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు రెడ్డి

తిరుపతిసిటీ: తెలంగాణ శాసనసభ సాక్షిగా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేశామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన రాయలసీమ ప్రజల హక్కులపై జరిగిన దాడి అని మాజీ ఎమ్మెల్సీ యండవల్లి శ్రీనివాసులురెడ్డి ఆరోపించారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆయన సోమవారం స్పందించారు. రాయలసీమ ప్రజలకు ప్రాణాధారమైన పథకాన్ని అడ్డుకున్నామని గర్వంగా అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి ప్రకటించడం దారుణమని పేర్కొన్నారు. ఇది ఒక ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవడం, లక్షలాది రైతులను ఆత్మహత్యల అంచుకు నెట్టే ప్రమాదకర చర్య అని హెచ్చరించారు. ఇంతటి తీవ్రమైన, రెచ్చగొట్టే ప్రకటనపై చంద్రబాబు ప్రభుత్వం నోరు విప్పకపోవడం వారి చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించడం ద్వారా ఈ ప్రాంతాన్ని ఎడారిగా మార్చే కుట్రలో భాగం అవుతోందన్నారు.

తెలంగాణ వాదనలకు బలం చేకూర్చడం బాధాకరం

రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త పురుషోత్తమరెడ్డి

తిరుపతి సిటీ: రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తానే నిలిపివేయించానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో కొందరు మంత్రులు చేస్తున్న ప్రకటనలు రాయలసీమకు ఉపయోగపడకపోగా... తెలంగాణ వాదనకు బలం చేకూర్చే విధంగా ఉండటం బాధాకరమని రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త పురుషోత్తమరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయ కోణంలో గత ప్రభుత్వ హయాంలో రాయలసీమ ఎత్తిపోతల నిలిచిపోయిందని మంత్రులు చెప్పడం సరికాదన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌కు పూర్తి అనుమతులు రాక ముందే కుడి, ఎడమ కాలువల నిర్మాణాన్ని వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టారని గుర్తుచేశారు. ఇప్పటికి పోలవరం అందుబాటులోకి రాకపోయినా కుడి కాలువ (పట్టిసీమ) ద్వారా నీటిని సరఫరాచేసే అవకాశం వచ్చిందన్న విషయం బహిరంగ సత్యమని తెలిపారు.

ఆయనకు చేతకాదు నువ్వు నమ్మాల్సిందే!

● సీమ ఎత్తిపోతలకు చంద్ర 'గ్రహణం'..

ఇదిగో సాక్ష్యం!

ఉద్దేశపూర్వకంగానే ఈఏసీ కోరిన సమాచారాన్ని ఇవ్వని బాబు సర్కార్



EAC Deliberations:

4. The EAC in the current meeting deliberated on the aforementioned issue and agreed with the concern raised by the Ministry. In this regard, it was suggested that the at the time of EC application the PP shall submit an undertaking in the form of an affidavit authorised and duly signed by the competent authority stating that no work has been done beyond the purpose of preparation of DPR along with a comprehensive report to the Ministry on the actions taken for site restoration, including photographic evidence, restoration methods, and a timeline of the activities. Further, if any part of the information and data found to be false or misleading at any stage, he shall be liable for action under the provisions of Water (Prevention and Control of Pollution) Act, 1974; the Air (Prevention and Control of Pollution) Act, 1981; and the Environment (Protection) Act, 1986.

5. In light of the above, the Committee unanimously recommended the modification of additional Terms of reference suggested vide EAC Meeting dated 10.01.2025.

ఈఏసీ సమావేశాల్లో సభ్య కార్యదర్శి అడిగిన వివరాలను చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో గతేడాది ఫిబ్రవరి 27న రాయలసీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతి ఇవ్వని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఈఏసీ

సాక్షి, అమరావతి: కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షిస్తూ.. తడారిన గొంతులు తడిపేందుకు.. తెలుగుగంగ, గాలేరు–నగరి, శ్రీశైలం కుడి గట్టు కాలువ (ఎస్సార్బీసీ) కింద 9.6 లక్షల ఎకరాల్లో పంటలను రక్షించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతలకు చంద్ర'గ్రహణం' పట్టుకుంది! ఆ ఎత్తిపోతల పూర్తయితే వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందనే ఈర్ష్యతోనే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఈఏసీ (ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ) 2024 నవంబర్ 5న.. 2025 జనవరి 1న నిర్వహించిన సమావేశాల్లో ఈఏసీ సభ్య కార్యదర్శి అడిగిన వివరాలను చంద్రబాబు సర్కార్ ఇవ్వలేదు. దాని పర్యవసానంగానే గతేడాది ఫిబ్రవరి 27న నిర్వహించిన ఈఏసీ సమావేశంలో రాయలసీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతి ఇచ్చేందుకు నిరాకరించిందని సాగునీటిరంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇదే అంశాన్ని లోక్‌సభలో గతేడాది మార్చి 19న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రస్తావించి చంద్రబాబు సర్కార్ తీరును కడిగిపారేశారు. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షించుకోవడానికి.. రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు సాగు, తాగునీరు, చెన్నైకి తాగునీటిని సరఫరా చేయడానికి.. తెలుగుగంగ, గాలేరు–నగరి, ఎస్సార్బీసీ ఆయకట్టులో పంటలను రక్షించుకోవడానికి రాయలసీమ ఎత్తిపోతల పనులు కొనసాగించడానికి పర్యావరణ అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

టీడీపీ సానుభూతిపరుడు గవినోళ్ల శ్రీనివాస్‌తో కేసు..

ఓటుకు కోట్లు కేసు భయంతో కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణకు చంద్రబాబు తాకట్టు పెట్టడంతో 2014–19 మధ్య ఎస్సార్బీసీ, తెలుగుగంగ, గాలేరు–నగరి ఆయకట్టుకు నీళ్లందక పంటలు ఎండిపోయి రైతులు అల్లాడారు. ఈ నేపథ్యంలో ఏపీకి హక్కుగా దక్కిన నీటిని వాడుకుని తడారిన గొంతులను తడపడం, ఎండిపోతున్న పంటలను రక్షించడం కోసం తెలంగాణ తరహాలోనే శ్రీశైలంలో 800 అడుగుల నీటి మట్టం నుంచి రోజుకు 3 టీఎంసీల చొప్పున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన కుడి ప్రధాన కాలువలోకి నీటిని ఎత్తిపోసేలా రూ.3,825 కోట్ల వ్యయంతో 2020 మే 5న రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆ పనులను రూ.3,707.06 కోట్ల వ్యయంతో కాంట్రాక్టు సంస్థకు అప్పగించి పనులను పరుగులెత్తించింది. సీమ ఎత్తిపోతల పథకం పూర్తయితే వైఎస్ జగన్‌కు ఎక్కడ మంచి పేరొస్తుందోననే అక్కసుతో.. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందంటూ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన టీడీపీ సానుభూతిపరుడు గవినోళ్ల శ్రీనివాస్‌తో ఎన్జీటీ (చెన్నై బెంచ్)లో ఆ ప్రాంతంలోని టీడీపీ నేతల ద్వారా చంద్రబాబు అప్పట్లో రిట్ పిటిషన్ దాఖలు చేయించారు. దీనిపై విచారించిన ఎన్జీటీ, పర్యావరణ అనుమతి తీసుకుని ఆ పనులు చేపట్టాలంటూ 2020 అక్టోబర్ 29న ఆదేశించింది. రాయలసీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తూనే.. ఆ అనుమతి వచ్చేలోగా చెన్నైకి 15 టీఎంసీలు, రాయలసీమలో దుర్భిక్ష ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసే పనులను తొలి దశలో చేపట్టాలని 2023 ఆగస్టు 11న నిర్ణయించింది. చెన్నైకి నీటిని సరఫరా చేయాలంటే.. తెలుగు గంగ ప్రధాన కాలువపై ఉన్న వెలిగోడు రిజర్వాయర్ (9.5 టీఎంసీలు), సోమశిల (17.33 టీఎంసీలు), కండలేరు (8.4 టీఎంసీలు) రిజర్వాయర్‌లలో మొత్తంగా కనీసం 35.23 టీఎంసీలు నిల్వ ఉండాలి. అప్పుడే చెన్నైకి 15 టీఎంసీలను సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది. దీనికి తోడు రాయలసీమలోని దుర్భిక్ష ప్రాంతాలకు తాగునీటి కోసం 8.6 టీఎంసీలు వెరసి 58.83 టీఎంసీలు (35.23+15+8.6) శ్రీశైలం నుంచి తరలించే పనులను పర్యావరణ అనుమతి వచ్చేలోగా చేపట్టడానికి అనుమతి ఇవ్వాలన్న అధికారుల ప్రతిపాదనకు గత ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ఆ మేరకు అధికారులు పనులు చేపట్టారు. 22.54 శాతం పనులు పూర్తి చేశారు.

చీకటి ఒప్పందంతో పనులు నిలిపివేత

సీఎం చంద్రబాబుతో ఏకాంతంగా సమావేశమై సీమ ఎత్తిపోతల పనులను నిలిపి వేయించా.. కావాలంటే తనిఖీ చేసుకోవచ్చంటూ తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా శనివారం రాత్రి ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. చంద్రబాబు సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాయలసీమ ఎత్తిపోతల పనుల్లో తట్టెడు మట్టి కూడా తీయలేదు. దీన్ని బట్టి తెలంగాణలో రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రయోజనాల కోసం రాయలసీమ ఎత్తిపోతల పనులను చంద్రబాబు ఆపేసి.. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను మళ్లీ తాకట్టు పెట్టారని సాగునీటిరంగ నిపుణులు, రైతులు మండిపడుతున్నారు. ఈ చీకటి ఒప్పందం కుదరడం వల్లే.. పర్యావరణ అనుమతిపై కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నిర్వహించిన సమావేశాల్లో ఈఏసీ సభ్య కార్యదర్శి అడిగిన వివరాలను చంద్రబాబు సర్కార్ కావాలనే ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమ ఎత్తిపోతల పనులు నిలిచిపోవడానికి పర్యావరణ అనుమతి రాలేదనే సాకులు చూపడానికే చంద్రబాబు సర్కార్ ఈఏసీకి వివరాలు అందజేయలేదని స్పష్టం చేస్తున్నారు.

హే.. కృష్ణా

తెలంగాణలో మరో 16 ప్రాజెక్టులు!

- కృష్ణా జలాలపై ఏపీ హక్కుల పరిరక్షణలో చంద్రబాబు సర్కార్ ఘోర వైఫల్యం
- 372.54 టీఎంసీలు తరలించేలా 16 ప్రాజెక్టుల డీపీఆర్‌ల తయారీకి గతేడాది సెప్టెంబరు 16న తెలంగాణ సర్కార్ అనుమతి
- ఆ ఉత్తర్వులు తక్షణమే నిలిపివేయాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లో కనీసం ఐఏ కూడా దాఖలు చేయని చంద్రబాబు సర్కారు
- అదే సమయంలో.. పోలవరం–నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టును ఆపాలంటూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన తెలంగాణ ప్రభుత్వం
- అనుమతి లేకుండా వడివడిగా నారాయణపేట–కొడంగల్, పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పనులు
- చీకటి ఒప్పందంతో రాయలసీమ ఎత్తిపోతల పనులను నిలిపేసిన చంద్రబాబు



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Irrigation & CAD (ISWR) Department – Utilization of Krishna waters in the erstwhile Districts of Mahabubnagar, Nalgonda, Rangareddy, Warangal, Khammam and drinking water needs of Hyderabad city - Detailed investigations and preparation of DPR for certain proposals to augment the existing and ongoing reservoir capacities (both off line and on line) in projects in Krishna Basin – Permission accorded - Orders -Issued.

IRRIGATION AND CAD (ISWR) DEPARTMENT

G.O.Ms.No.34 **Dated :16.09.2025.**

జూరాల, శ్రీశైలం జలాశయాల నుంచి 372.54 టీఎంసీలను తరలించడం కోసం 16 ప్రాజెక్టులు చేపట్టడానికి డీపీఆర్‌ల తయారీకి అనుమతి ఇస్తూ గతేడాది సెప్టెంబరు 16న తెలంగాణ సర్కార్ జారీ చేసిన ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణలో చంద్రబాబు సర్కార్ ఘోర వైఫల్యం, బాధ్యతా రాహిత్యానికి మరో నిదర్శనమిది. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో కుదిరిన చీకటి ఒప్పందంతో రాయలసీమ ఎత్తిపోతల పనులను నిలిపివేసిన సీఎం చంద్రబాబు.. జూరాల, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి 372.54 టీఎంసీలు తరలించేందుకు 16 ప్రాజెక్టుల డీపీఆర్‌ల తయారీకి గతేడాది సెప్టెంబరు 16న తెలంగాణ సర్కార్ జారీ చేసిన ఉత్తర్వులను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లోగానీ సుప్రీం కోర్టులోగానీ సవాల్ చేయలేదు. మరోవైపు శ్రీశైలం నుంచి పది టీఎంసీలు తరలించి 1.15 లక్షల ఎకరాలకు నీళ్లందించడం కోసం రూ.2,945 కోట్లతో అనుమతి లేకుండా తెలంగాణ సర్కార్ చేపట్టిన నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పనులతో పాటు తాగునీటి అవసరాల ముసుగులో పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పనులను యథేచ్ఛగా చేస్తున్నా చంద్రబాబు సర్కార్ నోరుమెదపకపోవడం గమనార్హం. వీటిని బట్టి చూస్తే.. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులకు చంద్రబాబు సర్కార్ నీళ్లొదులుతున్నట్లు స్పష్టమవుతోందని సాగునీటి రంగ నిపుణులు, రైతులు మండిపడుతున్నారు.

మొద్దు నిద్రలో బాబు సర్కారు..!

కృష్ణా నదిలో 75 శాతం నీటి లభ్యత ఆధారంగా ఉమ్మడి రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్(కేడబ్ల్యూడీటీ–1) కేటాయించిన 811 టీఎంసీల నికర జలాలు.. 65 శాతం, సరాసరి లభ్యత ఆధారంగా కేడబ్ల్యూడీటీ–2 కేటాయించిన 194 టీఎంసీల మిగులు జలాలు వెరసి 1,005 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు పంపిణీ చేయడంపై ప్రస్తుతం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారిస్తోంది. పరీవాహక ప్రాంతం (బేసిన్) ప్రాతిపదికగా తమకు 904 టీఎంసీలు కేటాయించాలని ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ సర్కార్ తుది వాదనలు వినిపించింది. ఈ క్రమంలో కృష్ణా ప్రధాన పాయపై జూరాల, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి.. ఉప నదుల నుంచి 372.54 టీఎంసీలు తరలించేలా, కొత్తగా 16 ప్రాజెక్టులు చేపట్టడానికి డీపీఆర్‌ల (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) తయారీకి అనుమతిస్తూ తెలంగాణ ప్రభుత్వం గత సెప్టెంబరు 16న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కేటాయింపులు చేయకుండానే 372.54 టీఎంసీలు తరలించేలా 16 ప్రాజెక్టులు చేపట్టడానికి తెలంగాణ సర్కార్ జారీ చేసిన జీవోను నిలుపుదల చేయాలని.. ఆ ప్రాజెక్టులను అడ్డుకోవాలని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లో చంద్రబాబు ప్రభుత్వం ఐఏ (ఇంటర్ లొకేటరీ అప్లికేషన్) దాఖలు చేయకపోవడాన్ని సాగునీటిరంగ నిపుణులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. వాటిని నిలుపుదల చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయకపోవడంపై నివ్వెరపోతున్నారు. ఇది కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణలో చంద్రబాబు సర్కార్ తీవ్ర నిర్లక్ష్యానికి, చిత్తశుద్ధి లోపానికి అద్దం పడుతోందని స్పష్టం చేస్తున్నారు. అదే సమయంలో ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం–నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు పనులను నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టులో తెలంగాణ సర్కార్ రిట్ పిటిషన్ దాఖలు చేసిందని గుర్తు చేస్తున్నారు.

మన హక్కులకు నీళ్లొదిలి..!

విభజన తర్వాత ఎలాంటి అనుమతులు లేకుండా 120 టీఎంసీలను తరలించేలా పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల, సుంకేశుల బ్యారేజీ గర్భం నుంచి తుంగభద్ర జలాలను తరలించేలా తుమ్మిళ్ల ఎత్తిపోతల.. కల్వకుర్తి, నెట్టెంపాడు ఎత్తిపోతల సామర్థ్యం పెంచి.. భారీ ఎత్తున కృష్ణా జలాలను తరలించేలా తెలంగాణ సర్కార్ పనులు చేపట్టినా.. ఓటుకు కోట్లు కేసు భయంతో నాటి సీఎం చంద్రబాబు నోరు మెదపలేదు. అంటే వ్యక్తిగత ప్రయోజనాల కోసం కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణకు తాకట్టు పెట్టారన్నది స్పష్టమవుతోంది. అనంతరం 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర హక్కుల పరిరక్షణకు రాజీలేని పోరాటం చేసింది. అందులో భాగంగానే రాయలసీమ ఎత్తిపోతల చేపట్టింది. పోలవరం కుడి కాలువ నుంచి కృష్ణా డెల్టాకు మళ్లించే 80 టీఎంసీల గోదావరి జలాలకుగానూ.. సాగర్‌కు ఎగువన 45 టీఎంసీల కృష్ణా జలాలు తమకే దక్కుతాయని, వాటితోపాటు చిన్న నీటిపారుదల విభాగంలో 45 టీఎంసీల మిగులు ఉందని.. వెరసి ఆ 90 టీఎంసీలను పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు కేటాయిస్తూ తెలంగాణ సర్కార్ జీవో జారీ చేయడంపై అప్పట్లో వైఎస్సార్‌సీపీ సర్కార్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఐఏ దాఖలు చేసి, దాన్ని అడ్డుకుందని సాగునీటిరంగ నిపుణులు గుర్తుచేస్తున్నారు.

తెలంగాణ సర్కార్ 372.54 టీఎంసీల కృష్ణా జలాల తరలింపునకు డీపీఆర్ తయారీకి అనుమతి ఇచ్చిన ప్రాజెక్టులు ఇవే..

1. రేలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యం 4 టీఎంసీల నుంచి 10 టీఎంసీలకు పెంపు
2. గట్టు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యం 1.32 నుంచి 10 టీఎంసీలకు పెంపు
3. నెట్టెంపాడు ఎత్తిపోతల రెండో దశలో మరో 4 టీఎంసీలు తరలింపు
4. 0.5 టీఎంసీల సామర్థ్యంతో బుజ్జితండా–భీమ తండా ఎత్తిపోతల
5. కల్వకుర్తి ఎత్తిపోతల సామర్థ్యం మరో 20.12 టీఎంసీలు పెంపు
6. జూరాల వరద కాలువ ద్వారా 100 టీఎంసీలు తరలించి 11.3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం
7. కోయిల్‌కొండ–గండీడు ఎత్తిపోతల ద్వారా 123 టీఎంసీలు తరలింపు
8. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల సామర్థ్యం అదనంగా 3.30 టీఎంసీలు పెంపు
9. జయపురం వద్ద 2 టీఎంసీల సామర్థ్యంతో ఆకేరు బ్యారేజ్
10. విస్సంపల్లె వద్ద 1.2 టీఎంసీల సామర్థ్యంతో మరో ఆకేరు బ్యారేజ్
11. 1.3 టీఎంసీల సామర్థ్యంతో మున్నేరు బ్యారేజ్
12. గార్ల వద్ద మున్నేరుపై 1.2 టీఎంసీల సామర్థ్యంతో మరో బ్యారేజ్
13. డోర్నకల్ మండలం ముల్కపల్లి వద్ద 35 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్
14. ఎద్దులచెర్వు వద్ద ఆకేరుపై 1.3 టీఎంసీల సామర్థ్యంతో మరో బ్యారేజ్
15. శ్రీశైలం ఎడమగట్టు కాలువ విస్తరణలో భాగంగా 3.99 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా సోమశిల వద్ద 35 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్
16. శ్రీశైలం నుంచి నీటిని తరలించి రీజనల్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో తాగునీటి కోసం దేవులమ్మ నాగారం (పది టీఎంసీలు), దండు మైలారం (పది టీఎంసీలు), ఆరుట్ల (పది టీఎంసీలు సామర్థ్యంతో) రిజర్వాయర్ల నిర్మాణం.

గోదావరి జల వివాదానికి మూడు 'సుప్రీం' మార్గాలు!

- మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం
- ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్
- హై–పవర్ కమిటీకి నిర్ణయాధికారం
- తెలుగు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి నదీ జలాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నెలకొన్న 'పోలవరం–నల్లమల సాగర్' ఎత్తిపోతల పథకం వివాదంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం మూడు మార్గాలను సూచించింది. పోలవరం ప్రాజెక్టును అనుసంధానిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన ఎత్తిపోతల ప్రాజెక్టు టెండర్లపై తక్షణం 'స్టే' ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం సుదీర్ఘ విచారణ జరిపింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. ఏపీ ప్రభుత్వం గోదావరి ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గోదావరి బేసిన్‌లో తెలంగాణకు 968 టీఎంసీల వాటా ఉందని, ప్రతిపాదిత ప్రాజెక్టు ద్వారా 200 టీఎంసీలను మళ్లిస్తే తమ రాష్ట్ర వాటాకు గండి పడుతుందని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీతోపాటు పలువురు సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. తాము కేవలం ప్లానింగ్ దశలోనే ఉన్నామని ధర్మాసనానికి వివరించారు. ఇరు రాష్ట్రాల వాదనలు విన్న ధర్మాసనం సమస్య పరిష్కారానికి మూడు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించింది.

మూడు మార్గాలు ఇవీ...

- ఇరు రాష్ట్రాల ప్రతినిధులు కలిసి కూర్చుని, మధ్యవర్తిత్వం ద్వారా స్నేహపూర్వకంగా సమస్యను పరిష్కరించుకోవచ్చు.
- ఆర్టికల్ 32 కింద రిట్ పిటిషన్‌గా కాకుండా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం తెలంగాణ సివిల్ సూట్ దాఖలు చేయవచ్చు. దీని వల్ల సాక్ష్యాధారాలతో సమగ్ర విచారణ చేయడానికి కోర్టుకు అవకాశం ఉంటుంది.
- తెలంగాణ లేవనెత్తుతున్న అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైతే ప్రాజెక్టును నిలిపివేసే అధికారం (స్టే) కల్పిస్తూ 'ఈ వివాదంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాటు చేసిన' హై–పవర్ కమిటీకి కోర్టు ఆదేశాలు ఇవ్వవచ్చు.
- ఈ ప్రతిపాదనలపై తమ ప్రభుత్వం నిర్ణయాన్ని తెలుసుకునేందుకు సమయం కావాలని తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది సింఘ్వీ కోరడంతో.. ధర్మాసనం తదుపరి విచారణను జనవరి 12వ తేదీకి వాయిదా వేసింది.

ప్రజాధనం వృథా కాకూడదు కదా..?

ఏపీ ప్రభుత్వానికి ధర్మాసనం కీలక ప్రశ్న

వాదనల సమయంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఏపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి కీలక ప్రశ్న వేశారు. కేవలం ప్రాజెక్టు ప్లానింగ్ దశలోనే ఉన్నామని, పీఎఫ్ఆర్, డీపీఆర్ తయారీ కోసమే సర్వేలు, టెండర్ల ప్రక్రియ చేపట్టామని, క్షేత్రస్థాయిలో నిర్మాణాలు చేయడం లేదన్న ఏపీ వాదనలకు సీజేఐ స్పందిస్తూ... 'ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్లానింగ్ దశలోనే ఉండొచ్చు. కానీ, ఒకవేళ భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు నిబంధనలకు విరుద్ధమని తేలి ఆగిపోతే... ఇప్పుడు ఆ ప్లానింగ్, డాక్యుమెంటేషన్ కోసం ఖర్చు చేసిన ఏపీ ప్రజల నిధులే వృథా అవుతాయి కదా?' అని ప్రశ్నించారు.

కాళేశ్వరాన్ని కాదనలేదు

- గోదావరిపై ఎన్ని ప్రాజెక్టులు కట్టినా పర్వాలేదు
- తెలంగాణలో కల్వకుర్తి లిఫ్ట్, ఏఎమ్మార్ ఎత్తిపోతల, నెట్టెంపాడు నేనే పూర్తి చేశా
- కృష్ణా డెల్టా ఆధునికీకరణతో పొదుపు చేసిన నీటిని తెలంగాణకు ఇచ్చా: సీఎం చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, అందుకే తెలంగాణలో కాళేశ్వరం నిర్మాణానికి తానెప్పుడూ అడ్డు చెప్పలేదని, ఎన్ని ప్రాజెక్టులు కట్టినా పర్వాలేదని ముందుకు వెళ్లానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. తెలంగాణ ప్రాంతంలో కల్వకుర్తి లిఫ్ట్, ఏఎమ్మార్ ఎత్తిపోతల, నెట్టెంపాడు లాంటి ప్రాజెక్టులను తానే పూర్తి చేశానన్నారు. గోదావరిపై గుత్ప, అలీసాగర్, దేవాదుల ఎత్తిపోతల లాంటి పథకాలను చేపట్టామని చెప్పారు. కృష్ణా డెల్టా ఆధునికీకరణతో పొదుపు చేసిన 20 టీఎంసీల నీటిని తెలంగాణకు కేటాయించి బీమా లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేశామన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య జల వివాదాలు శాశ్వతంగా పరిష్కారం కావాలన్నదే తన లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అన్ని నదులను అనుసంధానించాలన్నారు. గుంటూరులో శ్రీసత్య సాయి ఆధ్యాత్మిక కేంద్రంలో ఆంధ్ర సారస్వత పరిషత్ నిర్వహిస్తున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు సోమవారం సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని తపాలా శాఖ రూపొందించిన ప్రత్యేక కవర్‌ను సీఎం ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ వందలాది భాషలున్న మన దేశంలో కేవలం 6 భాషలకే ప్రాచీన హోదా లభించిందని, అందులో తెలుగు ఉండటం గర్వకారణమన్నారు. తమిళ కవి సుబ్రమణ్య భారతి 'సుందర తెలుంగై' అని కీర్తించారన్నారు. ప్రపంచ మహాసభలకు హాజరైన ఉపాధ్యాయులను ఆన్ డ్యూటీగా పరిగణిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సైబరాబాద్ నిర్మించి ఐటీకి ప్రాధాన్యత ఇచ్చానని, తాను ఇచ్చిన ఐటీ పిలుపుతో ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారు అద్భుతంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. గోవా గవర్నర్ పి.అశోక్‌గజపతిరాజు, స్పీకర్ సీహెచ్ అయ్యన్న పాత్రుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

క్లుప్తంగా...

గవర్నర్ నజీర్‌కు వైఎస్ జగన్ జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆయురారోగ్యాలతో ఆనందంగా దీర్ఘాయుష్షుతో జీవించాలని కోరుకుంటున్నట్లు వైఎస్ జగన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.

మమతా బెనర్జీకి వైఎస్ జగన్ పుట్టినరోజు శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వైఎస్ జగన్ సోమవారం మమతా దీదీకి ఈ మేరకు ట్వీట్ చేశారు. ఆమె ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ప్రార్థిస్తున్నాను అంటూ ఆయన పేర్కొన్నారు.

'కూటమి' అరాచకం పరాకాష్టకు..

లేళ్ళ అప్పిరెడ్డి, పుత్తా శివశంకర్ ఫైర్

లేళ్ళ అప్పిరెడ్డి

పుత్తా శివశంకర్

సాక్షి, అమరావతి: రెండు ఎంపీపీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకం పరాకాష్టకు చేరిందని.. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ మండిపడ్డారు. కేవలం ఆరు నెలల పదవీ కాలం కోసం ఎంపీటీసీ సభ్యులను పట్టపగలే కిడ్నాప్ చేయడం దారుణమని వారు ఆక్షేపించారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం వీరిరువురూ మీడియాతో మాట్లాడారు. వింజమూరు, బొమ్మనహళ్లి ఉప ఎన్నికల్లో టీడీపీ నేతలు రౌడీయిజానికి దిగితే పోలీసులు చోద్యం చూశారని విమర్శించారు. వీరిద్దరూ ఇంకా ఏమన్నారంటే.. రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు అరాచకంగా, అప్రజాస్వామికంగా పాలిస్తున్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం కాకుండా లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగమే రాష్ట్రంలో అమలవుతోంది. శాంతిభద్రతల నుంచి ఎన్నికల నిర్వహణ వరకూ అన్నీ అధికార మదంతో నిర్వహిస్తున్నారు. వింజమూరు, బొమ్మనహళ్లి ఎంపీపీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ దౌర్జన్యాలకు పాల్పడింది. ఎన్నికలే అవసరం లేదన్నట్లుగా, తాము చెప్పిందే వేదమన్నట్లుగా వ్యవహరిస్తోంది.

రాష్ట్ర ఎన్నికల సంఘం ఏం చేస్తోంది?..

ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తూ, ప్రజాప్రతినిధులను కిడ్నాప్ చేస్తుంటే రాష్ట్రంలో వ్యవస్థలు ఏం చేస్తున్నాయన్న అనుమానాలు కలుగుతున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం కళ్లుండి చూడలేని, నోరుండి మాట్లాడలేని స్థితికి వెళ్లింది. నెల్లూరులో మహిళా ఎంపీటీసీ సభ్యురాలిని లాక్కెళ్లిన ఘటనను పోలీసులు చూస్తూ నిలబడ్డారు. టీడీపీ నేతల ఒత్తిళ్లకు లోబడి అధికారులు అక్రమాలకు పాల్పడితే, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక చర్యలు తప్పవు. వింజమూరు, బొమ్మనహళ్లి ఎంపీపీ ఉప ఎన్నికలను వెంటనే రద్దుచేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి.

కిడ్నాప్.. దాడులు.. ఆగడాలు

- వింజమూరు, బొమ్మనహాళ్‌లో పచ్చమూకల దాష్టీకం
- గూండాగిరి, దౌర్జన్యాలతో ఏకపక్షంగా ఎంపీపీ ఎన్నిక
- వింజమూరులో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అపహరణ
- మరో మహిళా ఎంపీటీసీపై దాడి.. ఇంకో ఎంపీటీసీ నిర్బంధం
- ఉదయగిరి టీడీపీ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అరాచకం
- టీడీపీ ఆగడాలతో వైఎస్సార్‌సీపీ సభ్యుల వాకౌట్

బలం లేకున్నా బరిలో దిగి.. ఓడిపోతామని తెలిసి.. ఎంపీపీ ఉప ఎన్నికలో టీడీపీ బరితెగించింది. వారి ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో... ఖాకీల సాక్షిగా... గూండాగిరి, దౌర్జన్యాలకు తెగబడింది. వైఎస్సార్‌సీపీ సభ్యుల కిడ్నాప్.. దాడులు.. నిర్బంధాలతో ప్రజాస్వామ్యాన్ని పచ్చమూక ఖూనీ చేసింది. సోమవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరు, అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాళ్ ఎంపీపీ ఉప ఎన్నికలలో అధికార పార్టీ ఆగడాలకు అంతులేకుండా పోయింది.. అడ్డదారుల్లో వెళ్లి పచ్చ పార్టీ అక్రమంగా గెలుపును ఖాతాలో వేసుకుంది. 'రెడ్‌బుక్' రాజ్యాంగాన్ని ప్రయోగించి దొడ్డిదారిన పదవులు దక్కించుకోవడం విస్తుపోయేలా చేసింది.

వింజమూరులో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీని కిడ్నాప్ చేయడానికి బలవంతంగా కారులోకి నెడుతున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్, వింజమూరు (ఉదయగిరి): పోలీసుల సమక్షంలోనే వింజమూరు ఎంపీపీ ఉప ఎన్నికలో టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులపై దౌర్జన్యం చేశాయి. ఉదయగిరి టీడీపీ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎంపీడీవో కార్యాలయంలో తిష్టవేసి దీన్నంతటినీ నడిపించారు. ఆయన కనుసన్నల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన ఊటుకూరు ఎంపీటీసీ సభ్యుడు జి.మల్లికార్జునను బలవంతంగా లాక్కెళ్లి కారులో ఎక్కించి కిడ్నాప్ చేశారు. మరో ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ అయిన ఇనగలూరి మోహన్‌రెడ్డిని పోలీసులు నిర్బంధించారు. తాత్కాలిక ఎంపీపీ అన్నంగి రమణయ్య వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతారనే అనుమానంతో అజ్ఞాతంలోకి తీసుకెళ్లారు. నల్గొండ్ల ఎంపీటీసీ ఉంటా రత్నమ్మనూ కిడ్నాప్ చేసేందుకు బరితెగించారు. ఈ క్రమంలో పెనుగులాటలో ఆమె చేతికి గాయమైంది. అయినా లెక్కచేయకుండా ప్రతిఘటించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీపీ అభ్యర్థి పల్లాల కొండారెడ్డి, ఎంపీటీసీ డేగా వంశీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేవునూరి శ్రీనివాసరెడ్డిలు... టీడీపీ దౌర్జన్యాన్ని అడ్డుకుని రత్నమ్మను రక్షించారు. తమ సభ్యుడిని కిడ్నాప్ చేశారంటూ కొండారెడ్డి మిగతా ఎంపీటీసీలతో ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. దౌర్జన్యాన్ని ఎన్నికల అధికారి నిర్మలాదేవికి వివరించి, ఎన్నిక వాయిదా వేయాలని కోరారు. కానీ, కోరం ఉందని ఎన్నికల అధికారులు చెప్పడంతో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు వాకౌట్ చేశారు. ఎన్నికల పరిశీలకులు, జేసీ మొగిలి వెంకటేశ్వర్లుకు విషయం మొత్తం చెప్పినా ఫలితం లేకపోయింది.

2 నిమిషాల్లో సభ వాయిదా పడుతుందనగా...

ఉప ఎన్నిక ఉదయం 11కు ప్రారంభమవుతుందనగా 10.30కు ఐదుగురు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు బంగ్లా సెంటర్ చేరుకున్నారు. పోలీసులు వారి కారులో కాకుండా నడిచివెళ్లాలని చెప్పారు. ఇంతలో టీడీపీ శ్రేణులు అడ్డుకుని దౌర్జన్యం చేశాయి. ఇద్దరు సభ్యుల కిడ్నాప్‌నకు ప్రయత్నించి.. ఒకరిని లాక్కెళ్లారు. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదు. టీడీపీ ఎంపీటీసీలను వారి వాహనంలో తీసుకొచ్చారు. కాగా, ఎంపీపీ ఎన్నికకు ఆరుగురు సభ్యుల కోరం అవసరం. నలుగురు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు బాయ్‌కాట్ చేశారు. టీడీపీ తరఫున ఐదుగురే మిగిలారు. సమావేశం వాయిదా పడేందుకు 2 నిమిషాలు ఉందనగా తాత్కాలిక ఎంపీపీ రమణయ్యను పోలీసులు దొడ్డిదారిన తీసుకొచ్చారు. కోరం ఉందంటూ సమావేశం నిర్వహించి వనిపెంట హైమావతిని ఎంపీపీగా ఏకగ్రీవంగా ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు.

మెట్టు వాహనంపై టీడీపీ గూండాల రాళ్ల దాడి

మండల పరిషత్ నుంచి బయటకు వచ్చేసిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు.. మెట్టు గోవిందరెడ్డిని కలిశారు. ఆయన వారిని వెంటబెట్టుకుని జరిగిన అన్యాయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు అనంతపురం బయలుదేరారు. దేవగిరి వద్ద టీడీపీ గూండాలు మెట్టు వాహనంపైకి రాళ్లు రువ్వారు. వాహనం దెబ్బతినగా.. డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం తప్పింది. కాగా, ఎంపీపీ ఎన్నిక నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి టీడీపీ దౌర్జన్యపూరిత వైఖరి తమను తీవ్ర ఆందోళనకు గురిచేసిందని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు వాపోయారు. టీడీపీ ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఎన్నికను ఏకపక్షం చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యే కాలవ దౌర్జన్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బొమ్మనహాళ్‌లో 'పచ్చ' మూక దాష్టీకం 'కాలవ' రౌడీయిజం.. అడుగడుగునా ఆంక్షలు

బొమ్మనహాళ్ ఎంపీపీ ఉప ఎన్నిక టీడీపీ అరాచకాలకు పరాకాష్టగా నిలిచింది. ఆ పార్టీకి సంఖ్యా బలం లేకపోయినా ఏడుగురు ఎంపీటీసీ సభ్యులతోనే ఎన్నిక పూర్తి చేశారు. గత ఎన్నికల్లో 16 ఎంపీటీసీ స్థానాలకు గాను 15 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ, ఒకచోట ఇండిపెండెంట్ గెలిచారు. వైఎస్సార్‌సీపీ సభ్యురాలు పద్మావతి ఎంపీపీ అయ్యారు. ఇటీవల ఆమె రాజీనామా చేశారు. టీడీపీ నాయకుల ప్రలోభాలు, ఇతర కారణాలతో నలుగురు ఆ పార్టీ వైపు మొగ్గుచూపారు. స్వతంత్ర అభ్యర్థితో కలిపి టీడీపీ బలం 5 మాత్రమే. ఈ క్రమంలో ఎంపీపీ ఎన్నిక కోసం క్యాంపులో ఉన్న 8 మంది ఎంపీటీసీ సభ్యులను తీసుకుని బొమ్మనహాళ్ బయల్దేరిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి అడుగడుగునా పోలీసు ఆంక్షలు, టీడీపీ నేతల దౌర్జన్యాలను ఎదుర్కొన్నారు. ఆయనతో ఉన్న వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య, నాయకులను పోలీసులు కణేకల్లు క్రాస్‌లోనే అడ్డుకున్నారు.

రిటర్నింగ్ అధికారి గంగాధర ఉదయం 10 గంటలకు ఎన్నిక ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఉద్దేహాళ్ ఎంపీటీసీ కరూరు కల్పన, టీడీపీ అభ్యర్థిగా ఉప్పరహాళ్ ఎంపీటీసీ ముల్లంగి నాగమణి పోటీపడ్డారు. ప్రత్యేక ఆహ్వానితులుగా రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ హాజరయ్యారు. దర్గాహొన్నూరు ఎంపీటీసీ–1 నాగరత్నమ్మ (వైఎస్సార్‌సీపీ) గైర్హాజరవగా, ఎన్నిక సమయంలో ఇద్దరు సభ్యులు టీడీపీ వైపు మొగ్గుచూపారు. చివరకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి 8 మంది, టీడీపీకి ఏడుగురు మద్దతుగా నిలిచారు. టీడీపీ ఓటమిని గుర్తించిన ఎమ్మెల్యే కాలవ... దేవగిరి ఎంపీటీసీ సభ్యుడు అనుమేష్‌ను బయటకు పిలిచి మద్దతు తెలపాలని చాలా సమయం తీవ్రస్థాయిలో ఒత్తిడి చేశారు. ఈ విషయాన్ని అనుమేష్ మీడియాకు స్వయంగా తెలిపారు. కాగా, ఎమ్మెల్యే వైఖరితో మనస్తాపం చెందడంతో పాటు సహనం కోల్పోయిన ఏడుగురు వైఎస్సార్‌సీపీ సభ్యులు కార్యాలయం నుంచి బయటకు వచ్చేశారు. ఇదే అదనుగా భావించి ఉన్నవారితో కోరం చూపి ఎంపీపీ ఎన్నికను పూర్తిచేశారు. క్షణాల వ్యవధిలోనే టీడీపీ అభ్యర్థి చేతిలో డిక్లరేషన్ పెట్టారు.

అనంతపురం జిల్లా కణేకల్లు క్రాస్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాస్వామ్యానికి పాతర: మెట్టు మండిపాటు

''మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? లేక రాక్షస రాజ్యంలో ఉన్నామా? ఎంపీపీ ఎన్నికలో నైతిక విజయం వైఎస్సార్‌సీపీ. కోరం లేకున్నా గెలిచినట్టు ప్రకటించుకోవడం సిగ్గుచేటు. రక్షణగా నిలవాల్సిన పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారు. మాకు ఆంక్షలు, అడ్డంకులు విధించి, టీడీపీ నాయకులకు మాత్రం గేట్లు తెరిచారు'' అని మెట్టు గోవిందరెడ్డి మండిపడ్డారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు..మండల పరిషత్‌లోకి వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను బెదిరిస్తున్నా పోలీసులు అడ్డుకోలేదని అన్నారు. తమపై దాడులకు పాల్పడినవారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికను రద్దుచేసి న్యాయబద్ధంగా మళ్లీ నిర్వహించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తామన్నారు.

వింజమూరు ఎంపీపీ ఎన్నిక అప్రజాస్వామికం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఉదయగిరి: రాష్ట్రంలో కూటమి పాలన అరాచకాలు వింజమూరు ఎంపీపీ ఎన్నిక ఘటనతో పరాకాష్టకు చేరాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. ''గతంలో వైఎస్సార్‌సీపీ తరఫున వింజమూరు ఎంపీపీగా ఉన్న వ్యక్తిపై అవిశ్వాసాన్ని ప్రకటించి టీడీపీ నేతలు బలవంతంగా పదవి నుంచి దించారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ ఎన్నికకు అధికారులు సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీకి తగినంత బలం లేకపోవడంతో కుట్రలకు తెరలేపింది. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ మోహన్‌రెడ్డిని పోలీసులతో బలవంతంగా కిడ్నాప్ చేయించి నిర్బంధించి, కుటుంబ సభ్యులను బెదిరించి ఆధీనంలో ఉంచుకున్నారు. ప్రత్యేక సమావేశానికి వస్తున్న ఊటుకూరు ఎంపీటీసీ మల్లికార్జునను పోలీసుల సమక్షంలో టీడీపీ గూండాలు కిడ్నాప్ చేశారు. మరో మహిళా ఎంపీటీసీ ఉంటా రత్నమ్మను కిడ్నాప్ చేసేందుకు యత్నించారు. టీడీపీ ఎన్ని కుట్రలు పన్నినా, దౌర్జన్యాలు, అరాచకాలను లెక్క చేయకుండా ఎదురొడ్డి నిలబడిన ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు కాకాణి ధన్యవాదాలు తెలిపారు.



రాష్ట్రాన్ని అరాచక రాజ్యంగా మార్చారు

'ఎక్స్'లో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ధ్వజం

సాక్షి, అమరావతి: ఎంపీపీ ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టపగలే ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మండిపడ్డారు. దేశానికి ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పే సీఎం చంద్రబాబు... రాష్ట్రాన్ని అరాచక, ఆటవిక రాజ్యంగా మార్చినందుకు సమాధానం చెప్పాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో సోమవారం ఆయన పోస్ట్ చేశారు. ''ఒక చిన్న ఎంపీపీ ఎన్నికలో కూడా ప్రజాస్వామ్యాన్ని ఇంత దారుణంగా ఖూనీ చేస్తున్న తీరు, ఎన్నికలను ప్రజాస్వామ్య ప్రక్రియకు బదులుగా బల ప్రదర్శన వేదికగా మార్చిన వైనం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ తీవ్ర దురహంకారాన్ని, ప్రమాదకర స్వభావాన్ని బట్టబయలు చేస్తోంది'' అని అన్నారు. ''ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు ఎంపీపీ ఎన్నికలో ఓటు వేసేందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను నడిరోడ్డుపై అడ్డుకోవడమే కాకుండా, వారిపై దాడి చేశారు. దీంతో ఒక మహిళా ఎంపీటీసీ తీవ్రంగా గాయపడ్డారు. ఒక సభ్యుడిని కిడ్నాప్ చేశారు. మరొకరిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. వీటన్నింటి వెనుక ఉన్న ఏకైక ఉద్దేశం... ఎంపీపీ ఎన్నికలో వారిని ఓటు వేయకుండా ఆపడమే. ఒక భయాందోళన పరిస్థితి సృష్టించి, బల ప్రయోగంతో వారి ఓటు హక్కును అడ్డుకోవడమే. ప్రజల గొంతును అణచివేసి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని పాతరేయడానికి ఒక పథకం ప్రకారం చేసిన ప్రయత్నం ఇది. ఇలాంటి అప్రజాస్వామిక సంఘటనల సమయంలో... పోలీసులు టీడీపీ చేతిలో కీలుబొమ్మల్లా వ్యవహరిస్తూ, అధికార పార్టీకి బహిరంగంగా మద్దతిస్తూ, ప్రజాస్వామ్య ప్రక్రియను కాపాడడంలో విఫలమవుతున్నారు'' అని వైఎస్ జగన్ నిప్పులు చెరిగారు.

మౌన ప్రేక్షకుల్లా ఎన్నికల అధికారులు

''రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాళ్ మండలంలో కూడా అదే పరిస్థితి చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను నిర్బంధించి దూరంగా ఉంచారు. ఇంత జరుగుతున్నా ఎన్నికల అధికారులు, పోలీసులు మౌన ప్రేక్షకుల్లా చూస్తూ ఉండిపోయారు. ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలకు బాసటగా నిలిచి, ఎంపీపీ ఎన్నికను బలవంతంగా పూర్తి చేశారు'' అని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. ''ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల కిడ్నాప్, వారిపై బహిరంగంగా దాడి, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయడం, ఎన్నికల ప్రక్రియను పూర్తిగా అనుకూలంగా మార్చుకోవడం టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో సర్వసాధారణమైపోయింది. ఒక చిన్న స్థానిక సంస్థ పరోక్ష ఎన్నికలోనే ప్రజాస్వామ్యం పరిస్థితి ఇలా ఉందంటే ఈ ప్రభుత్వం ఎంత అధికార దుర్వినియోగం చేస్తోందో తేటతెల్లం అవుతోంది. ఎంత ప్రజాస్వామ్య వ్యతిరేకిగా మారింది అన్న విషయాన్ని చాటుతోంది'' అని వైఎస్ జగన్ అన్నారు.



ఔదార్యం అంటే మీరు ఇవ్వగలిగిన దాని కంటే ఎక్కువ ఇవ్వటం! ఔన్నత్యం అంటే మీకు అవసరమైన దాని కంటే తక్కువ తీసుకోవటం!!

– ఖలీల్ గిబ్రాన్

సాక్షి

మంగళవారం, 6 జనవరి 2026

సామ్రాజ్యవాద దురహంకారం

తన దుందుడుకు చర్యతో, దుష్ట పోకడతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచాన్ని సంక్షోభం ఊబిలోకి నెట్టేశారు. వెనిజులా రాజధాని కారకాస్‌తో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి అమెరికా సైన్యం భీకర దాడులకు దిగి అధ్యక్షుడు నికోలస్ మదురోనూ, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌నూ కళ్లకు గంతలు కట్టి, బేడీలు వేసి అపహరించుకుపోయింది. ఆయన 'మాదకద్రవ్య ఉగ్రవాదానికి' పాల్పడినట్టు తప్పుడు ఆరోపణలు చేసి న్యూయార్క్‌లో బంధించింది. అమెరికా సామ్రాజ్యవాద దురహంకారం ప్రపంచానికి కొత్తగాదు. ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా ఖండ దేశాలు అనేకం దాని వాతబడ్డాయి. కుట్రలు చేసి దేశాధినేతల్ని హతమార్చటం, ప్రజాస్వామ్యం డ్రామాలు నడిపి వ్యవస్థల్ని కూల్చేయటం దానికి మంచినీళ్ల ప్రాయం. నాలుగు దశాబ్దాల నాడు తానే అధికారంలో ప్రతిష్ఠించిన పనామా అధ్యక్షుడు ఆంటోనియో నొరీగాను ఇదేవిధంగా దాడిచేసి అరెస్టు చేసింది. కానీ నొరీగా దాని కీలుబొమ్మ. అమెరికా చర్యల పర్యవసానంగా ఇటీవలి దశాబ్దాల్లో ఇరాక్, లిబియా, అఫ్గానిస్తాన్ నెత్తుటి ముద్దలయ్యాయి. ట్రంప్ తాజా చర్య వాటన్నిటినీ తలదన్నింది. వందలాది మంది సీఐఏ ఏజెంట్ల ద్వారా అధ్యక్షుడి భద్రతను చూస్తున్న దళాలను లోబరుచుకుని, అధ్యక్షుణ్ణి భార్యాసమేతంగా అపహరించటం నికృష్టం. ఆయన స్థానంలో తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన డెల్సీ రోడ్రిజ్‌ను 'మదురోను మించిన ప్రారబ్ధం చవిచూడాల్సి వస్తుంద'ని హెచ్చరించటం, ఆమె ఈ అవమానాన్ని దిగమింగుకుని 'కలిసి పనిచేద్దామ'ని స్నేహహస్తం చాచడం ఈ విషాదానికి కొనసాగింపు.

దేశాల మధ్య సమస్యలొస్తే శాంతియుతంగా పరిష్కరించుకోవటానికి సిద్ధపడకుండా ఏకపక్షంగా దాడులకు పాల్పడటం, దేశ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించి అధినేతను అపహరించటం ఉగ్రవాదం. అలాంటి చర్యలు ప్రపంచ శాంతిని భగ్నం చేస్తాయి. కానీ పాశ్చాత్య దేశాలూ, అమెరికా ప్రధాన స్రవంతి మీడియా ఈ పరిణామాలను సాధారణ విషయంగా చూపే ప్రయత్నం చేస్తున్నాయి. మదురో పెద్ద నియంతంటూ ప్రచారం లంకించుకున్నాయి. ట్రంప్ దరిదాపుల్లోకి రాగల నియంత ప్రపంచంలో ఉంటాడా? చావెజ్ వారసుడిగా 2013లో అధికారంలోకొచ్చిన మదురో నియంత అనటం పచ్చి బూటకం. 2019 ఏప్రిల్‌లో 'తిరుగుబాటు' చేసి అధికారంలోకొచ్చానని ప్రకటించుకున్న గెయిడో సాయుధ బృందం రక్షణలో రాజధాని కారకాస్ వీధుల్లో స్వేచ్ఛగా తిరుగుతున్నా జనం నవ్వుకున్నారు. పోలీసులూ, సైనికులూ అతగాణ్ణి ఏమీ అనలేదు. చివరకు మదురో స్వయంగా పిలిచి నవ్వుతూ తలమీద ఒక్కటిచ్చి పొమ్మన్నారు. వేరే దేశంలో ఎక్కడైనా అది ఉరికంబం ఎక్కేంత తీవ్ర నేరం. కనీసం యావజ్జీవం జైల్లో మగ్గేంత అపరాధం.

వెనిజులా ప్రజలు 1999లో హ్యూగో చావెజ్ అధికారంలోకొచ్చాక దశాబ్దాల దారిద్ర్యం నుంచి విముక్తులయ్యారు. ఆయన హయాంలో దారిద్ర్యం ఒక్కసారిగా 70 శాతానికిపైగా తగ్గింది. నిరుద్యోగం సగానికి సగం పడిపోయింది. పెన్షన్లు నాలుగు రెట్లు పెరిగాయి. అక్షరాస్యత వంద శాతానికి చేరుకుంది. విద్య, వైద్యం, ఉపాధి కల్పన, ఆహారభద్రత అక్కడ ప్రాథమిక హక్కులు. దాదాపు వందేళ్లపాటు దేశ సంపదనంతా తరలించుకుపోయిన అమెరికా చమురు కంపెనీలను చావెజ్ స్వాధీనం చేసుకోవటంవల్లే ఇదంతా సాధ్యమైంది. అప్పటినుంచి అమెరికా కడుపుమంట మొదలైంది.

అమెరికా ఆంక్షల వల్ల వెనిజులా దీర్ఘకాలంగా సమస్యలకు ఎదురీదుతోంది. ప్రాణావసర మందులు కరువై లక్షమంది ప్రజలు మరణించారు. దారిద్ర్యాన్ని తట్టుకోలేక 80 లక్షల మంది దేశం వదిలిపోయారు. ఇటీవల మదురో చర్యలు వ్యాపార వర్గాల ప్రయోజనాలకు తోడ్పడుతున్నాయన్న విమర్శలున్నాయి. అయితే మదురో చైనా కరెన్సీ యువాన్లలో వాణిజ్యం నెరపడం, చైనా, రష్యా, ఇరాన్‌లతో జతకట్టడం, బ్రిక్స్‌లో చేరేందుకు సంసిద్ధం కావటం అమెరికాను కలవరపరిచాయి. అత్యధిక చమురున్న దేశం ఎదిగేలా కనబడటంతో డాలర్‌ను కాపాడుకోవటానికి అమెరికా ఈ తప్పుడు చర్యకు దిగింది. ఇవాళ వెనిజులా వంతు. రేపు మెక్సికో, క్యూబా, గ్రీన్‌ల్యాండ్... ఏదైనా కావొచ్చు. అందుకే అమెరికా చర్యను ప్రపంచం ముక్తకంఠంతో ఖండించాలి. ఆధునిక కాలంలో అనాగరిక పోకడలు చెల్లబోవని చాటాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.తదియ ప.11.33 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** ఆశ్లేష సా.4.13 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** తె.4.09 నుండి 5.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.49 నుండి 9.30 వరకు తదుపరి రా.10.46 నుండి 11.40 వరకు, **అమృత ఘడియలు:** ప.2.37 నుండి 4.10 వరకు, **సంకటహర చతుర్థి.**

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.36
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

అదృష్టం



అదృష్టం ఎక్కడో ఆకాశంపై నుండి వచ్చి పడదు. మన చేతుల్లోనే ఉంటుంది. నువ్వెంత కష్టపడి పని చేస్తే అంత అదృష్టవంతుడివి. కష్టించి పని చేయాల్సి వచ్చినప్పుడు చిరునవ్వుతో చేయండి. పని ఆనందంగా మారితే కష్టంలా తోచదు.

– కపిల్ దేవ్, క్రికెట్ దిగ్గజం

బంగారం

గొప్ప నిరాశ తర్వాత మాత్రమే ఉత్తమ విజయం లభిస్తుంది. ఫలితం కోసం తొందరపడి నిరాశ చెందకండి. మీ అభిరుచి ఏదైతే ఉందో, దానిపై అంకిత భావంతో పని చేయండి. నా విషయంలో, దుమ్ము బంగారం అయింది. వేచి ఉండండి, మీకూ అలాగే జరగొచ్చు.

– ఎ.ఆర్. రెహమాన్, సంగీత దర్శకుడు

తగనివి!

నేను నమ్మిన సూత్రాలు:
1. ప్రతిభ కంటే క్రమశిక్షణ ముఖ్యం. 2. మౌనంగా కష్టపడు. నీ విజయం మాత్రమే శబ్దం చేయాలి. 3. అవకాశం కోసం వేచి చూడకు. దానిని నువ్వే సృష్టించుకో. 4. గుర్తింపు వచ్చాక విశ్రాంతి తీసుకోకు. అప్పుడు ఇంకా కష్టపడాలి.

– దిల్జీత్ దోసాంఝ్, నట గాయకుడు

రెండోసారి

ఒకసారి ఏదైనా బంధం విఫలమైన తర్వాత కూడా, ప్రేమను వెతుక్కోటానికి ఎవరూ సంశయించనవసరం లేదు. జీవితాన్ని మార్చగల నిర్ణయాన్ని తీసుకునేటప్పుడు మీపై మీకు నమ్మకం ఉంటే చాలు. ప్రేమ... బంధం మాత్రమే కాదు, పరిపూర్ణమైన ఇల్లు కూడా!

– బిందియా గోస్వామి, నటి

ఆదర్శం

అనేకమైన విభజనలకు మనుషులు గురవుతున్న ఈ ప్రపంచంలో, మనం మన పిల్లలకు సమానత్వ భావనను అర్థమయ్యేలా తెలియజెప్పాలి. అన్నిటినీ మించి, మంచి మనిషిగా ఉండటంలోని అందం ఏమిటో వారికి మన చర్యల ద్వారా చూపించాలి.

– కలపూర్ రవికుమార్, మలయాళ రచయిత

అమూల్యం

సంతోషంగా ఉండటానికి ప్రత్యేక సందర్భం కోసం చూడకండి. సజీవంగా, ఆరోగ్యంగా ఉండటం జీవితంలోని అతి పెద్ద వేడుక. చిన్న క్షణాలను కూడా అమూల్యమైనవిగా భావించండి. కష్టమైన రోజులు మారువేషంలో ఉన్న పాఠాలని గుర్తించండి.

– యాన్సీ ఆంటోనీ, ఇంటర్నెట్ పర్సనాలిటీ

కానివారికి కంచాల్లో వడ్డిస్తారా!

అభిప్రాయం

జి. శ్రీరామ్మూర్తి

గుర్తుండే ఉంటుంది, 2022లో నిస్సాగు నిరసన చేపట్టారు కొందరు పెద్ద రైతులు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించడం వల్ల పూర్వంలా కూలీలు తక్కువ దినవేతనాలకు దొరకడం లేదన్నది వారి అసంతృప్తికి కారణం. అందువల్ల తమ సాగు వ్యయ భారం పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తూ ఆసారి సాగు విరామాన్ని పాటించారు. ఉపాధి పథకం కార్మికుల చేత రైతుల వ్యక్తిగత వ్యవసాయ పనులు చేయించాలన్న డిమాండ్‌కు మద్దతుగానూ ఇది జరిగింది. ఈ పథకం వల్ల కూలీలు ప్రియమైపోయారన్నదే నిజమైతే, రైతులు వారిని భరించలేకపోతున్నారన్నదే వాస్తవమైతే ఆ మేరకు పంటల మద్దతు ధరను పెంచి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి దానిని సాధించుకోవచ్చు. రైతుల సమస్య అదొక్కటే కాదు.

ఉపాధి పథకం భూమిలేని నిరుపేద వ్యవసాయ కార్మికుల్లో కొంత ఆత్మవిశ్వాసాన్ని పెంచినమాట నిజమే. వాస్తవానికి అది అంత గొప్ప పథకమేమీ కాదు. పేద కార్మికులకు తమ కాళ్ళ మీద తాము బతగ్గలిగే పూర్తి స్థాయి బలాన్ని అది కల్పించలేదు. వారి చేతిలోని ఊతకర్రకు కొంచెం అదనపు ఊతాన్ని మాత్రమే ఇచ్చింది. దానికే వారు తమను దాటిపోతున్నారని దేశమంతటా గల పెద్ద రైతులు భావించడం విడ్డూరం. దీని మూలాల్లో ఫ్యూడల్ శక్తుల అసహనం ఇమిడి ఉన్నదనే అభిప్రాయాన్ని తోసిపుచ్చలేము. ఎన్డీయే ప్రభుత్వం ఇప్పుడు గాంధీ పేరు తీసేసి, 'వీబీ జీ రామ్ జీ' చట్టాన్ని తెచ్చింది.

పేద వర్గాల పొట్ట కొట్టి...

గత పథకంలో మాదిరిగా ఈ కొత్తది డిమాండ్ ఆధారంగా గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించబోవడం లేదు. పనిని హక్కుగా గుర్తించి దానిని కల్పించడం తన బాధ్యతగా ఎన్డీయే ప్రభుత్వం భావించడం లేదు. కేంద్రం తాను అనుకున్న చోట మాత్రమే ఈ పథకం కింద పనులు మంజూరు చేస్తుంది. డిమాండ్ ఆధారిత పని కల్పనకు తెర దించబోతున్నారు. పథకం మొత్తం ఖర్చులో పూర్వం మాదిరిగా 90 శాతానికి బదులు 60 శాతం నిధులనే కేంద్రం భరిస్తుంది. అందువల్ల రాష్ట్రాల వాటా 10 నుంచి 40 శాతానికి చేరుకుని భారీగా పెరిగిపోనున్నది. అన్నింటికీ మించి సాగు సీజన్లో 60 రోజులపాటు ఉపాధి పనులను నిలిపివేయడం కొత్త పథకంలోని ప్రధానమైన ప్రజావ్యతిరేక లక్షణం. మహాత్మా గాంధీ 'నరేగా' కార్మికులకు ప్రసాదించిన ఉపాధి భరోసా ఈ విధంగా డొల్ల అయిపోతుందన్న మాట! దీనితో ముమ్మర సీజన్లో అధిక కూలీని సాధించుకునే హక్కును కార్మికులు కోల్పోనున్నారు. పేదలు, అణగారిన వర్గాలు పెత్తందారుల కింద బతకాలనే వ్యవస్థను పునరుద్ధరించాలని బీజేపీ కోరుకుంటున్నది. హిందూ సమాజ రక్షణే తమ విధి అని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఇటీవలే అన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం దానిని చేసి చూపిస్తున్నది.

మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని భూస్థాపితం చేయాలని ప్రధాని మోదీ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎదురు చూస్తున్నారు. ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్న ఆ పథకాన్ని వదిలించుకోడం అంత తేలిక కాదని కూడా ఆయన గ్రహించారు. అందుకే అవసరమైన నిధులు విడుదల చేయకుండా దానికి నెమ్మదిగా విషం ఇచ్చి చంపుతూ వచ్చారు. ఇప్పుడు పూర్తిగా తెరదించారు. కోవిడ్ కాలంలో నగరాలు, పట్టణాల నుంచి కాళ్లీడ్చుకుంటూ స్వస్థలాలకు చేరిన అసంఖ్యాక గ్రామీణ యువతకు పనులు కల్పించి ఆదుకున్న 'నరేగా'ను అంతమొందిస్తున్నందుకు ఇప్పుడిప్పుడే పల్లెల్లో నిరసన రూపుదిద్దుకుంటున్నది.

◆ కోవిడ్ కాలంలో నగరాలు, పట్టణాల నుంచి కాళ్లీడ్చుకుంటూ స్వస్థలాలకు చేరిన అసంఖ్యాక గ్రామీణ యువతకు పనులు కల్పించి ఆదుకున్న 'నరేగా'ను అంతమొందిస్తున్నందుకు ఇప్పుడిప్పుడే పల్లెల్లో నిరసన రూపు దిద్దుకుంటున్నది.

మైనారిటీలను దూరం పెట్టి...

స్వతంత్ర భారత రాజ్యాంగంలో బీజేపీకి బొత్తిగా గిట్టని పదాలు సోషలిస్టు, సెక్యులర్. ఈ రెండింటినీ 1976లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగం 'ప్రవేశిక'లో చేర్చింది. వాటిని సుప్రీంకోర్టు ధ్రువపరిచింది. భావజాలపరంగా, సంకేతాత్మకంగా సోషలిస్టు పదానికి మహాత్మా గాంధీ 'నరేగా' ప్రాతినిధ్యం వహిస్తున్నది. దానిని కూల్చివేయడం ద్వారా సోషలిస్టు తరహా వ్యవస్థ మూలాలను బీజేపీ ఛేదించగలిగింది. సెక్యులర్ లక్షణానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సర్వమత సమభావాన్ని నిర్మూలించాలని ఎదురుచూసిన ఆ పార్టీ అందుకోసం ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణను (సర్) ఎంచుకున్నది. సరిహద్దు రాష్ట్రాల్లోకి పొరుగు దేశాల ముస్లింల వలస పరాకాష్ఠకు చేరుకున్నదనే నెపం ఇందుకోసమే దూసుకొచ్చింది. మొత్తం మీద మైనారిటీ ఓటర్లను భారీ ఎత్తున తొలగించడం ద్వారా దేశ లౌకిక లక్షణాన్ని దెబ్బ తీయడానికి బీజేపీ సమకట్టిందనే అభిప్రాయం ధ్రువపడింది.

'సర్' మరో ఎన్ఆర్‌సి (జాతీయ పౌరసత్వ రిజిస్టర్) అనే విమర్శ బయలుదేరింది. దీని ద్వారా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన మైనారిటీలను విదేశీయులుగా ముద్రవేసి అస్సాంలో మాదిరిగా వెనక్కు పంపిస్తారనే భయాలు వ్యక్తమవుతున్నాయి. మైనారిటీ ఓటర్ల సంఖ్యను తగ్గించడం ద్వారా బీజేపీ తన గెలుపు అవకాశాలను గ్యారంటీ చేసుకుంటున్నది. బహుళత్వ రాజ్యాంగాన్ని హిందూత్వ పాలనాపత్రంగా మార్చివేసే తెగువకు పాల్పడుతున్నది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి ఉద్దేశించిన త్రిసభ్య కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించినప్పుడే ఎన్నికల యంత్రాంగాన్ని దుర్వినియోగానికి దారి ఏర్పడింది. ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ, ప్రాణప్రదం అయిన నిష్పాక్షిక ఎన్నికల వ్యవస్థకు తూట్లుపొడవటం అందువల్లనే సాధ్యమవుతున్నది. దాని విష శిశువే 'సర్'!

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

పుస్తక ప్రపంచం

భారత ప్రజలమైన మేము...



అసెంబ్లింగ్ ఇండియాస్ కాన్‌స్టిట్యూషన్: ఎ న్యూ డెమాక్రటిక్ హిస్టరీ

రచయితలు:

రోహిత్ డే ఆర్నిట్ షాని

1946 డిసెంబర్ 9న సరిగ్గా 11 గంటలకు న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ హాల్‌లో రాజ్యాంగ సభ మొదటిసారిగా సమావేశమైంది. ఈ సభలోని సుమారు 300 మంది సభ్యులు నేరుగా ప్రజల ద్వారా ఎన్నికైనవారు కాదు. బ్రిటిష్ ఇండియా ప్రావిన్సుల్లోని శాసనసభలు ఎంపిక చేసినవారు. మూడేళ్లలో 5,546 పేజీల చర్చలు జరిపి, ఈ రాజ్యాంగ సభ 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించింది. 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చింది. అప్పుడు ఈ మొత్తానికైన ఖర్చు రూ.47 లక్షలు. అయితే ఈ రాజ్యాంగ సభకు వెలుపల రాజ్యాంగం కోసం పడిన భిన్న ఆరాటాలను వివరించే పుస్తకం: 'అసెంబ్లింగ్ ఇండియాస్ కాన్‌స్టిట్యూషన్'. ఈ 400 పేజీల పుస్తకం ఒకప్పుడు దేశాన్ని పట్టిన రాజ్యాంగ జ్వరాన్ని కళ్లకు కడుతుంది.

రాజ్యాంగ ప్రక్రియలో కేవలం మేధావులు మాత్రమే పాల్గొనలేదనీ, ఇంకా 'ఇండియా'గా రూపుదిద్దుకోని భారత నేల నలుమూలలలో ఉన్న సకల జనాలు చురుగ్గా పాలుపంచుకున్నారనీ చెబుతారు రచయితలు. స్వతంత్ర భారతంలో తామెలాంటి పాలన కోరుకుంటున్నారో బలూచిస్తాన్ నుంచి బెజవాడ వరకు వేలాది మంది పౌరులుగా, సంఘాలుగా, పార్టీలుగా, అధికార ప్రతినిధులుగా, ట్రేడ్ యూనియన్లుగా తమ సంతకాలతో, వేలిముద్రలతో పంపిన అభ్యర్థనలను, అభిప్రాయాలను తవ్వితీసి, ఈ ఉత్సాహపూరిత ప్రజా కోణాన్ని అంతే ఆసక్తికరంగా వెల్లడించారు రచయితలు. ఉదాహరణకు గౌహతి నుంచి నలిన్‌కాంత బర్కాకటి పంపిన చిన్న కాగితం రాజ్యాంగ సభ సచివాలయానికి 1947 జనవరి 8న అందింది. 'రాజ్యాంగ విషయాల్లో తన అజ్ఞానాన్ని మన్నించమంటూనే', ఏ శాసనసభ్యుడినైనా ఎప్పుడైనా 'రీకాల్' చేసే హక్కు ఓటర్లకు ఉండాలని అతడు రాశాడు. అంటరానితనాన్ని నిర్మూలించకుండా సమైక్య భారతదేశం సాధ్యం కాదని వజీరిస్తాన్‌లోని బన్నూ నుంచి ప్రజా ప్రతినిధి కోటూ రామ్ కోరాడు. మహిళలకు సమాన హక్కులు; మరణశిక్ష రద్దు; జైనులు, బెనె ఇజ్రాయెలీ యూదులతో సహా మైనారిటీల హక్కులు; నగర బాలురతో సమానంగా గ్రామీణ పిల్లల హక్కుల లాంటివే కాదు, 'చెవిటి మూగ' వారికి ప్రత్యేక గ్యారంటీలు, విశ్వకర్మలకు ఫీజుల్లో రాయితీలు కోరుతూ కూడా లేఖలు అందాయి. విచిత్రంగా తమ లేఖల ద్వారా రాజ్యాంగ సభకు జనమే చట్టబద్ధత కల్పించారంటారు రచయితలు.



'ఆచరణాత్మక' కారణాల వల్ల, తొలుత రాజ్యాంగ చర్చలను రహస్యంగానే ఉంచదలిచిన పెద్దలు ఈ ప్రజాబాహుళ్యపు ఒత్తిడితో రాజ్యాంగం ఏ రూపం తీసుకుంటుందో బహిరంగపరచదలిచారు. 1948 ఫిబ్రవరి 26న ప్రచురించిన డ్రాఫ్ట్ కాన్‌స్టిట్యూషన్(ఆంగ్లం) బెస్ట్‌సెల్లర్‌గా నిలిచింది. వెల: ఒక్క రూపాయి. ఇది చెల్లించలేనివాళ్లు అణాతో 24 పేజీల సారాంశం చదువుకోవచ్చు. వారంలోనే దీన్ని దాదాపు అన్ని భారతీయ భాషల్లోకి అనువదించడానికి అనుమతులు కోరుతూ లేఖలు రాసాగాయి. కె.జి.చౌబాల్ అనే మరాఠీ జర్నలిస్టు 'మాతృదేశ సేవ' కోసం తన సేవలను వాడుకోవాలని రాశాడు.

ఈ పుస్తకం వెల్లడించే మరో కోణం, 'ఇండియన్ యూనియన్'కు సమాంతరంగా, అప్పటికి స్వతంత్రంగానే ఉండదలిచిన సంస్థానాల్లో కూడా రాజ్యాంగ రచన ఎలా జరిగిందో వివరించడం. సంస్థానాలకు రాజ్యాంగ సభ 93 ప్రాతినిధ్య స్థానాలను ఇచ్చినప్పటికీ, తమను తాము ప్రజాస్వామీకరించుకోవడంలో భాగంగా అవి ఈ ప్రక్రియ చేపట్టాయి. రాంపూర్ పాలకుడు తన ప్రజలకు భావస్వేచ్ఛతో సహా తొమ్మిది ప్రాథమిక హక్కులను ప్రసాదించాడు. రత్‌లామ్ రాజ్యాంగం ఉచిత ప్రాథమిక విద్యను రాజ్య బాధ్యతగా పేర్కొంది. 'మేము ఇప్పటివరకు తమ సొంత రాజ్యాంగాన్ని రూపొందించుకున్న 75 సంస్థానాలను గుర్తించాం' అంటారు రచయితలు.

ఇంకా న్యాయమూర్తులు ఎలా భాగమయ్యారు; ట్రూమన్‌తో సహా అమెరికా, యూకే, ఐర్లాండ్, కెనడా నాయకులు, న్యాయనిపుణుల ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం ద్వారా రాజ్యాంగపు ఫస్ట్ డ్రాఫ్ట్ రూపొందించిన సర్ బి.ఎన్.రావు ఇండియా రాజ్యాంగాన్ని 'ప్రపంచ వేదిక'కు ఎలా పరిచయం చేశారు; ఈశాన్య రాష్ట్రాల్లోని గిరిజనులు తమ హక్కుల కోసం ఎలా నిలబడ్డారు లాంటి అంశాలను విపులంగా చర్చించిన ఈ పుస్తకం రాజ్యాంగపు బహుముఖ పార్శ్వాలను తెలుసుకోగోరేవారికి ఆసక్తి కలిగిస్తుంది. కోట్ల మంది ఆశలను ఒక దగ్గర గుదిగుచ్చడం ఎంత దుర్భరమో, అబ్బురమో కూడా అర్థమవుతుంది. తర్వాతి రాజ్యాంగ సవరణలు ఈ ప్రజా చైతన్యపు కొనసాగింపే!

❑ ఎడిటోరియల్ టీమ్

పత్రికా పఠనం తప్పనిసరి!

ఇన్ బాక్స్

రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు పాఠశాలల్లో పత్రికా పఠనాన్ని తప్పనిసరి చేయడం ఆహ్వానించదగిన పరిణామం. విద్యార్థులు తమ చుట్టూ జరుగుతున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులను అర్థం చేసుకోవడం; నిత్యం కొత్త పదజాలం నేర్చుకుని హిందీ, ఇంగ్లిష్ భాషలను అభివృద్ధి చేసుకోవడం; వార్తలు, సంపాదకీయాల విశ్లేషణ; జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై అవగాహన పెంపొందించుకోవడం వంటి లక్ష్యాలు ఈ నిర్ణయం వెనుక ఉన్నాయి. పాఠశాల స్థాయిని బట్టి (సీనియర్ స్కూళ్లకు హిందీ, ఇంగ్లిష్; అప్పర్ ప్రైమరీకి రెండు హిందీ పత్రికలు) ఖర్చు మొత్తాన్నీ రాజస్థాన్ స్కూల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ భరించడం వల్ల పాఠశాలల ఆర్థిక భారం తగ్గుతుంది.

పోటీ పరీక్షలకు సిద్ధమవ్వడానికి పత్రికా పఠనం ఎంతగానో ఉపయోగపడుతుంది. సమగ్ర వ్యక్తిత్వ వికాసం సులభతరమవుతుంది. సమాజంలో ఎలా నెగ్గుకు రావాలో అర్థమవుతుంది. ఉపాధ్యాయులకు సరైన శిక్షణ లభించడం, ప్రతి పాఠశాలకు సకాలంలో పత్రికలు చేరుకోవడం, విద్యార్థుల ఆసక్తిని నిరంతరం నిలబెట్టడం వంటి కొన్ని సవాళ్లు ఉన్నాయి. ఇవి సరైన ప్రణాళిక, పర్యవేక్షణ ద్వారా నివారించగలిగినవే.

రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నిర్ణయం ... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటివి అనుసరించదగిన ఒక ఆదర్శ నమూనా. తెలంగాణ ప్రభుత్వం 'రీడింగ్ అవర్'ను ప్రవేశపెట్టడం ఈ దిశలో ఒక సకారాత్మకమైన అడుగనే చెప్పాలి. ఇప్పుడు, పాఠశాలల్లో పఠన ప్రచారారంతో పాటు... తెలంగాణ పబ్లిక్ లైబ్రరీల డైరెక్టరేట్ సహాయంతో గ్రంథాలయాలను మెరుగుపరచడం జరుగుతోంది. ఈ ప్రయత్నాలను రాజస్థాన్ మాదిరిగానే ఒక నిర్మాణాత్మక, పాఠ్యక్రమంతో అనుసంధానించబడిన రోజువారీ కార్యక్రమంగా రూపొందించవచ్చు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా తన విద్యా విధానంలో ఇలాంటి సంస్కరణను ప్రవేశపెట్టవచ్చు. ప్రాంతీయ భాషైన తెలుగు పత్రికలతో పాటు ఇంగ్లీషు పత్రికలను పాఠశాలలకు అందించడం ద్వారా... విద్యార్థులు స్థానిక, జాతీయ, అంతర్జాతీయ సమాచారంతో పరిచయం పెంచుకోవచ్చు. దీనికోసం రాష్ట్ర విద్యాశాఖ, స్థానిక పత్రికల సంస్థలతో ఒక ఒప్పందానికి రావచ్చు. అంతిమంగా, ఇలాంటి చొరవలు దేశ విద్యా లక్ష్యాలను మరింత బలపరుస్తాయి. అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో బాధ్యతాయుతమైన పౌరులను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

– డా॥ రవి కుమార్ చేగొని I తెలంగాణ గ్రంథాలయ సంఘం కార్యదర్శి

పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

డేటా పాయింట్

దేశంలో 2020–21 నుంచి 2025–26 మధ్య కొత్తగా 48,563 ఎంబీబీఎస్ సీట్లు వచ్చి చేరాయి.



సద్గతికి మూలప్రకృతి

జ్యోతిర్మయం

మంచి స్వభావానికి సంబంధించిన మూలప్రకృతి ఒకటి మనిషికి పుట్టుకతోనే సంక్రమిస్తుందని పెద్దలు చెప్పారు. కవులు తమ కావ్యాలలో వివరించారు. '**ప్రాణి తోడనె కూడ నుద్భవము జెందు గాని సద్గుణ మొక చోట గల్గి రాదు**'– మంచి గుణం మనిషికి పుట్టుకతోనే వచ్చే లక్షణంగా ఉంటుంది కాని వేరే ఎక్కడి నుండో ప్రత్యేకంగా తయారై వచ్చి చేరదు. పువ్వు పుట్టడంతోనే ఆ పూవు పరిమళం కూడా పుడుతుంది. అంతేగాని ఎక్కడినుండో వేరేగా పట్టి తెచ్చి అతికిస్తే వచ్చేది కాదు కదా!– అన్నాడు పెనుమళ్ళ సోమ మంత్రి, తన 'సీమంతినీ కళ్యాణము' కావ్యంలో. తెలుగులో తొలి పురాణమైన 'మార్కండేయ పురాణము' ద్వితీయాశ్వాసంలోని ఈ క్రింది పద్యంలో మారన కవి ఈ విషయాన్ని మరింతగా వివరించి చెప్పాడు.

మ. గురుదేవర్షి పితృపూజనము సద్గోష్ఠీ ప్రియత్వంబు సు/స్థిరసత్యోక్తి సమస్త భూతదయ మైత్రీసాధు సాంగత్యముల్/పరలోకాభ్యుదయ క్రియారతిశ్రుతి ప్రామాణ్య సందర్శనం/బరయ స్స్వర్గము బాసి పుట్టిన మణుష్య శ్రేణి సంజ్ఞల్ నృపా!

గురువులను, ఋషులను, తల్లిదండ్రులను, వారితో సమానమైన పెద్దవాళ్ళను భక్తితో పూజించడం, నలుగురితో కలిసి ఉన్నపుడు, వారితో సంభాషిస్తున్నపుడు, తోటివారందరికీ మంచిచేసే మాటలను చెప్పుకోవడంలో ఎప్పుడూ ఇష్టాన్ని కనబరచడం; ఎల్లవేళలా సత్యభాషణంలో అనురక్తిని కనబరిచి ఎప్పుడూ నిజాన్నే మాట్లాడటం, సకల జీవరాశి యందు సమభావాన్ని కలిగి భూమిపై వాటి మనుగడకు హాని కలిగేవిధంగా ప్రవర్తించకుండా ఉండటం, సాధుజనులతో మైత్రిని, సాంగత్యాన్ని వృద్ధి చేసుకోవడం, ఈ లోకంలోనే కాక పరలోకంలోనూ సద్గతి సమకూరే పుణ్యకార్యాలపై దృష్టి పెట్టి, ఆ కార్యాలను నిత్యం ఆచరించడంలో అనురక్తిని కనబరచడం; వేద విహిత కార్యాచరణ ప్రామాణికంగా జరిగే సందర్భాల, ప్రదేశాల సందర్శనము అనే కార్యాలు సద్గతినీ, మోక్షాన్నీ, స్వర్గప్రాప్తినీ ఆశిస్తూ, ఆ లోకంలో తమ స్థానాన్ని ముందుగానే స్థిరం చేసుకుని జన్మించిన మనుషులు ఎల్లప్పుడూ ఆచరించేవై ఉంటాయి అని పై పద్యం భావం.

– భట్టు వెంకటరావు

కిలో మామిడికి రూ.8 ఇస్తామని రూ.4 ఇవ్వడంతో..

ఫ్యాక్టరీకి తాళం వేసిన రైతులు

బకాయిలు చెల్లించే వరకు ఫ్యాక్టరీని తెరవనిచ్చేది లేదని హెచ్చరిక

ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

గుడిపాల (చిత్తూరు): చిత్తూరు జిల్లా గుడిపాల మండలంలోని మామిడి రైతుల నెత్తిన జ్యూస్ ఫ్యాక్టరీ కుచ్చుటోపీ పెట్టింది. కిలో మామిడి కాయలకు రూ.8 చొప్పున చెల్లిస్తామని నమ్మబలికి రూ.4 చొప్పున మాత్రమే ఇవ్వడంతో మామిడి రైతులు గుడిపాల మండలం 189 కొత్తపల్లె వద్ద ఉన్న తాసా మామిడి జ్యూస్ ఫ్యాక్టరీని సోమవారం ముట్టడించారు. ఫ్యాక్టరీ ఎదుట బైఠాయించి రూ.8 చొప్పున ధర చెల్లించేంతవరకు జ్యూస్ ఫ్యాక్టరీని తెరవనిచ్చేది లేదని తేల్చి చెప్పారు. సమాచారం అందుకున్న తహశీల్దార్ శ్రీనివాసులు అక్కడకు చేరుకుని ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చలు జరిపారు. అనంతరం కిలోకు రూ.5 చొప్పున ఇప్పిస్తామని తహశీల్దార్ చెప్పడంతో ఆగ్రహించిన రైతులు అధికారుల తప్పిదాల వల్లే తాము నష్టపోయామని మండిపడ్డారు. పంట చేసిన వాడికి కష్టం విలువ తెలుస్తుందని.. కార్యాలయాల్లో కూర్చున్న అధికారులకు ఏం తెలుస్తుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరిబాబు చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకోవడంతో చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కిలో మామిడికి రూ.8 ఇస్తామని చెప్పిందని, 6 నెలలైనా ఇంతవరకు నగదు చెల్లించలేదని చెప్పారు. రూపాయి చొప్పున జతచేసి కిలోకు రూ.9 ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం వినకపోవడంతో ఫ్యాక్టరీ ఎదుట బైఠాయించిన రైతులు ఫ్యాక్టరీ కార్యాలయానికి, ఫ్యాక్టరీకి తాళాలు వేశారు. రైతులకు పూర్తి ధర చెల్లించకపోతే సహించేది లేదని అల్టిమేటం జారీ చేసిన రైతులు తాళాలను తహశీల్దార్‌కు అప్పగించారు. ఇదే పరిస్థితి కొనసాగితే చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులంతా మూకుమ్మడిగా వచ్చి ఫ్యాక్టరీ ఎదుట బైఠాయిస్తామని హెచ్చరించిన అనంతరం రైతులు వెళ్లిపోయారు.

బాల్యం నుంచే మాతృభాష నేర్చుకోవాలి

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

తెలుగు మహాసభల్లో పాల్గొన్న పలువురు వక్తలు

మాట్లాడుతున్న మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : అందరూ బాల్యం నుంచే మాతృభాషను నేర్చుకోవాలని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ (ఎన్వీ రమణ) చెప్పారు. గుంటూరు నగరంలోని సాయి బొమ్మిడాలనగర్ హైవే వద్ద శ్రీసత్య సాయి స్పిరిచ్యువల్ సిటీ ఆవరణలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో సోమవారం ఆయన మాట్లాడారు. జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ మాతృభాష లేని జాతి లేదన్నారు. మన భాషను గౌరవించడం మన బాధ్యత అని పేర్కొన్నారు. మాతృభాషను ప్రేమించలేకపోతే మన సంస్కృతిని ఆనందించలేమని, సాహిత్యాన్ని ఆస్వాదించలేమని చెప్పారు. పిల్లలకు తెలుగు భాషను దూరం చేయవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

- విశ్వహిందీ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ టీటీడీలో తెలుగు భాష అమలుకావడం లేదని పేర్కొన్నారు. అర్చన అనంతరం దర్శనాన్ని ఏఏడీ అని, కల్యాణం అనంతరం దర్శనం (కేఏడీ) అంటూ ఇంగ్లీష్ కోడ్ భాషలోనే పిలుస్తున్నారని, దీనివల్ల యాత్రికులు, భక్తులకు అర్థం కావడం లేదని పేర్కొన్నారు.
- మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రామాయణ కాలంలోనూ తెలుగు భాష ఉందని ఇటీవల కొన్ని ఆధారాలు గుర్తించారని అన్నారు. ఆ కాలం నుంచి ఈనాటి వరకు తళుకులీనుతున్న తెలుగును మరింత వెలుగులోకి తేవాలని చెప్పారు.
- ఉదయం జరిగిన సభలో గోవా గవర్నర్ పి.అశోక్‌గజపతి రాజు మాట్లాడుతూ మాతృభాష వల్ల మానవ విలువలు వస్తాయని అన్నారు. భాష గొప్పదనాన్ని భావి తరాలకు అందించాలని చెప్పారు.
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణ ప్రతి తెలుగువాడి బాధ్యత అని అన్నారు.
- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ పిల్లలు తెలుగు నేర్చుకోవడంపై తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ సభకు అధ్యక్షత వహించారు. సభలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పిడి కృష్ణమోహన్, గాయకుడు మనో, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, నటుడు సాయి కుమార్, ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.వి.త్రివిక్రమరావు, తెలుగు/సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ శరత్‌చంద్ర, లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.మాధవ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, మహాసభల సమన్వయ కర్త పి.రామచంద్రరాజు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
నెం. 11/2025-26, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు** తేది: 01.01.2026
పని పేరు : బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం ఎర్రబాలెం గ్రామంలోని పిడిఎఫ్‌ల కోసం ఎర్రబాలెం (ఫేజ్-1) ఆర్ & ఆర్ కాలనీ నుండి మేదరమెట్ల హైవే వరకు అనుసంధాన రహదారికి బిటి రోడ్డు నిర్మాణం.
పని విలువ : రూ. 1,33,52,595/-. షెడ్యూల్ డౌన్‌లోడ్ ఆఖరు తేది : 19.01.2026, మ.3.00 గం.ల వరకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ https://tender.apeprocurement.gov.in లో చూడగలరు.
ఫోన్ నెం: 9490165319.
సం/- పర్యవేక్షక ఇంజినీర్, కన్‌స్ట్రక్షన్ సర్కిల్, ఒంగోలు
DIPR RO No.18666/CL/Advt/1/1/2021-22, Dt: 05.01.2026

ఉచిత పథకాలతో ప్రజల్ని సోమరులను చేస్తున్నారు

ఇలా అయితే ఇంకేం పనిచేస్తారు

సీఎంలు రూ. లక్షల కోట్లు అప్పులు చేస్తున్నారు

విద్య, వైద్యం మాత్రమే ఉచితంగా ఇవ్వాలి

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలి

మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

గుంటూరు రూరల్: ఉచిత పథకాల పేరుతో ప్రభుత్వాలు ప్రజలను సోమరులను చేస్తున్నాయని, ఇలాగైతే ప్రజలు ఇంకేం పనిచేస్తారని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రశ్నించారు. సోమవారం గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్ 10వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా కొందరు ముఖ్యమంత్రులు రూ. లక్షల కోట్లు అప్పులు చేస్తున్నారని, వాటిని చివరకు తీర్చాల్సింది ప్రజలేనన్నారు. ఉచిత బస్సులు కావాలని ప్రజలు అడగలేదని, అసలు ఉచిత పథకం అంటే కేవలం దారిద్ర్యరేఖకు దిగువన ఉండే కడుపేదలకు మాత్రమే అందాలన్నారు. విద్యాలయాలు, వైద్య కేంద్రాలు, వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడిపించాలన్నారు. ప్రైవేటు వైద్యం నేడు అత్యంత ఖరీదైందని, పేదలు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లలేని స్థితిలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి విద్య, వైద్యానికి మాత్రమే ఉచిత పథకాలు అమలు చేయాలని సూచించారు. రూ.లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజలకు పప్పుకూడు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. విద్య, వైద్యం మాత్రం ఉచితంగా ఇస్తేనే ఆ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేసినట్లు అవుతుందన్నారు. ఇటీవల ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన బాగా పెరగడంతో సేంద్రియ ఉత్పత్తుల వైపు వేగంగా అడుగులు వేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జీఎస్టీ పెంపుపై గళమెత్తిన పొగాకు రైతులు

వినుకొండలో భారీ ర్యాలీ

వినుకొండ: కేంద్ర ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులపై విధిస్తున్న భారీ జీఎస్టీని నిరసిస్తూ పల్నాడు జిల్లా వినుకొండలో పొగాకు రైతులు గళమెత్తారు. అఖిలభారత ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ప్రధాన రహదారుల పై రైతులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్రం నిర్ణయం సాగుదారుల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీని 50 శాతం నుంచి 70 శాతం మేర పెంచడం వల్ల మార్కెట్‌లో వినియోగం తగ్గి పరోక్షంగా రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇతర దేశాల నుంచి అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తోన్న విదేశీ సిగరెట్లను వెంటనే అరికట్టాలని, దీని వల్ల దేశీయ పొగాకు రంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని డిమాండ్ చేశారు. రైతు సంఘ నాయకుడు ఎం. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేంద్ర నిర్ణయం వల్ల రైతులు ఆర్థికంగా చితికిపోయే ప్రమాదం ఉందన్నారు. రైతాంగాన్ని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం, ఇలాంటి పన్నుల భారంతో నడ్డి విరవడం సరికాదని రైతులు పేర్కొన్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం...

పాలకొల్లు దంపతుల మృతి

వారం రోజుల క్రితం కృష్ణకిషోర్ తల్లిదండ్రులతో దిగిన ఫొటో

పాలకొల్లు సెంట్రల్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకొల్లుకు చెందిన దంపతులు మృతి చెందారు. వారి ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని పినిశెట్టివారి వీధికి చెందిన కొటికలపూడి పురుషోత్తం(తాతాజీ), లక్ష్మి దంపతులకు కుమారుడు కృష్ణకిషోర్(టిన్ను), కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ వివాహాలయ్యాయి. ఇద్దరూ అమెరికాలోనే స్థిరపడ్డారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన కృష్ణకిషోర్‌కు ఆశాఖన్నాతో 2008లో వివాహమైంది. వీరికి అమెరికన్ గ్రీన్‌కార్డు హోల్డర్లుగా గుర్తింపు ఉంది. కృష్ణకిషోర్ తన తల్లిదండ్రులను చూడడానికి భార్య ఆశాతోపాటు కుమార్తె శివాని, కుమారుడు సుచయ్‌తో కలిసి డిసెంబర్ 23న పాలకొల్లు వచ్చారు. ఐదు రోజులు సంతోషంగా గడిపిన అనంతరం 28న బయలుదేరి దుబాయ్ వెళ్లారు. అక్కడ నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. శనివారం అక్కడి నుంచి బయలుదేరి వాషింగ్టన్ వెళ్లాల్సి ఉంది. ఉదయం ఉన్న వాషింగ్టన్ విమానానికి ఎ.ఎం అని బుక్ చేసుకోవలసిన టికెట్ పొరపాటున పీఎం అని బుక్ చేయడంతో సాయంత్రం వరకు ఆగాల్సి వచ్చింది. అయితే, ఆ టికెట్ క్యాన్సిల్ చేసుకుని వెంటనే అందుబాటులో ఉన్న న్యూయార్క్ విమానానికి టికెట్ తీసుకుని వెళ్లారు.

న్యూయార్క్ నుంచి కారులో వెళుతుండగా..

న్యూయార్క్ నుంచి కృష్ణకిషోర్ కుటుంబం కారులో తాము ఉంటున్న చార్లెట్ సిటీకి వెళ్లాల్సి ఉంది. దాదాపు 1,200 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాలి. సుమారు 400 కిలోమీటర్ల ప్రయాణం పూర్తయ్యాక మేరీల్యాండ్ స్టేట్‌లోని బాల్టిమోర్ సిటీ సమీపంలో ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న ట్రక్కు వీరి కారుని ఢీకొట్టింది. ట్రక్కు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని సమాచారం. ఈ ఘటనలో కొటికలపూడి కృష్ణకిషోర్ (51), అతని భార్య ఆశాఖన్నా (43) అక్కడికక్కడే మృతిచెందారు. కుమార్తె శివాని, కుమారుడు సుచయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో ఆశాఖన్నా డ్రైవింగ్ చేస్తున్నారు. అమెరికాలో శనివారం అర్ధరాత్రి (భారత కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం) ఈ ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు. చికిత్స అనంతరం మెలకువ వచ్చిన కుమార్తె శివాని తమకు సమాచారం ఇచ్చినట్లు పాలకొల్లులోని బంధువులు చెప్పారు.

ఖలీద్, ఇమామ్‌లకు నో బెయిల్

ఢిల్లీలో అల్లర్లు చెలరేగేలా కుట్రకు పాల్పడినట్లు ఆధారాలున్నాయి

- సాక్ష్యాధారాల పరిశీలన లేదా సాక్షుల విచారణ తర్వాతే బెయిల్ పిటిషన్ చూస్తాం
- ఇతర ఐదుగురు నిందితులకు బెయిల్ మంజూరు
- ఢిల్లీలో '2020 అల్లర్ల కేసు'లో కీలక తీర్పు వెలువర్చిన సర్వోన్నత న్యాయస్థానం
- ఉమర్, ఇమామ్‌లకు బెయిల్ తిరస్కరణపై విపక్షాల పెదవివిరుపు

న్యూఢిల్లీ: ఆరేళ్ల క్రితం దేశ రాజధానిలో 53 మంది మరణాలకు, 700 మందికిపైగా గాయాలపాలు కావడానికి కారణమైన భారీ అల్లర్ల కేసులో నిందితులు, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) మాజీ విద్యార్థులు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకోర్టులో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. వీళ్లకు ఎట్టిపరిస్థితుల్లోనూ బెయిల్ ఇచ్చేది లేదని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ వీఎన్ అంజారియాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. అల్లర్లకు భారీ స్థాయిలో కుట్ర పన్నడం, అమలు చేయడం, అల్లరిమూకలకు మార్గదర్శకం వహించడం, అల్లర్లలో భాగస్వాములుగా మారడం దాకా ప్రతిదశలో వీళ్ల పాత్ర ఉన్నట్లు తెలిపే బలమైన సాక్ష్యాధారాలు ఉన్న కారణంగా ఖలీద్, ఇమామ్‌ల బెయిల్ అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. ''ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాధారాలను పోలీసులు కోర్టుకు సమర్పించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక)చట్టం (ఉపా)లోని సెక్షన్ 43డీ(5) ప్రకారం నిందితులపై ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలుంటే బెయిల్‌ను కోర్టు తిరస్కరించవచ్చు. దీని ప్రకారం వీళ్ల బెయిల్ పిటిషన్ తిరస్కరణకు అర్హమైందే. కేసు కీలక దర్యాప్తు, విచారణదశలో ఉన్న ఈ తరుణంలో వీళ్లిద్దరికీ బెయిల్ ఇవ్వడం సముచితం అనిపించుకోదు. కేసు విచారణ ఆలస్యమైనంత మాత్రాన నిందితులకు కొత్తగా ఒనగూరేది ఏమీ ఉండదు. నేరంలో లోతైన ప్రమేయం ఆధారంగా ఏడుగురు నిందితులను ఒకే గాటన కట్టలేము. అందుకే ఇతర ఐదుగురు నిందితులైన గుల్ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్, షిఫా ఉర్ రెహ్మాన్, మొహమ్మద్ సలీమ్ ఖాన్, షాదాబ్ అహ్మద్‌లకు బెయిల్ ఇస్తున్నాం'' అని సోమవారం సుప్రీంకోర్టు ప్రకటించింది.

11 షరతులు విధించిన కోర్టు

ఈ సందర్భంగా ఈ ఐదుగురికి కోర్టు 11 షరతులు విధించింది. '' తలా రూ.2 లక్షల పూచీకత్తుతో వ్యక్తిగత బాండ్ సమర్పించండి. దేశం దాటి ఎక్కడికీ పోవద్దు. ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోనే అధికారులకు అందుబాటులో ఉండాలి. పాస్‌పోర్ట్‌లను అధికారులకు ఇచ్చేయాలి. ఢిల్లీ జైసింగ్ మార్గ్ పోలీస్‌స్టేషన్‌కు ప్రతి సోమ, గురువారాలు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలి. మీరు ఉండబోయే ఇంటి అడ్రస్, వాడబోయే ఫోన్ నంబర్, ఈమెయిల్‌లను దర్యాప్తు అధికారులకు ఇవ్వాలి. కేసు పూర్తయ్యేదాకా కేసు వివరాలు ఎక్కడా ఎవరితో పంచుకోవద్దు. ప్రచారసభల్లో ప్రసంగాలు చేయొద్దు. భౌతికంగా, ఎల్రక్టానిక్ వస్తువులు, మాధ్యమాల్లో ఎలాంటి అంశాలను ప్రచారంలోకి తేవొద్దు'' అని కోర్టు వాళ్లకు సూచించింది.

వీళ్లది కీలక పాత్ర..

'' ఉమర్ ఖలీద్, ఇమామ్‌లు భారీ కుట్రలో కీలక భాగస్వాములుగా ఉన్నారు. వ్యూహరచన, అల్లరిమూకలను రెచ్చగొట్టడం, లక్షిత ప్రాంతాల్లో గుమిగూడేలా చేయడం, ప్రణాళిక అమలులో వీళ్ల పాత్ర ఉందని ప్రాథమిక సాక్ష్యాధారాలు స్పష్టం చేస్తున్నాయి. ట్రంప్ పర్యటన సందర్భంగా జనం రోడ్లమీదకొచ్చి రాస్తారోకోలు, ధర్నాలు చేసేలా ఫిబ్రవరి 24, 25 తేదీల్లో ఖలీద్ విద్వేషపూరిత ప్రసంగాలిచ్చాడు. భారత్‌లో మైనార్టీలు హింసకు బలవుతున్నారనే వాదనలు నిజమని అంతర్జాతీయ సమాజం విశ్వసించేలా ప్రసంగాలిచ్చారు. జేఎన్‌యూ వర్సిటీలో ముస్లిం స్టూడెంట్స్ ఆఫ్ జేఎన్‌యూ వాట్సాప్ గ్రూప్ సృష్టించి అందర్నీ సమీకరించాడు. ఇతని పాత్ర ఒక్క ఢిల్లీకే పరిమితం కాలేదు. జనాన్ని పోగేసేందుకు అలీగఢ్, ఇతర ప్రాంతాల్లోనూ పర్యటించాడు'' అని ధర్మాసనం తన తీర్పులో పలు అంశాలను ప్రస్తావించింది.

గుల్ఫిషా ఫాతిమా పాత్రపై..

''ఇక మరో నిందితురాలు గుల్ఫిషా ఫాతిమా.. స్థానిక మహిళలను పోగేసి నిరసన ప్రదర్శనల ప్రాంతాలకు తరలించారని, ఉద్యమ సంబంధ వస్తువుల సేకరణకు సాయపడ్డారని చేసిన వాదనల్లో పస లేదు. అందుకే ఆమెకు బెయిల్ ఇస్తున్నాం'' అని కోర్టు స్పష్టంచేసింది. పౌరసత్వ సవరణచట్టం–2020, జాతీయ పౌరపట్టీ (ఎన్‌ఆర్‌సీ)లను తీవ్రంగా వ్యతిరేకిస్తూ చట్టవ్యతిరేక విద్వేషక ప్రసంగాలు చేశారన్న ఆరోపణలపై ఇమామ్‌ను పోలీసులు 2020 జనవరి 28వ తేదీన, సెప్టెంబర్ 13వ తేదీన ఖలీద్‌ను అరెస్ట్‌చేశారు. ఈ కేసులో బెయిల్ కుదరదని ఢిల్లీ హైకోర్టు గత ఏడాది సెప్టెంబర్ రెండో తేదీన ఇచ్చిన తీర్పును ఖలీద్, ఉమర్‌తోపాటు మరో ఐదుగురు నిందితులు సుప్రీంకోర్టులో సవాల్ చేయగా గత ఏడాది డిసెంబర్‌లో వాదనలు పూర్తయ్యాయి. నిందితుల తరఫున కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ దవే, సల్మాన్ ఖుర్షీద్, సిద్ధార్థ్ లూథ్రా హాజరై వాదనలు వినిపించారు. ఢిల్లీ పోలీసుల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు వాదనలు వినిపించగా తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం గత ఏడాది డిసెంబర్ 10వ తేదీన రిజర్వ్‌చేసి సోమవారం తీర్పును వెలువర్చింది. సాక్ష్యాధారాల పరిశీలన, సాక్షుల విచారణ తర్వాత లేదా ఏడాది తర్వాత ఉమర్, ఇమామ్‌లు తాజాగా బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ధర్మాసనం సూచించింది. ఉత్తర ఢిల్లీలో 2020 ఫిబ్రవరిలో జరిగిన అల్లర్ల వెనుక ముందస్తు ప్రణాళిక దాగి ఉందని, ఇలాంటి వ్యూహరచన, అమలు అనేవి దేశ సార్వభౌమత్వంపై దాడి అని ఢిల్లీ పోలీసులు విచారణ సందర్భంగా వాదించారు. అందుకే అత్యంత కఠినమైన ఉపా, భారత శిక్షాస్మృతి సెక్షన్ల కింద కేసు నమోదుచేశామని వాదించారు.

అదృష్టం లేదంతే

బెయిల్ తిరస్కృతిపై ఖలీద్ తండ్రి ఆవేదన

న్యూఢిల్లీ: ఉమర్ ఖలీద్‌కు బెయిల్ రాకపోవడంపై అతని తండ్రి ఎస్‌క్యూఆర్ లియాస్ ఆవేదన వ్యక్తంచేశారు. '' తీర్పు కాపీ అందరికీ అందుబాటులోనే ఉంది. దీనిపై నేను కొత్తగా చెప్పేదేం లేదు. ఖలీద్ విషయంలో మాకు అదృష్టం లేదంతే. ఇది నిజంగా దురదృష్టకరం'' అని వ్యాఖ్యానించారు.

ఇకపై ఇదే నా కొత్త జీవితం..

తీర్పుపై ఖలీద్ సహచరిణి బానోజ్యోత్స్న లాహిరి 'ఎక్స్' వేదికగా స్పందించారు. అతనికి బెయిల్ రాకపోయినా తన తోటి వాళ్లు బెయిల్‌పై విడుదల అవుతున్నందుకు ఖలీద్ సంతోషం వ్యక్తం చేశాడని బానోజ్యోత్స్న వెల్లడించారు. '' బెయిల్ కనీసం వాళ్లకయినా వచ్చిందికదా. సంతోషం. నాకెంతో తృప్తిగా ఉంది'' అని ఖలీద్ అన్నారు. దీనికి స్పందనగా '' నేను రేపు వచ్చి జైలులో నీతో ములాఖత్ అవుతాను'' అని జ్యోత్స్న సమాధానం ఇచ్చారు. దీనికి స్పందనగా ఖలీద్ '' మంచి పని. వచ్చేసెయ్. ఇకపై ఇదే నా కొత్త జీవితం '' అని వ్యాఖ్యానించాడు.

ఆయనకు 15 సార్లు ఎలా?

ఉమర్ ఖలీద్, ఇమామ్‌ల బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు వెలువర్చిన తీర్పుపై విపక్ష నేతలు అసహనం వ్యక్తంచేశారు. ఈ మేరకు సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిటాస్ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. '' వీలైనంత వరకు నిందితులకు బెయిల్ ఇచ్చేందుకే చూడాలి. తప్పనిసరి పరిస్థితుల్లోనే జైలుకు పంపాలి అనే సూత్రం అందరికీ ఒకేలా వర్తించబోదని నేడు సుప్రీం తీర్పుతో అర్థమైంది. ఈ కేసులో విచారణ ఇంకా మొదలుకాలేదు. అయినాసరే కఠిన ఉపా చట్టం కింద ఉమర్‌ఖలీద్‌ను ఐదేళ్లుగా కారాగార చీకటికొట్టంలో పడేశారు. ఇది విచారణకు ముందే జైలుశిక్ష అమలుచేయడం కాదా?. మహిళా భక్తులపై రేప్, హత్య కేసులో 2017లోనే 20 ఏళ్ల శిక్షపడిన డేరాసచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రాంరహీం సింగ్‌కు మరోసారి తాత్కాలిక జైలుశిక్ష నిలుపుదల(పెరోల్) అవకాశం కల్పించారు. ఇప్పటికి ఆయన ఇలా 15 సార్లు పెరోల్‌మీద బయటికొచ్చాడు. ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరో న్యాయమా. ఒకరు(ఖలీద్) నిరవధికంగా జైల్లో మగ్గిపోతుంటే మరొకరు(గుర్మీత్ బాబా) బయట డిమాండ్‌కు తగ్గట్లు ఎప్పటికప్పుడు జైలు నుంచి సెలవుల మీద విడుదలై సంతోషంగా గడుపుతున్నారు'' అని జాన్ బ్రిటాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తీర్పును బీజేపీ స్వాగతించింది. సత్యమేవ జయతే అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సైతం తీర్పుపై సంతోషం వ్యక్తంచేశారు.

నేను కోపంగా ఉన్నట్టు మోదీకి తెలుసు!

రష్యా చమురు కొనుగోళ్లపై ట్రంప్ ● టారిఫ్‌లు భారీగా పెంచుతామని ప్రకటన

న్యూయార్క్/వాషింగ్టన్: రష్యా నుంచి భారత చమురు కొనుగోళ్లపై తాను ఆగ్రహంగా ఉన్నట్టు ప్రధాని నరేంద్ర మోదీకి బాగా తెలుసని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అంతేకాదు, భారత్‌పై టారిఫ్‌లను అతి త్వరలో భారీగా పెంచే అవకాశముందని మరో బాంబు పేల్చారు. ఫ్లోరిడా నివాసం నుంచి వాషింగ్టన్ వెళ్తూ ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''మోదీ చాలా మంచివారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో నేను ఆనందంగా లేనని ఆయనకు తెలుసు. దాంతో భారత్ నన్ను సంతోషపరిచేందుకు ప్రయత్నించింది. అది చాలా ముఖ్యం కూడా. ఏమైనా భారత్‌పై త్వరలో టారిఫ్‌లు పెంచేస్తాం. అది వారికి చాలా చేటు చేయనుంది''అని వ్యాఖ్యానించారు. తమ ఆంక్షలు రష్యాను బాగా నష్టపరుస్తున్నాయన్న ట్రంప్, ఆ వెంటనే గురి భారత్‌పైకి తిప్పారు. భారత్‌పై అమెరికా ఇప్పటికే అత్యధికంగా 50 శాతం టారిఫ్‌లు విధించడం తెలిసిందే. భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద చమురు దిగుమతిదారు. తన చమురు అవసరాల్లో 88 శాతం దాకా దిగుమతులపైనే ఆధారపడింది. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యా తన చమురును చవకగా విక్రయిస్తుండటంతో అక్కడి నుంచి భారీగా దిగుమతి చేసుకుంటూ వస్తోంది. అయితే కొన్నాళ్లుగా అందులో తగ్గుదల నమోదవుతున్నట్టు రియల్ టైం డేటా అనలిటిక్స్ సంస్థ క్ప్లర్ తెలిపింది. రష్యా నుంచి భారత చమురు దిగుమతులు నవంబర్‌లో రోజుకు 18.4 లక్షల బ్యారెళ్లు కాగా డిసెంబర్‌లో 12 లక్షల బ్యారెళ్లకు తగ్గినట్టు పేర్కొంది. ఇది గత మూడేళ్లలో అత్యల్పం కావడం విశేషం.

గ్రాహం వ్యాఖ్యల కాక

రష్యా నుంచి భారత చమురు కొనుగోళ్లు భారీగా తగ్గాయంటే ట్రంప్ విధించిన భారీ టారిఫ్‌లే కారణమని యూఎస్ సెనేటర్ లిండ్సీ గ్రాహం కూడా తాజాగా వ్యాఖ్యానించడం తెలిసిందే. ''ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి తెరదించాలంటే ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై ఒత్తిడిని విపరీతంగా పెంచక తప్పదు. గత నెల భారత రాయబారి (వినయ్ క్వాత్రా)తో భేటీ అయినప్పుడు తాము రష్యా చమురు కొనుగోళ్లను ఎంతగా తగ్గించిందీ వివరించేందుకే ఆయన ప్రాధాన్యమిచ్చారు. 'భారత్‌పై టారిఫ్‌లను తగ్గించాల్సిందిగా అధ్యక్షునికి చెబుతారా?'అని నన్నడిగారు''అని కూడా గ్రాహం చెప్పుకొచ్చారు. వాటిపై భారత్‌లో విస్మయం వ్యక్తమైంది కూడా. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై ఏకంగా 500 సుంకాలు విధించాలని అమెరికా నూతన టారిఫ్ బిల్లులో ప్రతిపాదించడం తెలిసిందే.

పుతిన్ నివాసాన్ని ఉక్రెయిన్ లక్ష్యంగా చేసుకోలేదు

రష్యా 'డ్రోన్ దాడి' ఆరోపణలను ఖండించిన ట్రంప్

వాషింగ్టన్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు చెందిన నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడికి దిగిందంటూ వచ్చిన ఆరోపణలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఖండించారు. రష్యా అధ్యక్షుడి నివాసాన్ని ఉక్రెయిన్ లక్ష్యంగా చేసుకోలేదని చెప్పారు. పుతిన్ నివాసానికి సమీపంలో ఏదో జరిగిందని, అయితే అది పుతిన్‌ను లక్ష్యంగా చేసుకుని జరిగింది కాదని తమ అధికారులు చెప్పారన్నారు. ఫ్లోరిడాలోని మార్ ఎ లాగో నివాసంలో రెండు వారాల విశ్రాంతి ముగించుకున్న ట్రంప్ సోమవారం వాషింగ్టన్‌కు వస్తూ తన ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో మాట్లాడారు. 'మొదట్లో ఉక్రెయిన్ దాడి విషయం మేం కూడా నమ్మాం. కానీ, ఇప్పుడు పూర్తి క్లారిటీ వచ్చింది. అలాంటి దాడి ఏదీ జరగలేదని నిర్ధారణ అయింది'అని ట్రంప్ అన్నారు. ట్రంప్ ప్రతిపాదిత రష్యా–ఉక్రెయిన్ శాంతి ఒప్పందంపై అమెరికాలో చర్చలు జరుగుతున్న వేళ..పుతిన్ తనతో ఫోన్‌లో మాట్లాడారని, డ్రోన్ దాడి జరిగినట్లు చెప్పడంతో తనకు చాలా కోపం వచ్చిందని సోమవారం ట్రంప్ తెలపడం తెల్సిందే. అనంతరం, శాంతి చర్చలను తప్పుదోవ పట్టించేందుకే రష్యా ఈ అబద్ధం చెప్పిందటూ న్యూయార్క్ పోస్ట్‌లో వచ్చిన కథనాన్ని బుధవారం ఆయన షేర్ చేశారు. శాంతి చర్చలు పురోగతిలో ఉన్నట్లు ట్రంప్, జెలెన్‌స్కీ ప్రకటించినా రష్యా మాత్రం తన డిమాండ్లపై వెనక్కి తగ్గడం లేదు. ఉక్రెయిన్‌లోని పారిశ్రామిక డోన్బాస్ ప్రాంతం మొత్తం తనకే చెందాలని, యుద్ధానంతరం ఆ దేశం పరిమితంగా సైన్యాన్ని ఉంచుకోవాలని షరతులు విధిస్తోంది.

ఆ డ్యాన్సులే కొంప ముంచాయా?

- అమెరికాను ఎద్దేవా చేస్తూ మదురో స్టెప్పులు
- పదేపదే వెక్కిరించడంతో రగిలిపోయిన ట్రంప్

నవంబర్‌లో ఓ కార్యక్రమంలో మదురో స్టెప్పులు

వాషింగ్టన్: డ్యాన్సు స్టెప్పులు వేసి మరీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను అనవసరంగా రెచ్చగొట్టడమే వెనెజువెలా నియంత నికోలస్ మదురో కొంప ముంచిందా? అవుననే అంటోంది న్యూయార్క్ టైమ్స్ వార్తా పత్రిక. నృత్యాలతో తమను ఎద్దేవా చేయడమే గాక ఏం చేసుకుంటారో చేసుకోండంటూ ఆయన బాహాటంగా సవాలు విసిరినట్టు కూడా ట్రంప్ యంత్రాంగం భావించిందట. గత నవంబర్‌లో మదురో పలుమార్లు టీవీల్లో కనిపించారు. 'యుద్ధం వద్దు, శాంతే కావాలి' అంటూ తాను చేసిన ప్రసంగం తాలూకు మ్యూజికల్ రీమిక్స్‌కు సరదాగా స్టెప్పులు వేశారు. 'మతిలేని యుద్ధం వద్దే వద్దు (నో క్రేజీ వార్)' అనే లైన్లకు కూడా అలాగే పాదాలు కదిపారు. అమెరికాను, ట్రంప్‌ను, ప్రత్యక్ష దాడి తప్పదన్న ఆయన హెచ్చరికలను తేలిగ్గా తీసుకుంటున్నాననే అర్థం వచ్చేలా ఆ సందర్భంగా పదే పదే నవ్వుతూ కన్పించారు. ఇదంతా ట్రంప్‌కు తీవ్ర ఆగ్రహం కలిగించిందని వైట్‌హౌస్ అధికారులను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ''నిజానికి మదురో అధికారిక నివాసంపై నేరుగా దాడి చేసి ఆయనను ఎత్తుకొచ్చేందుకు అప్పటికి కొద్ది నెలలుగా అమెరికా సైన్యం తాలూకు స్పెషల్ ఫోర్సెస్ రిహార్సల్స్‌లో మునిగి తేలుతూనే ఉన్నాయి. కాకపోతే నిజంగా అలాంటి ప్రత్యక్ష చర్యకు దిగే విషయంలో మాత్రం అప్పటిదాకా ట్రంప్ కాస్త సంశయంలోనే ఉన్నారు. కానీ మదురో డ్యాన్సింగ్ సవాళ్లు చూసి ఆయనకు చిర్రెత్తుకొచ్చింది''అని తెలిపింది. దాంతో, ''మదురో స్టెప్పులు మరీ శ్రుతి మించాయి. ఇక గుణపాఠం నేర్పి తీరాల్సిందే'అని ట్రంప్‌తో పాటు ఆయన యంత్రాంగంలోని ఉన్నతాధికారులు కూడా నిర్ణయానికి వచ్చారట. అలా ట్రంప్‌ను అనవసరంగా పరిధి దాటి రెచ్చగొట్టి, ఆ ఫలితాన్ని మదురో ఇలా అనుభవిస్తున్నారన్నది న్యూయార్క్ టైమ్స్ కథనం! గత శనివారం అర్ధరాత్రి అమెరికా ప్రత్యేక సైనిక దళాలు మెరుపు ఆపరేషన్ చేపట్టి మదురోను ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌తో పాటు బెడ్రూంలో నుంచి లాక్కొచ్చి మరీ న్యూయార్క్‌కు తరలించడం తెలిసిందే. ఇప్పుడాయన విచారణ కోసం ఎదురుచూస్తూ న్యూయార్క్ జైల్లో కాలం గడుపుతున్నారు. మదురో దంపతులతో పాటు వారి కుమారునిపై కూడా అమెరికా డ్రగ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పలు అభియోగాలు మోపింది. సైనిక చర్యకు ముందు పలుమార్లు మదురోకు దేశం వీడి ఏ తుర్కియేలోనో ఆశ్రయం పొందాల్సిందిగా ట్రంప్ ఆఫర్ ఇచ్చారు. వాటిని మదురో నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తూ వచ్చారు.

నేను వెనెజువెలా అధ్యక్షుడిని..

- అమెరికా కోర్టులో మదురో వాదన
- ప్రథమ పౌరురాలినన్న సిలియా ఫ్లోరెస్
- తదుపరి విచారణ మార్చికి వాయిదా

న్యూయార్క్: వెనెజువెలా పదవీచ్యుత అధ్యక్షుడు నికొలస్ మదురో అమెరికా గడ్డపై బందీగా ఉన్నా ఏమాత్రం జంక లేదు. 'నేను వెనెజువెలా అధ్యక్షుడిని. కారకాస్‌లోని నా ఇంట్లో ఉండగా బంధించి తీసుకువచ్చారు. నేనెలాంటి తప్పూ చేయలేదు. అమాయకుడిని. మర్యాదస్తుడిని' అని సోమవారం మన్‌హట్టన్ కోర్టులో చెప్పుకున్నారు. వ్యాపార లావాదేవీలను తప్పుగా చూపారంటూ నమోదైన కేసులో 2024లో డొనాల్డ్ ట్రంప్ సైతం ఇదే కోర్టు బోనులో నిలుచోవడం విశేషం. మదురో కేసులో క్లింటన్ హయాంలో నియమితులైన 92 ఏళ్ల అల్విన్ హెల్లెర్‌స్టీన్ వాదనలు విన్నారు. సరిగ్గా 12 గంటల సమయంలో కాళ్లకు మాత్రమే గొలుసులుండగా చేతులు వెనక్కి పెట్టుకుని భద్రతా సిబ్బంది వెంటరాగా మదురో కోర్టు హాల్లోకి ప్రవేశించారు. మదురో, సిలియాలు హెడ్‌ఫోన్లు పెట్టుకుని ఇంగ్లిష్ నుంచి స్పానిష్‌లోకి కోర్టు ప్రొసీడింగ్ అనువాదాలను వింటూ ఉన్నారు. జడ్జి అల్విన్ హెల్లెర్‌స్టీన్ పరిచయం అనంతరం మదురో.. వెనెజువెలా అధ్యక్షుడినంటూ జడ్జికి స్పానిష్ భాషలో పరిచయం చేసుకున్నారు. తానెలాంటి తప్పు చేయలేదని పేర్కొన్నారు. తనను బందీగా మార్చారంటూ స్పానిష్‌లో మదురో చెప్పారు. ఆయన మాటలను కోర్టు రూం రిపోర్టర్ అనువాదం చేసి జడ్జికి తెలిపారు. మదురో భార్య

నన్ను కిడ్నాప్ చేశారు..!

సిలియా ఫ్లోరెస్ కూడా తాను వెనెజువెలా ప్రథమ మహిళనంటూ చెప్పుకున్నారు. ఎలాంటి తప్పూ చేయలేదని స్పానిష్‌లో తెలిపారు. వీరిద్దరూ జైలు నుంచి విడుదలను గానీ, బెయిల్‌ను గానీ కోరడం లేదని లాయర్లు తెలిపారు. జడ్జి ఆదేశాల మేరకు అభియోగాలకు సంబంధించిన పత్రాలను అధికారులు ఇద్దరికీ అందించారు. అనంతరం, తదుపరి విచారణ మార్చి 17న ఉదయం 11 గంటలకు ఉంటుందని జడ్జి ప్రకటించారు. మదురోపై విచారణ చేపట్టిన కోర్టు సముదాయం వెలుపల పెద్ద సంఖ్యలో జనం గుమికూడారు. మదురోను విడుదల చేయాలని కొందరు, ట్రంప్ కింగ్.. అంటూ మరికొందరు నినాదాలు చేశారు. అంతకుముందు, బ్రూక్లిన్ జైలు నుంచి సోమవారం ఉదయం 7.15 గంటల సమయంలో మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను జైలు నుంచి అత్యంత భారీ భద్రతతో కూడిన వాహన శ్రేణిలో దగ్గర్లోని అథ్లెటిక్ ఫీల్డ్‌కు తీసుకెళ్లారు. హెలికాప్టర్‌లోకి వారిని ఎక్కించారు. ఆ హెలికాప్టర్ మన్‌హట్టన్ హెలిపోర్టులో ల్యాండయ్యింది. హెలికాప్టర్ నుంచి దించి సాయుధ వాహనంలో వారిని కూర్చోబెట్టుకుని కోర్టుహౌస్ కాంప్లెక్స్‌లోకి తీసుకెళ్లారు. శనివారం చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో కారకాస్‌లోని మిలటరీ బేస్‌లోని నివాసం నుంచి మదురో, సిలియాలను అమెరికా బలగాలు న్యూయార్క్‌కు తీసుకురావడం తెల్సిందే. మాదక ద్రవ్యాలతో పాటు ఆయుధాల అక్రమ రవాణా ఆరోపణలను వారిద్దరిపైనా మోపారు. కాగా, మదురో భార్య సిలియా డ్రగ్స్ అక్రమ రవాణాదారుల నుంచి 2007లో భారీగా ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి.



మన్‌హట్టన్ కోర్టు వద్ద మదురో

ఎవరీ పొలాక్..?

మదురో తరఫున వాషింగ్టన్‌కు చెందిన ప్రముఖ లాయర్ బ్యారీ పొలాక్ వాదనలు వినిపించారు. వికీలీక్స్ ఫౌండర్ జూలియన్ అసాంజే తరఫున దీర్ఘకాలం ప్రాతినిథ్యం వహించింది ఈయనే. అమెరికా గూఢచర్య చట్టం కింద ఆరోపణలు ఎదుర్కొంటున్న అసాంజేను జైలు నుంచి విడుదల చేయించి, సొంతదేశం ఆస్ట్రేలియాకు పంపించడంలో కీలకంగా ఉన్నారు. అసాధ్యాన్ని సైతం సుసాధ్యం చేయగలరని ఈయనకు పేరుంది.

ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా కోర్టుకెళతా

- ప్రజలు భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు
- అనారోగ్యంతో ఆస్పత్రి పాలవుతున్నారు
- బెంగాల్ సీఎం మమత ఆరోపణలు

సాగర్ ఐల్యాండ్: పశ్చిమ బెంగాల్ ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్‌ఐఆర్) ప్రక్రియను సవాల్ చేస్తూ కోర్టుకు వెళతామని టీఎంసీ చీఫ్, సీఎం మమతా బెనర్జీ సోమవారం ప్రకటించారు. ఎస్‌ఐఆర్ అధికారుల వేధింపులు, ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలు భయాందోళనలకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవుతున్నారని ఆమె ఆరోపించారు. దక్షిణ 24 పరగణాల జిల్లా సాగర్ ఐల్యాండ్‌లో జరిగిన బహిరంగ సభలో మమత మాట్లాడారు. ఎస్‌ఐఆర్ సిబ్బంది ఎలాంటి సహేతుక కారణాలను చూపకుండానే అర్హులైన ఓటర్ల పేర్లను ఏకపక్షంగా తొలగిస్తున్నారని విమర్శించారు. మామూలుగా చేపట్టే ఈ ప్రక్రియను ఎన్నికల వేళ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే ఆయుధంగా వాడుతున్నారని ఆరోపించారు. ఓటర్ల పట్ల అమానవీయంగా వ్యవహరించడం, ఎస్‌ఐఆర్ నేపథ్యంలో సంభవిస్తున్న మరణాలపై 6న(మంగళవారం) కోర్టులో పిటిషన్ వేస్తామన్నారు. ఓ సాధారణ పౌరురాలిగా అవసరమైతే దీనిపై సుప్రీంకోర్టు తలుపు కూడా తడతానన్నారు. 'నేను కూడా అనుభవమున్న లాయర్‌నే'అంటూ వ్యాఖ్యానించారు. అయితే, ఈ పిటిషన్‌ను వ్యక్తిగతంగా వేస్తారా, రాష్ట్ర ప్రభుత్వం లేక టీఎంసీ పక్షానా అనే విషయం ఆమె స్పష్టంగా తెలపలేదు. వ్యాధిగ్రస్తులు, వృద్ధులు కూడా తాము అర్హులైన ఓటర్లమే అని నిరూపించుకోవాల్సి వస్తోందన్నారు. ఏమాత్రం కనికరం చూపకుండా ఎస్‌ఐఆర్ సిబ్బంది వారినీ క్యూలలో నిల్చోబెడుతున్నారని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వలస కార్మికులపై వివక్ష చూపుతున్నారని మమత చెప్పారు. బెంగాలీలో మాట్లాడటం ఈ దేశంలో నేరమైపోయిందంటూ ఆమె..'నన్ను చంపినా సరే, బెంగాలీలోనే మాట్లాడుతా'అని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ప్రజలు తాయిలాలు చూపే బీజేపీ.. గెలిచిన తర్వాత అణచివేతలకు పాల్పడుతుందని హెచ్చరించారు. 'ఎన్నికలకు ముందు తలా రూ.10 వేలు పంచిపెడుతుంది.. ఆ తర్వాత వారిపైకి బుల్‌డోజర్లను నడుపుతుంది'అంటూ బీజేపీపై ధ్వజమెత్తారు.

11న సోమనాథ్ ఆలయానికి వెళ్తున్నా

- సోమనాథ్ స్వాభిమాన్ పర్వ ఉత్సవాల్లో పాల్గొంటా
- ఈ క్షేత్రం మన అజేయ సంకల్పానికి నిదర్శనం: మోదీ
- 1951లో ప్రధాని నెహ్రూ పునర్నిర్మాణ వేడుకలకు వెళ్లలేదంటూ నింద

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 11వ తేదీన గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయాన్ని సందర్శించుకోనున్నారు. సోమనాథ్ ఆలయంపై విదేశీయులు మొదటిసారిగా దాడి జరిపి, ధ్వంసం చేసిన దురాగతానికి వెయ్యేళ్లు అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరుతో ఏడాదంతా వివిధ కార్యక్రమాలను తలపెట్టారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్నాయి. సోమనాథ్‌ను 11వ తేదీన సందర్శించుకోనున్నట్లు ప్రధాని సోమవారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. 'సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం భారతీయ నాగరికత అజేయ సంకల్పానికి, బలానికి గొప్ప నిదర్శనం. విదేశీ దురాక్రమణదారులు ఎన్నిసార్లు దాడి చేసినా, ప్రతిసారీ ఈ పుణ్యక్షేత్రం మరింత వైభవోపేతంగా తిరిగి పుంజుకుంది'అని పేర్కొన్నారు. గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతం వెరావల్‌లో అరేబియా సముద్ర తీరాన ఉన్న సోమనాథ్ ఆలయంలో శివుడు కొలువుతీరాడు. ఈ ఆలయంపై మొదటిసారిగా తుర్కియే పాలకుడు గజనీ మహ్మద్ దాడి చేసి, విధ్వంసం సృష్టించాడు. అప్పట్నుంచి పలువురు విదేశీ పాలకులు దాడి చేసి దోచుకున్నారు. 'సోమనాథ్ కథ కేవలం ఒక ఆలయానికి సంబంధించింది కాదు, అది మన సంస్కృతిని, నాగరికతను కాపాడిన భారతమాత కోట్లాది సంతానానికి చెందిన అజేయమైన సాహసగాథ. శతాబ్దాల తరబడి దాడులు, వలసవాద దోపిడీలను తట్టుకుని నిలబడిన ఈ స్ఫూర్తే నేడు మన దేశాన్ని ప్రపంచ ఆర్థిక వృద్ధిలో అత్యంత వేగంగా ముందుకు సాగుతున్న దేశంగా నిలబెట్టింది'అని మోదీ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక ఆలయాన్ని పునర్నిర్మించే విషయంలో సర్దార్ పటేల్ ఎంతో చొరవ కనబరిచారన్న ప్రధాని మోదీ...1951లో జరిగిన ఆలయ ఉత్సవాలకు అప్పటి ప్రధాని నెహ్రూ వెళ్లలేదంటూ నిందించారు. '1947లో దీపావళి వేడుకల వేళ సర్దార్ పటేల్ ఆలయాన్ని దర్శించుకున్నారు. అప్పుడే ఆయన ఆలయానికి పూర్వవైభవం తేవాలని నిర్ణయించుకున్నారు'' అని మోదీ చెప్పారు.

పీఎఫ్ వేతన పరిమితి పెంపుపై 4 నెలల్లో నిర్ణయం తీసుకోండి

కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి పథకం (ఈపీఎఫ్ఓ) పథకం లబ్ధిదారుల అర్హతకు సంబంధించిన గరిష్ట వేతన పరిమితిని పెంచడంపై నాలుగు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందిగా కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. నెలవారీ వేతనం రూ.15 వేలకు మించిన వారికి పీఎఫ్ పథకం వర్తించదన్నది తెలిసిందే. దీన్ని గత 11 ఏళ్లుగా సవరించకపోవడాన్ని ప్రశ్నిస్తూ నవీన్ ప్రకాశ్ నౌటియాల్ అనే సామాజిక కార్యకర్త సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నెలవారీ వేతనం 15 వేలకు మించితే పీఎఫ్ ప్రయోజనాలు దక్కకపోవడం దారుణమని ఆయన ఆరోపించారు. కేంద్రంతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన కనీస నెలవారీ వేతన మొత్తమే రూ.15 వేలకు మించి ఉందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో 15 వేల పరిమితి వల్ల పీఎఫ్ పథకం తాలూకు సామాజిక సంక్షేమ ఫలాలు చాలామంది అర్హులైన చిరుద్యోగులకు అందకుండా పోతున్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు. దాంతో, పీఎఫ్ వేతన పరిమితి పెంపుపై 4 నెలల్లో కేంద్రం నిర్ణయం తీసుకోవాలంటూ న్యాయ మూర్తులు జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ ధర్మాసనం సోమ వారం తీర్పు వెలువరించింది. తమ తీర్పు కాపీని జత పరుస్తూ రెండు వారాల్లోగా కేంద్రానికి వినతిపత్రం ఇవ్వాల్సిందిగా పిటిషనర్‌కు సూచించింది.

ఉపసంఘమే చెప్పినా: పీఎఫ్ పథకం లబ్ధిదారుల గరిష్ట వేతన పరిమితి పెంపుపై నిర్దిష్ట నియమ నిబంధనలేవీ లేవు. దాంతో దాని సవరణ విషయంలో ఒక క్రమమంటూ లేకుండా పోయింది. ఒకసారి 12 ఏళ్లకు, మరోసారి 13, 14 ఏళ్లకు గరిష్ట వేతన పరిమితిని సవరించారు. పైగా ద్రవ్యోల్బణం, తలసరి ఆదాయం, ఆర్థిక సూచనలను కూడా పెద్దగా పరిగణనలోకి తీసు కోవడం లేదన్నది సామాజిక కార్యకర్తల ఆరోప ణ. దీనివల్ల అర్హులైన చిరుద్యోగులెందరో పీఎఫ్ పథకం ఫలాలకు దూరమవుతున్నారని నౌటియాల్ తన పిటిషన్‌లో ఆవేదన వెలిబుచ్చారు.

సాక్షి
గుంటూరు
మంగళవారం । 6 । జనవరి । 2026

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 560.00 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 19,472 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డుకు సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1500, గరిష్ట ధర రూ.3500, మోడల్ ధర రూ.2300 వరకు పలికింది.

స్వామివారికి విశేషార్చన

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రులోని శ్రీ భూనీళా సమేత శ్రీ వరదరాజస్వామి సోమవారం ప్రాతఃకాలంలో విశేషార్చనలో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

విశేష అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు ఆలయాల్లో సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణం వడ్డవల్లిలోని శ్రీ రామాలయం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామికి విశేష అలంకారం చేశారు. కోదండ రామచంద్ర ప్రభువైన శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామిలను విశేష అలంకరణ చేసి పూజలు, గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. మహిళలు పాశురాలను పఠించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో ఉన్న శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి గంధంతో అలంకారం చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు చిత్రకవి శ్యాము ఆచార్యులు గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కోలాట ప్రదర్శన చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా శ్రీరామయోగయ్య స్వామి తిరునాళ్ల వేడుకలు



నూజెండ్ల: నూజెండ్ల గ్రామంలో వేంచేసి యున్న శ్రీరామయోగయ్య స్వామి తిరునాళ్ల వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని వేకువజాము నుంచి పంచామృతాలతో ప్రత్యేకంగా అభిషేకించి విశేష పూజలు చేశారు. గ్రామంలోని నలుదిక్కులు ఏర్పాటు చేసిన పాదులకు మేళతాళాల నడుమ వైభవంగా 108 బిందెలతో గ్రామస్తులు జలాభిషేకం చేశారు. మహిళలు పొంగళ్లు పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. మూడు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు.

కోర్టు ఆవరణలో సోషల్ సెక్యూరిటీ ఆడిట్

నరసరావుపేట టౌన్: నరసరావుపేట కోర్టు ఆవరణలో పల్నాడు జిల్లా ఏఆర్ ఏఎస్పీ సత్తిరాజు ఆధ్వర్యంలో సోమవారం సోషల్ సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కోర్టు ఆవరణలో భద్రతాపరమైన అంశాలను పరిశీలించి న్యాయస్థానం ఏవోకు పలు సూచనలు చేశారు . ప్రహరీ గోడ పైన ఇనుప కంచె నిర్మించాలని సూచించారు. కోర్టు ఆవరణలోకి వచ్చే కక్షిదారులను తనిఖీ చేయడానికి తగు ఏర్పాట్లు చేయాలన్నారు. కోర్టు విధులు నిర్వహించే సమయంలో సాయుధ భద్రతనుఆవరణలో ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. జనరేటర్ పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు ఆవరణలో రాత్రి సమయంలో విద్యుత్ కాంతి ఉండేలా లైట్లు ఏర్పాటు చేయవలసిందిగా సూచించారు.

సత్తెనపల్లిలో 100 అడుగుల జాతీయజెండా ఆవిష్కరణ

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో రూ.18.40 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన 100 అడుగుల జాతీయ జెండాను రాష్ట్ర విద్యుత్ శాఖ, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లం చర్ల లక్ష్మీతులసీ, కమిషనర్ నంబూరి ఆనంద్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా పోస్టల్ శాఖ రూపొందించిన ప్రత్యేక కవర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, గోవా గవర్నర్ పి.అశోక్ గజపతిరాజు తదితరులు

కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న అమెరికాకు చెందిన కళాకారిణులు

ముగిసిన తెలుగు మహాసభలు

గుంటూరులోని శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలు సోమవారంతో ముగిశాయి. సభలకు తెలుగు భాషాభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సభల రెండో రోజైన ఆదివారం మారిషస్ దేశ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ దంపతులు హాజరయ్యారు. సభల ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గోవా గవర్నర్ పి.అశోక్‌గజపతిరాజు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా పోస్టల్ శాఖ రూపొందించిన ప్రత్యేక కవర్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ప్రపంచంలో తెలుగు భాషకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. చిన్న పిల్లలను తెలుగులోనే మాట్లాడించాలని తల్లిదండ్రులకు సూచించారు.

జిల్లాల విభజనలో సాంకేతికత లేదు

- బాపట్ల జిల్లాలోకి పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాలు చేర్చాలి
- మంత్రి అనగానికి వినతిపత్రం అందిస్తాం
- మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

బాపట్ల: రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనలో సాంకేతికత లేదని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కోన రఘుపతి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విభన చేపడితే కూటమి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసమే పునర్విభజన చేసిందన్నారు. పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా చేయటం వలన నీతి ఆయోగ్ నుంచి నిధుల విడుదల, వాటి సఫలీకృతం చేసేందుకు వీలు ఉంటుందనే మంచి ఆలోచనతో విభజన చేశారని గుర్తు చేశారు. మా మార్క్ కనిపించాలనే విధంగా కూటమి ప్రభుత్వం అశాస్త్రీయంగా విభజన చేసిందన్నారు. రాయచోటి జిల్లాను మార్పుచేసి మదనపల్లికి ఎందుకు మార్పు చేయాల్సి వచ్చిందో అర్థంకావటంలేదన్నారు.

బాపట్లకు ప్రాధాన్యం తగ్గే విధంగా పునర్విభజన

బాపట్ల జిల్లా నుంచి అద్దంకి నియోజకవర్గాన్ని తొలగించటం బాధాకరమన్నారు. 1982 సంవత్సరం నుంచి బాపట్ల జిల్లాను సాధించాలని తన తండ్రి కోన ప్రభాకర్ నుంచి తన వరకు ఏ సందర్భం వచ్చినా జిల్లా ప్రస్తావనతో ముందుకు నడిశామన్నారు. నీతి ఆయోగ్ ప్రాధాన్యతను చూసినప్పుడు సంతనూతలపాడు నియోజకవర్గం బాపట్ల జిల్లాలోకి రాలేదని కొద్దిపాటి ఆలోచన చేసినప్పటికి ఒంగోలుకు చుట్టుపక్కల ఉండటంతో అలా చేయాల్సి వచ్చిందని భావించామన్నారు. తాను మొదటి నుంచి పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాలను బాపట్ల జిల్లాలో చేర్చాలని కోరుతూనే ఉన్నానని కోన చెప్పారు. అద్దంకి తొలగిపోవటంతో ఆర్థికంగా బాపట్ల జిల్లా వెనుకబడిపోతుందని కోన అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా బాపట్ల జిల్లా ముందు ఉండాలంటే పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాలను జిల్లాలో కలపాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తామని కోన చెప్పారు. జిల్లాల పునర్విభజన సందర్భంగానైన ఆ రెండు నియోజకవర్గాలను బాపట్ల జిల్లాలో కలపాలని బలంగా తమ వాణి వినిపిస్తామని చెప్పారు. సమావేశంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, ఉయ్యూరు లీలాశ్రీనివాసరెడ్డి, నాయకులు గవిని కృష్ణమూర్తి, మోర్ల సముద్రాలగౌడ్, లక్ష్మీరాఘవ, అహ్మద్ హుస్సేన్, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, ఇనగలూరి మాల్యాద్రి, తన్నీరు అంకమ్మరావు తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

విజ్ఞాన్‌లో ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శన

ప్రపంచ ప్రఖ్యాత భరతనాట్య కళాకారిణి డాక్టర్ బాలాదేవి చంద్రశేఖర్ ప్రత్యేక ప్రదర్శన

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో భారతీయ సంప్రదాయ కళలను విద్యార్థులకు చేరువచేసే లక్ష్యంతో శాస్త్రీయ నృత్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్ సోమవారం తెలిపారు. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగం, డీన్-స్టూడెంట్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి గాంచిన ప్రముఖ భరతనాట్య నృత్య కళాకారిణి డాక్టర్ బాలాదేవి చంద్రశేఖర్ ప్రత్యేక శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేశారు. భారతీయ శాస్త్రీయ నృత్యానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చిన కళాకారిణిగా డాక్టర్ బాలాదేవి చంద్రశేఖర్‌కు విశేషమైన పేరు ఉందని వైస్ చాన్సలర్ తెలిపారు. డాక్టర్ బాలాదేవి చంద్రశేఖర్ భారతదేశంతో పాటు అమెరికా, యూరప్, ఆసియా దేశాల్లోని అనేక ప్రతిష్ఠాత్మక వేదికలపై నృత్య ప్రదర్శనలు ఇచ్చి భారతీయ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేశారని తెలిపారు. కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై శాస్త్రీయ నృత్య వైభవాన్ని తిలకించారు.

ప్రముఖ భరతనాట్య నృత్య కళాకారిణి డాక్టర్ బాలాదేవి చంద్రశేఖర్

నేటి నుంచి 134వ ఉరుసు మహోత్సవం

నగరంపాలెం: నగరంపాలెంలో శ్రీహాజరత్ కాలే మస్తాన్ షా ఆవులియా 134వ ఉరుసు మహోత్సవాన్ని మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త రావి రామ్మోహరావు తెలిపారు. సోమవారం సాయంత్రం నగరంపాలెంలో 134వ ఉరుసు మహోత్సవ బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరో తేది నుంచి పదో తేదీ వరకు ఈ మహోత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున బాబా సమాధిపై చాందిని అలంకరణ, గంధ మహోత్సవం, రాత్రి సందల్ (గంధం) ఊరేగింపు ఉంటుందని అన్నారు. ఏడో తేదీ సాయంత్రం గంధం పంపిణీ, దీపారాధన, ఎనిమిదో తేదీన పురాణ పఠనం, తొమ్మిదిన బాబా వస్త్రాలను పంచడం, బాబా కుర్చీ యథాస్థానంలో ఉంచడమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఈ మహోత్సవానికి వచ్చే బాబా భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా కనీస మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజు భక్తులకు అన్న సంతర్పణ ఉంటుందని చెప్పారు. బాబా గంధం, ఊరేగింపుల కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని అన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పాటిబండ్లకు ఆధ్యాత్మిక శోభ

- ముగ్గురు రాజుల మహోత్సవానికి సిద్ధం
- దేశ, విదేశాల నుంచి రానున్న క్రైస్తవ సోదరులు

పెదకూరపాడు: పాటిబండ్ల గ్రామంలో ఆధ్యాత్మిక శోభ విరజల్లుతుంది. ముగ్గురు రాజుల దేవాలయం తిరునాళ్లకు సిద్ధమైంది. తిరునాళ్ల మహోత్సవాన్ని తిలకించేందుకు దేశ విదేశాలలో ఉన్న మత గురువులు, మతకన్యలు, క్రైస్తవ సోదరులతో రానున్నారు. ఆదర్శవంతమైన సంఘంగా, విశ్వాసానికి ప్రత్యేకంగా పాటిబండ్లలో నిర్మించిన ముగ్గురు రాజుల దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాలు 5,6,7 తేదీలతో ముగుస్తాయి. జనవరి ఒకటో తేదీ నుంచి ప్రత్యేక దివ్య పూజ నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించే మహోత్సవంలో గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య ప్రత్యేక దివ్య పూజ నిర్వహించనున్నారు. మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్థానిక విచారణ గురువులు చిన్నాబత్తిన హృదయరాజు తెలిపారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పెదకూరపాడు పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అర్జీల పరిష్కారం మరింత పారదర్శకం

- డీఆర్వో షేక్ ఖాజావలి
- 385 అర్జీలు స్వీకరణ

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని, ఎలాంటి సందర్భంలో కూడా బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకూడదని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో డీఆర్వో మాట్లాడుతూ అర్జీలను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలన్నారు. సీఎంఓ నుంచి అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. లోకాయుక్త, ఎస్సీ, ఎస్టీ, హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు సంబంధించిన కేసులపై తక్షణమే స్పందించాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి నిర్ణీత సమయంలో కౌంటర్ దాఖలు చేయాలన్నారు. మొత్తం అందిన 385 అర్జీల్లో 173 రెవెన్యూ క్లినిక్స్‌లోనే నమోదయ్యాయన్నారు. అర్జీలను డీఆర్వో, డిప్యూటీ కలెక్టర్‌లు గంగరాజు, లక్ష్మీకుమారి, అధికారులు పరిశీలించారు.

అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో, ఇతర అధికారులు

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా రైతుల సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయి. పంటలకు గిట్టుబాటు ధర ఉండడం లేదు. కౌలు రైతులకు రుణాలివ్వక పోగా పంటల బీమా కూడా అంతంత మాత్రమే. ప్రకటించిన నీటి కాలువల మరమ్మతులు, ప్రాజెక్టులపై సమీక్షలు కూడా నిర్వహించడం లేదు. రైతు అభివృద్ధి చెందనిదే దేశం అభివృద్ధి సాధ్యం కాదు. దీనిని పాలకులు అర్థం చేసుకుని రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

–ఉమ్మడి సహదేవరెడ్డి,
రాష్ట్ర అధ్యక్షులు భారతీయ కిసాన్ సంఘ్.

పుస్తకాలకు సమాజాన్ని శాసించే శక్తి

విశ్రాంత ఐఏఎస్ అధికారి కృష్ణయ్య

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజాన్ని శాసించే శక్తి పుస్తకాలకు ఉందని విశ్రాంత ఐఏఎస్ అధికారి కృష్ణయ్య అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో సోమవారం సాయంత్రం ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి రచించిన 'ధర్మపురి' నవలను కృష్ణయ్య ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంపై పుస్తకాల ప్రభావం ఉంటుందన్నారు. గుజ్జు చెన్నారెడ్డి నవలను తీసుకురావటం అభినందనీయమన్నారు. రచయిత చెన్నారెడ్డి మాట్లాడుతూ.. బుద్ధుని చరిత్రతో ప్రభావితమై, దానిని ఆధునిక పరిస్థితులకు అన్వయిస్తూ ఈ నవల రాసినట్లు తెలిపారు. ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు మాట్లాడుతూ.. మత్తు మందుల్లాంటి ప్రమాదకర వ్యసనాల నుంచి భావితరాలను రక్షించే శక్తి మంచి పుస్తకాలకు ఉందన్నారు. ప్రభుత్వ సహాయ కార్యదర్శి కృష్ణయ్య, పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షుడు మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణయ్య తదితరులు

మినీ కవితా ఉద్యమ సారథి కొల్లూరి

ఎక్స్‌రే పత్రిక సంస్థాపకుడు కొల్లూరి మినీ కవితా ఉద్యమ సారథి అని పలువురు వక్తలు కొనియాడారు. ఎక్స్‌రే పత్రిక, నెలనెలా వెన్నెల కార్యక్రమం ద్వారా మినీ కవితా ఉద్యమానికి ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో కవి, ఎక్స్‌రే పత్రిక సంస్థాపకుడు కొల్లూరి సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కార్యదర్శి చలపాక ప్రకాష్ అధ్యక్షత వహించారు. సింగంపల్లి అశోక్ కుమార్, బి.ఆంజనేయరాజు, కందికొండ రవికిరణ్, ఉమామహేశ్వరి, శైలజ సామినేని ప్రసంగించారు.

సమాజాన్ని ఆవిష్కరించే సాధనం కవిత్వం

సమాజ వాస్తవ స్వరూపాన్ని అత్యద్భుతంగా ఆవిష్కరించే సాధనం కవిత్వమని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. 'పాతికేళ్ల కవిత' అంశంపై చర్చాగోష్ఠిని బీవీ పట్టాభిరామ్ సాహిత్యవేదికపై నిర్వహించారు. రచయిత ఖాదర్ మొహియుద్దీన్, కడలి సత్యనారాయణ, కవి అనిల్ డ్యానీ ప్రసంగించారు. సాహితీ స్రవంతి సత్యాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వాధికారి మెరుపుల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మమ్మీ, డాడీ కల్చర్‌కు స్వస్తి పలకండి



మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కళాశాల చైర్మన్ పెరుమాళ్లు

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

ప్రత్తిపాడు: తెలుగు రాష్ట్రంలో పుట్టిన బిడ్డలెవ్వరూ అమ్మా, నాన్నలను మమ్మీ, డాడీ అని పిలవకూడదని, మమ్మీ, డాడీ కల్చర్‌కు స్వస్తి పలికి, ఇంట్లో తెలుగు మాట్లాడాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకలకు ముఖ్య అతిథిగా వెంకయ్యనాయుడు హాజరయ్యారు. తొలుత కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన మాజీ రాష్ట్రపతి ఏపీజె అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం హాస్టల్ ఆవరణలో నూతనంగా నిర్మించిన గాయత్రి సదన్ హాస్టల్ భవన సముదాయాన్ని ప్రారంభించారు. విద్యార్థినుల సాంస్కృతిక నృత్య ప్రదర్శలు, కోలాటాలను ఆసక్తిగా వీక్షించారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అమ్మా.. అనే మాట అంతరాల నుంచి వస్తుందని, మమ్మీ అంటే మూతి నుంచి వస్తుందన్నారు. ఇంగ్లీషు తప్పనిసరిగా చదువుకోవాలని, కానీ ఇంట్లో, వీధిలో, గుడిలో, బడిలో అమ్మఒడి నుంచి వచ్చిన భాషను మరిచిపోకూడదన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	49,746
అమ్మకాలు	45,171
నిల్వ	9,810

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–18,000
నంబరు–5	12,000–17,000
341	11,000–18,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–17,000
నంబరు–5	11,000–16,000
341	11,000–18,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,000
బాడిగ–355	11,000 – 18,000
దేవనూరు డీలక్స్	11,000 – 19,000
ఆర్మూర్	10,000 – 13,000
తాలుకాయలు	5,000 – 8,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,500
బాడిగ – 355	10,000–17,000
తాలు	5,200 – 8,000

–కొరిటెపాడు (గుంటూరు)

ప్రొటోకాల్‌కు అధికారుల మంగళం!

- గ్రామసభకు పిలిచి వేదికపై స్థానం ఇవ్వకుండా వైఎస్సార్ సీపీ జడ్పీటీసీని అవమానించిన వైనం
- ప్రశ్నించడంతో వేదికపై ఓ మూలన చోటు
- టీడీపీ స్థానిక నేతలచే సభ నిర్వహణ

దోకిపర్రులో గ్రామసభ నిర్వహిస్తున్న టీడీపీ స్థానిక నాయకులు

మేడికొండూరు: అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులకు సముచిత గౌరవం ఇవ్వడం లేదు. కేవలం టీడీపీ నేతల అండతోనే వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ ప్రకారం గౌరవించకుండా అవమానాలకు గురిచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మేడికొండూరు మండల పరిధిలోని డోకిపర్రు సచివాలయం వద్ద మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్యకు అధికారులు ఆహ్వానం పలికారు. స్థానిక పంచాయతీ అధికారి ఆహ్వానం మేరకు గ్రామసభకు వచ్చిన జడ్పీటీసీ సిద్ధయ్యకు చేదు అనుభవం ఎదురైంది. ప్రభుత్వ కార్యక్రమమైన గ్రామ సభ వేదికపై టీడీపీ చోటా నాయకులు కొలువుదీరారు. జడ్పీటీసీ సిద్ధయ్య వేదిక వద్దకు వచ్చినా.. వేదికపైకి ఎవరూ ఆహ్వానించలేదు. తనకు ప్రొటోకాల్ పాటించకపోవడంపై సిద్ధయ్య ప్రశ్నించడంతో చివరకు స్థానిక పంచాయతీ అధికారి షేక్ జిలానీ స్టేజిపైకి పిలిచి, చివరన కూర్చోబెట్టారు. అధికారులు టీడీపీ నేతల ఒత్తిళ్లకు లొంగి ప్రజాప్రతినిధులకు సముచిత గౌరవం ఇవ్వకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 1372

కొమ్ములు : 872 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,200	13,511	13,100

కాయలు : 500 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,200	13,511	13,100

మొత్తం అమ్మకాలు : 1,029 క్వింటాళ్లు

–దుగ్గిరాల

గంజాయి ముఠా అరెస్టు

- 6.4 కిలోల గంజాయి స్వాధీనం
- ఏడుగురు నిందితులు అరెస్టు – ఇద్దరు పరారీ
- వివరాలు వెల్లడించిన గురజాల డీఎస్పీ జగదీష్

వివరాలు వెల్లడిస్తున్న గురజాల డీఎస్పీ జగదీష్, పక్కన సీఐ, వెనుక ముసుగులో నిందితులు

పిడుగురాళ్ల: గంజాయి ముఠాను అరెస్టు చేసినట్లు గురజాల డీఎస్పీ బీఎల్ఎన్ జగదీష్ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గురజాల డీఎస్పీ బీఎల్ఎన్ జగదీష్ మాట్లాడుతూ పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కార్యకలాపాలలో పాల్గొంటున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 6 కేజీల 400 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని పట్టణ సీఐ ఎస్ వెంకట్రావు, ఎస్ఐ డి.శివనాగరాజుల బృందం చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిలో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వెన్ను తిరుమలరావు, సాదుపాటి రాజేష్, సున్నావత్ శివకుమార్, సాదుపాటి గోపి, కొండమోడుకు చెందిన షేక్ బాబావలి, పిడుగురాళ్ల ఎస్టీ కాలనీకి చెందిన తాడిమళ్ల దివ్యబాల, డేగల శిరిష వీరికి అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణ శివారు కళ్లం టౌన్‌షిప్ పరిధిలో 60 అడుగుల రోడ్డు చివర పడమర వైపు కొంత మంది గంజాయి కలిగి ఉన్నారనే సమాచారంతో సీఐ వెంకట్రావు, ఎస్ఐ శివనాగరాజులు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అమ్మకాలు వినియోగిస్తున్న స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. వీరితో పాటు దాచేపల్లి పట్టణానికి చెందిన సాకేటి తిరుపతినారం నాయుడు, పిడుగురాళ్ల ఎస్టీ కాలనీకి చెందిన మామిడిశెట్టి మణికంఠలు పరారీలో ఉన్నారు. వీరు విశాఖపట్నం, ఒడిస్సాలో ప్రాంతాల నుంచి కిలో గంజాయిని కిలో రూ. 5000 వేలకు కొనుగోలు చేసి దానిని అరెస్టు అయిన ఏడుగురికి కిలో రూ.10 వేల చొప్పున అమ్మేవారు. ఈ ఏడుగురు పది గ్రాముల చొప్పున చిన్న చిన్న ప్యాకెట్ కవర్లలో పెట్టి పది గ్రాముల గంజాయి ప్యాకెట్ రూ.300లకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే వీరిపై గంజాయి కేసులు వంటి పలు కేసులు నమోదై ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, యువత భవిష్యత్‌కు, సమాజానికి తీవ్ర ప్రమాదమని డీఎస్పీ జగదీష్ హెచ్చరించారు. నిషేధిత మాదకద్రవ్యాల కొనుగోలు, విక్రయం, రవాణా కలిగి ఉండటం చట్టపరంగా తీవ్రమైన నేరమని, ఇటువంటి వాటికి పాల్పడితే కఠిన శిక్ష తప్పదని తెలిపారు. ఇటువంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే తక్షణమే 112కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ పేర్కొన్నారు. అనంతరం గంజాయిని పట్టుకున్న సీఐ, ఎస్ఐను అభినందించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్ఐలు బి.శివనాగరాజు, ఎం.మోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల నుంచి ప్రారంభం కానున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 వారాల పాటు నిర్వహించే ఈ కోర్సులు చిరుధాన్యాల ఉత్పత్తి, విలువ ఆధారిత ఉత్పత్తులు, తేనెటీగల పెంపకం, వర్మికంపోస్ట్ ఉత్పత్తి, సేంద్రియ సూక్ష్మజీవులు వంటి కోర్సులను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు రూ. 1500 ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ సదుపాయం, ఆండ్రాయిడ్ ఫోన్, కంప్యూటర్, ఐపాడ్ ఏదోఒకటి కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 9063219959, 8096085560 సెల్ నంబర్లను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల మధ్య మాత్రమే సంప్రదించాలన్నారు. లేదా విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

రొంపిచర్లలో విజిలెన్స్ దాడులు
50 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: అక్రమంగా తరలిస్తున్న 50 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. రొంపిచర్ల మండలం బుచ్చిబాపన్నపాలెం గ్రామం నుంచి రామిరెడ్డిపాలెం వైపు అక్రమంగా మినీ లారీలో ప్రజా పంపిణీ బియ్యం రవాణా చేస్తున్నారన్నా సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న 50 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని రొంపిచర్ల ఎస్ఐ లోకేశ్వరరావుకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

పౌల్ట్రీ ఫామ్‌లో మంటలు
చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో మంటలు ఎగిసిపడి తీవ్రంగా గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం ప్రత్తిపాడు మండలం ఈదులపాలెంలోని విజయసాయి పౌల్ట్రీ ఫామ్‌లో చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన పిండి గోపి కృష్ణారెడ్డి (27) వెల్డర్ కమ్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. అతనికి ఒడిశా రాష్ట్రానికి చెందిన బీమదేను రానా హెల్పర్‌గా చేస్తుంటాడు. గత నెల 27వ తేదీ ఇద్దరూ కలిసి పౌల్ట్రీ ఫామ్ స్టోర్ రూంలో వెల్డింగ్ పనులు చేస్తున్నారు. ఆ సమయంలో వెల్డింగ్ వల్ల వచ్చే నిప్పురవ్వలు ఎగిసి పడి స్టోర్ రూంలో డంప్ చేసి ఉంచిన వస్తువులకు మంటలు అంటుకున్నాయి. మంటల్లో చిక్కుకోవడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిద్దరిని గుంటూరులోని లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 29న బీమాదేన్ రానా మరణించాడు. సోమవారం గోపికృష్ణ రెడ్డి కూడా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మృతుని బంధువులు ఇచ్చిన పిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్. నరహరి తెలిపారు.

'ఉపాధి' చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలి

గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు

అమరావతి: 2005 నుంచి కొనసాగుతున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం–2025 వికసిత్ భారత గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ (గ్రామీణ చట్టానికి వ్యతిరేకంగా స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో కీలకమైన నిబంధనలను అంశాలను రద్దుచేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2025 డిసెంబర్ నూతన చట్టాన్ని తెచ్చి పాత చట్టంలో ఉన్నటువంటి ఉపాధికి గ్యారెంటీ అంశాన్ని రద్దు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం భరిస్తున్న 90శాతం నిధులను 60 శాతానికి కుదించి రాష్ట్రాలు 40 శాతం భరించాలని సవరణ చేయటం దారుణమన్నారు. ఇప్పటికే రాష్ట్రాలు అప్పుల పాలై అధోగతిలో ఉంటే 40శాతం నిధులు భరించే స్థితి లేక ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తాయన్నారు. పాత చట్టంలో 100 రోజులు ప్రతి కుటుంబం తమకు అవకాశం ఉన్న సందర్భంలో పనికి హాజరుకావచ్చని, కొత్త చట్టంలో ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రాంతాల్లో మాత్రమే పని కల్పించటం కూలీల కడుపుకొట్టడమేనన్నారు. కొత్త చట్టం వల్ల లక్షలాది గ్రామీణ వ్యవసాయ కుటుంబాలు పని లేక వలసలు పోవాల్సి వస్తుందన్నారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయం వద్ద జరుగుతున్న గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు వినతిపత్రం అంచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సూరిబాబు, ఎస్‌కే రఫీ సయ్యద్ బహుదిన్ వలి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు నందూరి వెంకటేశ్వరరాజు, మండల కన్వీనర్ పి.సత్యనారాయణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సౌత్ జోన్ ఆలిండియా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక

మంగళగిరి టౌన్: త్వరలో జరగనున్న సౌత్‌జోన్ ఆలిండియా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్‌కు సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని స్పోర్ట్స్ ఐజీపీ ఏవీ మోహనరావు తెలిపారు. మంగళగిరి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఏపీ పోలీస్ స్టేట్ టి–20 సెలక్షన్స్ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ఈ సెలక్షన్లు జనవరి 5 నుంచి 11వ తేదీ వరకు మంగళగిరి స్టేడియం, మూలపాడు స్టేడియంలలో జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ సెలక్షన్స్‌కు 11 టీమ్‌లు వచ్చాయని ఏపీఎస్‌పీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్, ఇంటెలిజెన్స్, సీఐడీ, ఏసీబీల టీమ్‌లు ఆడనున్నట్లు తెలిపారు. వీటిలో బాగా ఆడి గెలుపొందిన టీమ్‌లను ఫిబ్రవరి మొదటి వారంలో జరిగే సౌత్‌జోన్ ఆలిండియా పోలీస్‌క్రికెట్ పోటీలకు పంపనున్నట్లు వివరించారు. సోమవారం మొదటి మ్యాచ్ విశాఖ–కర్నూలు మధ్య జరిగిందని తెలియజేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మేనేజర్ చందు కిషోర్, సెలెక్టర్ ప్రదీప్‌లతో పాటు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

11న ఏపీటీఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సు

రాష్ట్ర విద్యాసదస్సు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యమ సారధి నూతలపాటి పరమేశ్వరరావు 4వ వర్ధంతి సందర్భంగా ఈనెల 11న ఏపీ టీఎఫ్ ఆధ్వర్యంలో ఏసీ కళాశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి విద్యా సదస్సుతో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ పిలుపునిచ్చారు. కన్నావారితోటలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం విద్యా సదస్సు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.బసవలింగారావు మాట్లాడుతూ గత 80 ఏళ్లగా ఆంధ్రప్రదేశ్ విద్యారంగ ప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమానికి ఏపీటీఎఫ్ కృషి చేస్తోందని అన్నారు. విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న ఏపీటీఎఫ్ సంఘంలో పరమేశ్వరరావు కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు, జి.దాస్, జిల్లా కార్యదర్శులు పి.లక్ష్మీనారాయణ, పి.శివరామకృష్ణ, ఎస్.సత్యనారాయణ మూర్తి, కేసన రమేష్, ఆర్.బలరాజు, సిద్దిక్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్స్‌కు కేఎల్‌యూ జట్టు

భారతీయార్ యూనివర్సిటీ జట్టుతో తలపడుతున్న కేఎల్‌యూ జట్టు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరంలో జరుగుతున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పురుషుల టోర్నమెంట్–2026 పోటీలు సోమవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.హరికిషోర్ మాట్లాడుతూ.. ఎనిమిది జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయని తెలిపారు. సెమీ ఫైనల్స్ క్రీడలు రాత్రి కూడా జరగనున్నాయని.. సోమవారం సాయంత్రం 5వ రౌండ్ పూర్తయ్యే సమయానికి కేఎల్‌యూ జట్టు చెన్నైకు చెందిన భారతీయార్ యూనివర్సిటీ జట్టుపై విజయం సాధించి సెమీ ఫైనల్స్‌లో తలపడనుందని తెలిపారు. జేఎన్‌టీయూ కాకినాడ జట్టుపై కేరళకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ విజయం సాధించిందని పేర్కొన్నారు. వీటితో పాటు మరో ఆరు జట్లు సెమీ ఫైనల్స్‌లో తలపడుతున్నాయని.. సెమీ ఫైనల్స్ ముగిసిన అనంతరం మంగళవారం మధ్యాహ్నం ఫైనల్ మ్యాచ్ జరుగనున్నట్లు వివరించారు.

తుళ్లూరులో టవర్ ఎక్కి యువకుడు హల్‌చల్

- బెట్టింగ్ యాప్‌ల వల్ల అప్పుల పాలయ్యానని.. ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులు
- కిందకి దింపిన పోలీసులు.. నెల్లూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తింపు

టవర్‌పైకి ఎక్కిన రాంబాబు

తాడికొండ: గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మల్కాపురం జంక్షన్‌లో సోమవారం రాంబాబు అనే యువకుడు ఓ విద్యుత్ టవర్‌పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతని వివరాలు ఆరా తీశారు.. తాను బెట్టింగ్ యాప్‌ల వలన అప్పుల పాలయ్యానంటూ వాపోయాడు. ఆత్మహత్య చేసుకునేందుకే టవర్ ఎక్కానని చెప్పగా.. పోలీసులు అతనితో సానుకూలంగా మాట్లాడి టవర్ నుంచి కిందకు దింపారు. పోలీసు విచారణలో యువకుడిది నెల్లూరు జిల్లాగా గుర్తించారు. బెట్టింగ్ యాప్‌లో ఆట ఆడటం వలన రూ.80 లక్షలు నష్టపోయానని, ఇంకా రూ.60 లక్షలు అప్పు ఉందని యువకుడు పోలీసులకు తెలిపాడు. సినీహీరోలు బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేయడం వలననే తాను బెట్టింగ్‌లో డబ్బులు పెట్టానన్నారు. అప్పులు తీర్చడం కోసం తాను కిడ్నీ అమ్ముకోవడానికి హైదరాబాద్ వెళ్లానని, రూ.4 లక్షలు మాత్రమే ఇస్తానన్నారని, సంక్రాంతి పండుగ వస్తుందని, అప్పుల వాళ్లు తనను ఇబ్బంది పెడుతున్నారని, తనకు రూ.10 లక్షలు కావాలన్నాడు. కిడ్నీ అమ్ముకునేందుకు అనుమతి కోసం 5 రోజుల నుంచి హైకోర్టు చుట్టూ తిరుగుతుంటే తనను లోపలికి వెళ్లనివ్వలేదని, లాయర్లు ఐపీ పెట్టమని సలహా ఇస్తే తాను అలా చేయలేనన్నారు. రాంబాబును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

అమెరికాలో వాలీబాల్ పోటీలకు ఎంపిక



ఈశ్వర్‌ను అభినందిస్తున్న స్థానికులు

మంగళగిరి టౌన్ : అమెరికాలో ఎంసీఏఏ ఆధ్వర్యాన జాతీయ స్థాయిలో జరిగే ఆ దేశ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే టీమ్‌కు మంగళగిరి క్రీడాకారుడు ఎంపికయ్యాడు. స్థానిక వివిధ పార్టీల నాయకులు క్రీడాకారుడు ఈశ్వర్‌ను సోమవారం శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురుమాట్లాడుతూ జనవరి నుంచి మే వరకు అమెరికాలో జరిగే ఆ దేశ వాలీబాల్ పోటీల్లో మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన పొందుగల ఈశ్వర్ ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈశ్వర్ అమెరికాలో పుట్టి పెరిగి అక్కడే విద్యను అభ్యసిస్తూ, ఆ దేశంలో జరిగే వాలీబాల్ పోటీలకు పెప్పర్ డైన్ విశ్వవిద్యాలయం నుంచి ఎంపికయ్యాడని తెలిపారు. ఫిబ్రవరి 12న జరిగే పోటీలలో ఈశ్వర్ టీమ్ తలపడనుందని, గ్రామానికే కాక రాష్ట్రానికి దేశానికి గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో ఈశ్వర్ క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో స్థానికులు వెంకటేశ్వరరావు, శివరామయ్య, నంద కిషోర్, బ్రహ్మం, అన్నె చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

•26న రాజ్యాంగ పరిరక్షణ సభ

పొన్నూరు: ఈ నెల 26వ తేదీన పొన్నూరు పట్టణంలో భారత రాజ్యాంగ పరిరక్షణ సభ నిర్వహించనున్నట్లు మాల మహాసభ అధ్యక్షులు మల్లెల వెంకటరావు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. పొన్నూరు, నిడుబ్రోలులో సామాజిక సంఘర్షణలు తలెత్తకుండా సామరస్యం కోసం కృషి చేసిన వారికి స్వర్ణపురి సంఘమిత్ర పురస్కారం ప్రదానం చేయనున్నట్లు జైభీం సమూహం కార్యనిర్వాహక వర్గం తెలిపారు. మాల మహానాడు, మాల మహాసభ, ఇతర ప్రజా సంఘాలు సంయుక్తంగా 26న సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్న సభలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎద్దు రత్నరాజు, రెమెళ్ల వెంకట్రావు, యడ్ల వందనం, జంగా రాజేష్, చల్లపల్లి ఆనంద్, కంచర్ల సుధాకర్, గుమ్మడి రోశయ్య, గిరిబాబు, శ్యామ్ ప్రసాద్, దూళ్ల జంగం తదితరులు పాల్గొన్నారు.

•గిరిజన ఖేలో ఇండియా ఎంపిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: తొలిసారిగా ఖేలో ఇండియా ట్రైబల్ క్రీడలు–2026 ఓపెన్ ఏజ్ కేటగిరిలో జాతీయస్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి సోమవారం తెలిపారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జాతీయస్థాయి పోటీలో పాల్గొనే రాష్ట్ర జట్టును ఎంపిక చేసేందుకు ఈనెల 8వ తేదీన కాకినాడలో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్టు వివరించారు.

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : అమరావతి
24-2-87, 2వ అంతస్తు, పల్నాడు బస్ స్టాండ్ దగ్గర, హిందూ కాలేజ్ వెనుక, చెన్నై ట్రంక్ రోడ్డు, గుంటూరు-522003, ఆం.ప్ర

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

కు:
1. M/s లాన్య ఆటోమోటివ్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: ఎం. శ్రీనివాసరావు, 15 2 31, మెయిన్ రోడ్డు, మాచెర్ల, ఆంధ్రప్రదేశ్-522426 (ఋణగ్రహీత).
2. శ్రీ మర్రిపూడి శ్రీనివాసరావు, తండ్రి: నాగేశ్వరరావు, ఫ్లాట్ నెం 506, శ్రీనివాస కన్‌స్ట్రక్షన్, NGOS కాలనీ, నరసరావుపేట, ఆంధ్రప్రదేశ్- 522601 (సహ-ఋణగ్రహీత / తనఖాదారు).
3. శ్రీ వెల్నాటి సాంబశివరావు, తండ్రి: రోశయ్య, డి.నెం. 5-117, సిరిపురం, మేడికొండూరు మండలం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522401 (హామీదారు/ తనఖాదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, నరసరావుపేట-1 బ్రాంచ్ (8696) నుండి M/s లాన్య ఆటోమోటివ్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: ఎం. శ్రీనివాసరావు, తండ్రి: నాగేశ్వరరావు, శ్రీ వెల్నాటి సాంబశివరావు, తండ్రి: రోశయ్య గార్లు పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & అకౌంట్ నెం.	లోన్ మొత్తం & లోన్ తేదీ	తేది 27.12.2025 నాటికి వడ్డీతో కలిపి బకాయి	వడ్డీ రేటు
2000-MSME-OD/ OCC అకౌంట్ నెం. 8696261000023	రూ. 1,60,00,000/- తేదీ: 07.09.2015 & రెన్యూవల్ తేదీ. 29.03.2025	రూ. 1,59,90,153.47/-	10.40%
765-GECL 1.0 (ఎక్స్‌టెన్షన్) అకౌంట్ నెం. 170002121592	రూ. 22,20,000/- తేదీ: 17.11.2021	రూ. 6,78,325.00/-	8.60%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని తేది 27.12.2025 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ.1,66,68,478.47/- (అక్షరాల ఒక కోటి అరవై ఆరు లక్షల అరవై ఎనిమిది వేల నాలుగు వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మరియు నలభై ఏడు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధించబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది. SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

బ్యాంకుకు హైపొథికేట్/తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు దిగువన తెలుపబడినవి :

1). షెడ్యూలు "ఎ": నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట టౌన్, NGO కాలనీ తూర్పు వైపున, మున్సిపల్ పాత వార్డ్ నెం.1, కొత్త వార్డ్ నెం. 4 & 9, పాత సర్వే డి నెం.503/B, ఎకరా 1.25 సెంట్లు, డి నెం.503/C ఎకరా 2.02 సెంట్లు, టి.ఎస్ నెం.726/3, 726/4, బ్లాక్ నెం.1/9, పాత అసెస్‌మెంట్ నెం.381, 382, సమీప డోర్ నెం. 3-24-27/14 నందు మొత్తం విస్తీర్ణం 1102.96 చ॥గ॥లకు సమానమైన 922.08 చ॥మీ॥లలోని అవిభాజ్యమైన, నిర్దిష్టపరచని మరియు విభజించలేని వాటా విస్తీర్ణం 31.50 చ॥గ॥లకు సమానమైన 26.33 చ॥మీ॥లలోని స్థలం. హద్దులు: తూర్పు: కమ్మ బాలికల హాస్టల్ ప్రహరీ గోడ – అ॥ 83"-4", దక్షిణం: బొల్లపాటి బ్రహ్మయ్య మొదలైనవారు, స్థలం – అ॥ 118"-1", పడమర: మున్సిపల్ రోడ్డు – అ॥ 79"-4", ఉత్తరం: అల్లికం సుబ్బారావు మరియు చావా ఎర్రేశ్వరరావు యొక్క ఆస్తి – అ॥ 126"-6". ఈ పైన తెలిపిన హద్దులలో 1102.96 చ॥గ॥ లేదా 922.08 చ॥మీ॥ల స్థలం.

షెడ్యూలు "బి": (పైన తెలిపిన అగ్రిమెంట్ ఎ-షెడ్యూల్ ఆస్తి) విస్తీర్ణం 1102.96 చ॥గ॥లలో నిర్మించిన "శ్రీనివాస టవర్స్" (స్టిల్ట్, గ్రౌండ్, మొదటి, రెండవ మరియు మూడవ) మల్టీస్టోర్డ్ బిల్డింగ్, నాల్గవ అంతస్తులో 980 చ॥అ॥ల ప్లింత్ ఏరియా మరియు మధ్యస్థ-పరిమాణ కార్ పార్కింగ్‌తో ఫ్లాట్ నెం. 506 మరియు విస్తీర్ణం అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా 31.5 చ॥గ॥లు లేదా 26.33 చ॥మీ॥. హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం.505 & 506 మధ్య శూన్యాకాశం, దక్షిణం: శ్రీనివాస టవర్స్ యొక్క బహిరంగ ప్రాంతం, పడమర: ఫ్లాట్ నెం. 506 & 501 మధ్య శూన్యాకాశం, ఉత్తరం: ఫ్లాట్ నెం. 508 & 503 మధ్య ఉమ్మడి వరండా. ఈ హద్దుల లోపల "ఎ" షెడ్యూల్ ఆస్తిలో అవిభాజ్యపు & అనిర్దేశ్యపు వాటా 980 చ॥అ॥ ప్లింత్ ఏరియా. సెర్సాయ్ ఐడి: 400011250305. టైటిల్ హోల్డర్: రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 10446/2010 & 10447/2010, తేదీ. 08.07.2010 ప్రకారం ఈ ఆస్తి శ్రీ మర్రిపూడి శ్రీనివాసరావు, తండ్రి: నాగేశ్వరరావు పేరున కలదు.

2). నరసరావుపేట (ఆర్‌డి), మాచెర్ల (యస్ఆర్ఓ), మాచెర్ల మున్సిపల్ ఏరియా, గుంటూరు రోడ్, మార్కెట్ యార్డ్ దగ్గర, మాచెర్ల మున్సిపల్ బ్లాక్ నెం. 15, మాచెర్ల గ్రామం, డి.నెం. 604/1-1 మరియు డి.నెం. 604/1-2, డోర్ నెం. 15-2-16 ఉత్తర వైపు మరియు డోర్ నెం. 15-2-18 తూర్పు వైపు నందు 726.02 చ॥గ॥ల లేదా 606.95 చ॥మీ॥ (కొలత తర్వాత ఖచ్చితమైన విస్తీర్ణం) ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: దొండేటి నారాయణ రెడ్డి యొక్క స్థలం మరియు ఇతరులు – 250 లింకులు, దక్షిణం: దొండేటి నారాయణ రెడ్డి మరియు ఇతరులు యొక్క స్థలం – 59 లింకులు, పడమర: మండలపు వెంకట సుబ్బారెడ్డి యొక్క స్థలం – 246 లింకులు, ఉత్తరం: గుంటూరు నుండి మాచెర్ల రోడ్డు – 62 లింకులు. సెర్సాయ్ ఐడి: 400058584580. టైటిల్ హోల్డర్: రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 13679/2017, తేదీ. 07.10.2017 ప్రకారం ఈ ఆస్తి శ్రీ మర్రిపూడి శ్రీనివాసరావు, తండ్రి: నాగేశ్వరరావు పేరున కలదు.

3). గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, మరియు సత్తెనపల్లి సబ్ జిల్లా, సత్తెనపల్లి మున్సిపాలిటీ, వడ్డవల్లి గ్రామం, డి.నెం. 34-1A2 నందు విస్తీర్ణం 15-46 సెంట్లు, సత్తెనపల్లి మున్సిపల్ వార్డు నెం. 9, జోన్ 4 లో రఘురాం నగర్ నందు ఫ్లాట్ నెం. 17, ప్రస్తుత డోర్ నెం. 11-5-42/8 నందు 218 చ॥గ॥ విస్తీర్ణం లేదా 183.12 చ॥మీ॥ల స్థలం మరియు అందులో నిర్మించిన భవనం. హద్దులు: తూర్పు: 21 అ॥ల వెడల్పు బజార్ – 33, దక్షిణం: ఇనగంటి కులంటి రెడ్డి – 59'-7", పడమర: పెమ్మారి సుబ్బారావు – 32'-4", ఉత్తరం: దూపలపూడి సాంబశివరావు – 60'3".

సెర్సాయ్ ఐడి: 400011250052. టైటిల్ హోల్డర్: రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 420/1994, తేదీ. 22.03.1994. ప్రకారం ఈ ఆస్తి శ్రీ వెల్నాటి సాంబశివరావు, తండ్రి: రోశయ్య పేరున కలదు.

గమనిక: పైన పేర్కొన్న క్రమ సంఖ్య 2 ఆస్తిని కూడా మెస్సర్స్ సంతోష్ ఆటోమోటివ్స్ (ప్రొప్రయిటర్ శ్రీమతి మర్రిపూడి కోమలి, ఓవర్‌డ్రాఫ్ట్ అకౌంట్ నెం.125007849302) పేరుతో అందుబాటులో ఉన్న పరిమితికి తనఖా పెట్టారు, ఇది తేదీ నాటికి సబ్-స్టాండర్డ్. [సెక్షన్ 13(2)] కింద డిమాండ్ నోటీసు ఇప్పటికే జారీ చేయబడింది మరియు సర్ఫేసి చట్టం కింద తదుపరి చర్యలు షెడ్యూల్ ప్రకారం కొనసాగుతాయి.

తేది: 29.12.2025, ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727

REAL ESTATE

PLOT FOR SALE

■గుంటూరు; సిటీ పరిధిలో 1250, 1360, 3000 చ॥ గజాల తూర్పు ఫేస్ ప్లాట్స్ సేల్, గోరంట్ల, ఆదిత్రి యెల్లోరా ప్రక్కన రేట్ గజం 14,000. సంప్ర॥ 8790894569

SERVICES

GOLD FINANCE

■బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 8333833368

■Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. Nlr Dt. 9150011538, 9750497504

WANTED

■గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు స్త్రీలు కావలెను. జీతము: 10,000/- నుండి 13000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు : ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు 22సంవత్సరములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 9100024059

■శ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18-28 సం॥లోపు ✆ 9133444985 / 89

■Montessori School, Gnt. Wanted Qualified Primary Teachers, P.E.T, Receptionist మరియు వాచ్ మాన్ ఫ్యామిలీ కావలెను. 8121400100

■గుంటూరు మంగళగిరిరోడ్ లోని ప్రముఖ ఎక్స్‌పోర్ట్ కంపెనీ వారి గుంటూరు, చిన కొండ్రుపాడు, చిలకలూరిపేట పరిసర ప్రాంతాలలోని బ్రాంచెస్ నందు పనిచేయుటకు MS ఆఫీస్‌లో నాలెడ్జ్ ఉన్న కంప్యూటర్ ఆపరేటర్స్, అకౌంట్స్ డేటా ఎంట్రీ ఆపరేటర్స్, మెషిన్ ఇన్‌ఛార్జ్, IT Admin / IT మేనేజర్, HR డేటా ఎంట్రీఆపరేటర్స్ కావలెను. అర్హత, అనుభవం బట్టి జీతం ఇవ్వబడును. ఆసక్తి గల అభ్యర్థులు మీ పూర్తి బయోడేటాను 15 రోజులలో psshr.recruit@gmail.com మెయిల్‌కు పంపగలరు.

■Wanted B or D Pharmacy Candidates to work in a pharmacy Guntur City, pci registration mandatory. 6300975241

■శ్రీ శాంతి హోమ్‌కేర్ తెనాలి, గుంటూరు, రేపల్లె, నందు పనిచేయుటకు ఆయాలు కేర్ టేకర్స్, నర్సులు(M/F) కావలెను. 7995123705, 7893145549

■యాడ్ ఏజెన్సీ నందు పనిచేయుటకు అకౌంటెంట్ 2 సం॥ అనుభవం కలిగి హిందీ మాట్లాడే (స్త్రీ) కావలెను, జీతం 25,000/-, టైమింగ్ 9.30 AM to 8 PM, అడ్రస్ : అరండల్‌పేట 3/3, గుంటూరు-02. సంప్ర॥ 77028 34555

■నరసరావుపేట హాస్పిటల్లో పనిచేయుటకు లేడీస్ సెక్యూరిటీ కావలెను. డ్యూటీ 8 గం, జీతం 12K, ESI, PF, Qul: ఇంటర్ P/F. ✆ 73866 88787

■ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ గుంటూరులో Experience Field Executives కావలెను. Salary: 15-20K + Incentive. ✆ 72079 42933

■ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు. కావలెను. జీ : 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. Ph: 9347148051

■త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K-20K.Ph: 9640400073, 9160900024

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశదంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుచున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి స్పందన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని గణేష్ కళామందిరం వద్ద పైపు లైన్లు పగిలి తాగునీరు వృథాగా పోతోంది. దీనిపై సాక్షిలో సోమవారం 'రోడ్డుపై వృథాగా తాగు నీరు' శీర్షికన సమస్య ప్రచురితమైంది. స్పందించిన కార్పొరేషన్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. తాగునీరు పైపులైన్ ఎక్కడ పగిలిందో గుర్తించి మరమ్మతులు చేపట్టేందుకు డ్రిల్లింగ్ మిషన్‌తో రోడ్డును పగులగొట్టి పైపు పగిలిన ప్రాంతాన్ని గుర్తించారు. త్వరితగతిన మరమ్మతులు నిర్వహిస్తామని కార్పొరేషన్ సిబ్బంది తెలిపారు.

ఉపాధి హామీ పని దినాలు పెంపు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేడాబాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో వికసిత్ భారత్–రామ్‌జీ అనే నూతన చట్టాన్ని తీసుకు వచ్చిందని తెలిపారు. దీంతో ఉపాధి హామీ పని దినాలు 100 రోజుల నుంచి 125 రోజులకు పెరిగినట్లు పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ఈ చట్టం రూపకల్పన చేసినట్లు ఆయన చెప్పారు. దీని ద్వారా పనిలేని వారికి మరింత పని దినాలు కల్పించారన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు అభివృద్ధి పనుల వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు కదిలిన క్వారీ బాధితులు

ఫిరంగిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామంలో ఇటీవల క్వారీ బ్లాస్టింగ్‌తో రాళ్లు ఇళ్ల మీద పడ్డాయి. దీంతో అధికారులకు తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదు. క్వారీ పేలుళ్ల విషయం, అధికారులకు పట్టని వైనం గురించి కలెక్టర్‌కు తెలియజేసి వినతి పత్రం అందించేందుకు సుమారు 50 మంది గ్రామస్తులు సోమవారం గుంటూరుకు బయలుదేరి వెళ్లారు. తమ గోడును అధికారులకు తెలియజేస్తామని న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రం అందజేయనున్నట్లు వారు తెలిపారు.

జీజీహెచ్‌లో పండ్లు పంపిణీ

తాడికొండ: మోతడక చలపతి కళాశాల సీఎస్ ఈ–డేటా సైన్స్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధితులకు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవను కూడా తెలియజేస్తే భవిష్యత్తులో వారు మరింతగా స్వచ్ఛంద సేవకు పాటుపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ పర్యవేక్షణాధికారి ఎస్ఎస్ రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని మెల్లెంపూడిలో మృతిచెందిన ఓ వ్యక్తి కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం టీడీపీ నాయకులు సోమవారం ఆర్థిక సాయాన్ని అందించారు. మెల్లెంపూడి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మారెం శ్రీనివాసరావు కుమారుడు నాగరాజు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ తాడేపల్లి రూరల్ మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ నాగరాజు భౌతికకాయానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు రూ.20 వేలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఖాసిం ఖాన్, జంగాల సాంబశివరావు, కంచర్ల కళ్యాణ్, మెల్లెంపూడి గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ ఖాసిం బాబు, షేక్ నాగుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్య భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని రమేష్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ దాసరి స్రవంతి సూచించారు. గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్యం , పీసీఓడీ, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా దీర్ఘకాలిక సమస్యలనుంచి బయటపడొచ్చన్నారు. హార్మోన్లు పనిచేసే విధానం, ఒత్తిడి వల్ల కలిగే నష్టాలను వివరించారు.

ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

దుగ్గిరాల: నిరుపేదల కుంటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచిన ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి తెలిపారు. సోమవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో కొత్త చట్టాన్ని రద్దు చేసి 2005లో వచ్చిన పాత చట్టాన్ని కొనసాగించాలని ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. అనంతరం శివనాగరాణి మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టం పేదలకి ఎంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలరాజు, కోటేశ్వరరావు, కరీముల్లా, బ్రహ్మేశ్వరరావు, హరికృష్ణ, నారాయణ, శ్రావణి, లక్ష్మీ, సాంబశివరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన చట్టాన్ని రద్దు చేయాలి...

ఎంపీడీవోకు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడికొండ: కేంద్ర ప్రభుత్వం 2005 ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి 2025లో తెచ్చిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆ జీవికా మిషన్(గ్రామీణ) చట్టాన్ని తెచ్చారని.. దీనిని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తాడికొండ గ్రామ సభలో సర్పంచ్ తోకల సరోజినీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. కేంద్రం 90 శాతం నిధుల నుంచి 60 శాతానికి కుదించుకుందని.. 60 రోజుల వ్యవసాయ సీజన్‌లో పని చేయకూడదని నిషేధించిందని.. రాష్ట్ర హక్కులు హరించి సాంకేతికనంతా కేంద్రం గుప్పెట్లో పెట్టుకుందని ఆరోపించారు. నూతన చట్టాన్ని రద్దుచేసి పాత పథకం కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, జోషి, బాణావత్ భద్రయ్య, జోషి, పిచ్చయ్య, చిన్న రామయ్య, రోషన్ రైతులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు సోమవారం 398వ రోజుకు చేరుకున్నాయి. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ నాయకులు సుభాని, సాంబశివరావు, తుపాకుల నాగేశ్వరరావు, ఆదినారాయణలతో కలిసి దీక్షా శిబిరాన్ని ప్రారంభించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం ఏడాదికి పైగా దీక్షలు చేస్తున్నా స్థానిక మంత్రి నారా లోకేష్ స్పందించకపోవడం దారుణమన్నారు. దీక్షలో శారద, రమాదేవి, లక్ష్మమ్మ, రిబ్కా, సువర్ణకుమారి కూర్చొనగా..

కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

అంకయ్య, ఆశీర్వాదం, హగ్గయ్య, యహోషువ, నాగేశ్వరరావు, సూర్యప్రకాష్, శారమ్మ, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కాదు.. నలుగురు!

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వరుసగా ద్విచక్రవాహనాల డిక్కీలు పగలగొట్టిన దొంగలు ఇద్దరు కాదు.. నలుగురు అని తాడేపల్లి పోలీసులు సోమవారం చేపట్టిన విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ డిక్కీలు పగలగొట్టే యువకులు రెండు ద్విచక్రవాహనాలపై నలుగురు వచ్చి కాపలా నిర్వహిస్తుండగా ఇద్దరు రోడ్డు వెంబడి పార్క్ చేసిన ద్విచక్రవాహనాల డిక్కీలు పగలగొట్టి అందులో దొరికిన నగదు, ఇతర వస్తువుల చోరీకి పాల్పడుతున్నారు. ఇదే తరహాలో విజయవాడలోని భవానీపురం, గుణదల, వన్‌టౌన్, మాచవరం డౌన్ ప్రాంతాల్లో డిక్కీలు పగలగొట్టి చోరీకి పాల్పడుతున్నారని అన్నారు. ఈ నలుగురు కూడా విజయవాడకు చెందిన వారుగా తాడేపల్లి పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

మంగళగిరి టౌన్: శ్రీశ్రీశ్రీ భద్రావతి సమేత శ్రీ భావనాఋషి స్వామివార్ల కల్యాణ మహోత్సవ ఆహ్వాన శుభపత్రికను సోమవారం పాత మంగళగిరి శ్రీ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో భావనా ఋషి ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ఊట్ల పాలశ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఏటా మాఘమాసం రథసప్తమి రోజున భావనాస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం జనవరి 25న జరుగనున్న రథసప్తమి సందర్భంగా 27 మంది పుణ్య దంపతులతో వేదపండితుల మంత్రోచ్చారణలతో వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద శ్రేష్ఠులు తిరువీధుల వెంకట పాపారావు, అమర లింగేశ్వరరావు, రామారావు, నరసింహమూర్తి, సంఘ సెక్రటరీ నాగ వెంకట శివకృష్ణ, కోశాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

పాముకాటుకు వృద్ధుడి మృతి

మంగళగిరి టౌన్: పాముకాటుకు వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళగిరి మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కురగల్లుకు చెందిన కర్నాటి ఆనందరావు(74) ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. రోజు మాదిరిలానే ఆదివారం రాత్రి విధుల్లో ఉన్నారు. సోమవారం ఉదయం కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆవరణలో విగత జీవిగా పడి ఉన్న ఆనందరావును గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. దీంతో కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆనందరావు పాము కాటుకు గురై మృతి చెందినట్లు మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో క్యాన్సర్ నివారణ

మంగళగిరి టౌన్: మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతగానో దోహదం చేస్తుందని మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్యశాల గైనకాలజిస్ట్ డాక్టర్ సరోజ పేర్కొన్నారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడి నాగార్జున హైస్కూల్‌లో సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమంపై రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 6 లక్షల మంది మహిళలు క్యాన్సర్ బారిన పడి అందులో సగానికి పైగా మరణిస్తున్నారని తెలిపారు. దేశంలో ఏటా 1.77 లక్షల మంది సర్వైకల్ క్యాన్సర్ బారిన పడి అందులో 70 వేల మంది మహిళలు మృత్యువాత పడుతున్నారని వివరించారు. దీన్ని నివారించేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిందని, దీనికి రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ప్రగడ రాజశేఖర్, వెంకటేశ్వరరావు, నాగార్జున హైస్కూల్ డైరెక్టర్ రాఘవయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సరోజ

ట్రాక్టరు ప్రమాదంలో బాలుడి మృతి

తాడికొండ: ట్రాక్టరు వెనుక ట్రక్కుకు ఏర్పాటు చేసిన లింక్ విరగడంతో రాబర్రుపై నిలబడ్డ బాలుడు జారి పడ్డాడు. తలకు బలమైన గాయమై బాలుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఉద్దండరాయునిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామానికి చెందిన పులి వేణు(17) వాటర్ ట్యాంకర్‌తో ఉన్న ట్రాక్టరు బెడ్(రాబర్రు)పై నిలబడి కృష్ణానది కరకట్టపై వెళ్లే మార్గంలో ప్రయాణిస్తున్నాడు. ప్రమాదవశాత్తు ట్రాక్టరు రాబర్రు విరగడంతో వేణు కింద పడ్డాడు. వేణుకు తలకు బలమైన గాయం కావడంతో ఘటనా స్థలంలోని మృతి చెందాడు. కేసు నమోదు చేసి తుళ్లూరు ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా గంగా భ్రమరాంబ చంద్రశేఖర స్వామి కల్యాణం

పెదకాకాని: గంగా భ్రమరాంబ సమేత చంద్రశేఖరస్వామి కళ్యాణం వైభవంగా జరిగింది. మండల పరిధిలోని తక్కెళ్లపాడులో నిర్వహిస్తున్న ఆర్ద్ర మహోత్సవాలు పురస్కరించుకొని మూడోరోజు సోమవారం స్వామి కళ్యాణ మహోత్సవాలు, వైభవంగా నిర్వహించారు. దంపతులు పాల్గొని కళ్యాణ క్రతువు భక్తిశ్రద్ధలతో జరిపించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు గోత్రనామ పూజలు చేశారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాల ఐదు రోజులు స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరుద్రాభిషేకం, సహస్ర కుంకుమార్చన వంటి పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హరికథ, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు నిర్వాహక కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

తక్కెళ్లపాడులో గంగా భ్రమరాంబ చంద్రశేఖరస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఇద్దరు వ్యక్తులకు సోమవారం టీడీపీ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న తాడేపల్లి పట్టణ పరిధి 3వ వార్డుకు చెందిన బండి సాంబిరెడ్డికి రూ.42,664లు, 15వ వార్డుకు చెందిన తురమళ్ల ఏసుబాబుకు రూ.1,07,982ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశామని తెలిపారు. సీఎం సహాయనిధి చెక్కులను మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు వనమా సుధాకర్, మేకా పుల్లారెడ్డి, ఇట్టా పెంచలయ్య, అద్దంకి మురళి, మండవ గోపాలరావు, ఓలేటి రాము, పోతాబత్తిన శ్రీనివాసరావు, షిమాన్ పాల్గొన్నారు.

కష్టాలకు కుంగిపోకూడదు

కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

ప్రత్తిపాడు: ప్రతి మనిషి జీవితంలో సమస్యలు ఎదురవుతాయని, కష్టాలకు కుంగిపోకుండా ధైర్యంగా నిలబడి ఎదుర్కొన్నప్పుడే విజయాలు సొంతమవుతాయని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కిట్స్ జీవన్ కౌశల్ ఆధ్వర్యంలో సోమవారం ఎమోషనల్ వెల్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమోషనల్ వెల్నెస్ శిక్షకురాలు వాణి పోలూరి వాణి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రేరణ, ఆత్మస్థైర్యాన్ని కలిగించే పలు అంశాలను వివరించారు. నేను చిన్న వయసులోనే పోలియో వ్యాధికి గురయ్యానని, మానసికంగా కృంగిపోకుండా, అంగవైకల్యాన్ని లెక్కచేయకుండా చదువు కొనసాగించి విజయం ముంగిట నిలబడ్డానని తెలిపారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ వాణి పోలూరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కిట్స్ కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ వాణి విజయగాథ వెనుక ఆమె భర్త మూర్తి సహకారం మాటల్లో చెప్పలేనిదని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు పాల్గొన్నారు.

వాణిని సత్కరిస్తున్న సుబ్బారావు, సెక్రటరీ శేఖర్

పాసు పుస్తకాలు పంపిణీ

దుగ్గిరాల: మండలంలోని గ్రామాల్లో రీ సర్వే పూర్తయిన గ్రామాల భూ యజమానులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షురాలు కె.శ్రీఅనిత తెలిపారు. సోమవారం దుగ్గిరాల మండలంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీటీసీ కొప్పుల మధుబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొని కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు.

వాడవాడలా సమస్యలను గుర్తించాలి

తాడేపల్లి రూరల్: వాడవాడలా ప్రజా సమస్యలను గుర్తించాలని, ఆ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే యువతీ యువకులను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రోత్సహించాలని తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య అన్నారు. సోమవారం కుంచనపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తాడేపల్లి రూరల్‌లోని వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ విభాగాల అనుబంధ స్థాయి నాయకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరా నాగయ్య మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోనూ అనేక సమస్యలు ఉన్నాయని, ఆ సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆ సమస్యలను గుర్తించి ప్రశ్నించే యువతీ యువకులను ప్రోత్సహించాలని, ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ సంస్థలకు సంబంధించి కమిటీలను వేసేందుకు గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు ఇతర నాయకులు ప్రయత్నం చేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శివనాగేశ్వరరావు, నాగ స్రవంతి, మున్నంగి వీరశ్రీధర్ రెడ్డి, మేకా శివారెడ్డి, మిరియాల రాంబాబు, నూతక్కి శ్రీనివాసరావు, వీరంకి ప్రవీణ్, శంకర్, చలపతిరావు, సంకురి మరియబాబు, బండ్ల రాజేష్, బాణావత్ వెంకటేశ్వరరావు, షేక్ మీరాసా, తోట సత్యనారాయణ, గుడిసె రాజేష్, నల్లపు రాంబాబు, పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అమరా నాగయ్య

న్యాయవాది రామారావుకు సన్మానం

మంగళగిరి టౌన్: మంగళగిరి న్యాయవాది గుర్రం రామారావును సోమవారం కోర్టు ఆవరణలో మంగళగిరి బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 13న జరిగే ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎలక్షన్స్ నామినేషన్ ఫీజును రూ.1.25 లక్షలుగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయించిందని, ఈ నామినేషన్ ఫీజు సామాన్య న్యాయవాదులకు అందనంత దూరంలో ఉందని, ఫీజును తగ్గించాలంటూ మంగళగిరి న్యాయవాది గుర్రం రామారావు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారని తెలిపారు. వాదనలు విన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నామినేషన ఫీజును రూ.50 వేలకు తగ్గించిందని తెలియజేశారు. ఈ ఘనత సాధించిన న్యాయవాది రామారావును అభినందిస్తున్నామని అన్నారు.

రామారావును సత్కరిస్తున్న మంగళగిరి బార్ అసోసియేషన్ న్యాయవాదులు

పట్టపగలు ఇంట్లో చోరీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పాత ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద తాళాలు వేసిన ఇంట్లో పట్టపగలే చోరీకి పాల్పడ్డ ఘటన సోమవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. ఈఎస్ఐ హాస్పిటల్ వెనుక వీధిలో నివాసం ఉండే శ్రావణి తన కుటుంబ సభ్యులతో కాకానిలోని తోటకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి వెనుక తలుపులు పగులగొట్టి ఉన్నాయి. దొంగలు ఇంట్లోని వస్తువులన్నీ కింద పడవేసి బీరువా తాళాలు తీసి లాకర్‌ను పగులగొట్టి అందులోని రూ.20 వేల నగదు, సుమారు 4 గ్రాముల బంగారాన్ని దోచుకువెళ్లారు. ఘటనపై శ్రావణి తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలానే సీతానగరంలో తాళాలు వేసిన ఇంట్లో జరిగిన చోరీ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సేకరించిన వివరాల ప్రకారం.. చండి దమయంతి తన కుటుంబ సభ్యులతో శనివారం రాత్రి విజయవాడలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం సాయంత్రం వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని చిన్న చిన్న వెండి వస్తువులు దొంగిలించారు. ఘటనపై ఎస్ఐ అపర్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతానగరంలో దొంగలు పగులగొట్టిన బీరువా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంగళగిరి టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళగిరిలో ఆదివారం చోటుచేసుకుంది. మంగళగిరి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామానికి చెందిన షేక్ జిలాని(47) కొబ్బరి కాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిలానే చిలువూరు నుంచి తన ద్విచక్ర వాహనంపై కొబ్బరికాయలు పెట్టుకుని మంగళగిరి వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో తన వాహనంలో పెట్రోల్ అయిపోయింది. దీంతో మంగళగిరి తెనాలి ఫ్లైఓవర్ వద్ద వాహనాన్ని పక్కన పార్క్ చేశారు. జాతీయ రహదారికి మరోపక్క ఉన్న పెట్రోల బంక్‌కు పెట్రోల్ కోసం రోడ్డు దాటేందుకు వచ్చారు. ఈ క్రమంలో రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన కారు జిలానిని ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అతనిని స్థానికులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మార్గమధ్యలోనే జిలాని మృతిచెందారని వైద్యులు తెలిపారు. ఘటనపై మంగళగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన జిలాని

బావిలో పడి యువకుడి మృతి

తాడేపల్లి రూరల్: పెనుమాక గ్రామంలో ఓ యువకుడు గిలకల బావిపై కూర్చుని అశ్రద్ధగా ఫోన్ మాట్లాడుతూ బావిలో పడిపోయాడు. ఈ ఘటనలో యువకుడు మృతిచెందగా తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి సోమవారం కేసు నమోదు చేశారు. ఆయన వివరాల ప్రకారం.. కోకల కోటేశ్వరమ్మ కుమారుడు సాయిచరణ్ తండ్రి చనిపోవడంతో మేనమామ వద్ద ఉంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి పెనుమాక ఎస్సీ కాలనీలో ఉన్న గిలకల బావి వద్ద కూర్చొని ఫోన్ మాట్లాడుతుండగా జారి బావిలో పడ్డాడు. అనంతరం ఆయన నీటిలో మునిగిపోయాడు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలానికి వచ్చి నీటిలో మునిగిన సాయిచరణ్‌కు బయటకు తీశారు. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి సాయిచరణ్ మృతదేహాన్ని ఎయిమ్స్‌కు తరలించామని, జరిగిన సంఘటనపై సాయిచరణ్ తల్లి కోటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

సాయిచరణ్

పెదకాకాని నూతన ఎంపీపీగా దొడ్డక శిరీష

పెదకాకాని: మండల పరిషత్ అధ్యక్షురాలిగా దొడ్డక శిరీష ఏకగ్రీవంగా ఎన్నికైంది. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రిసైడింగ్ ఆఫీసర్ ఎంఎల్ నరసింహారావు ఎన్నిక నిర్వహించారు. నంబూరు గ్రామానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు దొడ్డక శిరీష నూతన ఎంపీపీగా ఎన్నికైనట్లు ప్రకటించారు. మండలంలో మొత్తం 21 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వారిలో 15 మంది వైఎస్సార్ సీపీ సభ్యులు. ఆరుగురు టీడీపీ సభ్యులు ఉన్నారు. అప్పట్లో ఎంపీపీగా అనుమర్లపూడి ఎంపీటీసీ సభ్యుడు తుల్లిమిల్లి శ్రీనివాసరావును ఎన్నికయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎంపీపీ ఎన్నిక జరిగి నాలుగేళ్లు పూర్తి కావడంతో కూటమి నాయకులు వైఎస్సార్ సీపీకి చెందిన 9 మందిని టీడీపీలోకి చేర్చుకుని ఏడాది నవంబరు 10వ తేదీన అవిశ్వాస తీర్మానం ద్వారా ఎంపీపీ తుల్లిమిల్లిని ఎంపీపీ పదవి నుండి తొలగించారు. సోమవారం జరిగిన సమావేశంలో ఎంపీపీ అధ్యక్ష పదవికి దొడ్డక శిరీష మాత్రమే నామినేషన్ వేయడంతో ఎంపీపీగా ఎన్నుకోవడం జరిగింది. మండల ప్రత్యేక అధికారి నరసింహారావు నూతన ఎంపీపీ దొడ్డక శిరీష చేత ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పాతూరు శారదాదేవి పాల్గొన్నారు.

ఎంపీపీగా శిరీషతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మండల ప్రత్యేక అధికారి నరసింహారావు

దాసరిపాలెం దాడి ఘటనకు వ్యక్తిగత కక్షలే కారణం

గుంటూరు రూరల్: నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని దాసరిపాలెం చంద్ర రాజేశ్వరరావుకాలనీలో జనవరి ఒకటో తేదీ అర్ధరాత్రి చోటుచేసుకున్న ఘటనపై డీఎస్పీ భానోదయ ప్రత్యేకంగా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అర్ధరాత్రి సమయంలో సంబంధిత మహిళ ఇంట్లో లేని విషయం తెలుసుకున్న కొందరు వ్యక్తులు ఆమె ఇంటిపై దాడి చేసి, ఇంట్లోని సామన్లను ధ్వంసం చేసి వెళ్లినట్లు తెలిపారు. ఘటనలో జగదీశ్, మహేష్, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నట్లు తమ విచారణలో ప్రాథమికంగా గుర్తించినట్లు చెప్పారు. గతంలో వీరి మధ్య కొనసాగుతున్న వ్యక్తిగత మనస్పర్థలు, గొడవలే ఈ ఘటనకు ప్రధాన కారణమని వివరించారు. ఘటనను గంజాయి వ్యవహారంతోనూ, రాజకీయ కోణంతోనూ ముడిపెట్టి కొందరు ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. వాస్తవానికి ఇది పూర్తిగా వ్యక్తిగత కక్షల నేపథ్యంలో గొడవ మాత్రమేనని స్పష్టం చేశారు. తనకు ప్రాణహాని ఉందని, రాజకీయంగా దాడి చేయించారంటూ వస్తున్న ఆరోపణలకు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. ఈ మొత్తం ఘటనను రాజకీయంగా మలిచి, వ్యక్తిగత ప్రచారం కోసం ఓ జనసేన నాయకురాలు ఫేక్ న్యూస్‌ను వ్యాప్తి చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతుందని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. విచారణలో నల్లపాడు పోలీస్‌స్టేషన్ సీఐ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు. నిందితులను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

స్పార్క్ 2.0లో కిట్స్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

ప్రత్తిపాడు: స్పార్క్ 2.0లో ఉత్తమ ఆవిష్కరణలు రూపొందించిన కిట్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. గత నెల 29 నుంచి ఈ నెల 3 వరకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో స్పార్క్ 2.0ను నిర్వహించారు. ఈవెంట్‌లో పాల్గొన్న కిట్స్ కళాశాల ఐటీ తృతీయ సంవత్సరం విద్యార్థులు షేక్ దుర్రే షహవర్, వై.సుస్మిత, ఎం.కార్తిక్, ఎం.చిరంజీవి, పి.చరణ్ కరెంటు మీటర్ ను, మీటర్ లొకేషన్‌ను సర్వీస్ నంబర్ ఆధారంగా లైన్‌మెన్ సులభంగా ట్రాక్ చేసేలా మీటర్ మ్యాప్ ను సరికొత్తగా ఆవిష్కరించి, ప్రదర్శించారు. ఈ మీటర్ మ్యాప్ ఆలోచన అందరినీ ఆకట్టుకుని ప్రథమ స్థానం సాధించింది. మీటర్ లొకేషన్‌ను తక్కువ టైంలో గుర్తించి సమస్యను, ఫిర్యాదును సాధ్యమైనంత త్వరితగతిన పరిష్కరించేలా మీటర్ మ్యాప్ పని తీరు ఉంటుందని విద్యార్థులు వివరించారు. ఈసందర్భంగా సోమవారం కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ కళాశాలలో స్ట్రాంగ్ ఇన్నోవేషన్ ఎకో సిస్టం ఉందని తెలిపారు. కళాశాలలో ప్రతి విద్యార్థికి నూతన ప్రయోగాలు చేస్తూ, సృజనాత్మకతను పెంపొందించడానికి ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని వివరించారు.

క్లుప్తంగా...

గ్యాస్ లీక్ కట్టడికి అంతర్జాతీయ నిపుణులు

- ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు
- మోరి ఆయిల్ ఫీల్డ్ ఘటనపై ఓఎన్‌జీసీ

సాక్షి, అమరావతి/న్యూఢిల్లీ: అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండలో మోరి 5వ నంబర్ బావిలో చెలరేగిన మంటలను త్వరితగతిన అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్టు ఓఎన్‌జీసీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఘటన విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించింది. 'గ్యాస్ లీకేజీని నియంత్రించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. మోరి–5వ బావిలో వర్కోవర్ ఆపరేషన్ల సమయంలో గ్యాస్ లీక్ అయినట్టు ఆపరేటర్‌గా ఉన్న డీప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ జనవరి 5న ఓఎన్‌జీసీకి సమాచారం అందించింది. బావి చుట్టుపక్కల సుమారు 500 నుంచి 600 మీటర్ల పరిధిలో ఎలాంటి జనావాసాలు లేవు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఎవరూ గాయపడలేదు. గ్యాస్ లీక్ సమాచారం అందిన వెంటనే పరిసర ప్రాంతాన్ని పూర్తిగా సీల్ చేసి, కూలింగ్ ఆపరేషన్లు ప్రారంభించాం. పరిస్థితిని నియంత్రించేందుకు క్రైసిస్ మేనేజ్‌మెంట్ టీమ్స్ (సీఎంటీ, ఆర్‌ఎంటీ)ను రంగంలోకి దింపాం. అవసరమైతే బావిని పూర్తిగా నియంత్రించడం, క్యాపింగ్ చేయడం కోసం ముందస్తు చర్యలు కొనసాగుతున్నాయి. బావి నియంత్రణకు సంబంధించి అంతర్జాతీయ స్థాయి వెల్–కంట్రోల్ నిపుణులతో కూడా సమన్వయం చేస్తున్నాం. సైట్ పరిస్థితుల అంచనాల ఆధారంగా ఆధునిక వెల్ కంట్రోల్, కేసింగ్ కట్టింగ్ ఆపరేషన్లకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఓఎన్‌జీసీ సీనియర్ మేనేజ్‌మెంట్, సాంకేతిక నిపుణులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. నరసాపురం సహా సమీప ప్రాంతాల నుంచి అదనపు పరికరాలను మోహరించాం' అని ఓఎన్‌జీసీ తెలిపింది.

బార్ కౌన్సిల్ నామినేషన్ ఫీజు ఖరారు

సాక్షి, అమరావతి: రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల నామినేషన్ ఫీజును రూ.50వేలుగా ఖరారు చేస్తూ హైకోర్టు నిర్ణయం వెలువరించింది. ఈసారి బార్ కౌన్సిల్ ఎన్నికల నామినేషన్ ఫీజును రూ. 1.25 లక్షలుగా నిర్ణయించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. గతంలో ఉన్న విధంగా రూ.30వేలు నిర్ణయించాలన్న పిటిషనర్ల అభ్యర్థననూ తోసిపుచ్చింది. నామినేషన్ ఫీజును రూ.50వేలుగా ఖరారు చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సోమవారం తీర్పు వెలువరించారు.

పోలీస్‌స్టేషన్ ముందే వ్యక్తి దారుణ హత్య

ఈశ్వరప్ప (ఫైల్)

తనకల్లు: శ్రీసత్యసాయి జిల్లా తనకల్లులోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. దుండగులు కాపుకాచి కొడవళ్లతో కిరాతకంగా నరికి చంపారు. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాగినేపల్లికి చెందిన ఎర్రి హరి తన భార్య నాగ శిరీష కనిపించడం లేదని, మార్పురివాండ్లపల్లికి చెందిన ఈశ్వరప్ప (40) తన భార్యను ఎటో తీసుకెళ్లాడంటూ ఈనెల 1న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నాగ శిరీష, ఈశ్వరప్ప తిరుపతి జిల్లా గూడూరు వద్ద ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి అక్కడికి వెళ్లి ఈశ్వరప్ప, నాగ శిరీషతో పాటు మరో మహిళను సోమవారం తెల్లవారుజామున తనకల్లు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈశ్వరప్ప పోలీసు వాహనం దిగగానే అప్పటికే అక్కడ మాటువేసిన ఎర్రి హరి, అన్న చెన్నప్ప, గంగులప్ప, శంకరప్ప ఒక్కసారిగా ఈశ్వరప్పపై దాడి చేసి కొడవళ్లతో విచక్షణారహితంగా నరికి అక్కడి నుంచి పరారయ్యారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఈశ్వరప్పను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా.. ఈశ్వరప్పను హత్య చేసే సమయంలో అక్కడే ఉన్న నాగ శిరీష, మరో మహిళను అదుపులోకి తీసుకొని పుట్టపర్తి తరలించినట్లు సీఐ నగేంద్ర తెలిపారు.

కోనసీమలో భారీ బ్లో అవుట్

డ్రిల్లింగ్ చేస్తుండగా ఎగదన్నుకు వచ్చిన గ్యాస్
రెండు గంటల తరువాత భారీ విస్ఫోటనం
ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని పరుగులు తీసిన స్థానికులు

- పగటి వేళ కావడంతో రెండు గ్రామాల ప్రజలకు తప్పిన ప్రాణాపాయం
- గ్రామాలను ఖాళీ చేయించిన అధికారులు
- ప్రమాదం జరిగే బావిగా గుర్తించి 12 ఏళ్ల కిందట మూసివేత
- తాజాగా.. గుజరాత్‌కు చెందిన డీప్ సీ సంస్థకు డ్రిల్లింగ్ బాధ్యతలు
- భయపడినట్లుగానే సంభవించిన బ్లోఅవుట్
- ఓఎన్‌జీసీపై మండిపడుతున్న స్థానికులు
- కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో ప్రమాదం

మలికిపురం మండలం ఇరుసుమండలో సంభవించిన బ్లోఅవుట్

సాక్షి, అమలాపురం/మలికిపురం: పచ్చని కోనసీమ గుండెలపై చమురు సంస్థలు మరో కుంపటి రాజేశాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఓఎన్‌జీసీకి చెందిన మోరి–5వ నెంబరు బావి వద్ద ఒక్కసారిగా బ్లోఅవుట్ సంభవించింది. భారీ ఎత్తున మంటలు ఎగసిపడడంతో చుట్టుపక్కల గ్రామాల్లో భీతావహ వాతావరణం నెలకొంది. ఇరుసుమండ గ్రామం వద్ద ఉన్న బావిలో నెలరోజులుగా గుజరాత్‌కు చెందిన డీప్ సీ ఇండస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో డ్రిల్లింగ్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో.. సోమవారం ఉ.11 గంటల సమయంలో సిబ్బంది డ్రిల్లింగ్ చేస్తుండగా సహజ వాయువు (గ్యాస్) ఒక్కసారిగా పైకి ఎగదన్నుకు వచ్చింది. తొలుత ఆ ప్రాంతమంతా గ్యాస్ ఎగజిమ్మగా తరువాత మంటలు చెలరేగాయి. చెవులు చిల్లులు పడే శబ్దంతో గ్యాస్ ఎగదన్నడం.. మంటలు చెలరేగడంతో సమీపంలోని రెండు గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉందని దశాబ్ద కాలం కిందట మూసివేసిన ఈ బావి వద్దే ఇప్పుడు మళ్లీ పనులు చేపట్టడం, బ్లోఅవుట్ సంభవించడంతో చమురు సంస్థలపై స్థానికులు మండిపడుతున్నారు.

భారీ శబ్దాలతో పొగలా విస్తరించిన గ్యాస్..

దీనిని అదుపు చేసేందుకు సిబ్బంది చేసిన యత్నాలు విఫలం కావడం... రానురానూ తీవ్ర పీడనంతో గ్యాస్ బయటకు ఎగదన్నుకు వస్తుండడంతో సిబ్బంది రిగ్గును వదిలి పరుగులు తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో రిగ్ వద్ద పదిమంది వరకూ సిబ్బంది ఉన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకూ గ్యాస్ ఎగదన్నుకు వస్తూనే ఉంది. ఆ సమయంలో భారీ శబ్దాలు రావడం, గ్యాస్ తెల్లని పొగలా చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించడం చూసి, సమీప గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. వృద్ధులు, చిన్న పిల్లలను చంకన వేసుకుని తల్లిదండ్రులు పరుగులు పెట్టారు. డ్రిల్ సైటుకు సమీపంలో నాట్లు వేస్తున్న కూలీలు పేలుడు ధాటికి పొలాల్లోనే భయంతో కుప్పకూలిపోయారు. కొద్దిసేపటికి తేరుకుని, అక్కడి నుంచి పరుగు తీశారు. రెండు గంటల పాటు గ్యాస్ ఎగజిమ్మడంతో రెవెన్యూ, పంచాయతీ అధికారులు, పోలీసులు స్థానికులను అప్రమత్తం చేశారు. ఇరుసుమండతో పాటు లక్కవరం గ్రామస్తులను ఖాళీ చేయించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ వినియోగించవద్దని, నిప్పు రాజేయవద్దని మైకుల్లో ప్రచారం చేశారు.

మంటలు చెలరేగి భారీ విస్ఫోటనం..

డ్రిల్లింగ్ చేస్తున్న బావి నుంచి గ్యాస్ ఎగదన్నుకు వచ్చిన సమయంలో పెద్ద హోరు వచ్చింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నిప్పు రాజుకోవడంతో మంటలు చెలరేగి, ఒక్కసారిగా భారీ విస్ఫోటనం సంభవించింది. దీంతో.. చుట్టుపక్కల ప్రాంతాల వారు ఉలిక్కిపడ్డారు. ప్రమాదం జరిగిన తొలిగంటలో 100 మీటర్ల ఎత్తున మంటలు ఎగసిపడి ఆ తర్వాత 300 మీటర్ల మేర అగ్నికీలలు విస్తరించాయి. మ.3 గంటల సమయంలో గ్యాస్‌తో పాటు బావి నుంచి చమురు కూడా వస్తుండడంతో మంటలు పైకి ఎగసిపడటం తగ్గినా అవి దిగువ భాగంలో విస్తరించాయి. భారీ ఒత్తిడితో గ్యాస్ ఎగదన్నుతోంది. దీని ఒత్తిడి ఎంత అనేది నిపుణులు ఇంకా అంచనా వేయలేకపోతున్నారు.

మండిందా? మండించారా!?..

తాజాగా.. ఇరుసుమండ బ్లోఅవుట్ సంఘటన వెనుక కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉ.11 గంటలకు బావి నుంచి ఎగజిమ్మిన గ్యాస్ మధ్యాహ్నానికి గ్రామమంతటా వ్యాపించింది. గ్యాస్ మరింత విరజిమ్మి చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరిస్తే 2014లో 'నగరం'లో చోటుచేసుకున్న ఘటన తరహా విస్ఫోటనం జరుగుతుందని ఓఎన్‌జీసీ సిబ్బంది, అధికారులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గ్యాస్ ఇంకా భారీగా వ్యాపిస్తే ప్రమాద తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని భావించడంతో దానిని మండించి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. పగటి వేళ ఈ ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం తప్పింది. ఇదే కనుక రాత్రివేళ జరిగి ఉంటే గ్యాస్ వ్యాపించి విద్యుద్దీపాలు, ఇతర మండే వస్తువులవల్ల రెండు గ్రామాలు తుడిచిపెట్టుకుపోయేవని స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి తోడు ప్రస్తుతం మంచు కురుస్తుండడంతో గ్యాస్ పొరలు పొరలుగా కమ్ముకుని ప్రమాద తీవ్రత పెరుగుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

కలెక్టర్, ఎస్పీ పరిశీలన..

ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్‌కుమార్ మీనా, డీఆర్‌ఓ కె.మాధవి, అమలాపురం ఎంపీ గంటి హరీష్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలించారు. బ్లోఅవుట్‌కు దారితీసిన పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మాడి మసైపోయిన కొబ్బరి చెట్లు..

ఇక బ్లో అవుట్ జరిగిన ఓఎన్‌జీసీ సైటు అగ్నిగుండంలా మారింది. ప్రమాద ధాటికి సమీపంలో ఉన్న కొబ్బరి, ఇతర ఫల వృక్షాలు మాడి మసైపోయాయి. సమీపంలోని పంట చేలల్లో నాట్లు వేసేందుకు అడుగు ఎత్తున ఉంచిన నీరు ఆవిరైపోయింది. మంటల ధాటికి ఓఎన్‌జీసీ, ఏపీ అగ్నిమాపక శాఖ సిబ్బంది అర కిలోమీటరు దూరంలోనే ఉండిపోయారంటే ప్రమాద తీవ్రత ఎంత ఉందో అర్థంచేసుకోవచ్చు. మంటలను అదుపు చేసేందుకు ఓఎన్జీసీతో పాటు స్థానిక అగ్నిమాపక శకటాలు చేరుకున్నాయి. మంటలు తీవ్రంగా వ్యాపించడంతో ప్రమాదం జరిగిన రిగ్ వద్దకు వెళ్లేందుకు అధికారులు సాహసించలేదు. కానీ, సా.6 గంటల సమయానికి రాజమహేంద్రవరం నుంచి వచ్చిన ఓఎన్‌జీసీ నిపుణుల బృందం మంటలను అదుపుచేసేందుకు, వేడిని చల్లార్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది.ఓఎన్‌జీసీ డ్రిల్ సైట్‌కు నలువైపులా రహదారికి బారికేడ్లు పెట్టి స్థానికులు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. మంటల వేడికి డ్రిల్లింగ్ చేస్తున్న ఓఎన్‌జీసీ రిగ్ మూడొంతులు కాలిబూడిదై ఓ పక్కకు ఒరిగిపోయింది. సమీపంలో ఓఎన్‌జీసీకి చెందిన చిన్నచిన్న భవనాలు, ఇతర వస్తు సామగ్రి మాడి మసైపోయాయి.

రిస్క్ అని తెలిసి కూడా..

ప్రమాదం సంభవించిన మోరి–5వ నంబర్ బావి ఓఎన్‌జీసీ మోరి స్ట్రక్చర్ పరిధిలో ఉంది. 12 ఏళ్ల క్రితం దీనిని మూసివేశారు. అప్పటికి దాదాపు పన్నెండేళ్లపాటు ఈ బావి నుంచి గ్యాస్, చమురు వెలికితీశారు. అనంతరం వట్టిపోవడంతో దీనిని మూసివేశారు. తరువాత చమురు నిక్షేపాల కోసం చేపట్టిన సిస్మిక్ సర్వేల్లో దీనికి సమీపంగా ప్రత్యేక జోన్లను గుర్తించారు. ఇదే సైట్ వద్ద కొత్త జోన్‌ను గుర్తించి, ఇక్కడ అపార చమురు, గ్యాస్ నిక్షేపాలున్నాయని నిర్ధారించారు. అయితే, ప్రొడక్షన్ టెస్టింగ్‌లో డ్రిల్లింగ్ సంస్థకు షాక్ తగిలింది. గ్యాస్ కిక్‌లు (బ్లోఅవుట్ సంకేతాలు) ప్రారంభం కావడంతో అప్పట్లోనే ముంబై, గుజరాత్‌ల నుంచి నిపుణులు వచ్చారు. ప్రత్యేక పరికరాలు తెచ్చారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఈ బావిని మూసివేయడం తప్ప వేరే మార్గంలేదని చేతులెత్తేశారు. ఈ బావిని తెరిస్తే బ్లోఅవుట్ తప్పదని ఆ నిపుణులు చెప్పడంతో పూర్తిగా మూసివేశారు. ఇక్కడ ప్రమాదం పొంచి ఉందని అప్పట్లోనే 'సాక్షి' కూడా కథనాలు అందించింది. తాజాగా.. ఈ బావిని ప్రైవేట్ సంస్థకు అప్పగించి తెరవాలని అధికారులు నిర్ణయించడానికి గల కారణాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మోరి-5 బావిలో ఎగసి పడుతున్న మంటల వేడిని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది

ఇరుసుమండలోని డ్రిల్లింగ్ సైట్ వద్ద ఎగసి పడుతున్న మంటలు

బ్లోఅవుట్ ధాటికి ఊరు దాటి వెళ్లిపోతున్న స్థానికులు

ఈ ప్రభుత్వంలో అధికారులకు కోర్టులన్నా,
కోర్టు ఆదేశాలన్నా లెక్కే లేదు

పవర్‌ఫుల్ వ్యక్తి కింద పనిచేస్తున్నాం.. ఎవ్వరూ ఏమీ చేయలేరనుకుంటున్నారు

సాక్షి, అమరావతి: నారా లోకేశ్ మంత్రిగా వ్యవహరిస్తున్న విద్యాశాఖపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పవర్‌ఫుల్ వ్యక్తి కింద పనిచేస్తున్నందున తమను ఏమీ చేయలేరన్న భావన విద్యాశాఖ అధికారుల్లో కనపడుతోందని వ్యాఖ్యానించింది. ఈ ప్రభుత్వంలో విద్యాశాఖ అధికారులు తమను తాము చాలా గొప్ప వారిగా, కోర్టుకన్నా శక్తివంతులుగా భావిస్తున్నారని మండిపడింది. కోర్టులన్నా, కోర్టు ఆదేశాలన్నా వారికి ఏ మాత్రం లెక్క లేకుండా పోయిందని తెలిపింది. పైగా న్యాయస్థానాలతో ఘర్షణ పెట్టుకోవాలని భావిస్తున్నారని పేర్కొంది. ఇందుకు ప్రత్యేక కారణాలున్నాయంది. ఇలాంటి అధికారులను ఎలా డీల్ చేయాలో తమకు బాగా తెలుసునంది. కేజీబీవీల్లో పీజీటీల బదిలీలకు సంబంధించి అప్పీల్‌పై జరుగుతున్న విచారణ సందర్భంగా హైకోర్టు... విద్యాశాఖలో ఏదీ కూడా సక్రమంగా జరగడం లేదంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది.

సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వ్యక్తిగత హాజరుకు ఆదేశం

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ)గా పనిచేస్తున్న వారిని ఒప్పందం ప్రకారం యథాతథంగా కొనసాగించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను, అలాగే సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తామంటూ ఇచ్చిన హామీని ఉల్లంఘించినందుకు సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) బి.శ్రీనివాస్‌రావుపై హైకోర్టు సుమోటోగా కోర్టు ధిక్కార చర్యలు చేపట్టింది. ఆయనకు కోర్టు ధిక్కారం కింద నోటీసులు జారీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. అలాగే వ్యక్తిగతంగా తమ ముందు హాజరు కావాలని శ్రీనివాస్‌రావును ఆదేశిస్తూ ఆయనకు నోటీసు ఇచ్చింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 4కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కేసు వివరాలు ఇవీ..

- కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ)గా పనిచేస్తున్న తమను అర్ధంతరంగా తొలగించడాన్ని సవాలు చేస్తూ పలువురు పీజీటీలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.
- విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు వారి సేవలను కొనసాగించాలని ఆదేశించారు.
- ఈ తీర్పును సవాలు చేస్తూ అధికారులు ధర్మాసనం ముందు గత ఏడాది జనవరిలో అప్పీల్ దాఖలు చేశారు.
- ఈ అప్పీల్‌పై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన జస్టిస్ బట్టు దేవానంద్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది.
- పీజీటీల తరఫు న్యాయవాది జైభీమ్ రావు వాదనలు వినిపిస్తూ "ఒప్పందం ప్రకారం రిట్ పిటిషనర్లు ఎక్కడ పనిచేస్తున్నారో వారిని అక్కడే కొనసాగిస్తూ, వారికి ఆ మేర వేతనాలు చెల్లించాలని సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారు. అయితే సర్వశిక్షాభియాన్ అధికారులు మాత్రం పిటిషనర్లను వేరే ప్రాంతానికి బదిలీ చేయడంతో పాటు నెలవారీ ఇచ్చే వేతనాన్ని పని గంటల ఆధారంగా చెల్లించేలా మార్పులు చేశారు. అంతేకాక సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను యథాతథంగా అమలు చేస్తామంటూ ఈ కోర్టుకు ఇచ్చిన హామీని సైతం అధికారులు ఉల్లంఘించారు' అని ధర్మాసనానికి విన్నవించారు.
- ఈ సందర్భంలో కోర్టు ఆదేశాలను, కోర్టుకిచ్చిన హామీని ఉల్లంఘించిన అధికారి ఎవరని ధర్మాసనం ప్రశ్నించింది.
- సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. దీంతో ధర్మాసనం ఆయనపై సుమోటోగా కోర్టు ధిక్కార చర్యలు చేపట్టింది.

పాతకక్షలకు అన్నదమ్ముల బలి

- కర్నూలు జిల్లాలో పడగ విప్పిన పాతకక్షలు
- 2023లో జరిగిన జంట మరణాలకు ప్రతీకారం
- మూడు నెలలుగా స్నేహపూర్వకంగా నటిస్తూ దారుణం
- ఇరువురు అక్కడికక్కడే మృతి

బోయ పరమేష్ (ఫైల్)

బోయ వెంకటేష్(ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండల పరిధిలోని కందనాతి గ్రామంలో జంట హత్యలు కలకలం రేపాయి. ఒకే సామాజిక వర్గం, అధికార తెలుగుదేశంపార్టీకి చెందిన రెండు వర్గాల మధ్య 2023లో జరిగిన జంట మరణాలకు ప్రతీకారంగా సోమవారం ఈ హత్యలు జరిగాయి. వేటకొడవళ్లు, గడ్డపారలతో పథకం ప్రకారం రెండు గ్రూపులుగా విడిపోయి ప్రత్యర్థి కుటుంబంపై విరుచుకుపడ్డారు. వేర్వేరు చోట్ల జరిగిన దాడిలో అన్నదమ్ములు బోయ వెంకటేష్ (49), బోయ పరమేష్ (44) అక్కడికక్కడే మృతి చెందగా, తమ్ముడు బోయ గోవిందు, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ముగ్గురిలో మృతుడు పరమేష్ భార్యతో పాటు గాయపడిన గోవిందు భార్య, కుమారుడు ఉన్నారు.

రెండేళ్ల కిందట కుళాయి దగ్గర గొడవ ప్రారంభం

కందనాతి గ్రామంలో 2023 ఫిబ్రవరిలో దేవర మహోత్సవం సందర్భంగా కుళాయి నీటి కోసం జరిగిన ఘర్షణలో ఒక వర్గం బిర్యాని గరెటతో దాడి చేయడంతో బిక్కి నరసింహులు, కుమారుడు బిక్కి రవి మృతి చెందారు. ఈ ఘటన జరిగినప్పుడే ప్రతీకారం తీర్చుకుంటామని నరసింహులు కుటుంబం శపథం చేసింది. దీంతో భయంతో 12 కుటుంబాలు గ్రామం వదలి వేర్వేరు గ్రామాల్లో తలదాచుకున్నాయి. ప్రతీకారంతో ఉన్న బిక్కి నరసింహులు వారసులు ప్రత్యర్థి వర్గాన్ని గ్రామంలోకి రప్పించేందుకు పథకం రచించి గ్రామ పెద్దలతో పోలీసులకు సమాచారం అందించారు. వీరి స్నేహపూర్వక మాటలు నమ్మిన బోయ వెంకటేష్, బోయ పరమేష్, గోవిందులతో పాటు 12 కుటుంబాలు 2025 దసరా పండగకు పోలీసుల సమక్షంలో గ్రామానికి చేరుకున్నారు. అయితే ఒకపక్క స్నేహంగా మెలుగుతూనే మరోపక్క హత్యాకాండకు నరసింహులు వారసులు రెక్కీ నిర్వహించారు. సోమవారం గ్రూపులుగా విడిపోయి ప్రతీకార దాడికి పాల్పడ్డారు.

మూడు చోట్ల దాడులు

- గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లిన బోయ గోవిందు, భార్య వీరేశమ్మ, కుమారుడు లోకేశ్ సోమవారం పనులు ముగించుకొని ట్రాక్టర్‌లో కట్టెలు వేసుకొని ఇంటికి వస్తున్నారు. అప్పటికే కాపుకాసి ట్రాక్టర్‌కు అడ్డువచ్చిన ప్రత్యర్థుల్లో ఒక గ్రూప్ దాడికి పాల్పడింది. ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తున్న బోయ గోవిందును గడ్డపారతో కడుపులో పొడవడంతో పేగులు బయటపడ్డాయి. పక్కనే కూర్చున్న భార్య వీరేశమ్మకు, కుమారుడు లోకేశ్‌కు గాయాలయ్యాయి. అయితే గోవిందు భార్య, కుమారుడిని కిందకు దించి ట్రాక్టర్ దిగకుండా వేగంగా నడుపుకుంటూ ఎమ్మిగనూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ప్రాణాలతో బయటపడ్డాడు. గోవిందు కడుపు నుంచి పేగులు బయటపడ్డా ట్రాక్టర్ నడుపుకుంటూ పోలీసుస్టేషన్‌కు చేరుకోవడం గమనార్హం.
- మరో గ్రూపు పొలం దగ్గర ఉన్న బోయ వెంకటేష్‌ను చుట్టుముట్టి అతికిరాతకంగా తలపై నరకటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- అక్కడి నుంచి రెండు గ్రూపులు కలసి బోయ పరమేష్ ఇంటి మీదకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గమనించిన పరమేష్ ఇంటి తలుపులు వేసుకోగా భార్య జయలక్ష్మి 'మా ఆయన లేడు మామా' అంటున్నా బండ బూతులు తిడుతూ ఆమె కాలిపై వేడకొడవలితో నరికారు. లోపల దాక్కున్న పరమేష్‌ను విచక్షణారహితంగా నరకడంతో రక్తం మడుగులో పడిపోయాడు.

ఇరువురి పరిస్థితి విషమం

ప్రత్యర్థుల దాడి నుంచి తప్పించుకున్న గోవిందును పోలీసులు వెంటనే చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ గోవిందు భార్య వీరేశమ్మ, కుమారుడు లోకేశ్‌కు ప్రథమ చికిత్స అందించారు. దాడిలో గాయపడ్డ పరమేష్ భార్య జయలక్ష్మిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. గోవిందు, లోకేశ్‌ల పరిస్థితి విషమంగా ఉండటంతోకర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు బోయ వెంకటేష్‌కు భార్య ఉసేనమ్మ, కుమార్తె రాజేశ్వరి, కుమారుడు మహానందిలు ఉన్నారు. బోయ పరమేష్‌కు భార్య జయలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు పూజ, రాణి, శివాణి, కుమారుడు మహేంద్రలు ఉన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ , డీఎస్పీ ఎంఎన్ భార్గవి, సీఐ చిరంజీవి గ్రామానికి వెళ్లి హత్యల తీరును పరిశీలించారు.

భోగాపురంపై నీళ్లు నమిలిన మంత్రులు

- ప్రాజెక్ట్ కోసం వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.960 కోట్లు ఖర్చు చేసింది వాస్తవం కాదా?
- హైకోర్టు, ఎన్జీటీ కేసులు ఎవరి హయాంలో అధిగమించారు?
- మీడియా ప్రశ్నలకు సమాధానాలు దాటవేసిన మంత్రులు బీసీ, కింజరాపు
- రాయలసీమ ఎత్తిపోతల పథకంపై వేసిన ప్రశ్నలకూ జవాబివ్వలేక కస్సుబుస్సు

సాక్షి, అమరావతి: భోగాపురం ఎయిర్‌పోర్టు విషయంలో మీడియా అడిగిన ప్రశ్నలకు మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, కింజరాపు అచ్చెన్నాయుడు నీళ్లు నమిలారు. ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక దాటవేత ధోరణి అవలంబించారు. సచివాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్‌కు కర్త, కర్మ, క్రియ చంద్రబాబే అని భజన చేశారు. ఈ విషయం చిన్న పిల్లాడిని నిద్రలో లేపి అడిగినా చెబుతాడని ప్రగల్భాలు పలికారు. దీంతో మీడియా ప్రతినిధులు కల్పించుకుని 'ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి భూములు ఇచ్చిన వారికి పునరావాసం, భూసేకరణ కోసం గత ప్రభుత్వంలో రూ.960 కోట్లు ఖర్చు చేశామని వైఎస్సార్‌సీపీ చెబుతోంది.' వాస్తవం కాదా? అని మీడియా ప్రశ్నించగా మంత్రులు నీళ్లు నమిలారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై హైకోర్టు, ఎన్జీటీల్లో కేసులను ఎవరి హయాంలో అధిగమించారు? అన్న ప్రశ్నకు సమాధానం దాట వేశారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రధాన పనుల్లో గణనీయమైన భాగం గత ప్రభుత్వంలోనే పూర్తయినట్టు ప్రతిపక్షం చెబుతోందని మీడియా ప్రస్తావించగా అచ్చెన్నాయుడు కస్సుబుస్సులాడారు. వాస్తవాలను అంగీకరించలేక మాజీ సీఎం వైఎస్ జగన్‌పై వ్యక్తిగత దూషణకు దిగారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత అంతా బాబుకే దక్కాలన్నారు. సీమ ఎత్తిపోతల పథకంపై మీడియా వేసిన ప్రశ్నలతో అచ్చెన్నాయుడు అసహనానికి గురయ్యారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను చంద్రబాబుతో మాట్లాడి ఆపించేశానని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆ రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని దీనిపై మీ స్పందన ఏమిటని మీడియా ప్రతినిధులు అచ్చెన్నను ప్రశ్నించగా 'వెళ్లి ఆయన్నే అడుక్కోండి' అని వారిపై కస్సుమన్నారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించాల్సిన అవసరం తమకు లేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రకటన చేసిన వెంటనే చంద్రబాబు సీమ ద్రోహి అని రాసేస్తారా? అంటూ చిందులు తొక్కారు.

Model Questions For Public Exam Practice

Passages for comprehension

(Questions 1- 5): Read the following passage carefully.

1) I finished my poem, and it was beautiful! It was about a mother duck and a father swan with three baby ducklings who were bitten to death by the father because they quacked too much. Luckily, Mr. Keesing took the joke the right way. He read the poem to the class, adding his own comments, and to several other classes as well. Since then, I've been allowed to talk and haven't been assigned any extra homework. On the contrary, Mr Keesing's always making jokes these days. (From the Diary of Anne Frank)

Now, answer the following questions. 5× 2 = 10 M

1. Who is the narrator in the above passage?
2. What was Mr.Keesing?
3. How did Mr.Keesing take the joke in the poem?
   A) seriously B) casually C) negatively
4. The father swan killed the baby ducklings because ....
   A) they quacked too much
   B) thefatherswandid not like them
   C) the motherswanwas irritated
5. The Father swan in Anne's poem symbolized ......
   A) all swans in the world
   B) the foster father C) Mr.Keesing, the teacher

Answers:

1. The narrator in the passage is Anne Frank.
2. Mr. Keesing was Anne Frank's Maths teacher.
3. (B) casually
4. (A) they quacked too much
5. (C) Mr. Keesing, the teacher

2) The baker or bread-seller of those days had a peculiar dress known as the kabai. It was a single piece long frock reaching down to the knees. In our childhood, we saw bakers wearing a shirt and trousers which were shorter than full-length ones and longer than half pants. Even today, anyone whowearsahalf pant which reaches just below the knees invites the comment that he is dressed like a pader! The baker usually collected his bills at the end of the month. Monthly accounts used to be recorded on some wall in pencil. Baking was indeed a profitable profession in the old days. The baker and his family never starved. He, his family, and his servants always looked happy and prosperous. Their plump physique was an open testimony to this. Even today any person with a jackfruit-like physical appearance is easily compared to a baker. (A Baker from Goa)

Now answer the following questions. 5×2 =10M

1. What is the name of the bread seller's dress?
2. What did the bakers use to wear during the narrator's childhood?
3. Whom does the phrase jack-fruit physique refer to?
   A) professor B) Baker C) Collector 2
4. How did the bakers note their bills?
   A) on walls with pen B) on paper in pencil
   C) on wall in pencil
5. How can we say that bakers and their families were healthy and wealthy all the time?
   A) by their report B) by their appearance
   C) by their rich clothes

Answers:

1. The nameofthe breadseller's dress is Kabai.
2. The narrator's childhood, he bakers used to wear a shirt and trousers which were shorter than full length ones and longer than half pants.
3. (B) baker
4. (C) on walls in pencil
5. (B) by their appearance

(Questions 6- 10): Read the following stanza carefully.

1) He should be snarling around houses
At the jungle's edge,
Baring his white fangs, his claws,
Terrorizing the village!
But he's locked in a concrete cell,
His strength behind bars,
Stalking the length of his cage,
Ignoring visitors.
He hears the last voice at night,
The patrolling cars,
And stares with his brilliant eyes
At the brilliant stars. (A Tiger in the Zoo)

Now, answer the following questions. 5 × 1 = 5 M

6. Who does 'he' refer to?
7. How did he terrorise the villagers?
8. Where was he lockedin?
   A) in the forest edge
   B) in a concrete cell
   C) in an old building
9. What is the mood ofthe person /animal in second stanza?
   A) agony B) pride C) relaxed
10. What is the last voice he hears in the poem?
   A) The voice of visitors
   B) The patrolling cars
   C) The brilliant stars.

Answers:

6. He refers to the tiger.
7. He terrorises the villagers by snarling around the houses at the jungle's edge.
8. B(in aconcrete cell)
9. A(agony)
10. B(the patrolling cars)

2) "If ever you should go by chanceto jungles in the East;
And if there should to you advance
A large and tawny beast,
If he roars at you as you're dyin',you'll know it is the Asian Lion."

Now, answer the following questions

6. Where does the poet suggest you might encounter an Asian Lion?
7. How can you identify an Asian Lion, according to the poet?
8. What does the poet describe as "large and tawny"?
   a) A tiger
   b) An Asian Lion
   c) A leopard d) A cheetah
9. How does the Asian Lion behave in the poem?
   a) It roars loudly while advancing toward the person.
   b) It hides in the jungle.
   c) It runs away upon seeing someone.
   d) It plays with the visitor.
10. Which poetic device is used in the line "If he roars at you as you're dyin'"?
   a) Hyperbole b) Alliteration
   c) Personification d) Simile

Answers:

6. In the jungles of the East.
7. By its large, tawny appearance and its roar as it attacks.
8. b) An Asian Lion.
9. a) It roars loudly while advancing toward the person.
10. a) Hyperbole

3) Now the name of the little black kitten was Ink,
And the little grey mouse, she called him Blink,
And the little yellow dog was sharp as Mustard,
But the dragon was a coward, and she called him Custard.
Custard the dragon had big sharp teeth,
And spikes on top of him and scales underneath,
Mouth like a fireplace, chimney for a nose,
And realio, trulio daggers on his toes.
Belinda was as brave as a barrel full of bears,
And Ink and Blink chased lions down the stairs,
Mustard was as brave as a tiger in a rage,
But Custard cried for a nice safe cage. (The Tale of Custard Dragon)

Now, answer the following questions. 5 × 1 = 5 M

6. What did Custard, The dragon cry for?
7. How brave was Belinda?
8. What was the name of the little yellow dog?
   A) Custard B) Mustard C) Blink
9. What did Ink and Blink do?
   A) Chased barrel full of bears
   B) Chased lions down the stairs
   C) Cried for nice safe cage
10. Which of the following is TRUE according to the poem above?
   A) Custard showed true courage.
   B) Custard cried for an iron safe.
   C) Belinda is the name of Dragon.

Answers:

6. Custard cried for a nice safe cage.
7. Belinda was as brave as a barrel full of bears.
8. B(Mustard)
9. B(Chased lions down the stairs)
10. A (Custard showed true courage)

4) The trees inside are moving out into the forest,
the forest that was empty all these days
where no bird could sit
no insect hide
no sun bury its feet in shadow
the forest that was empty all these nights
will be full of trees by morning. (THE TREES)

Now, answer the following questions. 5 × 1 = 5 M

6. Where are the trees moving?
7. How was the forest all these days?
8. What are personified in the poem?
   A) trees B) the Sun
   C) the trees and the Sun
9. The poet hopes that _________________
   A) the trees will be inside the houses
   B) the trees will have freedom by next morning
   C) the forest will be empty
10. The poem 'The Trees' expresses the poet's ________

A) pessimism B) optimism C) happiness

Answers:

6. The trees are moving out into the forest.
7. The forest was empty (without trees) all these days.
8. (C) trees and the Sun
9. (B) the trees will have freedom by next morning.
10. (B) optimism

Questions (11 to 15) Read the following passage.

1) The expected call came within a few days. Mrs. Pumphrey was distraught. Tricki would eat nothing. Refused even his favourite dishes and besides, he had bouts of vomiting. He spent all his time lying on a rug panting. Didn't want to go for walks, didn't want to do anything. I had made my plans in advance .The only way was to get Tricki out of the house for a period. I suggested that he be hospitalised for about a fortnight to be kept under observation. The poor lady almost swooned. She was sure he would pine and die if he did not see her every day. (A Triumph of Surgery)

Now answer the following questions. 5×1 = 5M.

11. Who was expecting a call? ( )
A) Mrs.Pumphrey B) Mr.Herriot
C) Hodgkin
12. Why was Mrs.Pumphrey distraught? ( )
A) She wasexpecting a call
B) Tricki fell ill.
C) She had bouts of vomiting
13. Who was Tricki ? ( )
A) a pet dog B) Gardner
C) Veterinary doctor
14. What was the plan Mr. Herriot made in advance to cure Tricki ? ( )
A) Give him somerest
B) Allow him to eat his favorite dishes
C) Hospitalize it for a fort night
15. Who would pine and die if he didn't see Mrs.Pumphrey ? ( )
A) The poor lady B) Hodgkin
C)Tricki

Answers:

11. (B) Mr. Herriot
12. (B) Tricki fell sick
13. (A)A pet dog
14. (C) Hospitalise it for a fortnight|)
15. (C)Tricki

2) I awoke late next morning to find that Anil had already made the tea. He stretched out his hand towards me. There wasa fifty-rupee note between his fingers. My heart sank. I thought I had been discovered. "I made some money yesterday," he explained. "Now you'll be paid regularly." My spirits rose. But when I took the note, I saw it was still wet from the night's rain. "Today we'll start writing sentences," he said. He knew. But neither his lips nor his eyes showed anything. I smiled at Anil in my most appealing way. And the smile camel by itself, without any effort. (The Thief's Story)

Choose the appropriate answer from the options given: 5 × 1 = 5 M

11. 'My heart sank'. What does the sentence mean?
A) He jumped up and down.
B) He became disappointed.
C) He felt fear of being caught.
12. 'He stretched out his hand'. Who does 'He' refer to?
A) the publisher
B) the writer
C) the thief
13. 'He knew'. What did 'he' know?
A) He knew that it rained.
B) He knew that he studied well.
C) He knew that Hari tried to steal.
14. 'The smile came by itself. Why?
A) His thoughts were clean.
B) So far, he held the smile back.
C) The incident was amusing.
15. What will the narrator probably do after this?
A) He will help the poor.
B) He will change his behaviour.
C) He will go from there at once.

Answers:

11. C (He felt fear of being caught)
12. B (the writer)
13. C(Heknewthat Haritried to steal)
14. A(His thoughts were clean)
15. B(Hewill change his behaviour)

(Question 16): Study the following Tree-diagram.



Now, answer the following questions. 5 × 1 = 5 M

1. What does the Tree-diagram show?
2. How many types of musical instruments are there?
3. How many instruments are shown in percussion instruments?
A) eleven B) five C) two
4. Identify the wind instrument from the following.
A) guitar B) flute C) xylophone
5. Identify the correct statement.
A) Drum is a wind instrument.
B) Guitar is a stringed instrument.
C) Mouth organ is a percussion instrument

Answers:

1. The tree diagram shows the classification of musical instruments
2. ii)there are three types of musical instruments wind instruments percussion instruments and string instruments
3. c)two
4. b)flute
5. b)guitar is a stringed instrument

(Question 17): Read the following passage carefully.

1) There was a big banyan tree, where two crows-husband and wife, had prepared a nice nest and made it their home. In the hollow of the same tree, lived a black cobra. The crows had a problem because the black cobra would climb up the tree and eat the newborns, whenever the female crow hatched her eggs. They could do nothing to save them. The crows went to a jackal, who lived in a nearby banyan tree, to seek his advice. They narrated everything to him and requested his advice for them to get rid of their problem. They said, "O Friend, It has become dangerous to live here. Please tell us how we can protect our children from being eaten up by the wicked black cobra. The jackal replied, "Please don't give up. Even powerful enemies can be overcome with the use of wit."

Now, arrange the following jumbled sentences into a meaningful order. 5 X 1 = 5 (M)

a) The crows went to a jackal and sought his advice.
b) Powerful enemies can be overcome with the use of wit.
c) Two crows prepared a nice nest and made it their home.
d) The jackal assured the birds and asked the birds to be brave.
e) There was a black cobra in the hollow and ate the newly born birds.

Answer:

c	e	a	d	b

2) Once up on a time, a farmer had a goose that laid a golden egg every day. The farmer used to sell that egg and earn enough money to meet their family's day-to-day needs. One day, the farmer thought that if he could get more such eggs and make a lot of money and become a wealthy person. The farmer decided to cut the goose and remove all the golden eggs from its stomach. As soon as they killed the bird and opened the goose's stomach, they found no eggs. The foolish farmer realized they had destroyed their last resource out of greed.

Now, arrange the following sentences into a meaningful order. 5 × 1 = 5 M

a) The farmer did not find any eggs in its stomach when he killed it.
b) The farmer wants to get all the eggs at once to become rich.
c) The farmer understood that he spoiled his source of life due to his greed.
d) The farmer had a goose that laid a golden egg every day.
e) Every day the farmer sells an egg and fulfills his family's needs.

Answer:

d	e	b	a	c

C. Bhagya Sekhar Reddy
SA, English
Govt. High School
Chandragiri, Tirupati Dt

Daily Quiz 6

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. **Fill in the blank with the suitable form of the verb:**
As soon as he ____ tomorrow, we will start the meeting.
a) will arrive b) arrives
c) has arrived d) is arriving
2. **Choose the statement that has an incorrect question tag:**
a) I think that I am right, aren't I?
b) You believe that she is honest, don't you?
c) Asha knows that the answer is correct, doesn't she?
d) I think everybody likes ice-cream, don't I?
3. **The meaning of the idiom "white elephant" is:**
a) A costly and valuable possession
b) A rare and unique thing
c) A costly but useless possession
d) A symbol of purity
4. **At the age of 15, Einstein felt so stifled that he left the school for good.**
The phrase "for good" means:
a) regularly b) finally
c) sincerely d) deliberately

క్లుప్తంగా...

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై వివరాలివ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన తరగతులకు (బీసీలు) జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సోమవారం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమగ్ర కులగణన, సామాజిక–ఆర్థిక–రాజకీయ సర్వే విషయంలో పూర్తిచేయకుండానే స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవడం బీసీల హక్కులను హరించడమేనంటూ ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ ఏపీ రాష్ట్ర విభాగం గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ సర్వేను తక్షణమే పూర్తి చేసి, ఆ సర్వే ఆధారంగా బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన హైకోర్టును అభ్యర్థించారు. కాగా ఉద్యోగ, విద్య, ఎన్నికల్లో రిజర్వేషన్లకు మొత్తం మూడింటిని కలిపి ఒకే పిటిషన్‌లో ఎలా లేవనెత్తుతారని వాదనల సమయంలో న్యాయమూర్తి ప్రశ్నించారు. తాము కేవలం ఈ వ్యాజ్యంలో స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకే పరిమితం అవుతున్నామని ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి సమాధానం ఇచ్చారు.

పొగమంచుతో విమాన రాకపోకలకు అంతరాయం

గన్నవరం: ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సోమవారం గన్నవరం విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. న్యూఢిల్లీ విమానాన్ని దారి మళ్లించగా, మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడిచాయి. గన్నవరం విమానాశ్రయ ప్రాంతాన్ని తెల్లవారుజాము నుంచి పొగమంచు దుప్పటిలా కప్పేసింది. దీంతో న్యూఢిల్లీ నుంచి ఉదయం 8.15 గంటలకు ఇక్కడకు వచ్చిన ఎయిరిండియా విమానం రన్‌వేపై విజిబులిటీ లేకపోవడంతో సుమారు అరగంట పాటు గాల్లో చక్కర్లు కొట్టింది. అయినప్పటికి ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలించకపోవడంతో విమానాన్ని హైదరాబాద్‌కు మళ్లించారు. ఈ విమానం తిరిగి 11 గంటలకు ఇక్కడికి చేరుకుంది. పొగమంచు కారణంగా హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం, చెన్నై విమాన సర్వీస్‌లు ఆలస్యంగా నడిచాయి.

రేషన్ మాఫియాకు చెక్ పెట్టండి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రేషన్ మాఫియా అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య సోమవారం సీఎంకు రాసిన లేఖలో డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల్లో బియ్యం, పంచదార పంపిణీలో లోపాలను అరికట్టాలన్నారు. పలు డిపోల్లో తూకంలో మోసాల వల్ల ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. బియ్యం పక్కదారి పట్టకుండా అక్రమార్కులపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టాలని ఈశ్వరయ్య కోరారు.

ఏయూలో అప్రకటిత కర్ఫ్యూ యత్నాలు దుర్మార్గం

- రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఇదే నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర

సాక్షి,అమరావతి: ఆంధ్రా యూనివర్సిటీలో అప్రకటిత కర్ఫ్యూ అమలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఇటీవల ఏయూ రిజిస్ట్రార్ జారీ చేసిన సర్క్యులర్ వల్ల గుర్తింపు కార్డు లేకపోతే యూనివర్సిటీలోకి ప్రవేశం లేకుండా పోయిందన్నారు. వీసీని ప్రొఫెసర్లు, రిజిస్ట్రార్, సిబ్బంది కలవాలంటే ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాలన్న నిబంధన విధించడం అప్రకటిత కర్ఫ్యూ అమలు చేసినట్లేనని..ఇది రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుకు నిదర్శనమని ఆరోపించారు. వందేళ్ల చరిత్ర ఉన్న విశ్వవిద్యాలయంలో ఇలాంటి నిషేధాజ్ఞలు విధించడం విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల స్వేచ్ఛను హరించడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో అప్రజాస్వామిక సర్క్యులర్లు జారీ అవుతున్నా విద్యా శాఖ మంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు. యూనివర్సిటీలను గాడిలో పెట్టే బాధ్యత విద్యాశాఖ మంత్రిది కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికే హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లోకి విద్యార్థి సంఘాలు, పౌరులు ప్రవేశించకూడదంటూ చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందరి.. అదే విధానాన్ని ఇప్పుడు యూనివర్సిటీల్లో అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆంధ్ర ఏయూ వైస్ చాన్స్‌లర్ రాజశేఖరా? లేక గీతం యూనివర్సిటీ చైర్మన్ భరతా? అని ప్రశ్నించారు. వర్సిటీలో అప్రకటిత కర్ఫ్యూ విధిస్తూ జారీ చేసిన సర్క్యులర్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

‘ఎత్తిపోతా’రు తస్మాత్ జాగ్రత్త

బాబు సర్కారుపై భగ్గుమన్న సీమ రైతులు

- భూమన అభినయ్ ఆధ్వర్యంలో కదం తొక్కిన కర్షకులు
- తిరుపతి కలెక్టరేట్ వద్ద రోడ్డుపై బైఠాయింపు.. నల్లచొక్కాలతో బిందెలు చేతబట్టి నిరసన
- ఉద్యమకారులపై పోలీసుల జులుం... సాక్షి ఫొటోగ్రాఫర్‌పైనా దౌర్జన్యం

రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, భూమన సుబ్రమణ్యంరెడ్డి, మేయర్ శిరీష, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అభినయ్‌రెడ్డిని బలవంతంగా అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తిరుపతి అర్బన్/చంద్రగిరి: తెలుగు రాష్ట్రాల సీఎంలు, గురుశిష్యులు సీమను ఎడారిగా మార్చడానికి చీకటి ఒప్పందాలకు తెగబడ్డారని కర్షకులు కన్నెర్రజేశారు. చంద్రబాబు సర్కారుపై భగ్గుమన్నారు. ఎత్తిపోతారు తస్మాత్ జాగ్రత్త.. అంటూ హెచ్చరించారు. సాగు, తాగునీటి ప్రాజెక్టుల రక్షణలో భాగంగా రైతులు సోమవారం ఉద్యమబాట పట్టారు. సోమవారం తిరుపతిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రోడ్డెక్కారు. తిరుపతి కలెక్టరేట్ వద్ద బైఠాయించి చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులకు అండగా రాయలసీమ ఉద్యమకారుడు, శ్వేత మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యం రెడ్డి, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష మద్దతుగా నిలిచారు. ‘చంద్రబాబు నోరు విప్పు–సీమ ప్రజలకు సమాధానం చెప్పు’ అనే నినాదంతో తిరుపతి కలెక్టరేట్ వద్ద నల్ల చొక్కాలు ధరించి, ఖాళీ బిందెలను చేతపట్టుకుని నిరసన గళం వినిపించారు. ప్లకార్డులతో సీఎం చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. శిష్యుడు రేవంత్‌రెడ్డి మీకు వెన్నుపోటు పొడిచారా...? లేదా ఇద్దరు కలసి సీమ ప్రజలకు వెన్నుపోటుకు దిగారో స్పష్టంగా ప్రజలకు చెప్పాలంటూ నినదించారు. ఆ నినాదాలతో ఆ ప్రాంతం మొత్తం హోరెత్తడంతో పోలీసులు నిరసనకారులపై విరుచుకుపడ్డారు. జులుం ప్రదర్శించారు. మహిళలపైనా దురుసుగా ప్రవర్తించారు. లాగిపక్కన పడేశారు. ఈ సందర్భంగా జై జగన్... నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. పోలీసులు ఉద్యమకారులను అరెస్టు చేసి తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలువురిపై కేసులు నమోదు చేశారు.

సీమ ద్రోహి సీఎం చంద్రబాబు

రాయలసీమ ద్రోహి సీఎం చంద్రబాబు... అంటూ వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, రాయలసీమ ఉద్యమకారుడు భూమన సుబ్రమణ్యం రెడ్డి మండిపడ్డారు. సైంధవుడు వలే చంద్రబాబు సీమ ప్రాజెక్టులకు అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంల చీకటి ఒప్పందాలతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాయలసీమ–ఎత్తిపోతల పథకానికి రూ.7వేల కోట్లు కేటాయింపులు చేసి శ్రీశైలం, తెలుగుగంగ ప్రాజెక్టు, గాలేరు–నగరి ప్రాజెక్టులకు నీటిని అందించాలని సంకల్పించారని గుర్తుచేశారు. ఎత్తిపోతల పథకం రాయలసీమకు జీవం పోస్తుందని పేర్కొన్నారు. సాగునీరు, తాగునీరు లేకపోవడంతోనే మదనపల్లె, తంబళ్లపల్లి, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి పుణెకు రైతులు వలసపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాజధాని పేరుతో అమరావతి భూములు లాక్కున్నట్లుగా ప్రాజెక్టులను తెలంగాణకు దోచిపెట్టి సీమను ఎడారిగా మార్చేయాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సీమకు అన్యాయం చేస్తుంటే ఊరుకోబోమని రైతుల్లో రగిలిన చైతన్యస్ఫూర్తితో మహోద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ప్రజల కోసం పోరాడితే అక్రమ అరెస్టులా..? : ఎంపీ మద్దిల గురుమూర్తి

ప్రజల హక్కులను కాపాడేందుకు శాంతియుత నిరసన చేస్తున్న ఉద్యమకారులను అడ్డుకోవడమే కాకుండా, అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఆగ్రహం వ్యక్తంచేశారు. తిరుపతి కలెక్టరేట్ వద్ద భూమన అభినయ్‌రెడ్డితోపాటు రైతులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న గురుమూర్తి వెంటనే తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసుల అణచివేత చర్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజల హక్కుల కోసం పోరాడే నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని, వెంటనే అభినయ్‌రెడ్డిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను వెనక్కి తీసుకునే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అనంతరం తిరుచానూరు పోలీసులు భూమన అభినయ్‌తోపాటు 29మందిని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

సాక్షి ఫొటోగ్రాఫర్‌పై పోలీసుల దౌర్జన్యం

విధినిర్వహణలో భాగంగా రైతుల శాంతియుత నిరసన, ఉద్యమకారుల అక్రమ అరెస్టులకు సంబంధించిన ఫొటోలు తీస్తున్న ‘సాక్షి’ ఫొటోగ్రాఫర్ మోహన్‌కృష్ణపై మఫ్టీలో ఉన్న ఓ కానిస్టేబుల్ దౌర్జన్యానికి పాల్పడ్డారు. తిరుచానూరు పోలీసుస్టేషన్ వద్ద మెడపట్టి బయటకు లాగేశారు. దీంతో మోహన్‌కృష్ణ, కానిస్టేబుల్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో ఆగ్రహించిన సీఐ సునీల్‌కుమార్ స్టేషన్‌లో ఉన్న ఫొటోగ్రాఫర్‌ను నెట్టుకుంటూ వచ్చి బయటకు తోసేశారు. ఆపై డీఎస్పీ ప్రసాద్ ఆదేశాలతో మోహన్‌కృష్ణను పోలీసులు స్టేషన్‌లో రెండు గంటలకుపైగా నిర్బంధించారు. సమాచారం అందుకున్న జర్నలిస్టు సంఘాల నేతలు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని డీఎస్పీతో మాట్లాడారు. పోలీసు చర్యలను ఖండించారు. ఫలితం లేకపోవడంతో విషయాన్ని జర్నలిస్టు సంఘాల నేతలు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు ఫొటోగ్రాఫర్‌ను విడిచిపెట్టారు.

జగన్ శ్రమ ఫలితమే ‘భోగాపురం’

ఆ ఎయిర్‌పోర్టుకు, చంద్రబాబుకు ఏం సంబంధం?: పేర్ని నాని ధ్వజం

- ఒక్క ఎకరా భూమి కూడా చేతికి రాకుండానే ఎన్నికల ముందు ఓ రాయి వేసి మభ్యపుచ్చారు
- ఆయన చరిత్ర అంతా అసత్యాలు, బురిడీ, మాయమాటలే
- ఎవరో చేసిన పనులను తన ఖాతాలో వేసుకోవడం బాబు నైజం
- ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు ఎక్కడ?
- ఏపీలో పోలీస్ వ్యవస్థ దిగజారిపోయిందని కేంద్రమే చెబుతోంది

చిలకలపూడి (మచిలీపట్నం): ముఖ్యమంత్రి చంద్రబాబు చరిత్ర అంతా అసత్యాలు, బురిడీ, మాయమాటలు చెప్పటమేనని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టం, ఆలోచన, శ్రమతోనే భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగిందని స్పష్టం చేశారు. చంద్రబాబు భోగాపురం ఎయిర్‌పోర్టు కట్టారని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ట్రైల్ రన్ అనంతరం ప్రెస్‌మీట్‌లో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రామ్మోహన్‌నాయుడు దేశం మొత్తం సిగ్గుపడి తలవంచుకునేలా ఇండిగో వ్యవహారంలో దొరికిపోయారని ఎద్దేవా చేశారు. అసలు భోగాపురం ఎయిర్‌పోర్టుకు, చంద్రబాబుకు ఏం సంబంధం? అని సూటిగా ప్రశ్నించారు. సోమవారం మచిలీపట్నంలోని పార్టీ కార్యాలయంలో పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

- చంద్రబాబు 15 వేల ఎకరాల్లో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మిస్తామంటూ మభ్యపుచ్చి, చివరకు ఒక ఎకరా కూడా చేతికి రాకుండానే గతంలో అధికారంలో ఉండగా ఎన్నికల ముందు 2019 ఫిబ్రవరి 14వ తేదీన రాయి వేశారు. ఇదే రీతిలో డ్రామాలాడుతూ బందరు పోర్టుకు 2019 మార్చిలో శంకుస్థాపన చేశారు. వైఎస్ జగన్ పటిష్ట ప్రణాళికా, చర్యలతో ఏడాదిలో బందరు పోర్టు నిర్మాణం పూర్తవుతున్న నేపథ్యంలో అది కూడా తామే కట్టామని చంద్రబాబు మాయమాటలు చెబుతున్నారు. నిజానికి గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2,200 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి చిత్తశుద్ధితో భూసేకరణ పూర్తి చేశారు. నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నగదు చెల్లించి వారికి కాలనీలు కూడా ఏర్పాటు చేసిన తరువాతే 2023లో శంకుస్థాపన చేశారు. అంతేకాదు.. వైజాగ్ ఎయిర్‌పోర్టు నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆరు లేన్ల రహదారి ఎన్‌హెచ్–16ని కలిపే విధంగా నిర్మించాలని, అందుకు రూ.6,600 కోట్లు మంజూరు చేయాలని ఆ సమయంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరి అందుకు ఒప్పించారు.
- భోగాపురం ఎయిర్‌పోర్టును తామే నిర్మించామని చంద్రబాబు ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. అదే నిజమైతే 18 నెలల్లో భూసేకరణ పూర్తి చేసి ఎయిర్‌పోర్టు నిర్మాణం ఎలా సాధ్యం? ఎవరో చేసిన పనులను తన ఖాతాలో వేసుకుని క్రెడిట్ చోరీ చేయడమే చంద్రబాబు నైజం. తాము తీసుకువచ్చిన పరిశ్రమలన్నీ వైఎస్ జగన్ ప్రభుత్వంలో వెళ్లిపోయాయని చంద్రబాబు, లోకేశ్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. అలాగైతే భోగాపురం ఎయిర్‌పోర్టు ఎందుకు వెళ్లలేదు?
- రాష్ట్రంలో ప్రభుత్వ కొత్త మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో నిర్వహిస్తామని చంద్రబాబు సర్కారు చెబుతున్నా టెండర్లు ఎందుకు రావట్లేదు? ఆదోని మెడికల్ కళాశాలకు టెండరు వచ్చిందని, కిమ్స్ హాస్పటల్ మేనేజ్‌మెంట్ దాన్ని దాఖలు చేసిందని ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. అయితే కిమ్స్ ఆస్పత్రి ప్రతినిధులు తాము ఆ టెండరు వేయలేదని చెప్పారు. దీనిపై విలేకరులు మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ప్రశ్నిస్తే.. ఆసుపత్రి నిర్వాహకుడు ప్రేమ్‌చంద్ షా దాఖలు చేశారని చెబుతున్నారు. నిజానికి దేశంలోని 26 కిమ్స్ ఆస్పత్రుల్లో ప్రేమ్‌చంద్ షా పేరుతో గుండె వైద్య నిపుణులు ఎవరూ లేరని మా పరిశీలనలో తేలింది. మరి ప్రేమ్‌చంద్ షా ఎవరు? ఆయన టెండరు వేసినట్లు, ఆయనెవరో ఆధారాలతో చెప్పే దమ్ము చంద్రబాబు ప్రభుత్వానికి ఉందా?
- ఎన్నికల ముందు రూ.15 వేలు ఫీజుతోనే మెడికల్ విద్య సీట్లు కళాశాలల ద్వారా అందుబాటులోకి తెస్తామని మాయమాటలు చెప్పిన చంద్రబాబు ఇప్పుడు వాటిని అమ్మకానికి పెడుతూ నిర్ణయం తీసుకున్నారు. మాయమాటలు చెప్పటం ఆయనకు అలవాటైపోయింది. ప్రభుత్వ వైద్యం బాగోదని.. ప్రైవేటు వైద్యం మాత్రమే బాగుంటుందని చెప్పిన చంద్రబాబుకు ముఖ్యమంత్రిగా ఉండేందుకు అర్హత ఉందా?
- తాము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని, ప్రతి ఇంటి నుంచి కరెంట్ అమ్ముకోవచ్చని చంద్రబాబు చెప్పారు. గత ప్రభుత్వంలో కరెంట్ మీటర్లు పెడితే బద్దలు కొడతామని అన్న తండ్రీ, కుమారుడు ఇప్పుడు అవే మీటర్లు బిగిస్తున్నారు. వలంటీర్లకు గౌరవ వేతనం ఏకంగా రూ.10 వేలకు పెంచి ఇస్తామని నమ్మబలికి చివరకు ఆ వ్యవస్థనే రద్దు చేశారు.
- చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒకటి రెండు నెలలు మినహా ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఎందుకు వేయటం లేదు? సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న వాగ్దానం ఏమైంది? డీఏ, ఎరియర్స్ ఇవ్వకపోగా పీఆర్సీ కమిషన్‌ను కూడా నియమించలేదు. ఐఆర్ కూడా ప్రకటించకుండా గోరుచుట్టు మీద రోకటి పోటులా ఉపాధ్యాయులకు ‘టెట్’ పెడుతున్నారు. పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్‌లు సంవత్సరానికి మూడుసార్లు చెల్లించాల్సి ఉండగా, గత ప్రభుత్వంలో నిల్వ ఉంచిన సొమ్ము మినహా 18 నెలల్లో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. హోంగార్డులకు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జీతం పెంచారు. ఆ తరువాత మీరు ఒక్క రూపాయి అయిన జీతం పెంచారా? ఆంధ్రప్రదేశ్‌లో పోలీస్ వ్యవస్థ కునారిల్లుతోందని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే వ్యాఖ్యానించటం నిజం కాదా? పోలీసులు కూడా ఈ ప్రభుత్వంపై తిరగబడే రోజు వస్తుంది.
- వైఎస్ జగన్ తన కుమార్తె వద్దకు లండన్ వెళితే రూ.12 కోట్లు ఖర్చు చేశారని వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు, లోకేశ్ ప్రస్తుతం హైదరాబాద్ నుంచి బాలి, లండన్, స్విట్జర్లాండ్ వెళ్లి తిరిగి రావడానికి ఎంత ఖర్చు అవుతోంది? పోలీసులకు పెట్రోల్ ఖర్చులు ఇవ్వలేని వారు వీటికి రూ.కోట్ల రూపాయలు ఎలా ఖర్చు చేస్తారు? ఈ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లో చేసిన దాదాపు రూ.3 లక్షల కోట్లు అప్పులు, రాష్ట్రానికి వచ్చిన ఆదాయం రూ.1.50 లక్షల కోట్లు ఏం చేశారో చంద్రబాబు చెప్పాలి. ఎవరో చేసిన పని తన ఖాతాలో వేసుకుని, తానే చేసినట్లుగా గొప్పలు చెప్పుకోవటం మానుకుని ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలు చెల్లించటంతో పాటు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి.
- చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నినా, తలకిందులుగా తపస్సు చేసినా.. జనబలం, గుండెబలం ఉన్న జగన్‌ను ఏమీ చేయలేరు. 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను ప్రజలంతా తమవాడిగా, ఇంట్లో మనిషిగా గెలిపించుకోవటం ఖాయం.

> చంద్రబాబు ప్రభుత్వం పలు సంస్థల పేరుతో వేల ఎకరాలు కేటాయింపులు చేస్తున్నా ఇంతవరకు ఒక్క పరిశ్రమ కూడా స్థాపించకపోవటం ప్రజలను మోసం చేయటమే. సింగపూర్‌లా అమరావతి నిర్మాణం చేస్తామని ప్రభుత్వ పెద్దలు మాయమాటలు చెబుతున్నారు. మంత్రి నారాయణ మాత్రం రోజూ తుమ్మ చెట్లు నరుకుతున్నామని చెప్పటం మినహా ఇంతవరకు చేసిందేమీ లేదు.

> విదేశాల నుంచి తీసుకువచ్చిన ప్రతినిధులతో సమ్మిట్లు నిర్వహించి రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయంటూ చంద్రబాబు మాయమాటలు చెబుతున్నారు. హోటళ్లలో వంటవారిని తీసుకొచ్చి సూటు బూటు వేస్తున్నారని తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ బాధపడటం విడ్డూరంగా ఉంది.

భోగాపురం ఎయిర్‌పోర్టు ఘనత

ముమ్మాటికీ జగన్‌దే

నిస్సిగ్గుగా తన ఖాతాలో వేసుకునేందుకు బాబు పాకులాట

2019 ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు చంద్రబాబు హడావుడిగా శంకుస్థాపన

ఎయిర్ పోర్టు కోసం అన్ని అనుమతులు సాధించింది వైఎస్.జగన్

2023 మే 3న నిర్మాణ పనులకు శంకుస్థాపన.. జూన్ 2026 నాటికి నిర్మాణ లక్ష్యం

వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మహారాణిపేట: భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ ఘనత ముమ్మాటికీ వైఎస్ జగన్‌దేనని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ స్పష్టం చేశారు. సోమవారం మద్దిలపాలెంలో ఆయన మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నిర్మాణంలో చంద్రబాబు కంట్రిబ్యూషన్ ఏమీలేదని విమర్శించారు. టీడీపీ నేతలు సిగ్గు లేకుండా భోగాపురం క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకుంటున్నారని మండిపడ్డారు. క్రెడిట్ చోరీకి పాల్పడడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ధ్వజమెత్తారు. కేవలం ఉత్తరాంధ్ర ప్రజలను మభ్యపెట్టడానికే 2019 ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు అప్పటి సీఎం చంద్రబాబు హడావుడిగా ఎయిర్‌పోర్టు పనులకు శంకుస్థాపన చేశారన్నారు. భూసేకరణ, అనుమతులు, ఆర్థిక వనరులు లేకుండా ఏ రకంగా నిర్మాణం చేద్దామని అప్పట్లో బాబు శంకుస్థాపన చేశారో తెలీదని విమర్శించారు. 2019లో వైఎస్ జగన్ హయాంలోనే ఎయిర్‌పోర్టు కోసం భూసేకరణతోపాటు అన్ని అనుమతులు సాధించిన తర్వాతే 2023 మే 3న నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారని స్పష్టం చేశారు. అదేరోజు జూన్ 2026 నాటికి ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారని చెప్పారు. అందులో భాగమే ఆదివారం జరిగిన విమాన ల్యాండింగ్ ట్రయల్ రన్ అని అమర్‌నాథ్ స్పష్టం చేశారు. ఇదే జగన్ విజన్‌కి తార్కాణమన్నారు. నిర్వాసితులకూ వైఎస్సార్‌సీపీ హయాంలో న్యాయం చేస్తూ.. నాలుగు గ్రామాల ప్రజలకు పరిహారం, మౌలిక సదుపాయల కల్పన కోసం సుమారు రూ.500 కోట్లు ఖర్చు పెట్టి రెండుచోట్ల కాలనీలు నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. అయినా టీడీపీ నేతలు నిస్సిగ్గుగా ఆ విజయాన్ని తమ ఖాతాలో వేసుకోవడంతోపాటు ఎయిర్‌పోర్టు విషయంలో కట్ పేస్ట్ వీడియోలతో జగన్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. రీల్స్ రామ్మోహన్‌ను పంపిస్తే ఆయనేమో తన ఘనతగా తాను సాధించినట్లుగా ఫీలవుతున్నారని విమర్శించారు. విజయవాడ విమానాశ్రయాన్ని ఏళ్ల తరబడి కడుతున్నారని, మరి దానిని రామ్మోహన్‌నాయుడు ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. ఎవరికో పుట్టిన బిడ్డకు తమ పేరు పెట్టుకోవడం వారికి అలవాటు అని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు.

కుప్పంలో ఎయిర్ పోర్టు మాటేమిటి?

‘అమరావతిలో కొత్తగా ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్ నిర్మిస్తామని బాబు అంటున్నారు. ఇంకా వింటే పోర్టు కూడా కడతామని చెబుతారు. మీ సొంత నియోజకవర్గం కుప్పంలో ఎయిర్ స్ట్రిప్‌కి సంబంధించి 2019 జనవరిలో శంకుస్థాపన చేశారు. అది ప్రారంభమైందా? భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మంచి రోడ్ కనెక్టివిటీ ఉండాలని వైజాగ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కి హాజరైన కేంద్రమంత్రి గడ్కరీని ఒప్పించి ప్రకటన చేయించాం. ఈ ఘనత జగన్‌కే దక్కుతుంది. భోగాపురం విమానాశ్రయానికి ఆరులేన్ల జాతీయ రహదారి ఏమైపోయింది. బాబు అధికారంలోకి రాగానే మెట్రో, పోర్టు, ఎయిర్‌పోర్టు అని చెప్పడం పరిపాటిగా మారింది. విశాఖ మెట్రో గురించి తాజాగా కేంద్ర ప్రభుత్వం ఫీజబులిటీ రిపోర్ట్ లేదు, మరోసారి పంపించాలని కేంద్రం చెప్పింది. దీన్నే చంద్రబాబు 2029 ఎన్నికల వరకు తిప్పి.. ఎన్నికల ముందు టెంకాయ కొడతారు. అమరావతిలో మాత్రం ఆవకాయ్ అంటారు. ఏ ప్రాజెక్టుకైనా ముందు టెంకాయ్ నాదే అనడం బాబు అలవాటు. మంగళగిరిలో పప్పు, అమరావతిలో ఆవకాయ్.. ఆంధ్రాకు అప్పులు, చంద్రబాబు గొప్పలు తప్ప ఇంతకుమించి ఈ రెండేళ్లలో సాధించిందేమీ లేదు’ అని అమర్‌నాథ్ ధ్వజమెత్తారు.

విజన్ అంటే జగన్.. భజన అంటే బాబు

‘విజన్ అంటే జగన్, భజన అంటే చంద్రబాబు అన్న విషయం ఈ రెండేళ్లలో రాష్ట్ర ప్రజలు తెలుసుకున్నారు. పబ్లిసిటీ తప్ప మరొకటి లేదు. ఏ చానెల్ పెట్టినా బాబుకు జాకీర్ హుస్సేన్‌ని మించి తబలా కొట్టేవాళ్లు తయారు అయ్యారు. ఇంత డప్పు కొట్టినా.. రాష్ట్రం మాత్రం అప్పులపాలైంది. రెండేళ్లలో రూ.3 లక్షల కోట్లు అప్పు చేశారు. ఆ రోజు జగన్‌కి ఇచ్చిన మాట ప్రకారం జీఎమ్మార్ సంస్థ ఈ ప్రాంత ప్రజల ఆశలను నిజం చేసింది. ఆ సంస్థకు ధన్యవాదాలు’ అని అమర్‌నాథ్ పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట రామయ్య పాల్గొన్నారు.

సీమకు ద్రోహం చేసిన బాబు అపర భగీరథుడా?

మాజీ మంత్రి శైలజానాథ్

అనంతపురం: రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపేసి ద్రోహం చేసిన చంద్రబాబును అపర భగీరథుడని మంత్రులు కీర్తించడం సిగ్గుచేటని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. అనంతపురంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రెండుదఫాలు హంద్రీ–నీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 40 టీఎంసీల నుంచి 5 టీఎంసీలకు తగ్గించిన చంద్రబాబును అపర భగీరథుడు అని కీర్తించాలా? అని ఎద్దేవా చేశారు. సీఎం అయిన ప్రతిసారి చంద్రబాబు రాయలసీమకు తీరని నష్టం చేస్తున్నారని పేర్కొన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే వైఎస్ జగన్‌కు కీర్తి దక్కుతుందనే భయంతో ఈ ప్రాజెక్ట్‌ను నిలుపుదల చేయించారన్నారు. తెలంగాణలోని అస్మదీయులతో కేసులు వేయించి ప్రాజెక్టును ముందుకు సాగనివ్వడం లేదన్నారు. ప్రాజెక్ట్ పురోగతి ఉండకూడదనే కుట్రతోనే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ముందు పేలవంగా వాదనలు వినిపించారని విమర్శించారు.

రూ.920 కోట్ల జరిమానా విధించినా..

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుతో రాష్ట్రానికి నీటి సమస్య తలెత్తుతుందని భావించి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారని శైలజానాథ్ గుర్తు చేశారు. ఫలితంగా ఆ ప్రాజెక్టు ఆపేయాలని గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు వెలువరించిందన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణాలు చేస్తుండడంతో తెలంగాణ ప్రభుత్వానికి ట్రిబ్యునల్ ఏకంగా రూ.920 కోట్ల జరిమానా విధించిందన్నారు. అయినా ప్రాజెక్ట్ పనులు నిరాటంకంగా కొనసాగిస్తున్నారని, ఇంతజరుగుతున్నా చంద్రబాబు అభ్యంతరం చెప్పడం లేదని విమర్శించారు.

సీమలో ఎకరాకు కూడా నీరివ్వలేదు

చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాయలసీమలో ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని శైలజానాథ్ విమర్శించారు. కాంట్రాక్టర్లకు డబ్బులు ధారపోయడం తప్ప ఇక్కడ ఏమీ లేదన్నారు. తాను కోరడం వల్లే రాయలసీమ ఎత్తిపోతల పనులు ఆపేశారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సాక్షాత్తూ అసెంబ్లీలో పేర్కొన్నప్పటికీ.. ఇక్కడ ఏపీ మంత్రులు చంద్రబాబును కీర్తిస్తున్నారంటే ఇంతకన్నా ద్రోహం ఇంకోటి ఉండదన్నారు.

విదేశీ విద్యాదీవెన బకాయిలు చెల్లించండి బాబూ

కాపు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ధర్నా

కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సాక్షి, అమరావతి: విదేశీ విద్యాదీవెన బకాయిలు రూ.90 కోట్లను తక్షణం చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని కాపు విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ప్లకార్డులు చేతబూని సోమవారం ధర్నా చేశారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడిని కలిసి సమస్య చెప్పేందుకు వెళ్లగా.. ఆయన లేకపోవడంతో కార్పొరేషన్ ఎండీ కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని నమ్ముకుని తమ బిడ్డలను అప్పులు చేసి మరీ విదేశాలకు పంపించామని, వారి చదువులకు చేసిన అప్పులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన బకాయిల్లో రూ.20 కోట్లకుపైగా గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారని తెలిపారు. 1,200 మందికి మరో రూ.90 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా చంద్రబాబు ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఏడాదికి రూ.3 వేల కోట్లు కాపు కార్పొరేషన్‌కు కేటాయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండవ ఏడాది అవుతున్న తరుణంలో మొత్తం రూ.6 వేల కోట్లు కేటాయించాల్సి ఉందన్నారు. కనీసం రూ.వెయ్యి కోట్లు కేటాయించినా విదేశీ విద్యాదీవెన బకాయిలు రూ.90 కోట్లు చెల్లించి.. మరో రూ.910 కోట్లతో కాపు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో ముత్యాల వెంకటేశ్వరరావు, పసుపులేటి పుల్లారావు, కోట నటరాజు, కాపు నేతలు ముళ్లపూడి నాగేశ్వరరావు, పోరుమామిళ్ల ఈశ్వర్, అడపా ప్రతాప్, ఆకుల తిరుపతిరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు సమర్థంగా నిర్వహించాలి

ఇంటర్ కార్యదర్శి రంజిత్‌బాషా

సాక్షి, అమరావతి: ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు, అంతకుముందు జరిగే ప్రీ ఫైనల్ పరీక్షలు సమర్థంగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం బోర్డు కార్యాలయంలో పబ్లిక్ పరీక్షలు, మధ్యాహ్నం భోజనం, సంకల్ప్ 2026, పదోన్నతులు, కొత్తగా ప్రైవేట్ జూనియర్ కాలేజీల ఏర్పాటు తదితర అంశాలపై జిల్లా, ప్రాంతీయ అధికారులతో సమీక్షించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షలు జరిగే ప్రక్రియ ఇంటర్ బోర్డు నుంచి లైవ్ ప్రసారం ఉంటుందని, పరీక్షలను స్క్వాడ్ సహాయంతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రధాన రాత పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు జరుగుతాయని, విధుల్లో పాల్గొనే సిబ్బంది జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఎక్స్-రే అంటే ఏమిటో, దాని వివరాలూ, తీయాల్సింది ఎందుకు, ఎప్పుడెప్పుడు, దాని తాలూకు దుష్ప్రభావాలేమిటి... అవే ఎక్స్-రేలను మరింత తక్కువ మోతాదులో ఉపయోగించి తీసే సీటీ-స్కాన్ ఏమిటి? అదెప్పుడు తీస్తారు వంటి వివరాలతో...

ప్రత్యేక కథనం నేడు 'సాక్షి' హెల్త్ ప్లస్ ఈపేపర్‌లో....

న్యూస్ మేకర్

● వెనెజువెలా నూతన సారథి

.. పులిబిడ్డ

'ముళ్ల కిరీటం' అనే మాట వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ విషయంలో అక్షరాలా సరిపోతుంది. ఒకవైపు అగ్రరాజ్యం అమెరికా కన్నెర్ర చేస్తోంది. 'ఇలా చేయాలి...ఇలా మాత్రమే చేయాలి' అంటూ శాసనాలు చేసే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు తన దేశ సార్వభౌమాధికారాన్ని, తమ జాతి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి ఏటికి ఎదురీదే ప్రయత్నం చేస్తున్నారు డెల్సీ రోడ్రిగ్స్...

నార్కో-టెర్రరిజం కుట్ర, కొకైన్ దిగుమతి... మొదలైన ఆరోపణలతో వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన భార్య సిలియాను అమెరికన్ సైన్యం నిర్బంధించింది. ఈ నేపథ్యంలో ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలిగా, ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్‌ను నియమిస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించడంతో 'ఎవరీ డెల్సీ రోడ్రిగ్స్?' అనే ఆసక్తి మొదలైంది.

■ **బాల్యం నుంచే పోరాట పాఠాలు**

తండ్రి ఒడిలో చిన్నప్పటి నుంచి పోరాట పాఠాలు వింటూనే పెరిగిన డెల్సీ రోడ్రిగ్స్ వెనెజువెలా సుప్రసిద్ధ జన నాయకురాలిగా ఎదిగారు. తండ్రి జార్జ్ ఆంటోనియో వెనెజువెలాలోని ప్రసిద్ధ లెఫ్ట్-వింగ్ గెరిల్లా ఫైటర్. 1976లో ఆయన హత్యకు గురయ్యాడు.

■ **చరిత్ర సృష్టించి...**

సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ వెనెజువెలా(యుసీవి) నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందిన డెల్సీ స్టూడెంట్ లీడర్‌గా చురుగ్గా ఉండేవారు. ఆ తరువాత కాలంలో 'సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ వెనెజువెలా'లో ప్రొఫెసర్‌గా, 'వెనెజువెలా అసోసియేషన్ ఆఫ్ లేబర్ లాయర్స్ ప్రెసిడెంట్'గా పనిచేశారు. 2002లో జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఒక్కోమెట్టు ఎక్కుతూ మంత్రి స్థాయికి ఎదిగారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో డెల్సీని 2014లో 'పాపులర్ పవర్ ఫర్ ఫారిన్ రిలేషన్స్' మంత్రిగా నియమించారు. వెనెజువెలా చరిత్రలో ఆ పదవి చేపట్టిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు డెల్సీ.

■ **ఉపాధ్యక్షురాలిగా...**

వెనెజువెలా ఉపాధ్యక్షురాలిగా 2018లో నియామకం అయ్యారు డెల్సీ. వెనెజువెలా నిఘా సంస్థ బొలివేరియన్ ఇంటెలిజెన్స్ సర్వీస్‌కి హెడ్ అఫీషియల్‌గా కూడా కీలక బాధ్యతలు నిర్వహించారు. 2020లో 'పాపులర్ పవర్ ఫర్ ఎకనామిక్ అండ్ ఫైనాన్స్ ఆఫ్ వెనెజువెలా' మంత్రిగా పనిచేశారు.

చమురు, ఆర్థిక శాఖల మంత్రిగా దేశాన్ని ద్రవ్యోల్బణం బారిన పడకుండా చూశారు.

దేశాన్ని రక్షించుకుందాం...

వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా నియామకం అయిన డెల్సీ రోడ్రిగ్స్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన హెచ్చరికలతో, తమ చెప్పుచేతల్లో ఉండాలని చెప్పకనే చెప్పాడు. అయితే ట్రంప్ హెచ్చరికలను 56 ఏళ్ల డెల్సీ ఆట్టే ఖాతరు చేయలేదు. నికొలస్ మదురో, అతడి భార్యను నిర్బంధించడాన్ని ఆమె ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'మదురోను కిడ్నాప్ చేశారు' అని ఆరోపిస్తున్న డెల్సీ రోడ్రిగ్స్ 'వెనెజువెలాని రక్షించుకోవడానికి, దేశంలో శాంతిభద్రతలు కాపాడుకోవడానికి ఐక్యంగా ఉండాలి' అని పిలుపునిచ్చారు. దేశ వనరులను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

ఏక్ లవ్‌స్టోరీ!

గతంలో డెల్సీ రోడ్రిగ్స్, నటుడు ఫెర్నాండో కారిల్లో ప్రేమికులు. ఈ జంట 2007 వరకు కలిసే ఉంది. టీవీ సోప్ ఒపేర స్టార్‌గా ఫెర్నాండో సుపరిచితుడు. 'నేను ఆమెను ఏదో ఒకరోజు వివాహం చేసుకోవాలనుకుంటున్నాను. అత్యంత తెలివైన మహిళలలో ఆమె ఒకరు' అని డెల్సీ గురించి చెబుతుండేవాడు ఫెర్నాండో కారిల్లో. వినోదం, రాజకీయం అనే భిన్న ప్రపంచాలు ఒకే ప్రపంచం కావడానికి ఏర్పడిన వైరుధ్యాలో? ఇతరత్రా కారణాలో... తెలియదుగానీ వారు ఎక్కువ కాలం కలిసి ఉండలేకపోయారు. తాజా విషయానికి వస్తే... డెల్సీ రోడ్రిగ్స్ వెనెజువెలా అధ్యక్షురాలిగా నియామకం అయిన నేపథ్యంలో, ఆ రోజుల్లో డెల్సీపై ఫెర్నాండో కారిల్లో తన ప్రేమను ప్రకటించిన రోజును గుర్తు చేసుకుంటున్నారు నెటిజనులు.

గ్రేట్ ఫైటర్

నికోలస్ మదురోకు డెల్సీ రోడ్రిగ్స్ ప్రతిభాపాటవాలన్నా, నాయకత్వ సామర్థ్యమన్నా ఇష్టం. ఒకానొక సందర్భంలో ఆమెను 'టైగర్' అని అభివర్ణించారు. డెల్సీ ఉపాధ్యక్షురాలిగా నియమితురాలైన సందర్భంలో నికోలస్ మదురో ఆమెను...'ధైర్యం మూర్తీభవించిన మహిళ. రాజకీయాల్లో తలపండిన అనుభవజ్ఞురాలు. అమరవీరుడి కుమార్తె. వెయ్యి యుద్ధాలతో పరీక్షించబడిన విప్లవకారిణి' అని ఆకాశానికి కెత్తారు. డెల్సీని 'టైగర్' విత్ డిజైనర్ ఫ్యాషన్ టేస్ట్ అంటుంటారు. కమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్‌మేషన్ మినిస్టర్‌గా పనిచేసిన డెల్సీకి ఫ్యాషన్ డిజైనింగ్‌పై మంచి అవగాహన ఉంది.

బ్యూటిప్స్ హెయిర్ కేర్

తెల్లజుట్టుకు సహజమైన డై

తెల్ల జుట్టు రాకుండా ఉండాలంటే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్లు, కాపర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఒకవేళ ఇప్పటికే మీ జుట్టు తెల్లరంగులోకి మారినట్లయితే.. ఇంట్లో దొరికే పదార్థాలతోనే జుట్టుకు సహజ రంగును తయారు చేసుకోవచ్చు. అదెలాగంటే...

ఒకటిన్నర టేబుల్ స్పూన్ల నల్ల నువ్వులు, ఒకటిన్నర టేబుల్ స్పూన్ల టీ పొడి, మూడు టేబుల్ స్పూన్ల ఉసిరి పొడి, రెండు టేబుల్ స్పూన్లు ఆవనూనె తీసుకోవాలి.

తయారీ విధానం: ముందుగా ఒక ఇనుప కడాయిలో నల్ల నువ్వులు వేసి వేయించుకోవాలి. ఆ తర్వాత టీ పొడి, ఉసిరి పొడి కూడా వేసి బాగా కలపాలి. ఇప్పుడు మూడింటిని మీడియం మంట మీద వేయించాలి. మిశ్రమం పూర్తిగా నల్లగా మారినప్పుడు గ్యాస్ ఆఫ్ చేయాలి. చల్లబడిన తర్వాత మిక్సర్‌లో వేసుకుని బాగా గ్రైండ్ చేసి, జల్లించుకుని గాలి చొరబడని సీసాలో నిల్వ చేసుకోవాలి.

రెండు చెంచాల పొడిని తీసుకుని.. ఆవాల నూనెలో కలిపి పేస్టులా తయారు చేసి, జుట్టుకంతటికీ బాగా పట్టించి రాత్రంతా అలాగే ఉంచాలి. ఉదయం ఎప్పటిలాగే షాంపూతో తలస్నానం చేస్తే సరిపోతుంది. నువ్వులు, టీ పొడి, ఉసిరి పొడిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు తెల్ల జుట్టును నల్లగా మార్చడంలో సాయపడతాయి. దీనితో ఎటువంటి దుష్ఫలితాలూ ఉండవు

నునుపైన మెడకోసం...

ఒక బంగాళదుంపని పొట్టు తీయకుండా ఉడకబెట్టి,మెత్తగా మెదుపుకోవాలి. దీనికి కాసిని పాలు, కొద్దిగాకొబ్బరినూనె జతచేసి పేస్ట్‌లా కలపాలి. మెడపై ఈమిశ్రమాన్ని అప్లై చేసి, 20 నిమిషాల తరువాతకడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తుంటే మెడనలుపు తగ్గి చర్మం కాంతివంతం అవుతుంది.

● ముగ్గు ముచ్చట

19 చుక్కలు, 10 వచ్చేవరకు మధ్య చుక్క

బొడ్డు ఝాన్సీ
చౌటుప్పల్,
యాదాద్రి భువనగిరి జిల్లా



15 చుక్కలు, మధ్య చుక్క 7 వచ్చేవరకు

కూరపాటి సింధు
తాడేపల్లి

సినిమా

కాంబినేషన్ ఫిక్స్?

హీరో అల్లు అర్జున్, తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రానుందనే టాక్ ఎప్పట్నుంచో వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల లోకేశ్ కనగరాజ్ హైదరాబాద్‌కు రావడం, అల్లు అర్జున్‌ను కలవడం వంటి పరిణామాల నేపథ్యంలో వీరి కాంబోలో సినిమా దాదాపు ఖరారు అయిందని ఫిల్మ్‌నగర్ సమాచారం. మైత్రీ మూవీమేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారని టాక్. తమిళ దర్శకుడు అట్లీతో సినిమా చేస్తున్నారు అల్లు అర్జున్. ఈ సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాత లోకేశ్‌తో చేయనున్న సినిమా షూట్‌లో అల్లు అర్జున్ పాల్గొంటారని ఊహించవచ్చు. అలాగే 'జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల..వైకుంఠపురములో..' చిత్రాల తర్వాత హీరో అల్లు అర్జున్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మరో సినిమా రానుందని, సుబ్రహ్మణ్యస్వామి నేపథ్యంలో ఆధ్యాత్మిక టచ్‌తో ఈ సినిమా కథ సాగుతుందనే టాక్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ వార్తలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

● అల్లు అర్జున్

ముగ్గురు భామలతో నాచే.. నాచే...

● ప్రభాస్

'నాచే నాచే...' అంటూ ముగ్గురు భామలతో ఆడి పాడుతున్నారు ప్రభాస్. ఆయన హీరోగా రూపొందిన తాజా పాన్ ఇండియన్ ఫిల్మ్ 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'నాచే నాచే...' అంటూ సాగే సాంగ్ లాంచ్ ఈవెంట్‌ని ముంబైలో నిర్వహించారు. ఈ పాటలో నిధి, మాళవిక, రిద్ధిలతో కలిసి స్టెప్పులేశారు ప్రభాస్. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– ''మా సంస్థ నుంచి ఇప్పటివరకు 'కార్తికేయ, జాట్, మిరాయ్' వంటి సినిమాలను బాలీవుడ్‌లో రిలీజ్ చేశాం. ఇప్పుడు మా సంస్థలో బిగ్గెస్ట్ స్టార్ హీరో ప్రభాస్‌గారితో 'ది రాజా సాబ్' వంటి పెద్ద సినిమా నిర్మించాం'' అని తెలిపారు. ''ఈ సినిమా కోసం తెలుగు నేర్చుకుని డబ్బింగ్ చెప్పాను'' అన్నారు రిద్ధీ కుమార్. ''పెద్దలతో పాటు పిల్లలకు కూడా మా సినిమా బాగా నచ్చుతుంది'' అన్నారు మాళవికా మోహనన్. ''రాజా సాబ్'లో వీఎఫ్ఎక్స్ సహజంగా ఉంటాయి. స్క్రీన్ మీద సన్నివేశాలు చూస్తుంటే నిజమైన అనుభూతి కలుగుతుంది'' అని నిధీ అగర్వాల్ పేర్కొన్నారు. నటీనటులు జరీనా వాహబ్, బొమన్ ఇరానీ మాట్లాడారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

● రవితేజ, డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్

రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ మూవీలో ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్లు. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న రిలీజ్ కానుంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను రేపు(బుధవారం) గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''రవితేజ నుంచి వస్తోన్న మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిశోర్ తిరుమల తెరకెక్కించిన ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సుధాకర్ చెరుకూరి ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో విపరీతమైన క్యూరియాసిటీని పెంచింది. ముఖ్యంగా రవితేజ ఇద్దరు భామల (ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి) మధ్య నలిగిపోయే లవ్ ట్రయాంగిల్ సన్నివేశాలు నవ్వులు పూయిస్తాయి. భీమ్స్ సంగీతం మా సినిమాకు ప్లస్ పాయింట్. ముఖ్యంగా 'వామ్మో వాయ్యో...' సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. రవితేజ మేనరిజమ్స్, స్టెప్పులు ఈ పాటను హిట్‌గా మార్చేశాయి'' అని చిత్రయూనిట్ తెలిపింది.

హైదరాబాద్‌లో భోగి

● శర్వానంద్

హైదరాబాద్‌లో భోగి ఆరంభమైంది. అదేంటీ... భోగి పండగ ఈ నెల 14న కదా.. అప్పుడే ఆరంభం కావడం ఏంటి? అని ఆశ్చర్యం కలగడం సహజం. అయితే హైదరాబాద్‌లో ఆరంభమైనది భోగి పండగ కాదు... 'భోగి' సినిమా. శర్వానంద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భోగి'. సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లు. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ''1960లో ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర ప్రాంతం నేపథ్యంలో రూపొందిస్తున్న సినిమా 'భోగి'. హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో ఈ సినిమా కొత్త షెడ్యూల్‌ను సోమవారం ప్రారంభించాం. ఈ కీలక షెడ్యూల్‌లో టాకీ పార్ట్‌ని చిత్రీకరించనున్నాం. ఈ మూవీలో శర్వా సరికొత్తగా కనిపించనున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ మూవీని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: కిశోర్ కుమార్.

● అనుపమ

కన్నెపిల్ల ఏమందో ఇన్నావా...

● అఖిల్, భాగ్యశ్రీ బోర్సే

అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పీ, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నాగార్జున, నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఎస్ఎస్ తమన్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'వారెవా వారెవా...' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటను అనంత శ్రీరామ్ రాయగా, శ్వేతా మోహన్, జుబిన్ నౌటియాల్ పాడారు. 'హే... ఇన్నావా ఇన్నావా కన్నెపిల్ల ఏమందో ఇన్నావా... వ వారెవా వ వారెవా వా...', 'హే ఉన్నావా ఉన్నావా భద్రంగా భూమ్మీదే ఉన్నావా... వ వారెవా వ వారెవా వా...' అంటూ ఈ పాట సాగుతుంది. ''సినిమాలోని భావోద్వేగాలను చక్కగా ప్రతిబింబిస్తూ, హీరో-హీరోయిన్ మధ్య కెమిస్ట్రీని హైలైట్ చేసేలా ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటి వరకు 70 శాతం పూర్తయింది. మే 1న 'లెనిన్'ని విడుదల చేయనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది.

తెలంగాణలో క్రేజీ కల్యాణం

● తరుణ్ భాస్కర్

అనుపమా పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, నరేశ్ వీకే, అఖిల్ ఉడ్డెమారి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రానికి 'క్రేజీ కల్యాణం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. భద్రప్ప గాజుల దర్శకత్వంలో బూసం జగన్‌మోహన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''పెళ్లి నేపథ్యంలో ఆసక్తికరమైన కథతో సాగే పూర్తి స్థాయి వినోదాత్మక సినిమా ఇది. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో 'క్రేజీ కల్యాణం' చిత్రీకరణ జరిగింది. త్వరలోనే ఇతర వివరాలను వెల్లడిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: సురేష్ బొబ్బిలి.

ముందు చెప్పినట్లే సంక్రాంతికి వస్తున్నాం

- నిర్మాత అనిల్ సుంకర

''స్క్రిప్ట్ విని, ఈ కథతో సినిమా చేయగలమా? లేదా అనే ఓ జడ్జిమెంట్‌కు రాగలగాలి. సినిమా రిజల్ట్ ఎలాగూ మన చేతిలో ఉండదు. అందుకే సినిమా స్క్రిప్ట్ లెవల్లోనే అన్నీ జాగ్రత్తగా చూసుకోగలగాలి. అఖిల్‌తో మేం చేసిన 'ఏజెంట్' సినిమాకు బౌండ్ స్క్రిప్ట్ లేదు. దాంతో ఆ సినిమాకు సరైన ఫలితం రాలేదు. అందుకే మంచి స్క్రిప్ట్‌తో వస్తేనే సినిమా చేయాలని నిర్ణయించుకున్నాను. స్క్రిప్ట్ ప్రకారం సినిమా వచ్చిందంటే ఆ సినిమా బాగున్నట్లే'' అని చెప్పారు నిర్మాత అనిల్ సుంకర. శర్వానంద్ హీరోగా నటించిన తాజా చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. ఈ చిత్రంలో సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటించారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న సాయంత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో అనిల్ సుంకర మాట్లాడుతూ–''నారీ నారీ నడుమ మురారి' పండగ మూవీ. ఆద్యంతం వినోదభరితంగా సాగే చిత్రం ఇది. ఈ చిత్రంలో శర్వానంద్ మంచి క్యారెక్టర్ చేశారు. శ్రీవిష్ణు గెస్ట్ రోల్ చేశారు. ఒకే ఆఫీసులో ఓ అబ్బాయి మాజీ ప్రేమికురాలు, ఆ అబ్బాయి ప్రస్తుత లవర్ ఉంటే... ఆ అబ్బాయి పరిస్థితి ఏమిటి? అన్నదే ఈ సినిమా కథ. పెళ్లి నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ఆడియన్స్‌ను ఆకట్టుకుంటాయి. మా సినిమాను మేం సంక్రాంతికి రిలీజ్ చేస్తాం అంటే చాలా మంది నమ్మలేదు. కొంతమంది నాకు ఫోన్ చేసి అడిగారు. కానీ మేం ముందుగా చెప్పినట్లే సంక్రాంతికి వస్తున్నాం. ఈ చిత్రాన్ని నైజాం, వైజాగ్ ఏరియాల్లో 'దిల్' రాజుగారు, వెస్ట్, కృష్ణా, గుంటూరులో రాజా, సీడెడ్‌లో శోభన్ రిలీజ్ చేస్తున్నారు. ఈస్ట్‌లో మేమే సొంతంగా రిలీజ్ చేస్తున్నాం. ఇక సంక్రాంతి సీజన్‌లో నాలుగైదు సినిమాలు రావడం అనేది కామన్. ఈ సీజన్‌లో విడుదలైన సినిమాలన్నీ హిట్ అయిన సందర్భాలూ ఉన్నాయి. మన తెలుగు చిత్రాలతో పాటు అనువాద చిత్రాలూ విడుదలవుతున్నాయి. అయితే కంటెంట్ బాగున్న సినిమాలకే ప్రేక్షకాదరణ లభిస్తుంది. 'నారీ నారీ నడుమ మురారి'కి ఓటీటీ డీల్ పూర్తయింది. నూతన నటీనటులతో 'ఎయిర్ ఫోర్స్ బెజవాడ బ్యాచ్' అనే మూవీ చేయబోతున్నాం. అడివి శేష్‌తో 'గూఢచారి 2' రాబోతోంది. సాయిదుర్గాతేజ్, తేజ సజ్జాలతో సినిమాలున్నాయి'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ–''ఏజెంట్' సినిమా విఫలమైంది. అఖిల్‌కు ఓ హిట్ ఇస్తే ఆ బాధ పోతుంది. 'భోళా శంకర్' సినిమాకూ సరైన ఫలితం రాలేదు. ఇదే సినిమా నాలుగేళ్ల క్రితం విడులై ఉంటే, బాక్సాఫీస్ ఫలితం మరోలా ఉండేది'' అని పేర్కొన్నారు.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
జనవరి 5న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,40,410	1,26,450	2,45,000
విజయవాడ	1,39,600	1,25,950	2,44,700
విశాఖపట్నం	1,37,400	1,25,950	2,65,000
రాజమండ్రి	1,39,600	1,29,200	2,44,700
ప్రొద్దుటూరు	1,40,500	1,29,260	2,45,000
చెన్నై	1,38,330	1,26,800	2,65,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	322	85,440
నిఫ్టీ ▽	78	26,250

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	23,418	△	183
డోజోన్స్	49,161	△	779
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,008	△	57
డాక్స్	24,933	△	394
హాంగ్‌సెంగ్	4,023	△	55
నికాయ్	51,833	△	1,493

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.80	90.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	119.70	122.65
€	యూరో	ఎస్‌బీఐ	104.00	106.83
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.69	58.07
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	58.89	61.20
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.62	71.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.09	24.60
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.60	24.86
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.99	13.81

లోకల్ కంపెనీల గ్లోబల్ జంప్

దుబాయ్‌కి దూసుకుపోతున్న దేశీ పెట్టుబడులు

- ఫ్లెక్స్ ఆఫీసుల నుంచి ఫండ్ హౌస్‌ల వరకు
- ఇప్పటికే రియల్ ఎస్టేట్ సంస్థల ఎంట్రీ

సాక్షి, బిజినెస్ డెస్క్

అంతర్జాతీయంగా కార్యకలాపాలు విస్తరించే ప్రణాళికల్లో ఉన్న దేశీ సంస్థలకు దుబాయ్ ఇప్పుడు ఆకర్షణీయ కేంద్రంగా మారుతోంది. ఇన్వెస్టర్లకు అనుకూల విధానాలు, పటిష్టమైన మౌలిక సదుపాయాలు ఇందుకు దోహదపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్లెక్స్ ఆఫీస్ సర్వీసులందించే సంస్థలు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ఫండ్‌హౌస్‌లు, ఫ్యామిలీ ఆఫీసులు మొదలైనవి దుబాయ్ బాట పడుతున్నాయి. ఇటీవలే ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ సంస్థ కార్పొరేట్ఎడ్జ్ 31,000 చ.అ. ఆఫీస్ స్పేస్‌ని లీజుకి తీసుకుంది. అటు నిసస్ ఫైనాన్స్ సర్వీసెస్ కంపెనీ (నిఫ్కో) అనే లిస్టెడ్ ఆల్టర్నేటివ్ ఫండ్ మేనేజ్‌మెంట్ సంస్థ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అత్యధికంగా రూ. 536 కోట్ల పెట్టుబడులు పెట్టింది. దుబాయ్ మోటర్ సిటీలోని లుటా ఎవెన్యూ అనే రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో ఇన్వెస్ట్ చేసింది. ఇప్పటికే శోభా, సన్‌టెక్ లాంటి దిగ్గజ రియల్టర్లు అక్కడ చేపట్టిన ప్రాజెక్టులకు ఇవి అదనం. 2024లో దుబాయ్ రియల్ ఎస్టేట్ మార్కెట్లో అత్యధికంగా ఇన్వెస్ట్ చేసిన కంపెనీల్లో భారతీయ సంస్థలు కూడా ఉన్నాయి. ఇవి సుమారు 35 బిలియన్ దిర్హామ్‌ల మేర పెట్టుబడులు పెట్టాయి. జెబెల్ అలీ ఫ్రీ జోన్‌లో సుమారు 2,300 భారతీయ కంపెనీలకు కార్యకలాపాలు ఉన్నాయి. 2024–25 లో ఇరు దేశాల మధ్య జరిగిన 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యంలో వీటి వాటా 6.9 బిలియన్ డాలర్లకు పైగా నమోదైంది.

గ్లోబల్ హబ్..

ప్రపంచం నలుమూలల్నించి కంపెనీలు తమ ప్రాంతీయ, అంతర్జాతీయ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు దుబాయ్‌ని ఎంచుకుంటున్నాయి. దీంతో అది అత్యంత వేగంగా గ్లోబల్ బిజినెస్ హబ్‌గా ఎదుగుతోంది. భారతీయ ఉద్యోగుల దన్నుతో అంతర్జాతీయంగా కార్యకలాపాలను విస్తరించాలనుకునే దేశీ సంస్థలకు దుబాయ్ ఆకర్షణీయంగా ఉంటోందని పరిశ్రమవర్గాలు వివరించాయి. ఇన్వెస్టర్లకు అనుకూలమైన విధానాలు, పన్నులపరంగా ప్రయోజనకరంగా ఉండే నిబంధనలు, పటిష్టమైన మౌలిక సదుపాయాలు తదితర అంశాలు దుబాయ్‌కి సానుకూలంగా ఉంటున్నాయి. భారత్‌లో ఖరీదైన మార్కెట్లకు దుబాయ్ ప్రత్యామ్నాయంగా ఎదుగుతోందని రియల్టీ రంగ నిపుణులు తెలిపారు. దేశీయంగా విలాసవంతమైన ప్రాపర్టీల విలువ గత అయిదేళ్లలో దాదాపు 60 శాతం పైగా పెరిగాయని, ముంబైలాంటి నగరాల్లో బ్రాండెడ్ డెవలపర్ల ప్రాజెక్టుల్లో ప్రాపర్టీల ప్రారంభ ధరే రూ. 5 కోట్లుగా ఉంటోందని వివరించారు. ఇక ప్రధాన ప్రాంతాల్లో చూస్తే రూ. 50 కోట్లు కూడా దాటేస్తోందని పేర్కొన్నారు. అదే దుబాయ్‌లో సగటు ప్రాపర్టీ లావాదేవీ విలువ రూ. 5 కోట్లుగా ఉంటోంది. అందుబాటు ధరలో లభించడంతో పాటు ఆదాయ పన్ను లేకపోవడం, 2 మిలియన్ దిర్హామ్‌ల పెట్టుబడులు పెడితే పదేళ్ల పాటు గోల్డెన్ వీసాలాంటి ప్రయోజనాలు దుబాయ్‌కి సానుకూలంగా ఉంటున్నాయి. లగ్జరీతో పాటు కమ్యూనిటీ లివింగ్‌ని కోరుకునే భారతీయ కొనుగోలుదారులు ప్రధానంగా దుబాయ్ మెరీనా, డౌన్‌టౌన్ దుబాయ్, ది పామ్ జుమేరాలాంటి ప్రాంతాలను ఎంచుకుంటున్నారు.

పదేళ్లలో పది కోట్ల ఉద్యోగాలు

కొలువుల కల్పనకు పరిశ్రమ దిగ్గజాల ప్రయత్నం

జాతీయ స్థాయిలో మిషన్ హండ్రెడ్ మిలియన్ జాబ్స్ ప్రారంభం

న్యూఢిల్లీ: దేశం వేగంగా వృద్ధి చెందుతున్నప్పటికీ ఉద్యోగాల కల్పనలో వెనుకబడుతున్న నేపథ్యంలో, దీన్ని పరిష్కరించేందుకు పరిశ్రమ దిగ్గజాలు నడుం కట్టారు. వచ్చే పదేళ్లలో పది కోట్ల ఉద్యోగాలను కల్పించే దిశగా మిషన్ హండ్రెడ్ మిలియన్ జాబ్స్‌ను ఆవిష్కరించారు. ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి, నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్, మెకిన్సే మాజీ సీనియర్ పార్ట్‌నర్ రజత్ గుప్తా, ఫ్రాక్టల్ సహ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ వెలమకన్ని తదితరులు ఇందులో పాలుపంచుకుంటున్నారు. ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించేందుకు, స్థానిక ఎకానమీలను పటిష్టం చేసేందుకు, భారీ స్థాయిలో కొత్త నైపుణ్యాల్లో శిక్షణ కల్పించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, పౌర సమాజంతో ఈ మిషన్ కలిసి పని చేస్తుంది. ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ సహ వ్యవస్థాపకుడు హరీష్ మెహతా, ది ఇండస్ ఎంట్రప్రెన్యూర్స్ (టై), సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ పాలసీ (సీఐపీపీ) వ్యవస్థాపకుడు కె. యతీష్ రజావత్ ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. దేశీయంగా ఉద్యోగం చేసే వయస్సు గల జనాభా సంఖ్య ఏటా 1.2 కోట్ల మేర పెరుగుతుండగా, భారీ స్థాయిలో ఉద్యోగాలు కల్పించడంలో ముందుండే తయారీ తదితర రంగాలు ఉపాధి కల్పనలో వెనుకబడుతున్నాయని పేర్కొన్నారు. కొత్తగా మార్కెట్లోకి వచ్చే వారికి ఉపాధి కల్పించేందుకు ఏటా 80–90 లక్షల ఉద్యోగాలను కల్పించాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. ఈ నేపథ్యంలోనే ఉద్యోగాల కల్పనను ఆర్థికాభివృద్ధికి కీలక కొలమానంగా మార్చడంపై ఈ మిషన్ దృష్టి పెడుతుందని తెలిపారు. స్థూల దేశీయోత్పత్తిలో 30 శాతం వాటా ఉండే స్టార్టప్‌లు, చిన్న సంస్థలు అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తాయని, ఇవి పెద్ద నగరాలకే పరిమితం కాకుండా, చిన్న ప్రాంతాలకు కూడా విస్తరించేలా ప్రోత్సాహం కల్పించాల్సిన అవసరం ఉందని మెహతా వివరించారు. ఏటా 80–90 లక్షల ఉద్యోగాలు కల్పించే క్రమంలో అవరోధాలను తొలగిస్తే ఎంట్రప్రెన్యూర్‌షిప్‌కి, పెద్ద ఎత్తున ఉద్యోగాలను కల్పించేందుకు ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.

బంగారం @ రూ.1,40,400

రూ.960 పెరుగుదల • రూ.2,600 ఎగసిన వెండి

న్యూఢిల్లీ: భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నడుమ బంగారం, వెండి ధరలు మరోసారి నూతన గరిష్ట స్థాయిలకు సమీపించాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.960 పెరిగి రూ.1,40,400కు చేరుకుంది. వెండి కిలోకి రూ.2,600 లాభపడి రూ.2,44,000 స్థాయిని అందుకుంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగిపోయిన తరుణంలో సురక్షిత పెట్టుబడి సాధనాలుగా బంగారం, వెండికి డిమాండ్ ఏర్పడినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ముఖ్యంగా వెనెజువెలాపై అమెరికా చర్యలు ధరల పెరుగుదలకు దారితీసినట్టు చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్‌కు 88 డాలర్లు పెరిగి 4,418 డాలర్లకు చేరుకుంది. వెండి స్పాట్ ధర 2.35 డాలర్లు పెరిగి 75 డాలర్ల స్థాయిని చేరింది. పారిశ్రామిక, పెట్టుబడుల పరంగా వెండికి బలమైన డిమాండ్ నెలకొనడంతో ధరలు అధిక స్థాయిలో ట్రేడ్ అవుతున్నట్టు.. సరఫరా సమస్యలు, భౌగోళిక ఉద్రిక్తతలు సైతం వీటికి తోడైనట్టు కోటక్ మ్యూచువల్ ఫండ్ వైస్ ప్రెసిడెంట్ సతీష్ దొండపాటి పేర్కొన్నారు.

ట్రంప్ టారిఫ్ హెచ్చరికలతో పతనం

- నిఫ్టీ రికార్డు గరిష్టం వద్ద లాభాల స్వీకరణ
- అధిక వెయిటేజీ, ఐటీ షేర్లలో అమ్మకాలు

ముంబై: నిఫ్టీ ఇండెక్స్ జీవితకాల గరిష్టం(26,373) నమోదు తర్వాత... లాభాల స్వీకరణతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్ నష్టాలతో ముగిసింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(–2.35%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (–1%)తో పాటు ఐటీ రంగ షేర్లలో అమ్మకాలు తలెత్తాయి. భారత్‌పై మరోసారి సుంకాలు విధిస్తానంటూ ట్రంప్ చేసిన హెచ్చరికలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మార్కెట్ ముగిసే సరికి సెన్సెక్స్ 322 పాయింట్లు పతనమై 85,440 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 78 పాయింట్లు కోల్పోయి 26,250 వద్ద నిలిచింది. వెనెజువెలాపై అమెరికా మెరుపు దాడి నేపథ్యంలో ఉదయం ట్రేడింగ్ బలహీనంగా మొదలైంది. వెంటనే పుంజుకోవడంతో నిఫ్టీ 45 పెరిగి 26,373 వద్ద సరికొత్త రికార్డు నమోదు చేసింది. గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణతో చోటు చేసుకుంది. ఒక దశలో సెన్సెక్స్ 447 పాయింట్లు కోల్పోయి 85,315 వద్ద, నిఫ్టీ 119 పాయింట్లు క్షీణించి 26,210 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని నమోదు చేశాయి. ఆసియాలో హాంగ్‌కాంగ్(–0.6%) మినహా అన్ని దేశాల మార్కెట్లు లాభపడ్డాయి. కొత్త సంవత్సర సెలవు తర్వాత పనిచేసిన జపాన్, చైనా మార్కెట్లు 3% నుంచి1.50% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 1% వరకూ పెరిగాయి. అమెరికా స్టాక్ సూచీలు అరశాతం లాభంతో ట్రేడవుతున్నాయి.

☛ బీఎస్ఈ రంగాల ఇండెక్సుల్లో ఐటీ 1.37%, చమురు, ఇంధన, టెలికమ్యూనికేషన్ 1%, వినిమయ 0.38%, ఫైనాన్సియల్ సర్వీసెస్ 0.25 శాతం నష్టపోయాయి. మిడ్, స్మాల్ సూచీలు వరుసగా స్వల్పంగా 0.07%, 0.05% పెరిగాయి. నష్టాల మార్కెట్లోనూ రియల్టీ, కన్జూమర్ డ్యూరబుల్స్, మెటల్, కమోడిటీ, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంకుల షేర్లకు డిమాండ్ లభించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఎగుమతుల వృద్ధిపై ఫార్మెక్సిల్ ఫోకస్
ఎయిరిండియా సీఈవో మార్పుపై కసరత్తు

ల్యాప్స్ అయిన పాలసీల పునరుద్ధరణ

కస్టమర్లకు ఎల్ఐసీ అవకాశం

న్యూఢిల్లీ: రద్దయిన జీవిత బీమా పాలసీలను (ల్యాప్స్‌డ్ పాలసీలు) పునరుద్ధరించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు ప్రభుత్వరంగ ఎల్ఐసీ ప్రకటించింది. మార్చి 2 వరకు రెండు నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపింది. అన్ని నాన్ లింక్డ్ పాలసీలకు, ఆలస్యపు రుసుము (నిలిచిపోయిన కాలానికి సంబంధించిన ప్రీమియంపై)లో ఆకర్షణీయమైన తగ్గింపును ఇస్తున్నట్టు పేర్కొంది. ఆలస్యపు రుసుములో 30 శాతం, గరిష్టంగా రూ.5,000 తగ్గింపు పొందొచ్చని వెల్లడించింది. సూక్ష్మ జీవిత బీమా పాలసీలపై ఆలస్యపు రుసుమును పూర్తిగా మాఫీ చేస్తున్నట్టు తెలిపింది. పాలసీ కాల వ్యవధి (టర్మ్) ముగిసిపోకుండా, కేవలం ప్రీమియం చెల్లింపులేక రద్దయిన పాలసీలకే పునరుద్ధరణ అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. వైద్య/ఆరోగ్య అవసరాల్లో ఎలాంటి రాయితీలు ఉండవని పేర్కొంది. సకాలంలో ప్రీమియంలు చెల్లించలేకపోయిన వారికి ఈ పునరుద్ధరణ కార్యక్రమం ప్రయోజనం కల్పిస్తుందని వివరించింది. పాలసీలను పునరుద్ధరించుకుని, బీమా కవరేజీని తిరిగి పొందాలంటూ పాలసీదారులకు సూచించింది.

సాక్షి స్పోర్ట్స్

'జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్'తో నీరజ్ చోప్రా కటీఫ్

భారత స్టార్ జావెలిన్ త్రోయర్, రెండు ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రా సుదీర్ఘ కాలంగా 'జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్'తో కొనసాగిన అనుబంధాన్ని ముగించాడు. 2016 నుంచి జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ కంపెనీ నీరజ్ చోప్రా మేనేజ్‌మెంట్ వ్యవహారాలు చూస్తూ వచ్చింది. జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ ప్రోగ్రాంలో భాగంగా ఆరంభంలో జత కట్టిన అథ్లెట్లలో నీరజ్ ఒకడు. ఈ సంస్థతో విడిపోతూ నీరజ్ తన సొంత అథ్లెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ 'వెల్ స్పోర్ట్స్'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాడు. అటు నీరజ్, ఇటు జేఎస్‌డబ్ల్యూ కూడా ఎలాంటి వివాదం లేకుండా పరస్పర ఒప్పందంతోనే ఈ బంధానికి గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాయి. 'గత పదేళ్లుగా నా అద్భుత ప్రయాణం, ఎదుగుదలలో జేఎస్‌డబ్ల్యూ కీలక పాత్ర పోషించింది. వారు అందించిన సహకారానికి ఎప్పటికీ కృతజ్ఞుడను' అని నీరజ్ వ్యాఖ్యానించాడు. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణపతకం సాధించిన నీరజ్ చోప్రా...2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజతం గెలిచాడు.

కొత్త సీజన్‌లో కోటి ఆశలతో...

- భారత షట్లర్లు సై
- నేటి నుంచి మలేసియా ఓపెన్ సూపర్-1000 టోర్నీ

సింధు

లక్ష్యసేన్

కౌలాలంపూర్: కొత్త ఏడాది కొత్త సీజన్‌ను ఘనంగా ఆరంభించాలని భారత షట్లర్లంతా మలేసియా ఓపెన్‌కు సై అంటున్నారు. అనుభవజ్ఞులైన స్టార్లు పీవీ సింధు, లక్ష్యసేన్ సహా భారత బలగమంతా ఈ టోర్నీ బరిలోకి దిగుతోంది. 14,50,000 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 13.09 కోట్లు) గల ఈ సూపర్–1000 టోర్నమెంట్‌ను ఆశావహ దృక్పథంతో ప్రారంభించాలని భారత షట్లర్లు భావిస్తున్నారు. 2025 సీజన్ భారత బ్యాడ్మింటన్‌కు ఓ చేదుగుళికగా ముగిసింది. స్టార్ ఆటగాళ్ల గాయాలు, నిలకడలేని ఆటతీరు, ప్రధాన టోర్నీలో చెత్త ప్రదర్శన ఇలా చెప్పుకుంటూ పోతే నిరుత్సాహకరంగానే గతేడాది ముగిసింది. దీనిని సాధ్యమైనంత తొందరగా మర్చిపోయి మలేసియా ఓపెన్‌లో మంచి రోజులను తెచ్చుకోవాలని... తద్వారా వచ్చే వారం సొంతగడ్డ (ఢిల్లీ)పై జరిగే ఇండియా ఓపెన్ సూపర్–750 టోర్నమెంట్‌లో కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగాలని షట్లర్లంతా ఆశిస్తున్నారు.

జియా హెంగ్‌తో లక్ష్య పోరు

సింగిల్స్‌లో లక్ష్యసేన్ గుడ్డికంటే మెల్ల నయం అన్నచందంగా ఒకటి అర టోర్నీలో మెరిశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్–500 టోర్నీలో టైటిల్ గెలిచాడు. హాంకాంగ్ ఓపెన్ ఫైనల్ చేరాడు. ఇప్పుడు తాజా టోర్నీ సింగపూర్‌కు చెందిన జియా హెంగ్ జాసన్‌తో 24 ఏళ్ల స్టార్ షట్లర్ ఈ సీజన్‌ను ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. యూఎస్ ఓపెన్ సూపర్–300 టైటిల్ గెలిచిన యువతార ఆయుశ్ షెట్టి ఈ సీజన్‌లో ప్రతీ టోర్నీలోనూ నిలకడైన ప్రదర్శన కనబరచడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. తొలి మ్యాచ్‌లో ఇతనికి క్లిష్టమైన ప్రత్యర్థి ఎదురవుతున్నాడు. తొలి రౌండ్లో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లీ జి జియా (మలేసియా)తో ఆయుశ్ పోటీపడతాడు.

గంపెడాశలతో సింధు

మహిళల సింగిల్స్‌లో రెండు వరుస ఒలింపిక్ పతకాల విజేత పీవీ సింధు ఈ సీజన్‌పై గంపెడాశలు పెట్టుకుంది. గాయాల బెడదతోనే గడిచిన గత సీజన్‌ను మరిపించేలా ఈ ఏడాది తన ప్రదర్శన ఉండాలని గట్టి పట్టుదలతో ఉంది. తొలి పోరులో భారత స్టార్ షట్లర్ సింధు... చైనీస్ తైపీకి చెందిన సంగ్ షువో యున్‌తో తలపడుతుంది. అయితే ఉన్నతి హుడాకు తొలి రౌండ్లో చైనా గోడ ఎదురవుతోంది. ఆమె టోక్యో ఒలింపిక్స్ చాంపియన్, నాలుగో సీడ్ చెన్ యు ఫె (చైనా)ను ఢీకొట్టనుంది. మోకాలి గాయంతో ఆరు నెలలు పూర్తిగా ఆటకు దూరంగా ఉన్న మాళవిక బన్సోద్... మాజీ ప్రపంచ చాంపియన్, ఏడో సీడ్ రచనొక్ ఇంతనొన్ (థాయ్‌లాండ్)తో సీజన్‌ను ప్రారంభించనుంది.

సాత్విక్–చిరాగ్‌ల జోరు కొనసాగేనా...

గత ఏడాది ఓవరాల్‌గా భారత బ్యాడ్మింటన్‌లోనే అత్యంత మెరుగ్గా, ధీటుగా రాణించిన ఆటగాళ్లెవరైనా ఉంటే సాత్విక్–చిరాగ్‌లే! పెద్దగా కలిసిరాని 2025లో కూడా తమ ఉనికి చాటుకొని జోరు సాగించిన జోడీ... ఇప్పుడు ఇదే ఉత్సాహంతో 2026ను ఘనంగా మొదలుపెట్టాలని అనుకుంటుంది. గత నెల ముగిసిన వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో సెమీస్ దాకా పోరాడిన సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ షెట్టి జోడీ... హాంకాంగ్ ఓపెన్, చైనా మాస్టర్స్ టోర్నీలలో రన్నరప్‌గా నిలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మరెన్నో టోర్నీలో సెమీస్ చేరింది. తాజా టోర్నీలో సాత్విక్–చిరాగ్ ద్వయం... లీ జె హుయ్–యంగ్ పొ సున్ (చైనీస్ తైపీ) జంటతో తొలి రౌండ్‌లో తలపడుతుంది. మరో డబుల్స్ జోడీ ఎం.ఆర్. అర్జున్–హరిహరన్.... హిరొకి మిడొరికవా–క్యోహి యమషిత (జపాన్) జంటతో పోటీపడుతుంది.

కొత్త ఉత్సాహంతో గాయత్రి–ట్రెసా

మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్–ట్రెసా జాలీ జోడీ నూతనోత్సాహంతో మలేసియా టోర్నీలో దిగుతోంది. గత ఏడాది గాయత్రి భుజం గాయంతో ఇబ్బంది పడింది. ఇటీవల ట్రెసాతో కలిసి సయ్యద్ మోడి టోర్నీలో టైటిల్ నిలబెట్టుకోవడం ద్వారా రేసులోకి వచ్చారు. ఈ టోర్నీ తొలి రౌండ్లో గాయత్రి–ట్రెసా జోడీ ఇండోనేసియాకు చెందిన ఫెబ్రియానా ద్విపుజి కుసుమ–మెలిసా ట్రియాస్ పుస్పితసరి జంటతో తలపడనుంది.

వైభవ్ విధ్వంసం

- 24 బంతుల్లో 1 ఫోర్, 10 సిక్స్‌లతో 68
- దక్షిణాఫ్రికాపై భారత అండర్-19 జట్టు విజయం
- 2-0తో వన్డే సిరీస్ కైవసం

బెనోనీ (దక్షిణాఫ్రికా): అండర్–19 ప్రపంచకప్‌నకు ముందు దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో యువ భారత జట్టు దుమ్మురేపుతోంది. వరుస మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన వైభవ్ సూర్యవంశీ సారథ్యంలోని భారత అండర్–19 జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే 2–0తో వన్డే సిరీస్ పట్టేసింది. సోమవారం జరిగిన రెండో మ్యాచ్‌లో యువ భారత్ 8 వికెట్ల తేడాతో (డక్‌వర్త్ – లూయిస్ పద్ధతి ప్రకారం) దక్షిణాఫ్రికాను చిత్తుచేసింది. మొదట దక్షిణాఫ్రికా 49.3 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. జాసన్ రౌల్స్ (113 బంతుల్లో 114; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... డానియల్ బోస్‌మన్ (31), అద్నాన్ (25) ఫర్వాలేదనిపించారు. యువ భారత బౌలర్లలో కిషన్ సింగ్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం వెలుతురు లేమి కారణంగా ఆటకు అంతరాయం వాటిల్లింది. దీంతో యువ భారత్ లక్ష్యాన్ని 27 ఓవర్లలో 174గా నిర్ణయించారు. ఛేదనలో ఆద్యంతం దూకుడు కనబర్చిన భారత్ 23.3 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ (24 బంతుల్లో 68; 1 ఫోర్, 10 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. బంతి ఎక్కడపడ్డా దాన్ని గీత దాటించడమే లక్ష్యంగా సఫారీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇప్పటికే సీనియర్ స్థాయిలో తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వైభవ్ సూర్యవంశీ దూకుడుతో లక్ష్యం వేగంగా కరిగిపోయింది. అభిజ్ఞాన్ కుందు (42 బంతుల్లో 48 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), వేదాంత్ త్రిపాఠి (31 నాటౌట్; 4 ఫోర్లు), హైదరాబాద్ ప్లేయర్ ఆరోన్ జార్జ్ (20; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో మిచెల్ క్రుస్‌కాంప్ 2 వికెట్లు పడగొట్టాడు. వైభవ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన మూడో వన్డే బుధవారం ఇక్కడే జరగనుంది.

'మా దేశంలో ఐపీఎల్ ప్రసారం చేయం'

బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రకటన

ఢాకా: భారత్, బంగ్లాదేశ్ మధ్య ముదురుతున్న దౌత్య వివాదంలో మరో పరిణామం చోటు చేసుకుంది. మార్చి నుంచి జరిగే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్‌లను తమ దేశంలో ప్రసారం చేయరాదని బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని బంగ్లా సమాచార, ప్రసార శాఖమంత్రి నిర్ధారించారు. ఐపీఎల్‌నుంచి తమ దేశం ఆటగాడు ముస్తఫిజుర్ రహమాన్‌ను అనూహ్యంగా తప్పించడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) ఈ క్రమంలో బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ కనిపించరాదని నిర్ణయించింది. తమ ఆటగాళ్ల భద్రతపై సందేహాలు ఉన్నాయంటూ టి20 వరల్డ్ కప్ మ్యాచ్‌లను భారత్‌నుంచి శ్రీలంకకు మార్చాలంటూ శనివారం విజ్ఞప్తి చేసిన బంగ్లాదేశ్... తర్వాతి రోజే ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం విధించింది. 'ముస్తఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తొలగించడంపై బీసీసీఐ సరైన వివరణ ఏదీ ఇవ్వలేదు. వారి నిర్ణయం మా దేశ అభిమానులందరినీ తీవ్రంగా నిరాశపర్చింది. ఇలాంటి స్థితిలో ఐపీఎల్ మ్యాచ్‌లను బంగ్లాలో ప్రసారం చేయరాదని నిర్ణయించాం. కేంద్ర ఉన్నతాధికారుల అనుమతి తర్వాతే ఈ ప్రకటన జారీ చేస్తున్నాం. ప్రజల కోణంలోనే నిర్ణయం తీసుకున్నాం' అని బంగ్లాదేశ్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

ముంబై సారథిగా శ్రేయస్

ముంబై: టీమిండియా ఆటగాడు శ్రేయస్ అయ్యర్ విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో ముంబై జట్టుకు సారథిగా వ్యవహరించనున్నాడు. గాయం కారణంగా ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌కు దూరమైన శ్రేయస్... ఆ తర్వాత బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో కోలుకున్నాడు. ఈ నెల 11 నుంచి న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో అయ్యర్ టీమిండియా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ నేపథ్యంలో మ్యాచ్ ప్రాక్టీస్ కోసం అతడు ముంబై జట్టు తరఫున ఆడనున్నాడు. స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టోర్నీ ఆరంభ మ్యాచ్‌ల్లో పాల్గొన్నారు. విజయ్ హజారే టోర్నమెంట్‌లో ఇప్పటి వరకు ముంబై జట్టుకు శార్దుల్ ఠాకూర్ సారథ్యం వహించగా... ఇప్పుడా బాధ్యతలు అయ్యర్ తీసుకున్నాడు. 'శార్దుల్ గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో మిగిలిన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండనున్న శ్రేయస్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశాం. శివమ్ దూబే, సూర్యకుమార్ యాదవ్ కూడా జట్టులో ఉన్నారు' అని ముంబై చీఫ్ సెలెక్టర్ సంజయ్ పాటిల్ వెల్లడించారు.

మరిన్ని క్రీడా వార్తలు
సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

మరో మూడు బీసీ స్టడీ సర్కిళ్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో మూడు బీసీ (ఐఏఎస్) స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సివిల్స్ కోచింగ్ సెంటర్‌ను సోమవారం మంత్రి సందర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అమరావతిలో ఐదుఎకరాల్లో రాష్ట్ర స్థాయి బీసీ స్టడీ సర్కిల్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. గత డీఎస్సీలో ఐదు వేల మందికి శిక్షణ ఇవ్వగా వారిలో 281 మంది టీచర్ పోస్టులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ అధికారులు భీమశంకర్, తనూజరాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అధికారిగా రోనాల్డ్ రోస్

సాక్షి, అమరావతి: ఆర్థిక శాఖ కార్యదర్శి డి.రోనాల్డ్ రోస్‌కు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ప్రత్యేకఅధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు బాధ్యతలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

సీడాప్ చైర్మన్, సిబ్బందికి వేతనాల విడుదల

సాక్షి, అమరావతి: సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) చైర్మన్‌తో పాటు సిబ్బంది వేతనాల కోసం రూ.20.45 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది. ఈమేరకు ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీడాప్ చైర్మన్‌తో పాటు సిబ్బందికి ఏడాది కాలంగా వేతనాలు చెల్లించడం లేదని చైర్మన్ దీపక్‌రెడ్డి ఇటీవల మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ క్రమంలో ప్రభుత్వం రూ.20.45 లక్షలు ఇస్తున్నట్టు తాజాగా ఉత్తర్వులు ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

స్మార్ట్ రేషన్ కార్డులకు రూ.8 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ చెల్లింపుల కోసం రూ.8 కోట్లకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి సౌరభ్ గౌర్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. 2025–26 పౌరసరఫరాల శాఖ బడ్జెట్‌లో క్యూ ఆర్ కోడ్‌తో రేషన్ కార్డు ముద్రణ, రవాణా కోసం అదనపు నిధుల కింద ఈ కేటాయింపులు చేసినట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ సమస్యలపై 'జనతా వారధి'

సాక్షి, అమరావతి: రెవెన్యూ రికార్డులు సక్రమంగా లేకపోవడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు బీజేపీ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం అన్ని జిల్లా కేంద్రాల్లో జనతా వారధి కార్యక్రమం చేపట్టనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ప్రజల సమస్యలను పార్టీ కార్యకర్తల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. వారధి కార్యక్రమం కోసం ప్రత్యేకంగా పోర్టల్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 9వ తేదీన అధికారికంగా జనతావారధి కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు. అలాగే పార్టీ తరపున 'నో డ్రగ్స్' పేరుతో ప్రచారం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో జామాయిల్, సుబాబుల్ ధరలు పెంచి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వినతిపత్రాలిచ్చినట్టు తెలిపారు.

అంబేడ్కర్ గురుకులాల్లో బేసిక్ కంప్యూటర్ కోర్స్

సాక్షి, అమరావతి: అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో బేసిక్ కంప్యూటర్ కోర్స్ అందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి అధ్యక్షతన బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 15 నూతన డిగ్రీ కాలేజీల ఏర్పాటు, అన్ని గురుకులాల విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్ కోర్స్, సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటు, ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీసెంటర్లలో విద్యార్థులకు వాషింగ్ మెషిన్ సౌకర్యం తదితర అంశాలపై చర్చించారు. పార్ట్ టైం, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రమాద బీమా, ఖాళీగా ఉన్న కేర్ టేకర్ పోస్టులను అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు. నాన్ బీఈడీ తెలుగు పండిట్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి, గ్రేడ్ –2 ప్రిన్సిపాళ్లకు గ్రేడ్ –1 ప్రిన్సిపాళ్లుగా అడహాక్ పదోన్నతి కల్పించే అంశాలపై సమావేశంలో చర్చించారు.

ఓర్వకల్లు వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్

సాక్షి, అమరావతి: ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌లో గుట్టపాడు క్లస్టర్ నీటి అవసరాల కోసం రూ.370 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 120 ఎకరాల్లో 4,205 ఎంఎల్‌డీ కెపాసిటీతో దీనిని నిర్మించనున్నారు. ఇందుకు అయ్యే వ్యయంలో ఏపీఐడీసీ రూ.97.82 కోట్లు, ఏపీఐఐసీ రూ.272.18 కోట్లు సమకూర్చనున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

మారని రోగుల తలరాత!

గజిబిజి అక్షరాలతో మందుల చీటి



పాఠశాలలో అక్షరాలు గుండ్రంగా రాయకపోతే బాలలను ఉపాధ్యాయులు మందలించేవారు. అక్షరాలు ఆణిముత్యాల్లా ఉండేందుకు పలుసార్లు రాయించేవారు. పరీక్షల్లో అందమైన దస్తూరితో మంచి మార్కులు వచ్చి కొందరు వైద్యులై అర్థంకాని రీతిలో మందుల చీటిని రాస్తున్నారు. సంతకం వద్ద సిగ్నేచర్ పెట్టినట్లు మందులు రాసి ఇస్తున్నారు. ఇలా రాసిన చీటి పట్టుకుని ఎక్కడికి వెళ్లినా మందులు దొరకని పరిస్థితి. భూమి గుండ్రంగా ఉందన్నట్లు ఆ మందులు రాసిన డాక్టర్ ఉన్న మెడికల్‌షాపునకు వెళితే తప్ప మందులు లభించని పరిస్థితి. ఇటీవల కొంత మంది వైద్యులకు ఈ జాడ్యం పట్టుకుంది. - కర్నూలు(హాస్పిటల్)

- డాక్టర్ మెడికల్ షాప్‌కు తప్ప వేరే వారికి అర్థం కాని వైనం
- మందులు ఎలా వాడాలో స్పష్టంగా రాయని కొందరు డాక్టర్లు
- బీడీ, ఓడీ, టీఐడీ అంటూ సామాన్యులకు అర్థం కాని గీతలు
- మెడికల్ షాపు వారు వివరించకపోతే అంతే!
- ఎన్ఎంసీ, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చెప్పినా వినని వైనం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 200లకు పైగా ప్రైవేటు ఆసుపత్రులు, వెయ్యికి పైగా క్లినిక్‌లు పనిచేస్తున్నాయి. ఆయా ఆసుపత్రులోని వైద్యులు తమ వద్దకు వచ్చే రోగులకు అర్థమయ్యేరీతిలో మందుల చీటిని రాసివ్వాలి. ఆ మందుల చీటి పట్టుకుని ఏ మెడికల్‌షాపునకు వెళ్లినా వారు అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా మందులు ఇచ్చేలా ఉండాలి. కానీ కొందరు వైద్యులు గజిబిజి రాతతో రోగులను తికమకపెడుతున్నారు. మందులను స్పష్టంగా అందరికీ అర్థమయ్యేలా, పెద్ద అక్షరాలతో రాయాలని ఉన్నా పలువురు వైద్యులు ఆచరించడం లేదు. వారు రాసిన మందులు అటాచ్డ్ కౌంటర్(డాక్టర్ క్లినిక్‌లో ఉండే మెడికల్‌షాప్)లో మాత్రమే అర్థమయ్యేలా మందులు రాస్తున్నారు. అక్కడ తప్ప ఆ చీటి తీసుకుని దేశమంతా తిరిగినా మందులు లభించని విధంగా ఉంటున్నాయి. ఒక్కసారి ఆ వైద్యుని వద్దకు వెళ్లిన రోగి మళ్లీ అదే డాక్టర్ వద్దకు వెళ్లి, అక్కడి మెడికల్‌షాపులోనే మందులు తీసుకునేలా వైద్యంతో వ్యాపారం చేస్తున్నారు.

జాతీయ వైద్య కౌన్సిల్ చెప్పినా!

మందుల వివరాలను వైద్యులు స్పష్టంగా రాయాల్సిందేనని నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఇటీవల మరోసారి స్పష్టం చేసింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల వైద్య విద్య సంచాలకులతో పాటు అన్ని వైద్య కళాశాలల ప్రిన్సిపల్‌లు, డైరెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రతి బోధనాసుపత్రిలో తప్పనిసరిగా 'డ్రగ్స్ థెరప్యూటిక్స్ కమిటి(డీటీసీ) ఏర్పాటు చేసి తాము జారీ చేసిన ఆదేశాలు అమలయ్యేలా చూడాలని అందులో సూచించింది. వైద్యులు స్పష్టమైన చేతి రాతతో చీటిపై మందులు రాయాలని, ఈ మేరకు గత యేడాది ఆగష్టులో పంజాబ్, హరియాణా హైకోర్టు తీర్పునిచ్చిన అంశాన్ని గుర్తు చేసింది. మందుల చీటిపై స్పష్టమైన రాత అన్నది రాజ్యాంగంలో ఆర్టికల్ 21కి లోబడి ఆరోగ్యహక్కు(రైట్ టు హెల్త్)కిందకు వస్తుందని ఈ కోర్టు పేర్కొందని వివరించింది. ఎన్ఎంసీ, ఎంసీఐలు వైద్యుల చేతి రాత గురించి పదే పదే ఆదేశించినా డాక్టర్లలో మార్పు రావడం లేదు. తమను ఎవరేమి చేస్తారులే అన్న చందంగా వారు నిర్భీతిగా వ్యవహరించడం గమనార్హం.

స్పష్టంగా రాయకపోతే ఇబ్బందులు

వైద్యులు తమ వద్దకు వచ్చే రోగులకు చికిత్సకు సంబంధించిన మందులను ప్రిస్క్రిప్షన్‌లో స్పష్టంగా, పెద్ద అక్షరాలతో రాయకపోతే చాలా నష్టాలు ఉన్నాయి. ఒకప్పుడు మందుల షాపులో మందులు కొన్న తర్వాత వాటిని తిరిగి తనకు చూపాలని డాక్టర్లు చెప్పేవారు. కానీ ఇప్పుడు చాలా మంది వైద్యులకు అంతటి ఓపిక లేదు. మెడికల్‌షాపులో చూపండి చెబుతారని పంపిస్తున్నారు. కానీ అర్థంగాని రీతిలో ఉన్న డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌లో ఒక్కోసారి మెడికల్‌షాపు వారికే అర్థం గాక ఒక మందు బదులు, ఒక డోసు బదులు ఇంకో డోసు మందులు ఇచ్చే అవకాశం ఉంది. ఇలాంటి మందులు వేసుకోవడం వల్ల రోగికి దుష్ప్రభావాలు(సైడ్ ఎఫెక్ట్స్) ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఒక్కోసారి ఈ పరిస్థితి ప్రాణాంతకంగా మారుతుంది. కాగా మరికొందరు వైద్యులు మందుల చీటిలో మందుల కింద ఏ మందు ఎన్ని పూటలు, ఎలా వాడాలో తెలుగులో స్పష్టంగా రాసేవారు. కానీ ఇప్పుడు బీడీ, ఓడీ, టీఐడీ అంటూ రాస్తున్నారు. వైద్యపరిభాషలో తెలిసిన వారికి మాత్రమే ఇలాంటి పదాలకు అర్థం తెలుస్తుంది. సామాన్య ప్రజలకు ఇవి అర్థం కావు. అలాగాకుండా వైద్యులే మందుల చీటిలో స్పష్టంగా ఏ మందు, ఎన్ని పూటలు వాడాలో అర్థమయ్యేలా రాస్తే ఇబ్బందులు ఉండవు.

వీరి రాత పక్కన మెడికల్‌షాపునకు ఎరుక

కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న పలువురు వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఎవ్వరికీ అర్థం కాని రీతిలో ఉంటున్నాయి. ఓ కార్డియాలజిస్టు ప్రిస్క్రిప్షన్ చూస్తే ఈసీజీ గ్రాఫ్‌లా కనిపిస్తుంది. దానిని చూసి అర్థం చేసుకుని అక్కడే ఉన్న మెడికల్‌షాపు వారు మందులు తీసి ఇస్తారు. అక్కడ తప్ప ఆ మందులు బయట ఎక్కడా లభించవు. అలాగే గాయత్రి ఎస్టేట్‌లోని ఓ న్యూరోసర్జన్ సైతం ఇదే విధంగా మందులు రాస్తున్నారు. అక్కడే ఉన్న ఓ జనరల్ సర్జన్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, లంగ్ స్పెషలిస్ట్, ఆర్థోపెడిక్ సర్జన్, ఈఎన్‌టీ, గైనకాలజిస్టు, న్యూరాలజిస్టు, యురాలజిస్టు, కొత్త బస్టాండ్ ప్రాంతంలోని పలు ఆసుపత్రులు, ఎస్ఆర్ పేటలోని పలువురు వైద్యులు రాసే ప్రిస్క్రిప్షన్లు ఎవ్వరికీ అర్థం కాని పరిస్థితుల్లో ఉంటున్నాయి. ఇటీవల బ్రాండెడ్ మందుల స్థానంలో స్థానికంగా తయారయ్యే మందులు అధికంగా వస్తున్నాయి. వాటిని రాస్తే అధికంగా లాభాలు వస్తాయన్న ఆశతో పలువురు వైద్యులు ప్రిస్క్రిప్షన్ రూపంలో ఇలా తప్పుడు గీతలు గీసి రోగుల ప్రాణాలతో ఆడుకుంటున్నారు.



ఒక డాక్టర్ రాసిన మందుల చీటి

ఎన్ఎంసీ మార్గదర్శకాలు ఇవీ

- మందులను వాటి జనరిక్ పేర్లతో మాత్రమే రాయాలి. బ్రాండెడ్ పేర్లను నివారించాలి.
- ప్రిస్క్రిప్షన్ల స్పష్టంగా, చదవడానికి వీలుగా ఉండాలి. వీలైతే పెద్ద అక్షరాలతో టైప్ చేసి ప్రింట్ చేయాలి. తద్వారా తప్పులు జరగకుండా ఉంటాయి.
- మందులను తార్కికంగా, సరైన మోతాదులో, సరైన సమయంలో వాడేలా రాయాలి.
- ప్రిస్క్రిప్షన్‌లో తేదీ, సమయం, ప్రదేశం, డాక్టర్ పేరు, హోదా, సంతకం, స్టాంప్ తప్పనిసరిగా ఉండాలి.
- ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ మందులు విచక్షణతో ఉపయోగించాలి.
- జనరిక్ మందుల లభ్యతను, వాటిని కొనుగోలు చేసే విధానాన్ని రోగులకు ప్రోత్సహించాలి.
- ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులకు జనరిక్ మందుల విలువ గురించి శిక్షణ ఇవ్వాలి

జీజీహెచ్‌లో త్వరలో కమిటీ

వైద్యులు తమ వద్దకు వచ్చే రోగులకు మందులను స్పష్టంగా, అందరికీ అర్థమయ్యే విధంగా రాయాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్ పేర్కొంది. ఈ మేరకు మార్గదర్శకాలు అమలయ్యేలా చూడాలని ఇటీవల అన్ని బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి త్వరలో డ్రగ్స్ థెరప్యూటిక్స్ కమిటీ ఏర్పాటు చేయనున్నాం.

– డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

మందులు స్పష్టంగా రాయాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులకు ఇటీవల స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశాం. రోగులకు రాసే ప్రిస్క్రిప్షన్ పెద్ద అక్షరాలతో, అందరికీ అర్థమయ్యేలా ఉండాలని చెప్పాం. కానీ ఇప్పటికీ చాలా మంది వైద్యులు తమకు ఇష్టమొచ్చినట్లుగా అర్థంగానట్లు ప్రిస్క్రిప్షన్ రాస్తున్నారు. దీనివల్ల రోగులకు మందుల దుష్ప్రభావాలు ఎదురై ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– డాక్టర్ ఎల్.భాస్కర్, డీఎంహెచ్ఓ, కర్నూలు

మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయవచ్చు

మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం రోగులకు వైద్యులు రాసే ప్రిస్క్రిప్షన్ పెద్ద అక్షరాలతో, జనరిక్ నేమ్‌తో రాయాలి. అది కూడా ఏ మందు, ఎప్పుడు, ఎలా వాడాలో కూడా స్థానిక భాషలో రాసి ఉండాలి. అలా గాకుండా ఇష్టమొచ్చినట్లు, ఎవ్వరికీ అర్థంగానట్లు రాస్తే అలాంటి వైద్యులపై మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

– డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, ఐఎంఏ కార్యదర్శి, కర్నూలు

జగన్‌ది ప్రజా పాలన.. చంద్రబాబుది విధ్వంస పాలన

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీ పార్వతి

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విప్లవాత్మక సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరిగిందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీ పార్వతి తెలిపారు. విద్య, వైద్య రంగాలు బలోపేతమయ్యాయని,, పారిశ్రామికాభివృద్ధితో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని వివరించారు. వైఎస్సార్‌సీపీ ఫ్లోరిడా టీమ్ ఆధ్వర్యంలో అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని ఓర్లాండోలో సోమవారం మీట్ అండ్ గ్రీట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎన్ఆర్ఐలు, 2019–24 మధ్య కాలంలో వైఎస్ జగన్ పాలన ప్రజా సంక్షేమమే కేంద్రంగా సాగిందని ఆనందం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు, పారదర్శక పాలన, సమగ్రాభివృద్ధి ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కోట్లాది మంది జీవితాల్లో మంచి మార్పులు వచ్చాయని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అనంతరం లక్ష్మీ పార్వతి మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చారని, మొత్తం 17 వైద్య కళాశాలలకు అనుమతి తెచ్చి 5 కళాశాలలను అందుబాటులోకి తెచ్చారన్నారు. అయితే, ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటుకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలతో పేద ప్రజలకు వైద్య విద్య, ఉచిత వైద్యం అందని ద్రాక్షగా మారుతుందని హెచ్చరించారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రద్దు చేయడం, అవగాహన లేకుండా అప్పులు చేయడం, ''రెడ్ బుక్ పాలన'' పేరిట వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధించడాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. ఈ ప్రతీకార రాజకీయాలు, విధ్వంసక పాలనతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు అనిశ్చితి, కష్టాలు పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలు వైఎస్ జగన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. 2029లో వైఎస్సార్‌సీపీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ వాసుదేవ రెడ్డి, డాక్టర్ కొండా మోహన్ రెడ్డి, సంజీవ రెడ్డి, రాయల్ రెడ్డి, మూర్తి, రమేష్ రెడ్డి, శేషాద్రి, రవి, మువ్వా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సినిమా పైరసీకి చెక్

టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎంఓయూ

సాక్షి, హైదరాబాద్: డిజిటల్ సినిమా పైరసీ, ఆన్‌లైన్ కాపీరైట్ ఉల్లంఘనలను కట్టడి చేయడంలో కీలక ముందడుగుగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ), తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. తెలుగు సినిమా పరిశ్రమను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న డిజిటల్ పైరసీని సమర్థంగా ఎదుర్కొనేందుకు సాంకేతికత ఆధారిత, సమన్వయ పూర్వక వ్యవస్థను ఏర్పాటు చేయడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. ఈ ఎంఓయూపై తెలంగాణ పోలీస్ తరఫున టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్, సినీ పరిశ్రమ తరఫున టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు దగ్గుబాటి సురేశ్‌బాబు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ పైరసీ ఒక వ్యవస్థీకృత సైబర్ నేరంగా మారిందని, పరిశ్రమ, పోలీసు సమన్వయం తప్పనిసరి అని తెలిపారు. శిఖాగోయల్ మాట్లాడుతూ కొద్ది నిమిషాల ఆలస్యం కూడా నిర్మాతలకు భారీ నష్టాన్ని కలిగిస్తుందని, ఈ ఎంఓయూ వేగవంతమైన చర్యలకు దోహదపడుతుందని చెప్పారు. టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు సురేశ్‌బాబు మాట్లాడుతూ, తమిళ్ బ్లాస్టర్స్, ఐ బొమ్మ వంటి పెద్ద పైరసీ నెట్‌వర్క్‌లపై తెలంగాణ పోలీసులు తీసుకున్న చర్యలు పరిశ్రమకు బలమైన మద్దతుగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ ఎంఓయూ డిజిటల్ పైరసీ నిర్మూలనలో మరో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.డిజిటల్ పైరసీ అత్యంత సున్నితమైన సమస్య అని, కాపీరైట్ ఉల్లంఘనలకు రియల్‌టైమ్‌లో గుర్తించడం ద్వారా మాత్రమే నిర్మాతల నష్టాలను నియంత్రించగలమని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ యాంటీ వీడియో పైరసీ సెల్ చైర్మన్ రాజ్‌కుమార్ ఆకెళ్ల అన్నారు.

చట్టపరమైన చర్యల కోసమే..

సినిమా విడుదలైన కొద్ది నిమిషాల్లోనే వెబ్‌సైట్లు, సోషల్ మీడియా, మెసేజింగ్ గ్రూపులు, ఐపీటీవీ స్ట్రీమ్స్, మొబైల్ యాప్‌లు, క్యామ్‌కార్డింగ్ ద్వారా జరుగుతున్న వ్యవస్థీకృత డిజిటల్ పైరసీని అరికట్టేందుకు ఈ ఎంఓయూ మార్గం సుగమం చేస్తుంది. రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ షేరింగ్, వేగవంతమైన టేక్‌డౌన్ చర్యలు, చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టేందుకు స్పష్టమైన విధానాన్ని ఇది ఏర్పరుస్తుంది. ఈ ఒప్పందం ప్రకారం..పైరసీ నెట్‌వర్క్‌లపై ప్రత్యక్ష పర్యవేక్షణ, టీజీసీఎస్‌బీ ఐసీసీసీ కేంద్రంలో టీఎఫ్‌సీసీ యాంటీ పైరసీ ఏజెంట్ల నియామకం, ధ్రువీకరించిన ఫిర్యాదులపై తక్షణ చట్టపరమైన చర్యలు, ఓటీటీలు, సోషల్ మీడియా సంస్థలతో సమన్వయం ద్వారా పైరేటెడ్ కంటెంట్ తొలగింపు వంటి చర్యలు చేపడతారు. ఆధునిక సాంకేతిక సాధనాలు వినియోగించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

బోధనాస్పత్రుల్లో వైద్య సేవలు మెరుగుపడాలి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో వైద్య సేవలు మెరుగుపడాలని వైద్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ అన్నారు. విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. వైద్యుల రోజువారీ వ్యక్తిగత పనితీరు, పూర్తి వివరాలు రోగుల ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు యాప్ (ఈహెచ్ఆర్)లో కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని వల్ల వైద్య సేవల్లో నాణ్యత పెరగడంతో పాటు పని చేయని వారిపై చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని చెప్పారు. బోధనాస్పత్రుల్లో సంభవించే మరణాలకు కారణాలను ఆన్‌లైన్‌లో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో డీఎంఈ డాక్టర్ రఘునందన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏపీ ఫిల్మ్ చాంబర్ కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శిగా ఎన్నికైన కొల్లి విజయ వరప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రస్తుత కార్యదర్శిగా ఉన్న కాకుమాను శివప్రసాద్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఫిల్మ్ చాంబర్ ఎన్నికల్లో నిర్మాత ఎస్.సుధాకర్ రెడ్డి సహకారంతో అధ్యక్షుడిగా దగ్గుబాటి సురేష్, తెలంగాణ కార్యదర్శిగా కె.అశోక్‌కుమార్, ఏపీ కార్యదర్శిగా కొల్లి విజయ వరప్రసాద్ (బేకరి ప్రసాద్) ఎంపికైన సంగతి తెలిసిందే.

'స్వచ్ఛ సర్వేక్షణ్' పర్యవేక్షణకు యూనిట్లు

సాక్షి, అమరావతి: పట్టణాల్లో పారిశుధ్య పరిస్థితిని మెరుగుపరిచి స్వచ్ఛ సర్వేక్షణ్ 2026లో ఉత్తమ ర్యాంకులు సాధించాలనే లక్ష్యంతో 46 నగరాల్లో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ల(పీఎంయూ)ను ఏర్పాటు చేస్తున్నట్టు మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ యూనిట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతాయని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీఎంయూలు అర్బన్‌లోకల్ బాడీల్లో పారిశుధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషించి ఆయా మున్సిపల్ కమిషనర్లను అప్రమత్తం చేస్తాయని వివరించారు.

నూర్‌బాషా దూదేకుల సహకార సంస్థ ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నూర్ బాషా, దూదేకుల సహకార ఆర్థిక సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ ఎస్. సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఏపీ సహకార సంఘాల చట్టం–1964, ఏపీ సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం–2001 నిబంధనల ప్రకారం కొత్తగా ఈ సహకార ఆర్థిక సంస్థ ఏర్పాటైంది. దీంతో.. ఇప్పటివరకు ఉన్న ఏపీ నూర్‌బాషా, దూదేకుల సంక్షేమ, అభివృద్ధి సంస్థను రద్దుచేశారు. నూర్‌బాషా, దూదేకుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం కొత్తగా సహకార ఆర్థిక సంస్థను ఏర్పాటుచేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సంస్థల బకాయిలు చెల్లించేందుకు రూ.1,993 కోట్ల అప్పు

6,009 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసిన ఏపీజెన్‌కో
థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై సమీక్షలో ఎండీ ఎస్.నాగలక్ష్మి వెల్లడి

సాక్షి, అమరావతి: బొగ్గు కంపెనీలకు బకాయిలను చెల్లించడానికి 8.95 శాతం వడ్డీకి హడ్కో నుంచి రూ.1,000 కోట్లు అప్పు తీసుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ(ఏపీజెన్‌కో) ఎండీ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తిని మెరుగుపరచడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం అధికారులతో ఆమె విద్యుత్ సౌధలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ శనివారం ఒక్కరోజే 6,009 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి జెన్‌కో రికార్డు సృష్టించిందని చెప్పారు. ప్రస్తుతం అన్ని థర్మల్ ప్లాంట్లలో 9 నుంచి 10 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు. హడ్కో నుంచి రూ.1,000 కోట్లతోపాటు థర్మల్ ప్లాంట్లకు రూ.801 కోట్లు, హైడల్ ప్లాంట్ల పునరుద్ధరణ, ఆధునికీకరణ పనుల కోసం 9 శాతం వడ్డీకి మరో రూ.192 కోట్లు రుణాలు తీసుకున్నట్లు వివరించారు. మొత్తంగా రూ.1,993 కోట్ల అప్పులు తీసుకుని బకాయిలను సకాలంలో చెల్లిస్తున్నామని ఎండీ చెప్పారు. ఈ సమావేశంలో జెన్‌కో డైరెక్టర్లు ఎం.సుజయకుమార్, పి.అశోక్‌కుమార్‌రెడ్డి, వి.ఉష, ఏపీపీడీసీఎల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

కమ్మని దృశ్యం!

మిట్ట మధ్యాహ్నం.. చల్లని చెట్టు నీడన భోజనాలు చేస్తున్న వీరంతా వ్యవసాయ కూలీలు. వివిధ గ్రామాలకు చెందిన సుమారు వంద మంది వ్యవసాయ కూలీలు మిరప కోత కోసం ఉదయాన్నే కర్నూలు జిల్లా గడివేములకు వచ్చారు. మధ్యాహ్న భోజన సమయా నికి అందరూ ఒకేచోట కూర్చుని ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాలు చేశారు. కష్టాలను మర్చిపోయేలా కబుర్లు చెప్పుకుంటూ.. మధ్య మధ్యలో నవ్వుకుంటూ.. కమ్మని రుచులు పంచుకుంటూ.. భోజనాలు ముగించారు. ఈ దృశ్యం గడివేముల సమీపంలో ఆదివారం కనిపించింది. - గడివేముల

విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకం: మంత్రి గొట్టిపాటి

సాక్షి, అమరావతి: విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు చంద్రబాబు కూటమి ప్రభుత్వం పూర్తి వ్యతిరేకమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. ఏపీ ఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్–2026 డైరీని సోమవారం విజయవాడలో మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యుత్ రంగానికి సంబంధించి లైన్ మెన్ నుంచి ఇంజనీర్ వరకు అందరూ కష్టపడితేనే ప్రజలకు ట్రూ డౌన్ రూపంలో ఊరట లభించిందన్నారు. విద్యుత్ ఉద్యోగుల మెడికల్ ఇన్సూరెన్స్ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పీఆర్సీ, ఇంజనీర్ల కొరత అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. శ్రీకాకుళంలో నూతన పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి సానుకూల నిర్ణయం వచ్చేలా స్థానికులతో చర్చిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి, ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శామ్యూల్, ప్రధాన కార్యదర్శి నాగప్రసాద్, రామారావుతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల వారీగా ప్రణాళికలు

అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

సాక్షి, అమరావతి: ఉద్యాన పంటల వారీగా ప్రణాళికలతోపాటు మార్కెట్ ధరలపై ముందస్తు అంచనాలను కూడా సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మంత్రి తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల విషయంలో గతేడాది ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రానున్న సీజన్‌లో పక్కా ప్రణాళికను తయారు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు, అదనపు డైరెక్టర్‌లు ఎం.వెంకటేశ్వర్లు, డీహెచ్ అశోక్‌కుమార్, సీహెచ్ హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈరోజున ఎక్స్-రేలు లేని మెడికల్ సైన్స్‌ను ఊహించుకోలేం. ఏదైనా సమస్యతో డాక్టర్ దగ్గరికి వెళ్లగానే చేయించే పరీక్షల్లో మొట్టమొదటిది రక్తపరీక్షలైతే.. రెండోది తప్పకుండా ఎక్స్-రే అయి ఉంటుంది. దేహాన్ని కోయకుండా... కత్తిగాటు పెట్టకుండా లోపలి అవయవాల తీరుతెన్నులు తెలుసుకునే ఈ పరీక్ష వైద్యశాస్త్రంలోనే ఓ తిరుగులేని వరదాయిని. ఏదైనా యాక్సిడెంట్ జరిగినప్పడు దేహంలోపలి అవయవాలకు గానీ, ఎముకలకు గానీ... ఏ ముప్పు వాటిల్లిందో, ప్రమాదం తాలూకు దుష్ప్రభావమెంతో తెలుసుకోవడంలో ఎక్స్-రేలను మించిన పరీక్షలేదు కదా... అలాంటిది అసలీ ఎక్స్-రేలను తెలుసుకోవడమే ఓ యాక్సిడెంట్! ఎక్స్-రే అంటే ఏమిటో, దాని వివరాలూ, తీయాల్సింది ఎందుకు, ఎప్పుడెప్పుడు, దాని తాలూకు దుష్ప్రభావాలేమిటి... అవే ఎక్స్-రేలను మరింత తక్కువ మోతాదులో ఉపయోగించి తీసే సీటీ-స్కాన్ ఏమిటి? అదెప్పుడు తీస్తారు వంటి అనేక వివరాలను తెలుసుకుందాం...

● ఎక్స్‌రే - స్కాన్

అందర్ కా స్వాస్థ్... అందరికీ హెల్త్!

ఎక్స్-రే అంటే కూడా ఒక రకం కాంతి. అనంత కాంతి పటలంలో కంటికి కనిపించేది కొంతమేరకు మాత్రమే. ఇక కంటికి కనిపించని కాంతి పుంజాలు... ఇన్‌ఫ్రారెడ్ అనీ, అల్ట్రా వయొలెట్ అనీ, ఎక్స్ రేస్ అనీ ఇలా వేర్వేరుగా ఉంటాయి. విస్తృతమైన రేడియేషన్‌లో కంటికి కనిపించే కాంతి ఒక వేవ్‌లెంగ్త్‌తో (అంటే కాంతి వేవ్‌లెంగ్త్ 380 నుంచి 750 నానో మీటర్ల మధ్యన) ఉంటే... ఈ రకరకాల రేడియేషన్ రూపాలు కొన్ని నిర్దిష్టమై వేవ్‌లెంగ్స్‌తో రకరకాలుగా ఉంటాయి. వాటి వేవ్‌లెంగ్త్ తాలూకు ఫ్రీక్వెన్సీలను బట్టి వాటికి ఆయా పేర్లు పెడతారు.

మిగతా రేడియేషన్ల తాలూకు తీవ్రత కాంతి కంటి భిన్నంగా ఉండటంతో పాటు కాంతిలా నిరపాయకరంగా ఉండదు. ఆయా కాంతి కిరణాల తీవ్రత కారణంగా వాటి దుష్ప్రభావమూ తీవ్రంగానే ఉంటుంది. అందుకే వైద్య పరీక్షల కోసం వెలువరించే ఆ రేడియేషన్‌తో కొన్ని ముప్పులూ, దుష్ప్రభావలూ తప్పవు. అయితే వైద్యశాస్త్ర అవసరాల దృష్ట్యా బేరీజు వేసినప్పుడు... వాటి వల్ల కలిగే దుష్ప్రభావం కంటే వాటితో ఒనగూరే మేలు ఎక్కువ అనుకున్నప్పుడు డాక్టర్లు ఈ కిరణాలను ఉపయోగించే ఎక్స్-రే పరీక్ష లేదా సీటీ స్కాన్ చేయించమని సూచిస్తారు. అయితే ఆధునిక వైద్యశాస్త్రవేత్తలు తమ కొత్త కొత్త ఆవిష్కరణలతో ఇప్పుడీ ఎక్స్-రేల దుష్ప్రభావాలను గతం కంటే చాలా చాలా తగ్గించారు. దాంతో ఇప్పుడు ఎక్స్-రేలు చాలావరకు నిరపాయకరమే అని చెప్పవచ్చు.

కనుగొనడమే ఓ యాదృచ్ఛికమైన అద్భుతం!

ఎక్స్-రేలను కనుగొనడమే చాలా యాదృచ్ఛికంగా జరిగింది. ఈ అత్యద్భుతమైన ఆవిష్కారం జరిగిన తీరు కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఓ గాజు సిలిండర్‌లో క్యాథోడ్ కిరణాలను దారిమళ్లించాక... అవి తప్పించుకుపోకుండా ఉంచిన ఫ్లోరెసెంట్ స్క్రీన్ మెరుస్తుండటంతో అక్కడ ఒకరకమైన కిరణాలు పడుతున్నాయని విల్హెమ్ కోనార్డ్ రాంట్‌జన్ అనుకున్నాడు.



అకస్మాత్తుగా తన చేతిని అడ్డుపెడితే చేతిలోని ఎముకలు కనిపించాయి. దాంతో తన భార్యను పిలిచి... ఆమె చేతిని కూడా ఆ కిరణాలకు అడ్డుగా ఉంచినప్పుడు ఆమె కూడా తన చేతిలోని ఎముకలు చూసి భయంతో బెంబేలెత్తిపోయింది. అలా చాలా యాక్సిడెంటల్‌గా రాంట్‌జన్ కనుగొన్న ఎక్స్-రేలతో వైద్యచికిత్సలో ఒక విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. అంతకుముందు చాలా అసాధ్యంగా భావించిన సంక్లిష్టమైన చికిత్సలు చాలా చాలా సులువయ్యాయి. మరీ ముఖ్యంగా ఎముకలు మొదలుకొని శరీరంలోని కొన్ని భాగాల చికిత్స ఎంతో సులభతరమయ్యింది.

అసలు ఎక్స్-రే అంటే ఏమిటి?

ఏదైనా వస్తువును చూడటానికి కాంతి అవసరమవుతుంది. కానీ నిజానికి 'కాంతి' అంటే అనేక వేవ్‌లెంత్ గల రేడియేషన్ తరంగాల కిరణాల్లో అదో చిన్న భాగం మాత్రమే. అందులోని ఇతర వేవ్‌లెంగ్త్ ఉన్న భాగాలు నేరుగా మన కంటికి కనిపించవు. కాంతి కిరణాల కంటే ఈ ఎక్స్-రే తరంగాలు బలమైనవి. కాబట్టి కాంతి మన శరీరాన్ని తాకి వెనుదిరిగిపోతుంది. కానీ ఈ ఎక్స్ కిరణాలు మాత్రం శరీరంలోకి బలంగా దూసుకుపోతాయి. కాంతి ఓ వస్తువును తాకి వచ్చి తిరిగి మన కంటిని చేరినప్పుడు... మనమా వస్తువును చూడగలిగినట్లే... ఈ కిరణాలూ శరీరం లోపలికి వెళ్లి అక్కడి అంతర్భాగాలపై ప్రతిఫలిస్తాయి కాబట్టి... వాటిని రేడియాలజిస్ట్ (రేడియేషన్‌తో పని చేయగలిగే సామర్థ్యం ఉన్న నిపుణులు) మరికొంత సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, వాటి సహాయంతో చూడగలుగుతాడు. అలాగే ఆ ప్రతిబింబాన్ని ఫొటో తీసి, ఫిల్మ్‌పై ముద్రించగలిగినప్పుడు అది 'ఎక్స్-రే' పిక్చర్ అవుతుంది. ఇప్పుడున్న సాంకేతికత సహాయంతో ఆ ప్రతిబింబాన్ని టీవీ మీదగానీ లేదా కంప్యూటర్ తెర మీదగానీ ఒడిసి పట్టగలగడమూ సాధ్యమే.

ఎక్స్-రే ఉపయోగాలేమిటి...?

ఎక్స్-రే వంటి బలమైన కిరణాలు బలంగా శరీరంలో లోపలికి చొచ్చుకుపోతాయి. అవి శరీరంలోని అనేక కీలక అవయవాలను చేరి, ఫొటోలు తీసి... అక్కడి సమాచారాన్ని అందిస్తాయి. దాన్ని ఎక్స్-రే ఫిల్మ్ సహాయంతో నిక్షిప్తం చేసుకోవచ్చు. మనకు తెలిసిందల్లా... ఎక్స్-రే అంటే... ఆ కిరణాల సహాయంతో ఎముకలు విరిగాయా అన్న సమాచారం తెలుస్తుందనే సాధారణ విషయం మాత్రమే. కానీ డాక్టర్లు మాత్రం ఈ ఎక్స్-రే కిరణాల సహాయంతో చాలా రకాల సమాచారమూ, ఫలితంగా ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. ఉదాహరణకు... దేహంలోకి ఓ పైప్‌ను పంపాలంటే... అది దేహంలోకి ఇతర అంతర్గత అవయవాలకూ తగలకుండా సాఫీగా ఎలా పంపగలమని చూస్తారు. అలాగే దేహం లోపల ఏదైనా ఉపకరణాన్ని లేదా పరికరాన్ని అమర్చాలంటే నిర్దిష్టంగా ఎక్కడ అమర్చాలన్న విషయాన్ని ఎక్స్-రేల సహాయంతోనే తెలుసుకుంటారు. ఎక్స్-రేతో ఇలాంటి ఎన్నో ప్రయోజనాలు సమకూరుతాయి.

వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు రేడియేషన్‌లు!

ఈ ప్రపంచంలో ప్రతిచోటా రేడియేషన్ ఉండనే ఉంటుంది. సగటున ఒక వ్యక్తి ప్రతి ఏడాదీ 3 ఎమ్ఎస్‌వీ రేడియేషన్‌కు గురవుతుంటాడని ఓ అంచనా. అయితే అది సగటు మాత్రమే. కొన్నిచోట్ల రేడియేషన్ తీవ్రత ఎక్కువగా ఉండవచ్చు. మరికొన్ని చోట్ల తక్కువ. ఉదాహరణకు పీఠభూమి (ప్లేటో) ప్రాంతాల్లో ఉండేవారు తమ తోటి కోస్తా (కోస్టల్) ప్రాంతాల్లో ఉండేవారితో పోలిస్తే 1.5. మిల్లీ సీవెర్ట్ (ఎమ్ఎస్‌వీ... అంటే రేడియేషన్‌ను కొలవడంలో ఉపయోగపడే కొలతల్లో ఒక రకమైన యూనిట్) ఎక్కువగా నేచురల్ రేడియేషన్‌కు గురవుతుంటారు.

అలాగే మనం మన ఇండ్లలోపలే ఉన్నప్పటికీ ఎంతోకొంత రేడియేషన్‌కు గురవుతూనే ఉంటాం. వాతావరణంలోని రాడాన్ గ్యాస్ కూడా ఈ రేడియేషన్ మోతాదులోని మార్పులకు కారణమవుతుంటుంది. రాడాన్ వల్ల రేడియేషన్ పెరుగుతుంది (ఏడాదికి షుమారు 2 ఎమ్ఎస్‌వీ). ఒకదేశంలో ఉండే రేడియేషన్‌కీ మరో దేశం తాలూకు రేడియేషన్‌లో కూడా తేడాలుంటాయి. ఉజ్జాయింపుగా ఒక ఉదాహరణ చెప్పాలంటే... మనం 10 రోజుల పాటు స్వాభావికంగానే ఎంత రేడియేషన్‌కు ఎక్స్‌పోజ్ అవుతామో... ఛాతీ ఎక్స్-రే తీయించుకోవాలనుకున్నప్పుడు కేవలం ఆ కొద్ది క్షణాల్లోనే 10 రోజులకు సరిపడా రేడియేషన్‌ను గురవుతామన్నది నిపుణుల తాలూకు ఓ రఫ్ అంచనా.

సీటీ స్కాన్‌లో ఉండేవీ 'ఎక్స్-రే'లే!

వైద్య పరీక్షల్లో భాగంగా 'సీటీ స్కాన్'గా పరిగణించే

స్కానింగ్ ప్రక్రియల్లోనూ ఎక్స్-రేలనే ఉపయోగిస్తారు. కాకపోతే వాటినే మరికొంత అడ్వాన్స్‌డ్ ప్రక్రియల్లో ఉపయోగించి ఎక్స్-రే కంటే అదనపు ప్రయోజనాలను సాధిస్తారు. కాకపోతే ఎక్స్-రేతో పోలిస్తే సీటీ స్కాన్‌లో రేడియేషన్ మోతాదులు ఎక్కువ. ఫలితం కూడా ఎక్కువే. ఇందులో రేడియేషన్ తాలూకు మోతాదూ, తీవ్రతా కాస్తంత ఎక్కువ. కాబట్టి తీయించుకోవడంలోనూ డాక్టర్ల సలహాలు, సూచనలు, విచక్షణ అవసరం. అందుకే వారి సలహా లేకుండా పేషెంట్లు తామంతట తాము సీటీ స్కాన్ కోసం పట్టుబట్టడం అంత సరైనది కాదు.

ఎక్స్-రేలు సురక్షితమేనా...?

ఒక్కమాటలో చెప్పాలంటే... పూర్తిగా సురక్షితమైతే కాదు. మరెందుకు తీయించుకుంటున్నామనే ప్రశ్న ఆవిర్భవిస్తుంది. అయితే... ఎక్స్-రేలకు ఎక్స్‌పోజ్ అయినప్పడు ఉన్న రిస్క్‌తో పోలిస్తే... నిజంగా మనకు అవసరమైనప్పడు చేయించిన వైద్యపరీక్షతో మనకు ఒనగూరే లాభం ఎక్కువ కాబట్టి. అందుకే ఎక్స్-రే లేదా ఇతరత్రా రేడియేషన్ సహాయంతో సీటీ స్కాన్ వంటివి తీసేప్పడు సాధ్యమైనంత తక్కువ రిస్క్‌తో... సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనం పొందేలా రేడియాలజిస్టులు పనిచేస్తారు. అలా వారు శిక్షణ పొందుతారు. మన ఇంట్లో మామూలు బల్బ్ ఆర్పేశాక... కాంతి మాయం అయినట్లే... ఒకసారి ఎక్స్-రే స్విచ్ ఆఫ్ చేశాక మళ్లీ అక్కడ రేడియేషన్ ఉండదు. కాబట్టి ఎక్స్-రే ప్రక్రియ ముగిశాక అక్కడ అరకొర ఎక్స్-రే దుష్ప్రభావాలు ఉండిపోయి... అవి మనకు హానిచేస్తాయేమో అనే ఆందోళన ఎంతమాత్రమూ అవసరం లేదు. అలా అనుకోవడం మన అపోహ మాత్రమే.

డాక్టర్ హేమలత.జి
సీనియర్ కన్సల్టెంట్ రేడియాలజిస్ట్

రేడియేషన్‌తో ఎప్పుడూ ప్రమాదమేనా..?

నిజానికి వైజ్ఞానికి ఆవిష్కరణ అన్నది ఎప్పుడూ పదునైన కత్తి లాంటిది. ఆ పదునుతో ఎన్ని సౌలభ్యాలుంటాయో, అన్ని ప్రమాదాలూ ఉంటాయి. ఎక్స్-రే, సీటీ స్కాన్ వంటి కొన్ని పరీక్షల తాలూకు మరో కోణాన్నీ చూద్దాం. అవును. రేడియేషన్‌తో కచ్చితంగా ఎంతో కొంత ప్రమాదం

ఉండితీరుతుంది.

అయితే రేడియేషన్ అంటే అదేదో కేవలం ఎక్స్-రేలలోనే ఉండదు. నిజానికి మన చుట్టూ ఉండే వాతావరణంలోనూ ఎల్లప్పుడూ ఎంతోకొంత రేడియేషన్ ఉంటుంది. కాకపోతే అది మనకు హానికలిగించే పరిమాణంలో ఉండకపోవచ్చు. వాతావరణంలో ఉన్న రేడియేషన్ అన్నది మనం తన ఉనికిని గుర్తించేంతగా ఉండదు. అదే... ఎక్స్-రే తీసేచోట లేదా వాటితో పనిచేసే చోట అది ఎక్కువగా ఉంటుంది. మితిమీరిన రేడియేషన్ కారణంగా ఎన్నో అనర్థాలూ, ఆరోగ్య సమస్యలూ వచ్చే ముప్పు ఉంటుంది.

ఎక్స్-రేలు... గర్భవతి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మామూలు వ్యక్తులకే ఎక్స్-రేలతో ఎంతోకొంత హాని ఉందనుకుంటే... మరి గర్భవతి కడుపులో పెరుగుతున్న చిన్నారులకూ ఇంకా ఎక్కువ హాని ఉండనే ఉంటుంది. అందుకే గర్భవతికి ఎక్స్-రే విషయంలో డాక్టర్లు చాలా జాగ్రత్తగా ఉంటారు. ఆమెకు మందులు ఇవ్వాల్సి వచ్చినప్పడు ఒక ఫిజీషియన్ ఎంత నిశితంగా వ్యవహరిస్తాడో... ఆమెకు ఎక్స్-రే అవసరమైనప్పడు ఒక రేడియాలజిస్ట్ అంతే నిశితంగా ఉంటాడు. అయితే ప్రతి సందర్భంలోనూ బిడ్డకు ఎక్స్-రే తప్పనిసరిగా హానికరంగా పరిణమిస్తుందని కాదు. కాకపోతే ఇది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు కడుపులోని బిడ్డ ఏ వయసుకు పెరిగింది (అంటే ఏ నెల గర్భం), దానికి హాని చేయకుండా ఎంత మోతాదు ఎక్స్-రేకు గురిచేయవచ్చు... లాంటి అనేక అంశాల మీద ఈ ఎక్స్-రేల తాలూకు ముప్పు ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఏదైనా కారణం చేత గర్భవతి తాలూకు తల, చెయ్యి, కాలు, ఛాతీ వంటి భాగాలకు ఎక్స్-రే తీయాల్సివస్తే... ఆమె కడుపులోని బిడ్డ వాటికి నేరుగా ఎక్స్‌పోజ్ అయ్యే ముప్పు అంతగా ఉండదు. కేవలం ఆమె పొట్టభాగంలో లేదా పొత్తికడుపు భాగాల్లో ఎక్స్-రే తీయాల్సి వచ్చినప్పడే బిడ్డ రేడియేషన్‌కు ఎక్స్‌పోజ్ అయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. అందుకే మిగతావాళ్లతో పోల్చినప్పడు ఎంతో అవసరమైతే తప్ప గర్భవతికి ఎక్స్-రే పరీక్ష నిర్వహించరు. ఒకవేళ చేయాల్సి వచ్చినా ఆమెకు చాలా తక్కువ మోతాదులో ఎక్స్-రేలు వాడేలా నిశితమైన జాగ్రత్తలు తీసుకుంటారు.

గర్భవతులకు ఇప్పుడు ఆందోళన అక్కర్లేదు...

ఏదైనా పనిలో రిస్క్ ఉందంటే... అది అన్నిసార్లూ అన్నే అనర్థాలను తెచ్చిపెట్టకపోవచ్చు. ఎక్స్-రే విషయంలోని ముప్పు కూడా అంతే. ఒకవేళ నిజంగా గర్భవతికి ఎక్స్-రే నిర్వహించాల్సి వస్తే అది తప్పకుండా అనర్థాలు తేకపోవచ్చు. కాకపోతే ఆ కిరణాల వల్ల కడుపులోని బిడ్డకు రిస్క్ ఉన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుని దాన్ని ఏ మేరకు తగ్గించగలరో... అంత మేరకు తగ్గించేలా రేడియాలజిస్టులు జాగ్రత్తలు తీసుకుంటారు. కాబట్టి గర్భవతికి నిజంగా ఎక్స్-రే తీయాల్సిన అవసరమైనప్పడు వారు ఈ విషయంలో మరీ ఎక్కువగా ఆందోళన పడాల్సిన అవసరం ఇప్పడు లేదు. ఎందుకంటే వైద్యపరిశోధనల్లో వచ్చిన ఎన్నో రకాల మార్పులు ఎక్స్-రే ముప్పులనూ గణనీయంగా తగ్గించగలిగాయి.

'రేడియేషన్'ను ఎలా కొలుస్తారంటే....?

ఒక ప్రదేశంలో రేడియేషన్ ఎంత పరిమాణంలో ఉందనే విషయాన్ని తెలుసుకోడానికి లేదా కొలవడానికి ఒక కొలత (యూనిట్) ఉంది. దాని పేరే మిల్లీ సీవెర్ట్ (ఎమ్ఎస్‌వీ). అలాగే రేడియేషన్ మోతాదునూ, తీవ్రతలను కొలవడానికీ రెడ్, రెమ్, రోంట్‌జెన్, సీవెర్ట్, గ్రే వంటి యూనిట్లూ ఉంటాయి.

ఈ వేర్వేరు కొలతలతో మనకు ఉపయోగం ఏమిటి?

కాంతి మన శరీరాన్ని తాకి వెనుదిరుగుతుంది. కానీ ఎక్స్-రేలు లోపలికి ఎముకల వరకూ వెళ్తాయి . అలాగే మన శరీరంలో వేర్వేరు అవయవాలు వాటివాటి స్వభావాన్ని బట్టి ఎక్స్-రేలను తమలోకి అనుమతించడం విషయంలో వేర్వేరుగా స్పందిస్తాయి. అంటే... ఎముకల వరకు వెళ్లాలంటే ఒక మోతాదు బలం అవసరం. అలాగే ఊపిరితిత్తులు మెత్తగా ఉంటాయి కదా. వాటిని చూడాలంటే ఎక్స్-రే వేరే మోతాదులో కావాలి. అలా మనం మన దేహంలోకి చూడాల్సిన అవయవాన్ని బట్టి వేర్వేరు మోతాదులో ఎక్స్-రే పరిమాణాన్ని లోపలికి పంపాలి. అలా మనం మన దేహంలో ఫొటో తీయాలనుకున్న అవయవాన్ని బట్టి వేర్వేరు మోతాదుల్లో ఎక్స్-రే కిరణాలను పంపాల్సి ఉంటుంది. అందుకే ఈ రెడ్, రెమ్, రోంట్‌జెన్, గ్రే వంటి కొలతలు అవసరమవుతాయి.

సీటీ స్కాన్‌తోనూ ఇదే ముప్పా?

ఉంటుంది. ఎందుకంటే... సీటీ స్కాన్‌లోనూ వెలువడే రేడియేషన్ కూడా హానికరమైనదే. అందుకే రేడియాలజిస్టులు సీటీ స్కాన్ తీసేప్పుడు వాడే రేడియేషన్ తాలూకు తీవ్రతనూ వీలైనంతగా తగ్గించేలా శిక్షణ పొందుతారు. అందుకే... ఎక్స్-రేగానీ లేదా సీటీ స్కాన్ గానీ తీయించుకోవడం తప్పనప్పుడు ఈ రేడియేషన్ ప్రమాదాలకు భయపడకూడదు. అలాగే మనకు అవసరం లేకపోయినా... రొటీన్ పరీక్షల పేరిట రేడియేషన్ ఇన్‌వాల్వ్ అయి ఉన్న పరీక్షలనూ తరచూ చేయించుకోవడమూ సరికాదు.

ఇదే ఇలాగుంటే మరి ఎమ్మారైతో...?

ఎక్స్-రేలూ, సీటీ స్కాన్‌లతో ఇంత ముప్పు అయితే మరి వీటన్నికంటే మరింత లోతైన ఫలితాలను చెప్పే ఎమ్మారైతో ఎంత ముప్పు కలుగుతుందో అన్న సందేహం వైద్య పరిజ్ఞానం అంతగా లేని సాధారణ ప్రజల్లో కలగవచ్చు. నిజానికి ఎక్స్-రే, సీటీ స్కాన్‌తో పోలిస్తే ఎమ్మారైతో రేడియేషన్ ప్రమాదమే ఉండదు. ఎందుకంటే ఎమ్మారై అంటే 'మేగ్నటిక్ రిజోనెన్స్ ఇమేజింగ్' అని అర్థం. అంటే ఇందులో కేవలం అయస్కాంత బలాన్ని మాత్రమే ఉపయోగిస్తూ, రేడియేషన్ వాడరు కాబట్టి ఎమ్మారైతో అంతటి ప్రమాదాలు ఉండవు.

రేడియేషన్ కిరణాలతో క్యాన్సర్ వంటి వైద్యచికిత్సలు... రేడియో సర్జరీలు!

రేడియేషన్‌తోనూ వైద్యచికిత్సలు సాధ్యమవుతాయన్న సంగతి తెలిసిందే. అయితే గతంలో రేడియేషన్ థెరపీ విషయానికి వస్తే గతంలో అది చాలా భయం గొలిపేదిగా ఉండేది. అయితే ఇప్పుడలాంటి దుష్ప్రభావాలు చాలావరకు తగ్గాయి. 'ర్యాపిడ్ ఆర్క్ ఇమేజ్ గైడెడ్ రేడియోథెరపీ' వల్ల కేవలం క్యాన్సర్ కణాలకు మాత్రమే రేడియేషన్ తగులుతుంది. ఇలాంటి చికిత్సల్లో రేడియేషన్ కేవలం క్యాన్సర్ కణాల్ని మాత్రమే తన లక్ష్యంగా చేసుకుంటుంది. అత్యాధునిక ప్రక్రియల సహాయంతో దేహంలోని అత్యంత కీలకమైన అవయవాలైన మెదడు, ఊపిరితిత్తులు, కాలేయం వంటి చోట్ల నిర్భయంగా రేడియేషన్‌ను ప్రసరింపజేయవచ్చు. ఇక ఇటీవలే అందుబాటులోకి వచ్చిన 'ఎఫ్ బీమ్' వల్ల చాలా సురక్షితంగా 'రేడియోసర్జరీ' చేయవచ్చు. సాధారణ సర్జరీలో రోగిని ఆసుపత్రిలో చేర్చాలి. కానీ రేడియోసర్జరీలో రోగిని ఆసుపత్రిలో చేర్చాల్సిన అవసరమే ఉండదు. పైగా రేడియేషన్‌తో చేసేదైనప్పటికీ ఇది పూర్తిగా సురక్షితం.

నిర్వహణ: యాసీన్

బిజినెస్ రీల్

ఐడీ ఫ్రెష్ ఫుడ్స్‌కు పెట్టుబడుల దన్ను

అపాక్స్ పార్ట్‌నర్స్ నుంచి రూ. 1,500 కోట్లు

ముంబై: గ్లోబల్ పీఈ సంస్థ అపాక్స్ పార్ట్‌నర్స్ బెంగళూరు కంపెనీ ఐడీ ఫ్రెష్ ఫుడ్స్‌లో రూ. 1,500 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. తద్వారా ఐడీ ఫ్రెష్‌లో అపాక్స్ ప్రస్తావించదగ్గ స్థాయిలో మైనారిటీ వాటాను సొంతం చేసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వీటి ప్రకారం ఐడీ ఫ్రెష్‌లో ప్రస్తుత వాటాదారులు ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, టీపీజీ న్యూక్వెస్ట్ నుంచి 35 శాతం వాటా కొనుగోలు చేసింది. అయితే ప్రస్తుత వాటాదారులు ఐడీ ఫ్రెష్‌లో ఇన్వెస్టర్లుగా కొనసాగనున్నట్లు తెలుస్తోంది. 2005లో ఏర్పాటైన కంపెనీ ఇడ్లీ, దోశల పిండిని స్థానిక రిటైలర్లకు సరఫరా చేసే సంగతి తెలిసిందే. తదుపరి దేశవ్యాప్తంగా విస్తరించడంతోపాటు.. ప్రస్తుతం 2,400 మందికి ఉపాధి కల్పిస్తోంది.



వారీ ఎనర్జీస్ నిధుల సమీకరణ

పెట్టుబడి వ్యయాల కోసం రూ. 1,003 కోట్లు

న్యూఢిల్లీ: ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ రంగ కంపెనీ వారీ ఎనర్జీస్ తాజాగా నిధుల సమీకరణ చేపట్టింది. వ్యూహాత్మక ఇన్వెస్టర్ల నుంచి అనుబంధ సంస్థ వారీ ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్ రూ. 1,003 కోట్లు అందుకున్నట్లు వెల్లడించింది. ఇన్వెస్టర్లలో కుటుంబ కార్యాలయాలు, సంస్థాగత ఇన్వెస్టర్లు, సంపన్న వర్గాలున్నట్లు పేర్కొంది. కంపెనీ 20 జీడబ్ల్యూహెచ్ అడ్వాన్స్‌డ్ లిథియం–అయాన్ సెల్, బ్యాటరీ ప్యాక్ తయారీ ప్లాంటు ఏర్పాటుకు రూ. 10,000 కోట్ల పెట్టుబడి వ్యయ ప్రణాళికల్లో ఉంది. దీనిలో భాగంగా రూ. 1,003 కోట్లు సమకూర్చుకున్నట్లు వారీ ఎనర్జీస్ వెల్లడించింది. స్టోరేజ్ సిస్టమ్స్, ఎలక్ట్రిక్ మొబిలిటీ తదితర విభాగాల కోసం హైపెర్ఫార్మెన్స్ సెల్స్, బ్యాటరీ ప్యాక్స్ తయారీకి వీలుగా ఏర్పాటు చేస్తున్న ప్లాంటుపై నిధులు వెచ్చించనున్నట్లు వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-1-2026	
విశాఖ	585-00
చిత్తూరు	663-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	620-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	580-00
వరంగల్	582-00
రిటైల్ ధర	6.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
COALINDIA	429.1	7.15
NTPC	351.65	4.56
HINDALCO	926.5	3.53
TRENT	4,400.00	2.39
SBIN	1,005.65	2.12

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ITC	350.1	-3.78
KOTAKBANK	2,189.90	-1.26
NESTLEIND	1,280.40	-1.13
SHRIRAMFIN	1,010.10	-0.94
BAJAJ-AUTO	9,499.00	-0.62

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,237
ఎన్‌ఎస్‌ఈ	1,04,602
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,68,276
ఎఫ్ఐఐ	- 36
డీఐఐ	+ 1,764

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	58.27	$ 57.32
బ్రెంట్	60.75	$ 60.75

8 కంపెనీల లిస్టింగ్‌కు ఓకే

సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్
- జాబితాలో ఇందిరా ఐవీఎఫ్
- రేస్ ఆఫ్ బిలీఫ్, శ్రీరామ్ ఫుడ్
- జెరాయ్ ఫిట్‌నెస్, గ్లాస్ వాల్

ఐపీవో స్ట్రీట్



సరికొత్త రికార్డులను సృష్టిస్తూ రెండేళ్లుగా కళకళలాడుతున్న ప్రైమరీ మార్కెట్లు ఈ కేలండర్ ఏడాది(2026)లోనూ దూకుడు చూపనున్నాయి. ఇప్పటికే పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిస్టింగ్ బాట పట్టగా.. హిందుస్తాన్ ల్యాబొరేటరీస్ ఐపీవోకు దరఖాస్తు చేసింది. తాజాగా 8 కంపెనీల ప్రాస్పెక్టస్‌లకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివరాలు చూద్దాం..

న్యూఢిల్లీ: కొత్త ఏడాదిలో విభిన్న రంగాలకు చెందిన 8 కంపెనీలు పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు సెబీ నుంచి అనుమతి పొందాయి. జాబితాలో ఆర్‌కేసీపీఎల్ లిమిటెడ్, చార్టర్డ్ స్పీడ్, గ్లాస్ వాల్ సిస్టమ్స్(ఇండియా), జెరాయ్ ఫిట్‌నెస్, శ్రీరామ్ ఫుడ్ ఇండస్ట్రీ, టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్(ఇండియా), ఇందిరా ఐవీఎఫ్, రేస్ ఆఫ్ బిలీఫ్ చేరాయి. ఈ కంపెనీలన్నీ 2025 జూలై– సెప్టెంబర్ మధ్య కాలంలో సెబీకి దరఖాస్తు చేశాయి. ఐపీవోలు విజయవంతమైతే ఈ కంపెనీలన్నీ బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో లిస్టకానున్నాయి. ప్రధానంగా ఫెర్టిలిటీ సర్వీసులందించే ఇందిరా ఐవీఎఫ్, రేస్ ఆఫ్ బిలీఫ్ గోప్యతా మార్గంలో ఐపీవోకు దరఖాస్తు చేసి అనుమతి పొందాయి.

ఆర్‌కేసీపీఎల్

నిర్మాణం, మౌలిక సదుపాయాల కంపెనీ ఆర్‌కేసీపీఎల్ లిమిటెడ్ ఐపీవో ద్వారా రూ. 1,250 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉంది. ఇందుకు అనుగుణంగా రూ. 700 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 550 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను కార్యకలాపాలు, బ్యాలెన్స్‌షీట్ పటిష్టతకు వినియోగించనుంది. రూ. 200 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ. 130 కోట్లు నిర్మాణ సంబంధ పరికరాల కొనుగోలుకి వెచ్చించనుంది. రూ. 188 కోట్లు రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది.

చార్టర్డ్ స్పీడ్

ప్రయాణికుల చేరవేత కంపెనీ చార్టర్డ్ స్పీడ్ లిమిటెడ్ ఐపీవోలో భాగంగా రూ. 655 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 200 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 855 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. నిధుల్లో రూ. 396 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుండగా, రూ. 97 కోట్లు ఎలక్ట్రిక్ బస్సులపై ఇన్వెస్ట్ చేయనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది.

గ్లాస్ వాల్

ఫ్యాసేడ్ సిస్టమ్స్ తయారీ, ఇన్‌స్టలేషన్ కంపెనీ గ్లాస్ వాల్ సిస్టమ్స్(ఇండియా) లిమిటెడ్ ఐపీవోలో భాగంగా రూ. 60 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 4.02 కోట్ల షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు.

శ్రీరామ్ ఫుడ్

ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లకు బియ్యం ఎగుమతి చేసే శ్రీరామ్ ఫుడ్ ఇండస్ట్రీ ఐపీవోలో భాగంగా 2.12 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 52 లక్షల షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. 2014లో ఏర్పాటైన కంపెనీ బీ2బీ పద్ధతిలో బియ్యం ఎగుమతులను చేపడుతోంది.

జెరాయ్ ఫిట్‌నెస్

ఫిట్‌నెస్ పరికరాల తయారీ కంపెనీ జెరాయ్ ఫిట్‌నెస్ ప్రమోటర్లు ఐపీవోలో భాగంగా 43.92 లక్షల ఈక్విటీ షేర్లను ఆఫర్ చేయనున్నారు. దీంతో ఐపీవో నిధులు కంపెనీ ప్రమోటర్లకు చేరనున్నాయి. కంపెనీ కస్టమర్లలో కమర్షియల్ జిమ్స్, హోటళ్లు, కార్పొరేషన్లు, దేశ, విదేశాలలోని రియల్టీ ప్రాజెక్టులున్నాయి. జిమ్ పరికరాలను జపాన్, యూఏఈ, ఆస్ట్రేలియా, స్వీడన్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తోంది.

టెంప్‌సెన్స్

థర్మల్ ఇంజినీరింగ్, కేబుళ్ల తయారీ కంపెనీ టెంప్ సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్(ఇండియా) ఐపీవోలో భాగంగా రూ. 118 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.79 కోట్ల షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు.

ఇందిరా ఐవీఎఫ్, రేస్ ఆఫ్ బిలీఫ్

ఫెర్టిలిటీ సేవల కంపెనీలు ఇందిరా ఐవీఎఫ్, రేస్ ఆఫ్ బిలీఫ్ గోప్యతా మార్గంలో సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసి అనుమతి పొందాయి. ఇందిరా ఐవీఎఫ్ మెయిన్ బోర్డులో లిస్టకానున్నట్లు 2025 జూలైలో ప్రకటించింది. గోప్యతా విధానంలో దరఖాస్తు చేయడం ద్వారా కంపెనీలు ముసాయిదా ప్రాస్పెక్టస్ వివరాలను రహస్యంగా ఉంచేందుకు వీలుంటుంది. పబ్లిక్ ఇష్యూకి వచ్చే ముందు వివరాలు వెల్లడించే సంగతి తెలిసిందే.

గత రెండేళ్ల రికార్డులిలా

2025 కేలండర్ ఏడాదిలో ప్రైమరీ మార్కెట్లు కదం తొక్కాయి. సరికొత్త చరిత్రకు తెరతీస్తూ 102 కంపెనీలు లిస్టయ్యాయి. తద్వారా రూ. 1.76 లక్షల కోట్లు సమీకరించాయి. దీంతో 2024లో 90 కంపెనీలు ఐపీవోలు చేపట్టడం ద్వారా సమీకరించిన రూ. 1.6 లక్షల కోట్ల రికార్డ్ వెనుకబడింది. అంతకుముందు 2023లో 57 కంపెనీలు మాత్రమే పబ్లిక్ ఇష్యూకి వచ్చి రూ. 49,436 కోట్లు సమకూర్చుకున్నాయి.

ఐపీవో బాటలో హిందుస్తాన్ ల్యాబ్

సెబీకి ప్రాథమిక ప్రాస్పెక్టస్ దాఖలు

జనరిక్ ఔషధాల తయారీ కంపెనీ హిందుస్తాన్ ల్యాబొరేటరీస్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. వీటి ప్రకారం ఐపీవోలో భాగంగా 50 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 91 లక్షల షేర్లను కంపెనీ ప్రమోటర్ ఆఫర్ చేయనున్నారు. ఇష్యూ నిధులను వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా జనరిక్ ఔషధాల తయారీ, సరఫరా కార్యకలాపాలను నిర్వహిస్తోంది. బిజినెస్ టు గవర్నమెంట్(బీ2జీ) పద్ధతిలో భారీ స్థాయిలో ఔషధాల తయారీని చేపట్టి ప్రభుత్వ రంగ సంస్థలకు సరఫరా చేస్తోంది. యాంటీఅలర్జిక్, యాంటీ డయాబెటిక్, యాంటీఇన్‌ఫెక్టివ్స్, గ్యాస్ట్రోఇంటెస్టినల్, న్యూట్రిషనల్ తదితర వివిధ థెరప్యూటిక్ విభాగాల ఔషధ తయారీ, సరఫరా చేపడుతోంది.

భారత్ కోకింగ్ కోల్ @ రూ. 21-23

రూ. 1,071 కోట్ల సమీకరణపై కన్ను

మైనింగ్ రంగ పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ కంపెనీ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్(బీసీసీఎల్) పబ్లిక్ ఇష్యూకి రూ. 21–23 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 9న ప్రారంభమై 13న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 8న షేర్లను ఆఫర్ చేయనుంది. ఇష్యూలో భాగంగా మాతృ సంస్థ కోల్ ఇండియా 46.57 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. తద్వారా రూ. 1,071 కోట్లకుపైగా సమీకరించాలని భావిస్తోంది. కంపెనీ లిస్టింగ్‌లో రూ. 10,700 కోట్ల విలువ సాధించే అవకాశముంది. వెరసి కొత్త కేలండర్ ఏడాదిలో తొలి ఐపీవోగా బీసీసీఎల్ నిలవనుంది. బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో ఈ నెల 16న లిస్ట్ కానుంది. రేటింగ్ దిగ్గజం క్రిసిల్ నివేదిక ప్రకారం కోకింగ్ కోల్ ఉత్పత్తిలో గతేడాది(2024–25) బీసీసీఎల్ అతిపెద్ద కంపెనీగా నిలిచింది. ఈ కాలంలో ఆదాయం రూ. 13,802 కోట్లుకాగా.. రూ. 1,204 కోట్ల నికర లాభం ఆర్జించింది.

కార్యకలాపాల విస్తరణ

1972లో ఏర్పాటైన బీసీసీఎల్ ప్రధానంగా స్టీల్, విద్యుత్ పరిశ్రమల్లో వినియోగించే కోకింగ్ కోల్, నాన్‌కోకింగ్ కోల్, వాష్‌డ్ కోల్ ఉత్పత్తి చేస్తోంది. కంపెనీ తొలుత ఝరియా(జార్ఖండ్), రాణిగంజ్(పశ్చిమ బెంగాల్) గనుల నుంచి కోకింగ్ కోల్ సరఫరా కోసం ఏర్పాటైంది. తదుపరి కాలంలో భారీస్థాయిలో కార్యకలాపాలు విస్తరించింది. 2025కల్లా 40.50 మిలియన్ టన్నుల కోల్‌ను ఉత్పత్తి చేసింది. 2022లో సాధించిన 30.51 మిలియన్ టన్నులతో పోలిస్తే ఇది 33 శాతం వార్షిక వృద్ధి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి ఆరు నెలల్లో 15.75 మిలియన్ టన్నుల కోల్‌ను ఉత్పత్తి చేసింది. అయితే గతేడాది ఇదే కాలం(ఏప్రిల్–సెప్టెంబర్)లో ఉత్పత్తి చేసిన 19.09 మిలియన్ టన్నులతో పోలిస్తే క్షీణత నమోదైంది. 2025 సెప్టెంబర్‌కల్లా 34 గనులను నిర్వహిస్తోంది. వీటిలో 4 భూగర్భంలోనివికాగా.. 26 ఓపెన్‌కాస్ట్ గనులు.

బీఎస్‌ఈలో కోల్ ఇండియా షేరు నామమాత్ర నష్టంతో రూ. 427 వద్ద ముగిసింది.

ఎగుమతుల వృద్ధిపై ఫార్మెక్సిల్ ఫోకస్

కేంద్ర ప్రభుత్వంతో ప్రతినిధి బృందం భేటీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా ఎగుమతులను మరింతగా పెంచడంపై ఔషధాల ఎగుమతుల సంస్థల మండలి ఫార్మెక్సిల్ దృష్టి పెడుతోంది. ఇందుకోసం తీసుకోతగిన చర్యలపై కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులతో ఫార్మెక్సిల్ ప్రతినిధి బృందం భేటీ అయ్యింది. వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, విధానాల గురించి ఈ సమావేశాల్లో చర్చించింది. వాణిజ్య–పరిశ్రమల శాఖ కార్యదర్శి రాజేశ్ అగ్రవాల్, ఫార్మా శాఖ కార్యదర్శి మనోజ్ జోషి, డీజీఎఫ్‌టీ డైరెక్టర్ జనరల్ లవ్ అగర్వాల్ తదితరులతో చర్చల్లో ఫార్మెక్సిల్ చైర్మన్ నమిత్ జోషి, ఐఫెక్స్ 2026 చైర్మన్ నిపుణ్ జైన్, డైరెక్టర్ జనరల్ రాజా భాను పాల్గొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఫార్మా ఎగుమతులు 9.4 శాతం వృద్ధి చెంది 30.47 బిలియన్ డాలర్లకు చేరాయని తెలిపారు. ప్రస్తుతం 60 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీ ఫార్మా మార్కెట్ 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు చేరనున్నట్లు వివరించారు. అలాగే, న్యూఢిల్లీలో సెప్టెంబర్ 7–9 మధ్య నిర్వహించే ఐఫెక్స్ 2026 సదస్సు వివరాలను తెలియజేశారు. ప్రభుత్వం నుంచి మద్దతు, పటిష్టమైన ఎగుమతులు .. దేశీ మార్కెట్ దన్నుతో భారత ఫార్మా పరిశ్రమ అంతర్జాతీయంగా గణనీయంగా విస్తరించేందుకు అవకాశాలు ఉన్నాయని నమిత్ జోషి తెలిపారు.

టొరెంట్ ఫార్మా నిధుల సమీకరణ

రూ. 12,500 కోట్లకు బోర్డు గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: ప్రయివేట్ ప్లేస్‌మెంట్ ద్వారా నిధుల సమీకరణ చేపట్టేందుకు బోర్డు అనుమతించినట్లు ఔషధ రంగ దిగ్గజం టొరెంట్ ఫార్మాస్యూటికల్స్ పేర్కొంది. మార్పిడికి వీలుకాని లిస్టెడ్, రేటెడ్, రిడీమబుల్ డిబెంచర్ల జారీ ద్వారా రూ. 12,500 కోట్ల వరకూ సమకూర్చుకునేందుకు బోర్డు తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించింది. వీటిని ఒకే దశలో లేదా దశలవారీగా జారీ చేసేందుకు వీలున్నట్లు తెలియజేసింది. కంపెనీ గతేడాది ఔషధ రంగానికే చెందిన జేబీ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 19,500 కోట్లు వెచ్చించిన సంగతి తెలిసిందే.

బీఎస్‌ఈలో టొరెంట్ ఫార్మా షేరు 0.25 శాతం నీరసించి రూ. 3,875 వద్ద ముగిసింది.

మరిన్ని టారిఫ్‌లతో ఎగుమతులకు దెబ్బ

అమెరికా ప్రకటనపై నిపుణుల అభిప్రాయం

న్యూఢిల్లీ: భారత్‌పై అమెరికా మరిన్ని టారిఫ్‌లు విధిస్తే అగ్రరాజ్యానికి మన ఎగుమతులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. దీనితో ఎగుమతిదార్లు మరింత వేగంగా ఇతర మార్కెట్లకు ఎగుమతులను పెంచుకోవాల్సి వస్తుందని వివరించారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నందున భారత్‌పై మరిన్ని టారిఫ్‌లు విధిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో నిపుణులు ఈ మేరకు తమ అభిప్రాయాలు తెలిపారు. 2025 మే–నవంబర్ మధ్య కాలంలో అమెరికాకు భారత్ ఎగుమతులు 20.7 శాతం తగ్గాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) పేర్కొంది. మన ఎగుమతులపై ఇప్పటికే 50 శాతం టారిఫ్‌లు అమలవుతుండగా వాటిని ఇంకా పెంచితే, ఎగుమతులు మరింత భారీగా పడిపోవచ్చని వివరించింది. 'చైనా తరహాలో అమెరికాపై భారత్‌కి పైచేయేమీ లేదు. నిజానికి రష్యా క్రూడాయిల్‌ని చైనాయే అత్యధికంగా కనుగోలు చేస్తోంది. కానీ పరిణామాలకు భయపడి దాని గురించి అమెరికా పట్టించుకోవడం లేదు. భారత్ మాత్రం అమెరికా నుంచి పెట్రోలియం క్రూడ్, ఇతర ఉత్పత్తుల దిగుమతులను పెంచుకుంది. కానీ దీన్ని అమెరికా పట్టించుకోదు' అని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు.

ఎయిరిండియా సీఈవో మార్పుపై టాటాల కసరత్తు

క్యాంప్‌బెల్ విల్సన్‌కు గుడ్‌బై చెప్పే యోచన

న్యూఢిల్లీ: ఎయిరిండియాకు కొత్త సీఈవోను నియమించే దిశగా టాటా గ్రూప్ అన్వేషణ ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్‌బెల్ విల్సన్ పదవీ కాలం 2027 జూన్‌తో ముగియనున్న నేపథ్యంలో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. అలాగే తక్కువ ఖర్చుతో సేవలు అందించే అనుబంధ సంస్థ 'ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్' కొత్త ఎండీ నియామకంపైనా టాటా గ్రూప్ దృష్టి సారించినట్లు తెలిసింది. ''2027 తర్వాత ఒప్పందాన్ని పొడిగించాలనే ఉద్దేశం విల్సన్‌కూ, టాటా గ్రూప్‌కూ లేదు. ఆయన స్థానంలో మరో వ్యక్తిని సీఈవోగా చేయాలని టాటాసన్స్ భావిస్తోంది. అందులో భాగంగా ఎయిరిండియాకు బాధ్యతలు చేపట్టగలిగే సామర్థ్యం కలిగిన అభ్యర్థులతో చర్చలు జరుపుతున్నారు'' అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా బోయింగ్ 787–8 ప్రమాదానికి సంబంధించిన తుది నివేదిక జూన్ నాటికి వెలువడే అవకాశం ఉందని సమాచారం. కాగా, టాటా హౌస్‌లో సోమవారం జరిగిన ఓ అధికారిక సమావేశానికి క్యాంప్‌బెల్ విల్సన్ హాజరు కావడం గమనార్హం.

ప్రైవేటు క్రెడిట్ వ్యాపారంలోకి హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ

స్ట్రక్చర్డ్ క్రెడిట్ ఫండ్–ఐ ప్రారంభం

న్యూఢిల్లీ: వేగంగా విస్తరిస్తున్న ప్రైవేటు క్రెడిట్ వ్యాపారంలోకి హెచ్‌డీఎఫ్‌సీ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) అడుగుపెట్టింది. 'స్ట్రక్చర్డ్ క్రెడిట్ ఫండ్–ఐ'ను ప్రారంభించింది. ఈ ఫండ్‌లో ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) రూ.220 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ ప్రకటించింది. ఇప్పటికే ఈ ఫండ్‌లో రూ.1,290 కోట్ల పెట్టుబడులకు సంబంధించి హామీలను పొందినట్లు తెలిపింది. రూ.1,500 కోట్లు సమీకరించాలన్నది లక్ష్యమని, స్పందన ఆధారంగా మరో రూ.1,000 కోట్లు సమీకరించే అవకాశం (గ్రీన్‌షూ ఆప్షన్) కూడా ఉన్నట్టు పేర్కొంది. ఈ ఫండ్ మొత్తంలో తనవంతుగా 14 శాతం సమకూర్చనున్నట్టు తెలిపింది. సంప్రదాయ మార్గాల్లో నిధుల సాయం అంతగా అందని మధ్యస్థ కంపెనీలకు ప్రత్యామ్నాయ రుణ సదుపాయ సేవలను ఈ ఫండ్ ద్వారా అందించనుంది. ఇప్పటికే రూ.380 కోట్లకు సంబంధించి మూడు ఒప్పందాలకు అంగీకారం కుదిరినట్టు తెలిపింది. 4–6 ఏళ్ల కాలంలో మిడ్‌టీన్ రాబడులను (15–17 శాతం) లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించింది.

డిమాండ్ కోలుకుంటున్న సంకేతాలు

- క్యూ3లో సింగిల్ డిజిట్ వృద్ధి
- ప్రకటించిన డాబర్ ఇండియా

న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ సంస్థ డాబర్ ఇండియా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంపై (2025–26 క్యూ3) ప్రాథమిక గణాంకాలను విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ఆదాయం మధ్యస్థ ఒక అంకె వృద్ధిని చూస్తుందని, నిర్వహణ లాభం, నికర లాభం ఇంతకు మించి వృద్ధి చెందుతాయని ప్రకటించింది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో డిసెంబర్ క్వార్టర్‌లో (క్యూ3) డిమాండ్ కోలుకుంటుందనడానికి ముందస్తు సంకేతాలు కనిపించినట్టు పేర్కొంది. అక్టోబర్‌లో పంపిణీదారులు, రిటైలర్లు అధిక ధరలతో కూడిన ముందస్తు నిల్వలను తగ్గించుకోవడంపై దృష్టి సారించినట్టు తెలిపింది. ఆ తర్వాత పట్టణ, గ్రామీణ మార్కెట్లలో వినియోగ ధోరణి మెరుగుపడినట్టు వెల్లడించింది. ముఖ్యంగా పట్టణ డిమాండ్ కంటే గ్రామీణ డిమాండ్ మెరుగ్గా ఉన్నట్టు తెలిపింది. సానుకూల స్థూల ఆర్థిక అంశాలు (ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు కనిష్టాల్లో ఉండడం, జీడీపీ బలమైన పనితీరు) రానున్న త్రైమాసికాల్లో స్థిరమైన డిమాండ్‌కు, ఆదాయం మెరుగునకు మద్దతునిస్తాయని అభిప్రాయపడింది. భారత్‌లో గృహ, వ్యక్తిగత సంరక్షణ వ్యాపారం రెండంకెల స్థాయిలో పెరుగుతుందని తెలిపింది. డాబర్ ఆమ్ల, డాబర్ ఆల్మండ్, డాబర్ రెడ్ టూత్‌పేస్ట్, మెస్వాక్ అమ్మకాలు మెరుగ్గా ఉన్నట్టు పేర్కొంది. అలాగే క్యూ3లో తమ ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోలో అధిక శాతం ఆయా విభాగాల వృద్ధిని మించి పనితీరు చూపించినట్టు వెల్లడించింది. ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తుల వ్యాపారం తక్కువ సింగిల్ డిజిట్ వృద్ధి (5 శాతంలోపు)ని చూసినట్టు తెలిపింది. ఫుడ్, బెవరేజెస్, కలినరీ విభాగాల్లో రికార్డు స్థాయిలో రెండంకెల వృద్ధి కనిపించినట్టు వెల్లడించింది.

అన్ని ఛానళ్లలోనూ బలమైన పనితీరు

సంప్రదాయ విక్రయ ఛానల్‌లో (రిటైల్ దుకాణాలు) అమ్మకాలు బలంగా పెరిగాయని, అదే విధంగా ఈ-కామర్స్, క్విక్ కామర్స్ ఛానళ్లలో రెండంకెల అమ్మకాలు ఉన్నట్టు డాబర్ ఇండియా తెలిపింది. అంతర్జాతీయంగా చూస్తే మెనా, టర్కీ, నేపాల్, బంగ్లాదేశ్‌లో కంపెనీ ఉత్పత్తుల అమ్మకాలు మెరుగ్గా ఉన్నట్టు వెల్లడించింది. మొత్తం మీద అంతర్జాతీయ వ్యాపారం రెండంకెల వృద్ధిని నమోదు చేస్తుందని వివరించింది.

టెల్కోలకు రూ. 150 కోట్ల జరిమానా

అవాంఛిత కాల్స్‌కి ట్రాయ్ పెనాల్టీ



న్యూఢిల్లీ: అవాంఛిత కాల్స్, మెసేజీలను కట్టడి చేయడంలో విఫలమైనందుకు గాను టెల్కోలకు టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ రూ. 150 కోట్ల జరిమానా విధించింది. నెలకు రూ. 50 లక్షల వరకు పెనాల్టీలతో 2020 నుంచి మూడేళ్ల వ్యవధికి గాను ఈ మొత్తాన్ని కట్టాలని ఆదేశించింది. కస్టమర్ల ఫిర్యాదులను సరిగ్గా పరిష్కరించకపోవడం, నిబంధనలకు తగ్గట్లుగా స్పామర్లపై తగిన చర్యలు తీసుకోకపోవడంలాంటి ఆరోపణలు ఇందుకు కారణం. అయితే, ఈ జరిమానాను టెల్కోలు సవాలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ట్రాయ్ గతేడాది 21 లక్షల స్పామ్ కనెక్షన్లను డిస్కనెక్ట్ చేయడంతో పాటు 1 లక్ష పైగా ఎంటిటీలను (సంస్థలు, వ్యక్తులు) బ్లాక్‌లిస్టులో పెట్టింది. 4–6 క్లిక్‌లతో కస్టమర్లు తమ ఫిర్యాదులను నమోదు చేసేందుకు వీలుగా ట్రాయ్ డీఎన్‌డీ యాప్ అందుబాటులో ఉంది. కాల్స్ లేదా మెసేజీలు వచ్చిన 7 రోజుల వరకు ఫిర్యాదు చేయొచ్చు. సాధారణంగా ప్రభుత్వ విభాగాలు, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, బీమా రంగాల కంపెనీలు లావాదేవీలు..సర్వీసులపరమైన కాల్స్ చేసేందుకు 1600 సిరీస్‌తో మొదలయ్యే నంబర్లను ఉపయోగించాల్సి ఉంటుంది. 10 అంకెల మొబైల్ నంబర్ల నుంచి ప్రమోషనల్ కాల్స్ చేయకూడదు. రిజిస్టర్డ్ టెలీ మార్కెటర్లకు కఠినతరమైన నిబంధనలు అమలవుతున్నప్పటికీ, ఇప్పుడు రిజిస్టర్ చేసుకోని వ్యక్తుల.. 10 అంకెల మొబైల్ నంబర్ల నుంచి స్పామ్ కాల్స్, మెసేజీలు అత్యధికంగా వస్తున్నాయి.



మనోజ్ కొఠారి కన్నుమూత

బిలియర్డ్స్‌లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఘనత

కోల్‌కతా: బిలియర్డ్స్ మాజీ ఆటగాడు, వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన మనోజ్ కొఠారి తీవ్ర గుండెపోటుతో మృతి చెందారు. ఆయన వయసు 67 సంవత్సరాలు. కోల్‌కతాలో నివాసం ఉంటున్న కొఠారికి తమిళనాడులోని తిరునల్వేలిలోని ఒక ఆస్పత్రిలో పది రోజుల క్రితం లివర్ ట్రాన్స్‌ప్లాంట్ జరిగింది. ఈ శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న సమయంలో అనూహ్యంగా వచ్చిన గుండెపోటుతో అక్కడే ఆయన కన్ను మూశారు. మనోజ్ కొఠారి ప్రస్తుతం భారత జాతీయ జట్టు చీఫ్ కోచ్‌గా కూడా ఉన్నారు. సోమవారం తిరునల్వేలిలోనే ఆయన అంత్యక్రియలు ముగిశాయి. 1990లో ఐబీఎస్ఎఫ్ వరల్డ్ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడంతో మనోజ్ పేరు మారుమోగిపోయింది. 1997లో ఆయన వరల్డ్ డబుల్స్ బిలియర్డ్స్ టైటిల్‌ను కూడా సొంతం చేసుకున్నారు. ఆటగాడిగా రిటైర్ అయ్యాక శిక్షకుడిగా తన స్థాయిని ప్రదర్శించిన మనోజ్... 2011 నుంచి భారత జట్టు కోచ్‌గా వ్యవహరిస్తుండటం విశేషం. ఆయన కుమారుడు సౌరవ్ కొఠారి భారత అత్యుత్తమ బిలియర్డ్స్ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. తండ్రి శిక్షణ, మార్గనిర్దేశనంలో పలు విజయాలు సాధించిన సౌరవ్... మనోజ్ తరహాలోనే 2025లో ఐబీఎస్ఎఫ్ వరల్డ్ బిలియర్డ్స్ చాంపియన్‌గా నిలిచాడు. ఆటకు చేసిన సేవలకుగాను 2005లో కేంద్ర ప్రభుత్వం మనోజ్ కొఠారిని ప్రతిష్టాత్మక ధ్యాన్‌చంద్ అవార్డుతో సత్కరించింది. బిలియర్డ్స్ చరిత్రలో ప్రపంచ చాంపియన్లుగా నిలిచిన తండ్రీ కొడుకుల జోడీ ఇదొక్కటే కావడం చెప్పుకోదగ్గ విశేషం.

అటు రూట్... ఇటు హెడ్

● జో రూట్ భారీ సెంచరీ ● ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 384 ఆలౌట్
● హెడ్ 87 బంతుల్లో 15 ఫోర్లతో 91 నాటౌట్ ● ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 166/2 ● 'యాషెస్' చివరి టెస్టు

జో రూట్

సిడ్నీ: ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న 'యాషెస్' సిరీస్‌లో చివరిదైన ఐదో టెస్టు రసవత్తరంగా సాగుతోంది. బ్యాటర్లు మెరుగైన స్కోరు చేయడంతో... తొలుత ఇంగ్లండ్ మంచి స్కోరు చేసింది. అనంతరం ఓపెనర్ హెడ్ విజృంభించడంతో ఆస్ట్రేలియా దీటుగా బదులిస్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 211/3తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్... చివరకు 97.3 ఓవర్లలో 384 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (242 బంతుల్లో 160; 15 ఫోర్లు) రికార్డు సెంచరీతో కదం తొక్కగా... హ్యారీ బ్రూక్ (97 బంతుల్లో 84; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో నెసెర్ 4 వికెట్లు పడగొట్టగా... స్టార్క్, బోలాండ్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 34.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్ (87 బంతుల్లో 91 నాటౌట్; 15 ఫోర్లు) సెంచరీకి చేరువ కాగా... మార్నస్ లబుషేన్ (48; 7 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో స్టోక్స్ 2 వికెట్లు పడగొట్టాడు. చేతిలో 8 వికెట్లు ఉన్న ఆస్ట్రేలియా... ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 218 పరుగులు వెనుకబడి ఉంది. హెడ్‌తో పాటు నైట్ వాచ్‌మన్ నెసెర్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

రూట్ రికార్డు శతకం

తొలి రోజు వర్షం కారణంగా మ్యాచ్ పూర్తి స్థాయిలో జరగకపోగా... రెండో రోజు ఇరు జట్ల బ్యాటర్లు పరుగుల వరద పారించారు. ఈ సిరీస్ ద్వారానే ఆస్ట్రేలియా గడ్డపై తొలి శతకం నమోదు చేసిన జో రూట్... మరో సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో టెస్టు ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన జాబితాలో మూడో స్థానంలో ఉన్న రికీ పాంటింగ్ (41)ను సమం చేశాడు. సచిన్ టెండూల్కర్ (51), జాక్ కలిస్ (45) ముందున్నారు. హ్యారీ బ్రూక్ ఎక్కువసేపు నిలవలేకపోగా... 11 బంతులాడిన కెప్టెన్ బెన్ స్టోక్స్ (0) ఖాతా తెరవకుండానే స్టార్క్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఈ సిరీస్‌లో స్టార్క్ చేతిలో అవుట్ కావడం స్టోక్స్‌కు ఇది ఐదోసారి. ఓవరాల్‌గా 14వసారి. అయితే జేమీ స్మిత్ (76 బంతుల్లో 46; 6 ఫోర్లు, 1 సిక్స్), విల్ జాక్స్ (62 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్) సహకారంతో రూట్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. బ్రూక్‌తో నాలుగో వికెట్‌కు 169 పరుగులు జోడించిన రూట్... ఆరో వికెట్‌కు స్మిత్‌తో 94, ఏడో వికెట్‌కు జాక్స్‌తో 52 పరుగులు జత చేశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం వెనక్కి తగ్గని రూట్ 146 బంతుల్లో టెస్టుల్లో 41వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. నెసెర్ తన బౌలింగ్‌లో పట్టిన చక్కటి రివర్స్ క్యాచ్‌తో రూట్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఆ తర్వాత ఇంగ్లండ్ ఆలౌట్ అయ్యేందుకు ఎక్కువ సమయం పట్టలేదు.

హెడ్

ఆసీస్ ధనాధన్..

మంచి స్కోరే చేశాం అని ఇంగ్లండ్ బ్యాటర్లు ఆనందపడే లోపే... ఆస్ట్రేలియా ఓపెనర్ హెడ్ వారి ఆశలపై నీళ్లు చల్లాడు. టి20 తరహా దూకుడుతో... వాయువేగంతో పరుగులు రాబట్టాడు. ఈ సిరీస్‌లో ఇప్పటికే రెండు శతకాలు నమోదు చేసుకున్న హెడ్... రెండో రోజు ఆట ముగిసే సమయానికి మూడో సెంచరీకి 9 పరుగుల దూరంలో నిలిచాడు. 55 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న హెడ్ ఆ తర్వాత మరింత రెచ్చిపోయాడు. ప్రతి బంతిని బౌండరీకి తరలించాలి అనేంత కసిగా ఆడాడు. ఈ క్రమంలో ఈ సిరీస్‌లో 500 పరుగులు పూర్తి చేసుకున్నాడు. మరో ఓపెనర్ వెదరాల్డ్ (21)తో కలిసి హెడ్ 9.2 ఓవర్లలోనే 50 పరుగులు జోడించాడు. ఆ తర్వాత లబుషేన్‌తో కలిసి రెండో వికెట్‌కు 113 బంతుల్లో 105 పరుగులు జతచేశాడు. ఈ క్రమంలో ఇంగ్లండ్ సారథి స్టోక్స్‌కు లబుషేన్‌కు మధ్య స్వల్ప మాటల యుద్ధం జరగగా... హాఫ్ సెంచరీకి రెండు పరుగుల ముందు లబుషేన్ అవుటయ్యాడు. చివర్లో నెసెర్ కొన్ని ఉత్కంఠ క్షణాలను ఎదుర్కొన్నాడు. ఇంగ్లండ్ పేసర్లు పదే పదే బౌన్సర్లతో అతడిని ఇబ్బంది పెట్టారు. ఓవరాల్‌గా ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 4.85 రన్‌రేట్‌తో పరుగులు రాబట్టడం విశేషం.

41 టెస్టుల్లో జో రూట్ సెంచరీల సంఖ్య. అత్యధిక శతకాల జాబితాలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ (41)ను రూట్ సమం చేశాడు. సచిన్ టెండూల్కర్ (51 ; భారత్), జాక్వెస్ కలిస్ (45 ; దక్షిణాఫ్రికా) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

24 2021 నుంచి ఇప్పటి వరకు రూట్ చేసిన సెంచరీల సంఖ్య. ఈ మధ్య కాలంలో ఇవే అత్యధికం. బ్రూక్, విలియమ్సన్, స్మిత్, గిల్ పదేసి శతకాలతో రెండో స్థానంలో ఉన్నారు.

17 రూట్ టెస్టుల్లో 150+ స్కోరు చేయడం ఇది 17వసారి. సచిన్ టెండూల్కర్ 20 సార్లు ఈ మార్క్‌ను అందుకున్నాడు.

14 ఆస్ట్రేలియా స్టార్ పేసర్ స్టార్క్ బౌలింగ్‌లో అవుట్ కావడం ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్‌కు ఇది 14వసారి. మరే బౌలర్ చేతిలో అతని ఇన్నిసార్లు అవుట్ కాలేదు.

ఆసియా క్రీడల స్వర్ణమే లక్ష్యం

తద్వారా ఒలింపిక్స్‌కు డైరెక్ట్ బెర్తు ● ఈ సాఫల్యంతోనే రిటైర్మెంట్ యోచన
హాకీ గోల్ కీపర్ సవిత పూనియా వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ మాజీ కెప్టెన్, వెటరన్ గోల్ కీపర్ సవిత పూనియా గొప్ప విజయంతో తన కెరీర్‌ను ముగించే ఆలోచనలో ఉంది. ఇదే విషయాన్ని ఆమె తాజాగా వెల్లడించింది. ఈ ఏడాది ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధిస్తే నేరుగా లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ బెర్తు లభిస్తుందని, ఈ చిరస్మరణీయ విజయంతో కెరీర్‌కు ఘనంగా వీడ్కోలు పలికే ఆలోచన ఉందని సవిత తెలిపింది. నిజానికి ఇప్పటినుంచే లాస్ ఏంజెలిస్-2028 ఒలింపిక్స్ కోసం ఎదురుచూడటం లేదని, ముందుగా ఈ ఏడాది జరిగే ఆసియా క్రీడల స్వర్ణంపైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు మాజీ కెప్టెన్ సవిత తెలిపింది. జపాన్‌లోని అయిచి, నగోయా రెండు వేదికల్లో ఈ సెప్టెంబర్19 నుంచి అక్టోబర్ 4 వరకు ఆసియా క్రీడలు జరుగనున్నాయి. 'లాస్ ఏంజెలిస్ మెగా ఈవెంట్‌కు చాలా సమయముంది. ఈ టోర్నీ గురించి ఇప్పుడే ఏమీ చెప్పలేను. నా ప్రస్తుత లక్ష్యమైతే ఆసియా క్రీడలే! అంతకు మించి వేరే ధ్యాసలేదు. ఈ ఈవెంట్‌లో భారత్ స్వర్ణం గెలిచి నేరుగా ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తే సంతోషంగా నేను రిటైర్మెంట్ ప్రకటిస్తాను. ఇటీవల నాకు కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలనిపిస్తోంది. ప్రతి ఒక్కరు ఏదో ఒక సమయంలో రిటైర్ కాక తప్పదు. నేను కూడా అంతే! మధురమైన జ్ఞాపకాలతో కెరీర్‌కు గుడ్‌బై చెప్పాలనుకుంటున్నాను. అది ఆసియా క్రీడలైనా కావొచ్చు. లేదంటే లాస్ ఏంజెలిస్ విశ్వక్రీడలైనా అవ్వొచ్చు' అని సవిత వివరించింది. 2022 కామన్వెల్త్ క్రీడల్లో కాంస్య పతకం గెలిచిన జట్టులో సభ్యురాలైన సవిత మూడు ఆసియా క్రీడల్లో పతకం సాధించిన జట్టులోనూ విజయవంతమైన గోల్‌కీపర్‌గా ఉంది. ఆమె ప్రస్తుతం జరుగుతున్న మహిళల హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో సూర్మ హాకీ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది. వివాహం తర్వాత కూడా తన కెరీర్ ఉత్సాహంగా సాగడానికి తన భర్త ప్రోత్సాహమే కారణమని సవిత చెప్పుకొచ్చింది. అత్త గారి కుటుంబం మద్దతు ఎన్నటికీ మరచిపోలేనని, పెళ్లయిన మూడేళ్ల నుంచి కూడా వారు తనను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని పేర్కొంది.

ఐఎల్ టి20 విజేత డిజర్ట్ వైపర్స్

రన్నరప్‌గా ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్

దుబాయ్: ఇంటర్నేషన్ లీగ్ (ఐఎల్) టి20 నాలుగో సీజన్‌లో డిజర్ట్ వైపర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఫైనల్లో డిజర్ట్ వైపర్స్ 46 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్ (ఎమ్ఐ) ఎమిరేట్స్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన డిజర్ట్ వైపర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. కెప్టెన్ స్యామ్ కరన్ (51 బంతుల్లో 74 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధ శతకంతో రాణించగా... మ్యాక్స్ హోల్డన్ (41; 2 ఫోర్లు, 1 సిక్స్), ఫఖర్ జమాన్ (20; 2 ఫోర్లు, 1 సిక్స్) డాన్ లారెన్స్ (23; 1 ఫోర్, 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేశారు. ఎమిరేట్స్ బౌలర్లలో ఫజల్ హక్ ఫరూఖీ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో ఎమిరేట్స్ 18.3 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌటైంది. షకీబ్ అల్ హసన్ (27 బంతుల్లో 36; 3 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ పొలార్డ్ (28 బంతుల్లో 28; 2 ఫోర్లు), మొహమ్మద్ వసీమ్ (13 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) కాస్త పోరాడారు. **ఫ్లెచర్ (10), టామ్ బాంటన్ (7), సంజయ్ కృష్ణమూర్తి (2), తజిందర్ సింగ్ (12), షెఫర్డ్** (1) విఫలమయ్యారు. దీంతో ముంబై ఇండియన్స్ జట్టుకు చెందిన ఫ్రాంచైజీకి పరాజయం తప్పలేదు. వైపర్స్ బౌలర్లలో నసీమ్ షా, డేవిడ్ పైన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. డిజర్ట్ వైపర్స్‌కు తొలి టైటిల్ అందించిన సామ్ కరన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. విజేత వైపర్స్‌కు 7,00,000 డాలర్లు (సుమారు రూ. 6.32 కోట్లు), రన్నరప్ ఎమ్ఐ ఎమిరేట్స్‌కు 3,00,000 డాలర్ల (సుమారు రూ. 2.70 కోట్లు) నగదు బహుమతి లభించింది.

రసెల్ 'హ్యాట్రిక్'

చెన్నై: స్టార్ స్ట్రయికర్ కేన్ రసెల్ 'హ్యాట్రిక్' గోల్స్‌తో చెలరేగడంతో హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో... హెచ్ఐఎల్ గవర్నింగ్ కౌన్సిల్ (హెచ్ఐఎల్ జీసీ) జట్టు శుభారంభం చేసింది. సోమవారం జరిగిన పోరులో హెచ్ఐఎల్ జీసీ జట్టు 3-2 గోల్స్ తేడాతో ఎస్‌జీ పైపర్స్‌పై గెలుపొందింది. రసెల్ (35వ, 37వ, 60వ నిమిషాల్లో) మూడు గోల్స్‌తో విజృంభించి హెచ్ఐఎల్ జీసీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఎస్‌జీ పైపర్స్ తరఫున విలాట్ (31వ నిమిషంలో), దిల్‌రాజ్ సింగ్ (56వ నిమిషంలో) చెరో గోల్ కొట్టారు. తొలి రెండు క్వార్టర్స్‌లో ఇరు జట్లు గోల్ చేయలేకపోగా... మూడో క్వార్టర్‌లో రెండు నిమిషాల వ్యవధిలో రసెల్ రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలచడంతో... హెచ్ఐఎల్ జీసీ ఆధిక్యం సాధించింది. అప్పటికే ఒక గోల్‌తో ఉన్న ఎస్‌జీ పైపర్స్ చివరి క్వార్టర్‌లో దిల్‌రాజ్ గోల్‌తో స్కోరు సమం చేసింది. ఇక మ్యాచ్ 'డ్రా'గా ముగియడం ఖాయమే అనుకుంటున్న దశలో రసెల్ మూడో గోల్‌తో హెచ్ఐఎల్ జీసీ జట్టును గెలిపించాడు. లీగ్‌లో భాగంగా మంగళవారం తమిళనాడు డ్రాగన్స్‌తో సూర్మా హాకీ క్లబ్ తలపడనుంది.

ఫైనల్లో ఎస్‌జీ పైపర్స్..

మహిళల హాకీ ఇండియా లీగ్ (డబ్ల్యూహెచ్ఐఎల్)లో ఎస్‌జీ పైపర్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గ్రూప్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడింట గెలిచిన ఎస్‌జీ పైపర్స్ 10 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతోంది. లీగ్‌లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో సూర్మా హాకీ క్లబ్ 2-1 గోల్స్ తేడాతో రాంచీ రాయల్స్‌పై గెలుపొందింది. సూర్మా హాకీ క్లబ్ తరఫున పెన్నీ స్క్వాబ్ (1వ నిమిషంలో), ఒలీవియా షనాన్ (39వ నిమిషంలో) చెరో గోల్ సాధించగా... అగస్టినా అలోన్సో (35వ నిమిషంలో) ఏకైక గోల్ చేసింది.

నిఖత్ శుభారంభం

న్యూఢిల్లీ: జాతీయ 'ఎలైట్' బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్, మాజీ ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ శుభారంభం చేసింది. ప్రిలిమినరీస్‌లో భాగంగా మహిళల విభాగంలో జరిగిన తొలి పోరులో (51 కేజీలు) నిఖత్ 5-0 స్కోరుతో నిధి (చండీగఢ్)పై ఘన విజయం సాధించింది. అయితే బౌట్ గెలిచిన తర్వాత కూడా తాను కొన్ని తప్పులు చేశానని... తర్వాతి పోరులో వాటిని సవరించుకుంటానని నిఖత్ వ్యాఖ్యానించింది. 48 కేజీల విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ మీనాక్షి, ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీ) కూడా తమ తొలి రౌండ్లలో విజయనాలు నమోదు చేసుకున్నారు. మీనాక్షి 5-0తో వి.లక్షయ విజయన్ (తమిళనాడు)పై గెలుపొందగా, లవ్లీనా 5-0తో కృష వర్మను ఓడించింది. పురుషుల విభాగంలో అభినాశ్ జమ్వాల్ సీనియర్ బాక్సర్ శివ థాపాను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. ప్రీతి పవార్, హితేశ్ గులియా, పవన్ బర్త్‌వాల్, అంకుశ్ పంఘాల్, జుగ్నూ అహ్లావత్ కూడా తొలి రౌండ్లలో విజయాలు సాధించి ముందంజ వేశారు. మరో వైపు మాజీ ఆసియా చాంపియన్ ఆశిష్ కుమార్ (80 కేజీ) ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థిని తన తలతో ఢీకొట్టడంతో అతడిని డిస్‌క్వాలిఫై చేశారు.

విజేతగా టోటల్ ఫుట్‌బాల్ అకాడమీ

సాక్షి, హైదరాబాద్: టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించిన టోటల్ ఫుట్‌బాల్ అకాడమీ (టోఫా) జట్టు... హైదరాబాద్ ఎలైట్ నైన్స్ కప్‌లో విజేతగా నిలిచింది. 16 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబర్చిన టోఫా జట్టు... తుది పోరులో 4-1 గోల్స్ తేడాతో బ్రదర్స్ ఫుట్‌బాల్ క్లబ్‌పై విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచి సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన టోఫా జట్టు వరుస గోల్స్‌తో విజృంభించింది. ఫైనల్ అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంతో భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ షబ్బీర్ అలీ విజేతలకు ట్రోఫీ బహుకరించారు.

జర్మనీలో ఉష్ణోగ్రతలు మైనస్ 6 డిగ్రీలకు పడిపోయాయి. దీంతో, ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయంలోని ఓ విమానంపై భారీగా పేరుకుపోయిన మంచును గ్లైకాల్ కలిపిన వేడినీటితో తొలగిస్తున్న దృశ్యం

ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రరూపం దాల్చిందంటూ సోమవారం అసెంబ్లీ సమావేశానికి మాస్కులు ధరించి వచ్చిన మాజీ సీఎం అతిశీ, ఆమె పార్టీ ఎమ్మెల్యేలు

శీతల గాలులు, పొగ మంచు

వణుకుతున్న ఉత్తరాది రాష్ట్రాలు

- మరో వారం ఇదే పరిస్థితులు
- అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక

సాక్షి, న్యూఢిల్లీ: శీతల గాలులు, దట్టమైన పొగమంచు కారణంగా ఉత్తరాది రాష్ట్రాలు చలితో వణుకిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ సహా ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరిగింది. రానున్న ఏడు రోజులపాటు చలి, పొగమంచు కొనసాగడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో వర్షాలు, మంచు కురిసే అవకాశం సైతం ఉందని సోమవారం భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. పలుచోట్ల దృశ్యమానత (విజిబిలిటీ)తీవ్రంగా పడిపోయిందని.. వచ్చే వారం కూడా ఇదే పరిస్థితులుంటాయని స్పష్టం చేసింది. పంజాబ్, హరియాణా, చండీగఢ్‌లలో ఈ నెల 8వ తేదీ వరకు, పశ్చిమ రాజస్థాన్‌లో 9వ తేదీ వరకు, తూర్పు రాజస్థాన్‌లో 10వ తేదీవరకు, జార్ఖండ్‌లో 7వ తేదీ వరకుశీతల గాలుల తీవ్రత మరింత పెరిగే సూచనలు ఉన్నాయని ఐఎండీ పేర్కొంది. ఉత్తర, మధ్య కశ్మీర్‌లోని పర్వత ప్రాంతాల్లో మంగళవారం తేలికపాటి వర్షం లేదా మంచు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో కూడా వర్షం, మంచు పడవచ్చని అంచనా వేసింది. మధ్య, తూర్పు భారతంలో రానున్న మూడు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశముందని స్పష్టం చేసింది. ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో సోమవారం వాతావరణం సాధారణంగా నే ఉన్నప్పటికీ.. మంగళవారం కొన్ని ప్రాంతాల్లో శీతల గాలుల ప్రభావం కనిపించవచ్చని తెలిపింది. ఉత్తర ప్రదేశ్‌లో కాన్పూర్, లక్నో, ప్రయాగ్‌రాజ్, వారణాసి, మీరట్, నోయిడా వంటి చోట్ల వాయువ్య దిశ నుంచి వీచే గాలుల కారణంగా చలి మరింత ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. తీవ్రమైన చలి, దట్టమైన పొగమంచు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలను నివారించాలని కోరింది. ముఖ్యంగా వృద్ధులు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించింది.

టేబుల్‌పై నోట్ల కట్టలు.. టీఎంసీ నేత..!

బెంగాల్ రాజకీయంలో కలకలం రేపుతున్న వీడియో

కోల్‌కతా: ఓ టేబుల్‌పై నోట్ల కట్టల గుట్ట..ఆ వెనుక టీఎంసీ నేత ఒకరు కూర్చున్న వీడియో ఒకటి పశ్చిమబెంగాల్‌లో వైరల్‌గా మారింది. ఉత్తర 24 పరగణాల జిల్లా బరాసత్–1 పంచాయతీ సమితి ఉపాధ్యక్షుడు మహ్మద్ గియాసుద్దీన్ మండల్, స్థానిక వ్యాపారి రకీబుల్ ఇస్లాంతోపాటు కూర్చుని ఉండగా వారికి ఎదురుగా ఉన్న టేబుల్‌పై పెద్ద మొత్తంలో డబ్బు కట్టలు కనిపిస్తున్నాయి. ఫోన్‌లో అవతలి వ్యక్తి.. 'కొనేది క్యాష్‌లోనా, ఫైనాన్స్‌లోనా అని అడుగుతుండగా, అప్పుడే మరోవ్యక్తి నోట్ల కట్టలు నింపి ఉన్న నైలాన్ బ్యాగ్‌తో ఆ గదిలోకి ప్రవేశించడం కనిపిస్తోంది. మరికొద్ది నెలల్లోనే రాష్ట్రం అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా వెలుగు చూసిన ఈ వీడియో రాజకీయ దుమారం రేపుతోంది. టీఎంసీ అక్రమ లావాదేవీలకు ఇదే నిదర్శనమంటూ ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. అయితే, ఇది 2022 నాటి పాత వీడియో అని మండల్ కొట్టిపారేస్తున్నారు. అది ఓ భూమి లావాదేవీకి సంబంధించిన అంశమని, తనకు ఎటువంటి సంబంధం లేదని చెబుతున్నారు. వీడియో కనిపిస్తున్న నగదు రెండేళ్ల క్రితం జరిగిన భూ లావాదేవీకి సంబంధించిందని రకీబుల్ ఇస్లాం కూడా తెలిపారు. ఇందులో ఎలాంటి తప్పిదం లేదని చెప్పారు. ఆ భూమి వ్యవహారంలో మండల్ భాగస్వామిగా ఉన్నారని, వీడియోలో కనిపించేది తన ఆఫీసు కూడా కాదని రకీబుల్ అన్నారు. ఈ అంశంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని బరాసత్–1 పంచాయతీ టీఎంసీ కన్వీనర్ మహ్మద్ ఇషా సర్కార్ చెప్పారు. వీడియోలో పెద్ద ఎత్తున కనిపిస్తున్న నగదుపై అనుమానాలు తలెత్తుతున్నాయని చెప్పారు. అది అసలైన వీడియోనా కాదా అనేది తేలుస్తామన్నారు. వీడియోపై బీజేపీ నేత తపస్ మిత్రా మాట్లాడుతూ.. స్థానిక భూ మాఫియా వెనుక మహ్మద్ గియాసుద్దీన్ మండల్ హస్తముందని ఆరోపించారు. ఈ వీడియోను చూస్తే అధికార టీఎంసీ అసలు స్వరూపం తేటతెల్లమవుతుందని విమర్శించారు.

సాగర సంరక్షణకు సముద్ర ప్రతాప్

సోమవారం జలప్రవేశం చేయించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్

- కాలుష్యాలను తగ్గించే పనిలో తలమునకలైన భారతతీరగస్తీ నౌక

పణజీ: భారత సముద్రతీర ప్రాంతాల్లో సాగర జలాలలను కాలుష్యం బారి నుంచి కాపాడే అత్యాధునిక తీరగస్తీదళ నౌక ఐసీజీ సముద్ర ప్రతాప్‌ను భారత్ విజయవంతంగా రంగంలోకి దింపింది. సోమవారం గోవాలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్వయంగా నౌకను జలప్రవేశంచేయించారు. భారత ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)తోపాటు ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్(ఈఈజెడ్)లకు రక్షణగా నిలబడుతూనే సముద్రప్రాంతంలో కాలుష్య నియంత్రణ, సముద్రజలాల్లో చట్టాల అమలు, విపత్కర పరిస్థితుల్లో బాధితుల కోసం అన్వేషణ, సహాయ కార్యక్రమాల్లో ఐసీజీ సముద్ర ప్రతాప్ పాలుపంచుకోనుంది. భారత్‌లో నిర్మాణం పూర్తిచేసుకున్న అతిపెద్ద కాలుష్య నియంత్ర నివారణ నౌకగా ఇది రికార్డ్ సృష్టించింది. దేశ నౌకనిర్మాణ రంగ కౌశలతకు కొత్త నౌక దిక్సూచీగా నిలుస్తుందని రాజ్‌నాథ్ అన్నారు. భవిష్యత్‌లో భారత నౌకారంగం, దీర్ఘకాలిక, స్వచ్ఛమైన, సురక్షితమైన, భద్రమైన వృద్ధి పథంలో దూసుకుపోయేందుకు ఈ నౌక చుక్కానిలా నిలిచిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. గోవా షిప్ట్ యార్డ్ లిమిటెడ్ తయారుచేసిన ఈ నౌకను గత నెలలోనే తీరగస్తీ దళానికి అందజేశారు. దక్షిణ గోవాలోని వాస్కోలో ఉన్న గోవాషిప్ట్ యార్డ్ లిమిటెడ్ పరిధిలోని సముద్రజలాల్లో సోమవారం ఈ నౌకను అధికారికంగా రాజ్‌నాథ్ జలప్రవేశం చేయించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్, ఇండియన్ కోస్ట్‌గార్డ్ డైరెక్టర్ జనరల్ పరమేశ్ శివమణి సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత అద్భుతమైన నావికా దార్శనికతతో ఈ కార్యక్రమం అనుసంధానమైందని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

ఎన్నో ప్రత్యేకతల సమాహారం...

- ఈ నౌకలోని మొత్తం 60 శాతం విడిభాగాలు, ఉపకరణాలను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేశారు.
- 114.5 మీటర్ల పొడవైన ఈ నౌక బరువు ఏకంగా 4,200 టన్నులు.
- ఇది గంటకు 22 నాటిక్ మైళ్లకంటే అధిక వేగంతో దూసుకెళ్లగలదు
- పూర్తి ఇంధన సామర్థ్యంతో ఏకంగా 6,000 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించగలదు
- వాణిజ్యనౌకలు, సరకు రవాణా నౌకల నుంచి ఒలికిపోయే, ప్రమాదాల కారణంగా సముద్రజలాల ఉపరితలంపై చేరిన ముడి చమురు, తెట్టును ఈ నౌకతొలగించగలదు

- ఒక పూర్తిస్థాయి కాలుష్యనియంత్రణ పరిశోధనశాలను ఈ నౌకలో ఏర్పాటుచేశారు
- వ్యర్థాలను ఒక దగ్గరకు లాక్కొచ్చే సైడ్ స్వీపింగ్ చేతులు, ఫ్లోటింగ్ బూమ్‌లు, అత్యధిక సామర్థ్యముండే స్కిమ్మర్లు, పోర్టబుల్ బార్జ్‌లు ఇలా అన్ని రకాల పరికరాలతో ఈ నౌకలో ఉన్నాయి
- చమురునౌకలకు అగ్నిప్రమాదం సంభవిస్తే అగ్నికీలలను ఆర్పే ఎఫ్ఐ–ఎఫ్ఐ క్లాస్–1 తరగతి స్థాయి శక్తివంతమైన అగ్నిమాపక వ్యవస్థ ఇందులో ఉంది
- ఒక హెలీప్యాడ్‌తోపాటు అనుమానిత నౌకలను అడ్డుకునేందుకు చిన్నపాటి ఇంటర్‌సెప్టార్ పడవలను ఇందులో ఉంచారు.
- కీలక సమయాల్లో స్వతంత్రంగా ఈ నౌక పనిచేస్తుంది. ప్రతిసారీ బయటి నుంచి సరకుల సరఫరా కోసం ఆధారపడకుండా ఎక్కువ సరకులను నిల్వచేసుకుని ఏకధాటిగా ఒకేసారి వేల నాటికల్ మైళ్ల పరిధిలో గస్తీ, అన్వేషణ, సహాయ కార్యక్రమాల్లో ఈ నౌక నిమగ్నంకాగలదు
- డైనమిక్ పొజిషనింగ్‌తోపాటు రెస్క్యూ ఆపరేషన్‌ల వేళ ఇతర నౌకతో అనుసంధానమయ్యేలా సమీకృత అనుసంధాన వ్యవస్థ, సమీకృత వేదికా వ్యవస్థ, స్వయంచాలిత ఇంధన నిర్వహణ వ్యవస్థ, ఆటోమేషన్ ఇలా పలు రకాల అత్యాధునిక వ్యవస్థలూ ఇందులో ఉన్నాయి.
- శత్రువుల పీచమణిచేందుకు 30 ఎంఎం సీఆర్ఎన్–91 రకం గన్, రెండు12.7 ఎంఎం రిమోట్ కంట్రోల్ గన్‌లనూ ఈ నౌకకు బిగించారు.
- కొచ్చి స్థావరంగా పనిచేసే ఈ నౌకలో 14 మంది అధికారులు, 115 మంది సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటారు. వీళ్లలో ఇద్దరు మహిళాధికారులు సైతం విధులు నిర్వర్తించనున్నారు
- 7,500 కి.మీ.ల తీర గస్తీ బాధ్యతలతో పాటు 20 లక్షల చదరపు కిలోమీటర్ల ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్ రక్షణ బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చగలదు
- నౌకల ప్రమాదాల, సముద్రాల్లోకి చట్టవ్యతిరేకంగా వ్యర్థాల పారబోత, అసాంఘిక శక్తుల కార్యకలాపాలను అడ్డుకోవడంలో నౌక కీలకపాత్ర పోషించనుంది
- సముద్రాల్లో కాలుష్యాన్ని అరికట్టేందుకు కృషిచేయడం ద్వారా ప్రత్యక్షంగా మత్స్య సంపద వృద్ధికి, తద్వారా మత్స్యకారుల ఉపాధి, జీవనం,ఆదాయానికి ఈ నౌక భరోసా ఇవ్వనుంది
- ఇదే తరహా విధుల్లో ఉన్న సముద్ర ప్రహరీ, సముద్ర వన్‌విజయ్ నౌకలకు దన్నుగా ఇది నిలబడనుంది
- మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోగలదు. రూ.284 కోట్ల వ్యయంతో ఈ నౌకను నిర్మించారు

దక్షిణాఫ్రికాలో నీలకంఠ వర్ణి అతిపెద్ద కాంస్య విగ్రహ ప్రతిష్ఠ

జోహన్నెస్‌బర్గ్: 18వ శతాబ్దపు యోగి, ఆధ్యాత్మిక గురువు నీలకంఠ వర్ణి 42 అడుగుల కాంస్య విగ్రహాన్ని దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో ప్రతిష్ఠించారు. అతిపెద్ద బోచాసన్‌వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ సంస్థ (బీఏపీఎస్) ఆలయంలో ఆదివారం ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇది దక్షిణాఫ్రికాలోనే అత్యంత ఎత్తైన కాంస్య విగ్రహం. వృక్షాసన భంగిమలో ఉన్న విగ్రహం ఈ ఆలయ భారీ సముదాయం ప్రవేశ ద్వారం వద్ద కొలువై ఉంది. ఇది కేవలం ఒక మతాన్ని ప్రతిబింబించే విగ్రహం కాదని, స్వీయ క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యం పట్ల ఉన్నత స్పష్టత, సమాజసేవ వంటి నీలకంఠ వర్ణి విలువలకు ప్రతీకని బీఏపీఎస్ ప్రతినిధి హేమాంగ్ దేశాయ్ తెలిపారు. రాగి, ఇత్తడితో తయారు చేసిన 20 టన్నుల బరువున్న ఈ విగ్రహం ఒకే కాలిపై నిలబడి ఉంటుందని, ఇది అసాధారణ ఇంజనీరింగ్ ఘనతకు తార్కాణమని అభివర్ణించారు. అత్యంత సీనియర్ సన్యాసులలో ఒకరైన స్వయంప్రకాశ్ స్వామి, దక్షిణాఫ్రికా ఉప ఆర్థిక మంత్రి అషోర్ సరూపెన్ సమక్షంలో అధికారికంగా విగ్రహాన్ని దక్షిణాఫ్రికాకు అప్పగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం పక్కనే బీఏపీఎస్ శాఖాహార రెస్టారెంట్ 'షయోనా'ఏర్పాటు చేశారు. ఇది గ్రేటర్ జోహన్నెస్‌బర్గ్ ప్రాంతంలోని పర్యాటకులకు ఖచ్చితంగా ఉపయోగపడుతుందని హేమాంగ్ అన్నారు.

అరెస్టయిన ఐఏఎస్‌ను సస్పెండ్ చేసిన గుజరాత్ ప్రభుత్వం

అహ్మదాబాద్: అవినీతి ఆరోపణలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసిన ఐఏఎస్ అధికారిని గుజరాత్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. చివరగా సురేంద్రనగర్ కలెక్టర్‌గా పనిచేసిన రాజేంద్రకుమార్ పటేల్.. భూమి మార్పిడి అనుమతులకు లంచాలు తీసుకున్నారని ఈడీ ఆరోపించింది. 2015 బ్యాచ్ అధికారి అయిన పటేల్‌ను ఈడీ జనవరి 2న అరెస్టు చేసింది. అదే రోజు ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు అతడిని జనవరి 7 వరకు ఈడీ కస్టడీకి అప్పగించింది. కస్టడీలో ఉన్న కాలం నలభై ఎనిమిది గంటలు దాటినందున పటేల్‌ను సస్పెండ్ చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆయన పీఏ చంద్రసింగ్ మోరీ లంచాలు తీసుకునేవారని నిందితులు చెప్పారని ఈడీ స్పష్టం చేసింది. వసూళ్లకోసం ప్రత్యేకంగా ఖాతానే నిర్వహించారని గుర్తించిన ఈడీ పీఏ మోరీని గత నెలలోనే అరెస్టు చేసింది. ఈడీ అరెస్టుతో ఎలా పోస్టింగ్ ఇవ్వకుండానే ఆయనను గత నెలలోనే బదిలీ చేశారు. ఆ తర్వాత, ఈడీ జనవరి 2న పటేల్‌ను కూడా అరెస్టు చేసింది.

బ్రిగెటీకి సైబర్ వేధింపులు...

10 మందికి శిక్షలు

పారిస్: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ భార్య బ్రిగెటీపై సైబర్ వేధింపుల కేసులో 10 మందిని దోషులుగా పారిస్ కోర్టు నిర్ధారించింది. వారికి 4 నుంచి ఆర్నెల్ల జైలుశిక్షలు విధించింది. అయితే వాటి అమలును సస్పెండ్ చేసింది. బదులుగా సైబర్ వేధింపుల అవగాహన శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆదేశించింది. విచారణ సందర్భంగా క్షమాపణలు కోరిన ఒక టీచర్‌కు మాత్రం జైలు శిక్ష విధించలేదు. దోషుల్లో ఎనిమిది మంది పురుషులు కాగా ఇద్దరు మహిళలు. బ్రిగెటీ ట్రాన్స్ జెండర్ అని, పుట్టుకతో పురుషుడని పేర్కొనడంతో పాటు ఆమెను కించపరిచేలా వీరంతా ఆన్‌లైన్‌లో పలురకాలుగా తప్పుడు సమాచార వ్యాప్తి చేశారని కోర్టు ఆక్షేపించింది. సైబర్ వేధింపులపై పోరాటంలో అందరికీ ఆదర్శంగా నిలిచేందుకే వారిపై కేసులు పెట్టినట్టు బ్రిగెటీ వెల్లడించారు. ఆన్‌లైన్ వేధింపులు మొదలైనప్పటి నుంచీ ఆమె జీవితం గందరగోళంగా మారిందని కూతురు టిఫైన్ అజీరే వాపోయారు. వాటివల్ల తమ కుటుంబమంతా ఇప్పటికీ బాధపడుతూనే ఉందన్నారు.

మరోసారి పెరోల్‌పై విడుదలైన డేరా బాబా

ఎనిమిదేళ్లలో 15వసారి పెరోల్

చండీగఢ్: ఇద్దరు శిష్యురాళ్లపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు సోమవారం మరోసారి పెరోల్ లభించింది. 40 రోజుల పెరోల్‌పై రోహ్‌తక్‌లోని సునారియా జైలు నుంచి బయటకు వచ్చిన ఆయన.. ఈ 40 రోజులపాటు సిర్సాలోని డేరాలో ఉంటారని డేరా ప్రతినిధి, న్యాయవాది జితేందర్ ఖురానా తెలిపారు. 16 సంవత్సరాల క్రితం ఒక జర్నలిస్టు హత్య కేసులో సింగ్‌తో పాటు మరో ముగ్గురికి కూడా 2019లో శిక్ష పడింది. 2017లో ఆయన దోషిగా తేలిననాటినుంచి ఇప్పటివరకు 15 సార్లు పెరోల్ లభించింది. గతంలో 14 సార్లు జైలు నుంచి బయటకు వచ్చినప్పుడు సింగ్ ఉత్తరప్రదేశ్ లోని బాగ్‌పత్ జిల్లాలో ఉన్న తన డేరా ఆశ్రమంలోనే ఉన్నారు. ఈ పెరోల్‌కు ముందు 2025 ఆగస్టులో 40 రోజుల పెరోల్‌పై బయటికి వచ్చారు. 2025 ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, 2024లో అక్టోబర్‌లో హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ముందు, 2022లో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు రెండు వారాల ముందు ఫిబ్రవరి 7న కూడా అతనికి పెరోల్ లభించింది. గుర్మీత్ సింగ్‌కు పెరోల్ ఇవ్వడాన్ని సిక్కు సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. ఆయనకు హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఇతర రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో అనుచరులు ఉన్నారు.

అబ్బెబ్బే.. అలా అనలేదు

ట్రంప్ ప్రకటనకు భిన్నంగా మాట్లాడిన విదేశాంగ మంత్రి రూబియో

వాషింగ్టన్/హవానా: నికోలస్ మదురోను గద్దె దించాక తామే వెనెజువెలాను పరిపాలించబోతున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనకు పూర్తి భిన్నంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో మాట్లాడారు. ''వెనెజువెలాను అమెరికా ప్రత్యక్షంగా పరిపాలించబోదు. ప్రభుత్వ విధానంలో మార్పు వచ్చేలా తీవ్ర ఒత్తిడి చేస్తాం. ఈరోజు ఏం చేయాలి. రేపు ఏం చేయాలి అన్నట్లు రోజువారీ ఆదేశాలు ఇవ్వబోం. వెనెజువెలా చమురు సరఫరాకు తీవ్ర ఆటంకం కల్గించి, ఆంక్షల కొరడా ఝుళిపించి ఒత్తిడి పెంచుతాం. తద్వారా మా నిర్ణయాలు అక్కడి ప్రభుత్వం ద్వారా అమలయ్యేలా చేస్తాం. వెనెజువెలా ప్రభుత్వ విదేశాంగ విధానంలో మార్పులు తీసుకొస్తాం. ముఖ్యంగా అమెరికా అనుకూల వైఖరిని తెస్తాం''అని అన్నారు. మదురోను బందీగా అమెరికా తీసుకెళ్లడంతో మదురో కుమారుడు, చట్టసభ సభ్యుడు నికోలస్ ఎర్నెస్టో గుయెర్రా ఇంతవరకు మీడియా కంట పడలేదు. త్వరలోనే దేశ జాతీయ అసెంబ్లీ సమావేశాలు కారకాస్‌లోని లెజిస్లేటివ్ ప్యాలెస్‌లో జరగనున్నాయి.

32 మంది క్యూబా అధికారుల మృతి!

మదురోను కిడ్నాప్‌చేసేందుకు అమెరికా చేపట్టిన సైనిక ఆపరేషన్‌లో 32 మంది క్యూబా సైనికులు చనిపోయినట్లు క్యూబా ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో ఇంత మంది విదేశీ అధికారులు మరణించారని ఒక దేశ ప్రభుత్వం ప్రకటించడం ఇదే తొలిసారి. వెనుజువెలాకు క్యూబా అత్యంత మిత్ర దేశంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో వెనెజువెలాలో పౌర, సైనిక అవసరాలు తీర్చేందుకు క్యూబా తమ సైనికులను తరలిస్తోందని తెలుస్తోంది. శనివారం తెల్లవారుజామున అమెరికా సేనలు వెనెజులాలోని కారకాస్ సిటీలో జరిపిన మెరుపుదాడిలో తమ అధికారులూ చనిపోయారని క్యూబా ప్రకటించింది. రెండురోజులపాటు సంతాప దినాలు ప్రకటించారు. క్యూబా మాజీ అధ్యక్షుడు, విప్లవ పోరాటయోధుడు రౌల్ క్యాస్ట్రో, అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ క్యానెల్ మృతుల కుటుంబాలకు సంతాప సందేశాలు పంపించారు.

వాన్స్ ఇంటిపై దాడి

రాళ్లు రువ్విన దుండగుడు

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, తెలుగు మూలాలున్న ఆయన సతీమణి ఉషా నివాసంపై దాడి జరిగింది. ఒహాయోలో విలియం హొవార్డ్ టఫ్ట్ డ్రైవ్ వద్ద ఈస్ట్ వాల్‌నట్ హిల్స్‌లో ఉన్న వారి నివాసంపైకి ఆదివారం అర్ధరాత్రి దాటాక ఓ ఆగంతుకుడు రాళ్లు విసిరాడు. దాంతో పలు కిటికీల అద్దాలు పగిలిపోయాయి. సీక్రెట్ సర్వీస్ అధికారులు అప్రమత్తమయ్యే లోపే దుండగుడు పారిపోయాడు. వాళ్ల సమాచారంతో సిన్సినాటీ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. వారితో పాటు అదనపు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లను కూడా వాన్స్ నివాసం వద్ద మోహరించారు. తర్వాత కాసేపటికే ఓ అనుమానితున్ని అదుపులోకి తీసుకున్నారు. అతనెవరు, దాడి వెనక ఉద్దేశం ఏమిటి వంటి వివరాలను అధికారులు వెల్లడించలేదు. అయితే అతను ఇంట్లోకి చొరబడలేదని వారు తెలిపారు. దాడి సమయంలో వాన్స్ దంపతులు ఇంట్లో లేరు.

ఢిల్లీ హైకోర్టులో లాలుకు దక్కని ఊరట

న్యూఢిల్లీ: ఐఆర్‌సీటీసీ స్కాముపై సీబీఐ సాగిస్తున్న దర్యాప్తుపై స్టే విధించాలంటూ ఆర్జేడీ సుప్రీం లాలు ప్రసాద్ యాదవ్ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. విచారణపై ప్రస్తుతానికి స్టే ఇవ్వలేమని తెలిపింది. లాలు పిటిషన్‌పై అభిప్రాయం తెలపాల్సిందిగా సీబీఐకి నోటీసు జారీ చేసింది. ఈ విషయంలో వాదనలను వినకుండా, సీబీఐ సమాధానం కూడా తెలుసుకోకుండా స్టే ఇవ్వలేమని జస్టిస్ స్వర్ణ కాంత శర్మ తెలిపారు. తదుపరి విచారణను ఈ నెల 14వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసులో విచారణ ఎంత వరకు వచ్చిందో తెలపాలని ట్రయల్ కోర్టును కోరారు. సీబీఐ నుంచి సమాధానం అందాకే స్టేపై విచారణ చేపడతామని చెప్పారు. రైల్వే శాఖ మంత్రిగా ఉన్న సమయంలో లాలు యాదవ్ ఐఆర్‌సీటీకి చెందిన రెండు హోటళ్లను ప్రైవేట్ సంస్థకు అప్పగించడంలో అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై సీబీఐ లాలుతోపాటు ఆయన భార్య రబ్డీదేవి, కుమారుడు తేజస్వీ యాదవ్ మరో 11 మందిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. దీనిపై విచారణకు 2025 అక్టోబర్ 13వ తేదీన ట్రయల్ కోర్టు పచ్చజెండా ఊపింది.

చైనీయుల కోసం కొత్తగా ఈ-బిజినెస్ వీసా

బీజింగ్: చైనా సాంకేతిక నిపుణులు, వ్యాపారవేత్తల కోసం భారత ప్రభుత్వం కొత్తగా ఈ-ప్రొడక్షన్ ఇన్వెస్టిమెంట్ బిజినెస్ వీసా, ఈ–బి–4 వీసా విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. పారిశ్రామిక రంగానికి సంబంధించిన విస్తృతమైన పనుల కోసం అనుమతిస్తారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యంత్రాలను ఫ్యాక్టరీలలో అమర్చడం. ప్లాంట్లు లేదా ప్రాజెక్టులను ప్రారంభించడం. యంత్రాల మరమ్మతులు, ఉత్పత్తి పక్రియలో పాల్గొనే వారితోపాటు సాంకేతిక తనిఖీలకు వచ్చే వారికి ఈ వీసా విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. కంపెనీల ఉన్నతాధికారులు, కార్యనిర్వాహక హోదాల్లో ఉండే వారు వ్యూహాత్మక నిర్ణయాల కోసం పర్యటించేందుకు సాయపడుతుంది. జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిన ఈ విధానంలో భారత ఎంబసీ లేదా ఏజెంట్లను సంప్రదించాల్సిన పనిలేకుండా నేరుగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చు. వీసా మంజూరు చేసేందుకు 45–50 రోజుల వరకు పడుతుంది. ఈ వీసాతో భారత దేశంలో ఆరు నెలల వరకు ఉండేందుకు వీలుంది. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్' (పీఎల్ఐ) పథకం కింద ఆపిల్, శామ్‌సంగ్ తదితర కంపెనీలు చైనా నుంచి యంత్రాలను దిగుమతి చేసుకున్నాయి. వాటిని ఇక్కడ ఇన్‌స్టాల్ చేయడానికి చైనా నిపుణుల అవసరం ఏర్పడింది. వారు సకాలంలో రాకపోవడం వల్ల కొన్ని ఫ్యాక్టరీల్లో పనులు నిలిచిపోయాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి భారత ప్రభుత్వం ఈ సులభతర వీసా విధానాన్ని తెచ్చింది.

హసీనాపై దేశద్రోహ ఆరోపణలు

ఈ నెల 21న నమోదు చేయాలన్న బంగ్లాదేశ్ కోర్టు

ఢాకా: పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా మరో 285 మందిపై ఈ నెల 21వ తేదీలోగా దేశ ద్రోహ ఆరోపణలను నమోదు చేయాలని బంగ్లాదేశ్‌లోని ఓ న్యాయస్థానం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. 2024 డిసెంబర్‌లో అవామీ లీగ్‌కు చెందిన 'జోయ్ బంగ్లా బ్రిగేడ్'గ్రూప్ వర్చువల్‌గా జరిపిన సమావేశంలో మహ్మద్ యూనస్ సారథ్యంలోని ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్రపన్నారన్న ఆరోపణలపై దేశద్రోహ కేసు నమోదైంది. ఈ కేసును సోమవారం ఢాకా స్పెషల్ కోర్టు–9 జడ్జి అబ్దుస్ సలామ్ విచారించారు. ఈ సందర్భంగా హసీనా, ఆమె మద్దతుదారులైన 285 మందిపై ఈ నెల 21వ తేదీన దేశ ద్రోహ ఆరోపణలను నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆందోళనలు హింసాత్మక రూపం దాల్చడంతో షేక్ హసీనా 2024 ఆగస్టు 5న ప్రధాని పదవిని వదిలేసి, భారత్ రావడం తెల్సిందే. ఆగస్టు 8న యూనస్ సారథ్యంలో ఆపద్ధర్మ ప్రభుత్వం ఏర్పాటైంది. గతేడాది జూలై 30న యూనస్ ప్రభుత్వం దేశద్రోహం కేసు నమోదు చేసింది.

అస్సాంలో భూకంపం, ఇద్దరికి గాయాలు

గౌహతి/మోరిగావ్: ఈశాన్య భారతాన్ని సోమవారం తెల్లవారుజామున భూకంపం భయాందోళనకు గురి చేసింది. కొన్ని గంటల వ్యవధిలోనే ఈశాన్య ప్రాంతంలోని పలు రాష్ట్రాల్లో భూమి కంపించింది. అస్సాంలో తెల్లవారుజామున 4.17 నిమిషాలకు భూకంపం సంభవించింది. 5.1 తీవ్రతతో వచ్చిన భూకంపంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు. రాష్ట్రంలోని మోరిగావ్ జిల్లాలో ప్రకంపనలతో ఇళ్లలోని వస్తువులు కదలడంతో ప్రజలు భయాందోళకు గురై.. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ భూకంపం ప్రభావం కనిపించింది. ముందుగా త్రిపురలోని గోమతి ప్రాంతానికి సమీపంలో 3.9 తీవ్రవతతో భూకంపం మొదలైంది. ఆ తరువాత మిగిలిన ప్రాంతాలకు విస్తరించాయి. ఈశాన్య ప్రాంతంలో భూగర్భంలోని టెక్టోనిక్ ప్లేట్ల కదలికల వల్ల తరచూ భూకంపాలు వస్తుంటాయి. సోమవారం నాటి కంపనల వల్ల పెద్ద స్థాయిలో నష్టం జరగలేదని మోరిగావ్ జిల్లా విపత్తు నిర్వహణ కార్యాలయం తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

వచ్చే వారం భారత్‌కు మెర్జ్

న్యూఢిల్లీ: జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ భారత్‌లో పర్యటించనున్నారు. ఆయన రెండు రోజుల పర్యటన జనవరి 12న మొదలవుతుంది. ఆ రోజు అహ్మదాబాద్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మెర్జ్‌కు స్వాగతం పలుకుతారు. అనంతరం ఆయన బెంగళూరులో సందర్శిస్తారని విదేశాంగ శాఖ సోమవారం ఈ మేరకు వెల్లడించింది. జర్మనీ, భారత్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఈ పర్యటన దోహదపడనుందని పేర్కొంది. మెర్జ్ భారత్ రానుండటం ఇదే తొలిసారి.

ఉక్రెయిన్ సెక్యూరిటీ చీఫ్ మార్పు

కీవ్: ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థను అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమూలంగా ప్రక్షాళన చేసే పనిలో పడ్డారు. అందులో భాగంగా సెక్యూరిటీ సర్వీస్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ వాసిల్ మలియుక్‌ను తొలగిస్తూ సోమవారం ఆయన నిర్ణయం తీసుకున్నారు. వాసిల్ స్థానంలో స్పెషల్ ఆపరేషన్స్ విభాగం మాజీ సారథి లెవ్‌హెన్ ఖ్మారాను నియమిస్తున్నట్టు ప్రకటించారు. రష్యాపై ఉక్రెయిన్ సాధించిన పలు కీలక యుద్ధ విజయాల వెనక వాసిల్ కీలక పాత్ర పోషించాడు. ఉక్రెయిన్ సైనిక నిఘా విభాగం చీఫ్‌ను కూడా మూడు రోజుల క్రితమే జెలెన్‌స్కీ మార్చేయడం తెలిసిందే. రష్యాతో యుద్ధానికి తెర దించే మార్గాల అన్వేషణకు పారిస్‌లో జరిగే చర్చల్లో పాల్గొనేందుకు బయల్దేరే ముందు జెలెన్‌స్కీ ఈ చర్యలకు దిగడం విశేషం.

'కొకైన్' కేసులో 22 మంది భారతీయులను అరెస్టు చేసిన నైజీరియా

అబుజా: వాణిజ్య నౌక నుంచి కొకైన్‌ను స్వాధీనం చేసుకున్న కేసులో ఆ నౌకకు చెందిన 22 మంది భారతీయ సిబ్బందిని నైజీరియా మాదకద్రవ్యాల నిరోధక సంస్థ అదుపులోకి తీసుకుంది. లాగోస్‌లోని అపాపా పోర్ట్‌లోని జీడీఎన్ఎల్ టెర్మినల్‌లోని ఆపరేటర్లు శుక్రవారం డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. మార్షల్ దీవుల నుంచి వచ్చిన ఈ నౌకలోని మూడవ హ్యాచ్‌లో 31.5 కిలోల కొకైన్ లభ్యమైందని, ఈ నౌక నుంచి అదుపులోకి తీసుకున్నవారిలో నౌక కెప్టెన్‌శర్మ శశి భూషణ్‌తో సహా మరో 21 మంది సిబ్బంది ఉన్నారని ఏజెన్సీ మడియా వెల్లడించింది. బోర్నోలో ఇద్దరు సరఫరాదారులను అరెస్టు చేసి పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్న ఏజెన్సీ.. ఈ మాదకద్రవ్యాల సరఫరా గొలుసును కూడా ఛేదించింది.

ప్రాచీన కాలంలో ప్రధాన ఓడరేవు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ప్రాచీన భారతదేశ పట్టణీకరణ

రాఖీగర్హ్, మొహంజొదారో, కాళీభంగన్, దోలవీరాలను పరిశీలించాక పట్టణ ప్రణాళిక విషయంలో ఆనాటి పట్టణాల్లో ఏకరూపత ఉన్నట్లు తెలుస్తోంది. నగరాల్లో పశ్చిమ వాయవ్య ప్రాంతాలు ఎత్తుగా ఉండి, తూర్పు, ఆగ్నేయ ప్రాంతాలు పల్లంగా కనిపిస్తున్నాయి. ఎత్తుగా ఉండే ప్రాంతాన్ని కోట అని పిలిచారు. కోట్‌డిజి వంటి వాటి ద్వారా కోట చుట్టూ ఆగడ్త ఉండటమే కాకుండా, కోట పై భాగంలో బురుజులున్నాయి అని తెలుస్తోంది. 12-14 అడుగుల ఎత్తు వరకు ప్రాకారాలు సురక్షితంగా ఉన్నట్లు అవగతమవుతోంది.

మొహంజొదారోలో స్నానవాటిక, రెండు స్థూపాలు, స్తంభ మండపం, కళాశాల భవనం వంటి నిర్మాణాలను గుర్తించారు. హరప్పాలో దిగువ భాగాన ఒక గ్రామం, ఒక దిబ్బ ఉండి, దిబ్బకు తూర్పు వైపున పోలీస్‌స్టేషన్ వంటి నిర్మాణ విశేషాన్ని కనుగొన్నారు. ప్రధాన వీధులు 4 నుంచి 6 మీటర్ల వరకు వెడల్పుతో ఉండేవి. రోడ్లన్నీ ఉత్తరం నుంచి దక్షిణం వైపుకు ఒకదానికొకటి లంబ కోణంలో ఉన్నాయి. లోథాల్ (గుజరాత్) వంటి పట్టణాల్లో కుమ్మరులు, లోహ కర్మ, శిలాకర్మలు చేసే వారి కార్ఖానాలు ఏర్పడ్డాయి.

పట్టణాలన్నింటిలో రోడ్ల పక్కన మురుగునీటి కాల్వలను నిర్మించారు. ఈ కాల్వల తయారీకి కాల్చిన ఇటుకలను ఉపయోగించారు. ఈ మురుగు నీటి కాల్వలను బాగు చేయడానికి అనువుగా నియమిత అంతరాల్లో మనిషి దిగడానికి కావాల్సిన రంధ్రాలను ఏర్పర్చారు. అదేవిధంగా ఎక్కువగా పారిన నీరు ఇంకడానికి చిన్న చిన్న గోతులను తవ్వారు.

ప్రత్యేక నిర్మాణాలు

మొహంజొదారోలో గొప్ప స్నాన వాటిక, స్తంభ మండపం, హరప్పాలో ధాన్యాగారాలు, లోథాల్‌లో ఓడరేవును గుర్తించారు. మొహంజొదారోలోని స్నానవాటిక 30×23×8 అడుగుల కొలతలతో నిర్మితమైంది. దీని గోడలు నీరు ఇంకకుండా ఏర్పడ్డాయి. దీనికి ఒకవైపు మెట్లవరుస, గ్యాలరీలా కూర్చోవడానికి వీలుగా నిర్మాణాలు ఉన్నాయి. దీనికి పైభాగంలో కొన్ని వరండాలు, గదులు కూడా ఉన్నాయి. హరప్పాలోని ధాన్యాగారాలను 50×20 అడుగుల కొలతతో ఆరు నిర్మాణాలను నదీ తీరాన నిర్మించారు. రెండు వరుసల్లో మొత్తం 12 ధాన్యాగారాలు ఉన్నాయి. లోథాల్ ప్రసిద్ధ ఓడరేవు. దీన్ని నదికి జతపరుస్తూ కృత్రిమ కాల్వలను తవ్వారు. ఈ నిర్మాణాలన్నింటికి ఒకే కొలతతో కూడిన కాల్చిన ఇటుకలను వాడారు. ఇటుకలు 11×5.5×2.75 అంగుళాల్లో, 4:2:1 నిష్పత్తిలో పొడవు, వెడల్పు, మందాన్ని కలిగి ఉండేవి.

నగర వ్యవస్థపై సామాజిక ప్రక్రియల ప్రభావం

నాగరికత కాలాల్లోని కట్టడాల్లో బానిసలను అధిక సంఖ్యలో వినియోగించినట్లు వాల్టేర్ రూబెన్ అభిప్రాయం. ఇళ్ల పరిమాణాల్లోని మార్పులు, వివిధ విలాసాల ఉనికిని బట్టి కొందరు చరిత్రకారులు సమాజంలోని అంతరాలను ఊహించారు. సామాజిక ప్రక్రియలో ప్రయోజనాత్మక గమనశీలత.. పట్టణ నిర్మాణ వ్యవస్థ, ప్రణాళికలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేయగా నగర, గ్రామ సంబంధాలు పట్టణ వ్యవస్థ అస్థిత్వానికి దోహదపడ్డాయి. కానీ వ్యవసాయక వృత్తుల ప్రాముఖ్యత కలిగిన గ్రామీణ నిర్మాణాల గురించి ఎలాంటి ఆధారాలు లభించడం లేదు.

రెండో పట్టణీకరణ

క్రీ.పూ. 600-300 మధ్యకాలంలో గంగానది లోయలో చోటు చేసుకున్న పట్టణీకరణను భారత ఉపఖండంలో రెండో పట్టణీకరణగా పేర్కొంటారు. రాజ్‌గాట్, చిరండ్ తవ్వకాల్లో లభ్యమైన ఆధారాలను బట్టి ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతంలో, బీహార్ పశ్చిమ ప్రాంతంలో ఇనుము వినియోగం విస్తృతంగా ఉండేదని తెలుస్తోంది. ఈ ఇనుము వాడకం విశాల సామ్రాజ్య స్థాపనకు దారి తీసింది. ఈ సామ్రాజ్యాలన్నీ సైనికపరంగా ఆయుధ సంపత్తితో కూడుకొన్నవి. వీటిలో యుద్ధవీరుల వర్గం ప్రధాన పాత్ర పోషించింది. కొత్త వ్యవసాయ పనిముట్లు రైతులు అధిక ఉత్పత్తి చేయడానికి దోహదం చేశాయి. ఈ ఉత్పత్తులు పాలక వర్గ అవసరాలను తీర్చడమే కాకుండా అసంఖ్యాకమైన ఇతర నగరాలను పోషించాయి. ఈ భౌతిక వస్తు వినియోగశక్తి కోసల, మగధ సామ్రాజ్యాల విస్తరణకు దోహదం చేసింది. వైదికేతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఈ సామ్రాజ్యాల్లో కలిసిపోయారు. తద్వారా కొత్త సామ్రాజ్యాలు పరిపాలనా సంబంధమైన కొత్త సమస్యలను, సామాజికంగా ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కొన్నాయి.

పాళీ, సంస్కృత గ్రంథాల్లో పేర్కొన్న అనేక నగరాలు కౌశాంబి, శ్రావస్తి, అయోధ్య, కపిలవస్తు, వారణాసి, వైశాలి, రాజగిరి, పాటలీపుత్రం మొదలైనవి తవ్వకాల్లో బయటపడ్డాయి. ఆవాసాలు, మట్టి నిర్మాణాల చిహ్నాలు కన్పించాయి. వాస్తవానికి ఇవి భారతదేశంలో రెండో నగరీకరణ ప్రారంభాన్ని సూచిస్తున్నాయి. మొత్తం దేశాన్ని పరిగణనలోకి తీసుకుంటే శ్రావస్తిలాంటి పెద్ద నగరాలు దాదాపు 20 వరకు ఉంటాయి. తర్వాత కాలంలో నగరాలు గణనీయంగా అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం గ్రీకు నుంచి అలెగ్జాండర్ సైన్యం భారతదేశానికి తరలి రావడమేనని గుర్తుంచుకోవాలి. దీని వల్ల అనేక వ్యాపార రవాణా మార్గాలు ఏర్పడ్డాయి. వాయవ్య భారతదేశం, పశ్చిమ ఆసియాల మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగుపడ్డాయి.

నగర ఆర్థిక వ్యవస్థ

నగరాల ఆవిర్భావానికి కారణాలు (రాజకీయ, ఆర్థిక, మతపరమైనవి) విభిన్నంగా ఉన్నప్పటికీ చివరికి ఈ నగరాలన్నీ మంచి వ్యాపార కేంద్రాలుగా ప్రసిద్ధి పొందాయి. వాటిలో రకరకాల వృత్తి నిపుణులు, వ్యాపారులు స్థిరపడ్డారు. వీరు కొన్ని సంఘాలుగా ఏర్పడ్డారు. జాతక కథల్లో అంటే బుద్ధుడి పుట్టుకకు సంబంధించిన కథల్లో ఇలాంటి సంఘాలను దాదాపు 18 వరకు పేర్కొన్నారు. అందులో నాలుగు పేర్లు (వడ్రంగులు, కుమ్మరులు, తోలుపని చేసేవారు, చిత్రకారులు) మాత్రం ప్రత్యేకంగా ఉన్నాయి. ప్రతి సంఘం నగరంలో ఒక ప్రత్యేక ప్రాంతంలో నివసించేది. అంటే ఇలాంటి నివాసాలు, పరిశ్రమలు వృత్తుల స్థానికీకరణకు తోడ్పడటమే కాకుండా వారసత్వంగా తండ్రుల నుంచి వారి సంతానానికి సంక్రమించడానికి ఈ కళలు దోహదపడ్డాయి. సాధారణంగా వ్యాపారులంతా నగరాల్లోనే జీవించేవారు. కానీ వ్యాపారులు జీవనోపాధి కోసం రాజు జారీ చేసిన మాన్యాలు (భోగ గ్రామాలు) చేసుకోవడానికి గ్రామాలతో సంబంధం పెట్టుకోక తప్పలేదు. ఆర్థిక వ్యవస్థకు వ్యాపారులు చేస్తున్న సేవలను బట్టి పరమ నిరంకుశులైన రాజులు కూడా వారిని తగిన రీతిలో గౌరవించేవారు. వీటన్నింటినీ గమనిస్తే వృత్తి నిపుణులు, వ్యాపారులు నగరాల్లో ప్రధానమైన సామాజిక వర్గాలుగా అభివృద్ధిలోకి వచ్చారన్న విషయం అవగతమవుతోంది.

వృత్తి నిపుణులు తయారుచేసిన వస్తువులను వ్యాపారులు సుదూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించేవారు. జాతక కథల్లో 500 బండ్లకు సరిపోయే వస్తువులు, వస్త్రాలు, దంతపు వస్తువులు, కుండలు మొదలైనవి తీసుకెళ్లినట్లు ప్రస్తావించారు. ఆ కాలంలో అన్ని ప్రధాన నగరాలు నదీ తీరాలకు ఆనుకునే ఉండేవి. వాటిని కలుపుతూ వ్యాపార మార్గాలు చాలా ఏర్పడ్డాయి. ఉదా।।శ్రావస్తి పట్టణాన్ని కౌశాంబి, వారణాసి, కపిలవస్తు, కుశినార మొదలైన నగరాలతో అనుసంధానం చేశారు. లోహాలతో తయారైన నాణేలు మొట్టమొదట ఈ కాలంలోనే కన్పిస్తాయి. వైదిక గ్రంథాల్లో కనిపించే నిష్క, శతమాన అనే పదాలను నాణేల పేర్లుగానే గుర్తించినప్పటికీ అప్పటికే దొరికిన నాణేలు క్రీ.పూ. 6వ శతాబ్ది నాటి కంటే పాతవి మాత్రం కావు. ఈ కాలంలో మొట్టమొదటి దశలో నాణేలు చాలావరకు వెండితో తయారుచేశారు. కొన్ని రాగి నాణేలు కూడ లభించాయి. లోహ నాణేలపైన కొన్ని గుర్తులు అంటే.. కొండలు, చెట్లు, చేప, వృషభం మొదలైన చిహ్నాలతో రంధ్రాలు చేయడం వల్ల వీటిని రంధ్రపు గుర్తులున్న నాణేలనేవారు. పాళీ గ్రంథాలు ధనాన్ని విస్తారంగా ఉపయోగించేవారని, జీతభత్యాలు ధనరూపంలోనే చెల్లించేవారనీ పేర్కొన్నాయి.

అశోకుడికి ముందు రెండు శతాబ్దాల కిందటే ప్రారంభమైన లిపి కూడా వ్యాపారాభివృద్ధికి చాలా దోహదం చేసింది. ఈ కాలంలో గ్రంథాలన్నీ కొలతలకు సంబంధించిన సునిశిత పరిజ్ఞానాన్ని వివరించాయి. బహుశా ఇవి ఇళ్లు, భూముల సరిహద్దుల గుర్తింపులకు, నిర్మాణాలకు ఉపయోగపడి ఉంటాయి. ఆ విధంగా లేఖనం అనేది చట్టాలు, మతాచారాల సంకలనానికి మాత్రమే కాకుండా వ్యాపార వివరాలు, పన్నుల చెల్లింపు, విస్తృతమైన సైనిక ఉద్యోగుల వివరాలు రాసి పెట్టుకోవడానికి అవకాశం కల్పించింది. కానీ ఈ కాలంలో లిపి ఉండేదనే విషయానికి సంబంధించి ఎలాంటి పురావస్తు ఆధారాలు లేవు. అయితే ఈ ప్రాచీన రికార్డులను శిలలు, లోహపు ఫలకాలపై రాయకపోవడం వల్ల అవి నాశనమై ఉండొచ్చని అందుకే అవి అలభ్యాలని చెప్పొచ్చు.

మౌర్యుల తర్వాత పట్టణీకరణ

వ్యాపారం అభివృద్ధి చెందడం, ద్రవ్య ఆర్థిక విధానం విస్తరించడం పట్టణీకరణకు కారణభూతమయ్యాయి. చైనా యాత్రికులు తమ రచనల్లో పాటలీపుత్రం, వైశాలి, వారణాసి, కౌశాంబి, హస్తినాపురం, మధుర, ఇంద్రప్రస్థం మొదలైన నగరాలను పేర్కొన్నారు. కుషాణుల కాలంలో చిరండ్, సోన్‌పూర్, బక్సార్ (బీహార్), తూర్పు ఉత్తరప్రదేశ్‌లో ఖేరత్, మాసన్, ఉత్తరప్రదేశ్‌లో సోహ్‌గౌరా, భీటా, కౌశాంబి, శృంగవేర్‌పూర్, ఆంత్రజిఖేరా, మీరట్, మజఫర్‌పూర్ ప్రాంతాలు సంపదలతో తులతూగేవి. అదేవిధంగా పంజాబ్‌లోని జలంధర్, లూథియానా, రూపార్‌ల్లో కూడా కుషాణుల కాలం నాటి నిర్మాణాలు బయటపడ్డాయి. మొత్తం మీద కుషాణుల కాలంలో నగరీకరణ అత్యున్నత స్థాయికి చేరుకుంది. పశ్చిమ భారతదేశంలో మాళ్వా ప్రాంతాన్ని పరిపాలించిన శకుల నగరాలు కూడా అద్భుతంగా ఉన్నాయి. వారి ప్రధాన నగరం ఉజ్జయిని. కౌశాంబి నుంచి మధుర, మధుర నుంచి పశ్చిమ తీర ప్రాంతానికి వచ్చే రెండు ప్రధాన రహదారులు ఉజ్జయినిలో కలవడం వల్ల ఆ నగరానికి అధిక ప్రాధాన్యత లభించింది. దీనికితోడు ఉజ్జయిని అతి విలువ కలిగిన ఆగేట్, కార్నిలియన్ రాళ్ల వ్యాపారానికి కేంద్రంగా ఉండేది. క్రీ.పూ. 200 నుంచి ఇక్కడ కార్నిలియన్, జాస్పర్ రాళ్లతో పూసల్ని తయారు చేసేవారని తవ్వకాలు నిరూపిస్తున్నాయి. క్షిప్రా నదీ గర్భంలో పుష్కలంగా ముడిసరుకు లభించడం వల్ల ఈ పరిశ్రమ గొప్పగా వర్ధిల్లింది.

శకులు, కుషాణుల యుగంలా శాతవాహనుల కాలంలో టగర్, పైఠాన్, ధాన్యకటకం, అమరావతి, నాగార్జునకొండ, బరూచ్, సొపారా, అరికమేడు, కావేరిపట్నం ప్రసిద్ధి చెందాయి. తెలంగాణలో ఫణిగిరి, మునుల గుట్ట, పోతన్ ప్రసిద్ధి చెందిన బౌద్ధ పట్టణాలని 'ప్లిని' అనే చరిత్రకారుడు తన రచనల్లో పేర్కొన్నారు.

గుప్తుల యుగం నాటి పట్టణీకరణ క్షీణత-ప్రభావం

6వ శతాబ్దం నుంచి వ్యాపారం తీవ్రంగా తగ్గుముఖం పట్టింది. రోమన్ సామ్రాజ్యంతో, పశ్చిమ దేశాలతో వ్యాపారం ఆగిపోయింది. 6వ శతాబ్దంలో ఇరాన్, బైజాంటియన్‌లతో పట్టువస్త్రాల వ్యాపారం ఆగిపోయింది, భారతదేశం.. చైనా, ఆగ్నేయ ఆసియాతో వ్యాపారం కొనసాగించడంలో దళారీలైన అరబ్బుల పాత్ర ప్రధానం. లాభాలు కూడా పూర్తిగా వారే పొందారు. వ్యాపారం క్రమక్రమంగా తగ్గుముఖం పట్టడంతో దేశంలో బంగారం నాణేలు పూర్తిగా తగ్గిపోయాయి. క్రమంగా పట్టణాలు శిథిలం కావడంతో మధుర, శ్రావస్తి, చరండ్, వైశాలి, పాటలీపుత్రం మొదలైన నగరాలు కాలగర్భంలో కలిసినట్లు తవ్వకాలు నిరూపిస్తున్నాయి. భారతీయ ఎగుమతులకు అవకాశాలు తగ్గడం వల్ల చేతివృత్తులవారు, వ్యాపారులు గ్రామీణ ప్రాంతాలకు తరలివెళ్లి వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించారు. 5వ శతాబ్దం చివరలో పట్టు నేసేవాళ్లు పశ్చిమ తీరం నుంచి మాళ్వా ప్రాంతంలోని మాండ్‌సోర్‌కు వలస వెళ్లారు. పట్టణాలు శిథిలం కావడం వల్ల, వ్యాపారం తగ్గుముఖం పట్టి గ్రామాలు తమకు కావలసిన నూనె, ఉప్పు, సుగంధద్రవ్యాలు, బట్టలు మొదలైన వస్తువుల్ని సమకూర్చుకోవాల్సివచ్చింది. అందువల్ల ఉత్పత్తి కేంద్రాలు చిన్నవిగా మారి, తమ అవసరాలకు మాత్రమే పరిమితంగా ఉండిపోయాయి. తర్వాత సామాజిక నిర్మాణంలో కూడా కొన్ని మార్పులు వచ్చాయి. ఉత్తర భారతదేశంలో వైశ్యులను స్వతంత్ర రైతులుగా పరిగణించేవారు.

భూదానాలు రాజుకు, రైతుకు మధ్య భూస్వాములను సృష్టించాయి. అందువల్ల వైశ్యులు శూద్రులతో సమానమైపోయారు. ఈ మార్పు ఉత్తర భారతదేశం నుంచి బెంగాల్‌కు, దక్షిణ భారతదేశానికి విస్తరించింది.

వర్ణ వ్యవస్థలో మార్పులు

ధర్మశాస్త్రాల ప్రకారం వ్యక్తుల సామాజిక స్థాయి వర్ణంపై ఆధారపడి ఉండేది. ఒక వ్యక్తికి ఉన్న ఆర్థిక హక్కులు కూడా అతని వర్ణంపై ఆధారపడి ఉండేవి. పరిస్థితులు మారిన తర్వాత కొత్త భూస్వామ్య వర్గానికి ఇవ్వాల్సిన స్థానాన్ని గురించి ధర్మశాస్త్ర గ్రంథాల్లో మార్పులు చేశారు.

విద్యార్థి సామర్థ్యాన్ని సూచించేవి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఎస్జీటీ - సైన్స్ మెథడాలజీ

విజ్ఞానశాస్త్ర బోధన లక్ష్యాలు

- సాధారణంగా ఉద్దేశాలు, గమ్యాలు, లక్ష్యా లు అనే పదాలను పర్యాయపదాలుగా వాడతారు.
- **గమ్యాలు:** విశాలమైన, దీర్ఘకాలిక అంతిమ ప్రయోజనాన్ని తెలిపేవి గమ్యాలు.
  ఉదా: విద్యకు పరమార్థం మోక్షం. **- ఉపనిషత్తులు**
- **ఉద్దేశాలు:** గమ్యాల నుంచి ఏర్పడినవి ఉద్దేశాలు. ఇవి గమ్యాల కంటే నిర్దిష్టమైనవే కాకుండా విద్యా దిశలను కూడా సూచి స్తాయి.
  ఉదా: విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్ర జ్ఞానం కలిగించడం.
- **లక్ష్యాలు:** స్వల్పకాలంలో చేరగలిగే గమ్యాలను లక్ష్యాలనవచ్చు.
  ఉదా: డీఈడీ పరీక్ష పాసవడం.

విజ్ఞానశాస్త్ర అధ్యయన విలువలు:
1. సామాజిక విలువలు
2. సాంస్కృతిక విలువలు
3. నైతిక విలువలు 4.వృత్తిపరమైన విలువలు
5. ఔపయోగిక విలువలు

సామాజిక విలువలు- రకాలు:
1. బౌద్ధిక విలువ 2. సృజనాత్మక విలువ
3. సౌందర్య విలువ.



విద్యా లక్ష్యాలను ఈ కింది విధంగా చూపొచ్చు
- **గాగ్నే అనే విద్యావేత్త సూచించిన వర్గీకరణ:** గాగ్నే అభ్యసనాన్ని వివిధ రకాలుగా విడమర్చి చెప్పారు. అవి..

సూచీ అభ్యసనం- ఉద్దీపన- ప్రతిస్పందన అభ్యసనం, భావనాభ్యసనం, సూత్రాల అభ్య సనం, సమస్యా పరిష్కారం. ఇవి సరళం నుంచి సంక్లిష్టం వరకు ఒక క్రమ పద్ధతిలో అమిరి ఉంటాయి.

- **బెంజిమన్ బ్లూమ్, క్రాత్‌హోల్, డేవిడ్ సూచించిన వర్గీకరణ:** వీరు విద్యా లక్ష్యాలను మూడు వర్గాలుగా విభజించారు. అవి..
  ఎ) జ్ఞానాత్మక రంగం బి) భావావేశ రంగం
  సి) మానసిక చలనాత్మక రంగం
- జ్ఞానాత్మక రంగంపై బెంజిమన్ బ్లూమ్, భావావేశ రంగంపై డేవిడ్.ఆర్. క్రాత్‌హోల్, మానసిక చలనాత్మక రంగంపై ఎలిబత్ సింప్సన్, ఆర్.హెచ్. దవే కృషి చేశారు.
- జ్ఞానాత్మక రంగం మెదడుకు, భావావేశ రంగం హృదయానికి, మానసిక చలనా త్మక రంగం మనసుకు, శరీరానికి సంబం ధించినవి.
- ఏ అంశం గురించి అయినా ఈ మూడు రంగాల్లో విద్యార్థులను అభివృద్ధి చేయాలి.

విజ్ఞాన శాస్త్రంలో లక్ష్యాలు - స్పష్టీకరణలు -వివరణలు

ఎ. జ్ఞాన రంగంలో లక్ష్యాలు:
- జ్ఞప్తికి తెచ్చుకోవడం
- గుర్తించడం

లక్ష్యం-I
1. **జ్ఞప్తికి తెచ్చుకోవడం :** విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన పదాలు, సత్యాలు, భావన లు, సూత్రాలు, నిర్వచనాలు, నియమాలు పద్ధతులు జ్ఞప్తికి తెచ్చుకొంటాడు.
   ఉదా: చంద్ర గ్రహణం అంటే ఏమిటి?
2. **గుర్తించడం:** విద్యార్థి విజ్ఞానశాస్త్ర సం బంధమైన సత్యాలు, భావనలు, సూత్రా లు, నియమాలు, పద్ధతులు గుర్తిస్తాడు.
   ఉదా: కుంభాకార, పుటాకార దర్పణాల్లో భేదాలను గుర్తించడం.

లక్ష్యం-II అవగాహన:
విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన పదా లు, సత్యాలు, భావనలు మొదలైన వాటిని అవగాహన చేసుకుంటాడు.

స్పష్టీకరణలు:
- భావనలు, నియమాలు, సూత్రాలకు ఉదాహరణలిస్తాడు.
  ఉదా: సజీవులకు ఉదాహరణనిస్తాడు.
- వివిధ భావనలు, సూత్రాలు, నియమాలను వివరిస్తాడు.
- ఇచ్చిన వాక్యంలోని దోషాన్ని సవరించి సరి చేస్తాడు.
- వివిధ భావనలు, సూత్రాలు నియమా లను సరి చేస్తాడు.
- చిత్రపటాలకు, రేఖా పటాలకు, దత్తాంశాలకు వ్యాఖ్యానం రాస్తాడు.
- విజ్ఞాన సూత్ర సత్యాలను, భావాలను వర్గీకరిస్తాడు.
- సమస్యలను సాధిస్తాడు.
- విజ్ఞానశాస్త్ర పరికరాలను, రసాయనాలను ఎంపిక చేసుకుంటాడు.
- భౌతిక రాశులకు సరైన ప్రమాణాలు తెలుపుతాడు.
- శాస్త్ర సత్యాలు, భావనలను, ప్రక్రియలను సరిపోల్చుతాడు.

లక్ష్యం - III వినియోగం: విద్యార్థి తాను నేర్చుకున్న విజ్ఞానశాస్త్ర విజ్ఞానాన్ని పరిస్థితులకనుగుణంగా వినియోగిస్తాడు.

స్పష్టీకరణలు:
- భావనలు, సూత్రాలు, నియమాలు మొదలైన వాటిని విశ్లేషిస్తాడు.
- విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానాన్ని నేరుగా వినియోగిస్తారు.
- శాస్త్ర ప్రక్రియలకు, దృగ్విషయాలకు కారణాలను తెలుపుతాడు.
- కారణానికి, ఫలితానికి మధ్య సంబం ధాన్ని ఏర్పరుస్తాడు.
- శాస్త్ర పరిశీలనలను వ్యాఖ్యానిస్తాడు.
- సామాన్యీకరణలను ప్రతిపాదిస్తాడు.
- సరైన ప్రయోగ విధానాలు, పరికరాలను సూచిస్తాడు.
- ప్రాగుక్తీకరించగలడు.
- దత్తాంశం ఆధారంగా నిర్ణయం తీసుకుంటాడు.

భావావేశ రంగం లక్ష్యాలు:
లక్ష్యం I: శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి
లక్ష్యం II: అభిరుచి
లక్ష్యం III: అభినందన

మానసిక చలనాత్మక రంగ లక్ష్యాలు
లక్ష్యం I: చిత్రలేఖన నైపుణ్యం
లక్ష్యం II: హస్త నైపుణ్యాలు
లక్ష్యం III: పరిశీలన నైపుణ్యాలు
లక్ష్యం IV: అభివ్యంజన నైపుణ్యాలు
లక్ష్యం V: నివేదన నైపుణ్యాలు

విజ్ఞాన శాస్త్రం- సహ సంబంధం

సహ సంబంధం ఆవశ్యకత:
- జ్ఞానాన్ని సంయుక్తపరచడం
- సమర్థవంతమైన అభ్యసనం
- శ్రమ ఆదా
- అభ్యసన బదలాయింపు

సహ సంబంధం- రకాలు:
- సహజసిద్ధం
- కృత్రిమ సహ సంబంధం
- వ్యవస్థీకృత సహ సంబంధం
- విజ్ఞానశాస్త్రానికి విద్యా ప్రణాళికలోని ఇతర పాఠ్యవిషయాలకు సంబంధం
- విజ్ఞానశాస్త్రం- భాష
- విజ్ఞానశాస్త్రం - చరిత్ర
- విజ్ఞానశాస్త్రం - భౌగోళిక శాస్త్రం
- విజ్ఞానశాస్త్రం- గణితం
- విజ్ఞానశాస్త్రం - చిత్రలేఖనం
- విజ్ఞాన శాస్త్రం - చేతిపని
- విజ్ఞాన శాస్త్రం-దైనందిన జీవితానికి సంబంధం.

విద్యా లక్ష్యాలు
- **జ్ఞాన రంగం:** జ్ఞానానికి సంబంధించిన వాటిని జ్ఞప్తికి తెచ్చుకోవడం, గుర్తించడం, మానసిక సామర్థ్యాలు, నైపుణ్యాలను అభివృద్ధి పరచడం.
- **భావావేశ రంగం:** ఆసక్తులు, విలువల్లో మార్పులు, అభినందనను పెంపొందించడం
- **మానసిక చలనాత్మక రంగం:** హస్తలాఘవ, మోటార్ నైపుణ్యాలు అభివృద్ధి చేయడం

బ్లూమ్ సూచించిన లక్ష్యాల వర్గీకరణ

శిశువు (ప్రవర్తన)

జ్ఞాన రంగం	భావావేశ రంగం	మానసిక చలనాత్మక రంగం
1. జ్ఞానం	1. గ్రహించడం	1. అనుకరణ
2. అవగాహన	2. ప్రతిస్పందించడం	2. హస్తలాఘవం
3. వినియోగం	3. విలువకట్టడం	3. సునిశితత్వం
4. విశ్లేషణ	4. వ్యవస్థాపనం	4. ఉచ్చారణ
5. సంశ్లేషణ	5. శీలస్థాపనం	5. స్వాభావీకరణం
6. మూల్యాంకనం		

గతంలో అడిగిన ప్రశ్నలు

1. విద్యార్థులు చేసే ప్రయోగాలకు కావాల్సిన పరికరాలను, వస్తు సామగ్రిని వారే తయారు చేసుకోవడాన్ని సూచించే విలువ? (డీఎస్సీ2008)
   ఎ) క్రమశిక్షణ విలువ
   బి) ఉపయోగిత విలువ
   సి) సృజనాత్మక విలువ
   డి) వృత్తిపరమైన విలువ
2. అవగాహనలో ప్రవర్తనాత్మకమైన స్పష్టీకరణం ఎక్స్‌ట్రాపొలేషన్‌కు ఉదాహరణ? (డీఎస్సీ-2008)
   ఎ) కార్యనిర్వాహక సంబంధం తెలపడం
   బి) అన్వయం చేయడం, వర్ణించడం
   సి) పోల్చడం, తేడాలు చెప్పడం
   డి) ఒక పరిష్కారం నుంచి మరొక పరిష్కారానికి
3. సామర్థ్యాలను స్పష్టీకరించడంలో ఒక మౌలికాంశం? (డీఎస్సీ-2006)
   ఎ) అభ్యసన ఔచిత్యం బి) పరిస్థితులు
   సి) పరిసరాల అనుగుణ్యత
   డి) పాఠ్యాంశాలు
4. మానసిక చలనాత్మక రంగంలోని లక్ష్యాల క్రమం? (డీఎస్సీ-2006)
   ఎ) అనుకరణ, నిర్వహణ, సునిశితత్వం, సమన్వయం, స్వాభావీకరణం
   బి) అనుకరణ, ప్రతిస్పందన, విలువ, సమన్వయం, శీలస్థాపనం
   సి) గ్రహించడం, నిర్వహణ, సునిశితత్వం సమన్వయం, శంకుస్థాపన
   డి) గ్రహించడం, ప్రతిస్పందన, విలువ, సమన్వయం, స్వాభావీకరణం
5. ఇందులో ఒకటి మానసిక చలనాత్మక రంగంలోని లక్ష్యం? (డీఎస్సీ-2001)
   ఎ) పరిసరాల్లో ఉన్న వాటిపై ఆసక్తి ప్రదర్శించడం
   బి) శాస్త్ర సంబంధమైన భావనలు గుర్తించడం
   సి) పటాలు గీయడంలో నైపుణ్యం
   డి) శాస్త్ర జ్ఞానాన్ని వినియోగించడం
6. మన ప్రకృతి సంపదను, వనరులను సద్వినియోగం చేసుకోవడం అనేది శాస్త్రపరంగా ఏ విలువను పెంపొందిస్తుంది? (డీఎస్సీ-2001)
   ఎ) బౌద్ధిక విలువ
   బి) సౌందర్య విలువ
   సి) ఉపయోగిత విలువ
   డి) వృత్తి విలువ
7. విద్యార్థి గడించిన సామర్థ్యాలను సూచించేవి? (డీఎస్సీ-2001)
   ఎ) ఉద్దేశాలు బి) లక్ష్యాలు
   సి) నైతిక విలువలు
   డి) స్పష్టీకరణలు
8. విజ్ఞానశాస్త్రాన్ని ఇతర సబ్జెక్టులతో సహసంబంధం కలిగించడం? (డీఎస్సీ-2000)
   ఎ) కష్టం బి) సులువు
   సి) ఇవేవీ కావు డి) మౌలికమైంది
9. ప్రయోగాలు/ కృత్యాలు చేయడం దేనికి సంబంధించింది? (డీఎస్సీ-2000)
   ఎ) అవగాహన బి) జ్ఞానం
   సి) నైపుణ్యం డి) అభినందన
10. క్షేత్ర పర్యటన ఏ రంగంలోనిది? (డీఎస్సీ-1998)
   ఎ) జ్ఞానాత్మక రంగం
   బి) మానసిక చలనాత్మక రంగం
   సి) భావావేశ రంగం
   డి) పైవేవీ కావు
11. 'విద్యార్థి నమ్మకంగా తన పరిశీలనలను నమోదు చేయడం' ఏ ముఖ్య లక్షణాన్ని సూచిస్తుంది? (డీఎస్సీ-1994)
   ఎ) అవగాహన బి) వైఖరి
   సి) నైపుణ్యం డి) జ్ఞానం

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) ఎ; 4) ఎ; 5) సి; 6) సి; 7) డి; 8) డి; 9) సి; 10) సి; 11) సి.

మాదిరి ప్రశ్నలు

1. విద్యా విషయక లక్ష్యాలను వర్గీకరించింది?
   ఎ) R.C. రాస్ బి) C.P.S. నాయర్
   సి) బ్లూమ్ డి) స్మిత్
2. ఎక్స్‌ట్రాపొలేషన్ దేనికి సంబంధించింది?
   ఎ) అనువాదం బి) అవగాహన
   సి) పరికల్పన డి) హేతుకీకరణ
3. 'Taxonomy of Educational Objectives'.. ఎవరి రచన?
   ఎ) బ్లూమ్ బి) థార్న్‌డైక్
   సి) అరిస్టాటిల్ డి) గాగ్నే
4. ఎత్తుకు, గురుత్వ త్వరణానికి సంబంధం తెలపడం ____
   ఎ) వినియోగం బి) జ్ఞానం
   సి) అవగాహన డి) సంశ్లేషణ
5. బొమ్మలు గీయడం ఏ రంగానికి చెందింది?
   ఎ) భావావేశ బి) జ్ఞానాత్మక
   సి) మానసిక చలనాత్మక
   డి) ఏదీకాదు
6. భావావేశ రంగాన్ని వివరించినవారు?
   ఎ) గేట్స్ బి) విలియమ్స్
   సి) క్రాత్‌హోల్ డి) బ్లూమ్

సమాధానాలు

1) సి; 2) బి; 3) ఎ; 4) సి; 5) సి; 6) సి.

మొట్టమొదటి భారతీయ అణు రియాక్టర్

భారతదేశం - శక్తి సంపద

శక్తి ఒక ముఖ్య వనరు మాత్రమే కాకుండా ఆధునిక కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే ప్రథమ కారకం. ఒక దేశం వ్యవసాయకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి శక్తి సంపద ఎంతో అవసరం. ప్రస్తుతం మానవ జీవితం శక్తి వనరులపై ఎంతో ఆధారపడింది. మానవ జీవితావసరానికి రూపొందించే ప్రతి వస్తు ఉత్పత్తి ఈ శక్తిపైనే ఆధారపడి ఉంటుంది. శక్తి వనరులను రెండు రకాలుగా విభజించొచ్చు. అవి

1. సంప్రదాయ శక్తి వనరులు/తరిగిపోయే శక్తి వనరులు
2. సంప్రదాయేతర/తరిగిపోని శక్తి వనరులు

1. సంప్రదాయ/తరిగిపోయే శక్తి వనరులు:
- బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తిని ఉత్పత్తి చేసే యురేనియం, థోరియం వంటి ఖనిజాలు మొదలైన వాటిని సంప్రదాయ శక్తి వనరులు అంటారు.
- వీటి నిల్వలు ప్రకృతిలో నిర్దిష్ట పరిమాణంలో మాత్రమే ఉన్నందున వాడుతూ ఉంటే క్రమేణా తరిగిపోతాయి.
- ఇవి తరిగిపోతే మానవుడు పునరుద్ధరించలేడు. కాబట్టి వచ్చే తరాలను దృష్టిలో పెట్టుకొని వీటిని క్రమబద్ధంగా వినియోగించుకోవాలి.

2. సంప్రదాయేతర/తరిగిపోని శక్తి వనరులు:
- నీరు, సౌరశక్తి, పవన శక్తి, వేలా తరంగాలు, భూతాప శక్తి మొదలైన వాటిని సంప్రదాయేతర శక్తి వనరులుగా పరిగణిస్తారు.
- ఇవి ప్రకృతిలో నిరంతరం లభ్యమవుతాయి. కాబట్టి తరిగిపోవడమనే సమస్యే లేదు.
- అయితే వీటిని శక్తి ఉత్పాదకతకు ఉపయోగించుకోవాలంటే సాంకేతికాభివృద్ధితో మాత్రమే సాధ్యపడుతుంది.
- మనదేశంలో నేలబొగ్గు, చమురు, కర్ర బొగ్గు, నీరు ప్రధాన శక్తి వనరులు. సూర్యరశ్మి, గాలి మొదలైన వనరుల వాడకం ఇప్పుడిప్పుడే అభివృద్ధి దశలో ఉంది. అలాగే అణుశక్తి కూడా మంచి అభివృద్ధి దశలో ఉందని చెప్పొచ్చు. వీటన్నింటిలోనూ బొగ్గు చాలా ముఖ్యమైన శక్తి ఉత్పాదక వనరు. ఆ తర్వాత స్థానం జలశక్తి ఆక్రమిస్తుంది.
- మనదేశంలో మొదటిసారి విద్యుచ్ఛక్తి తయారీ డార్జిలింగ్ (పశ్చిమ బంగా)లో 1897లో ప్రారంభమైంది. ఆ తర్వాత 1902లో కర్ణాటకలోని శివసముద్రం వద్ద జల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- స్వాతంత్ర్యానంతరం 'విద్యుచ్ఛక్తి చట్టం 1948'లో ప్రవేశపెట్టి విద్యుచ్ఛక్తిని ప్రభుత్వ రంగ పరిధిలోకి తెచ్చారు.
- 1975లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, 'నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్'ల ఏర్పాటుతో దేశంలో విద్యుచ్ఛక్తి రంగంలో గణనీయమైన అభివృద్ధి జరిగింది.
- మనదేశంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి 1947లో 1400 మెగావాట్లు ఉంటే, 2005-06 నాటికి 1,19,607 మె.వాట్లకు చేరింది.

థర్మల్ విద్యుత్

- బొగ్గు, నీటి ఆవిరి ఆధారంగా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను థర్మల్ విద్యుత్ అంటారు. దేశంలో సుమారు 73 శాతం ఉత్పత్తితో థర్మల్ విద్యుత్ మొదటి స్థానంలో ఉంది.
- థర్మల్ విద్యుత్‌ను ఎక్కువగా మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ఉత్పత్తి చేస్తున్నాయి.

భారతదేశంలో సూపర్ థర్మల్ పవర్ స్టేషన్లు

ఎస్టీపీఎస్	రాష్ట్రం
1. సింగ్రౌలి	ఉత్తరప్రదేశ్
2. దాద్రి	ఉత్తరప్రదేశ్
3. రీహాండ్	ఉత్తరప్రదేశ్
4. వూంచహార్	ఉత్తరప్రదేశ్
5. సింహాద్రి	ఆంధ్రప్రదేశ్
6. రామగుండం	తెలంగాణ
7. వింద్యాచల్ -1	మధ్యప్రదేశ్
8. వింద్యాచల్-2	మధ్యప్రదేశ్
9. కోర్బా	ఛత్తీస్‌గఢ్
10. కహాల్‌గావ్	బీహార్
11. తాల్చేర్	ఒడిశా
12. కాయంకుళం	కేరళ
13. ఫరక్కా	పశ్చిమ బంగా

- వేయి మెగావాట్ల కంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పవర్ స్టేషన్‌ను సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్టీపీఎస్) అంటారు. ఇవి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) ఆధ్వర్యంలో ఉంటాయి.
- 4000 మె.వాట్ల కంటే ఎక్కువ థర్మల్ విద్యుత్ సామర్థ్యం ఉంటే వాటిని 'అల్ట్రా మెగా పవర్ ప్లాంట్' (యూఎంపీపీ) అంటారు.

అణు విద్యుత్

అణు విద్యుదుత్పత్తికి అవసరమైన యురేనియం, థోరియం, ఇల్మనైట్, మోనజైట్ ఖనిజాలు భారతదేశంలో తగినంతగా లభిస్తున్నాయి.

- జార్ఖండ్‌లోని రాణి మేఖలలో, రాజస్థాన్‌లోని 'ఆరావళి' పర్వత ప్రాంతంలో యురేనియం లభిస్తోంది.
- బీహార్‌లో గయ, రాజస్థాన్‌లో జైపూర్, ఉదయ్‌పూర్, ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు జిల్లాల్లో యురేనియం నిల్వలున్నాయి.

- జార్ఖండ్‌లోని 'జాదుగూడ'లో యురేనియాన్ని శుద్ధి చేసే ప్లాంట్ ఉంది.
- కేరళ తీరం వెంట ఉన్న మోనజైట్ ఇసుకల్లో థోరియం నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి.
- ప్రపంచంలోని థోరియం నిక్షేపాల్లో 50 శాతంపైగా భారతదేశంలోనే ఉన్నాయి.
- ప్రస్తుతం భారతదేశ అణు విద్యుత్ సామర్థ్యం 4780 మె.వా. ఇది దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఉత్పత్తిలో సుమారు 3 శాతం.
- ప్రపంచంలో అణు విద్యుత్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశం ఫ్రాన్స్.

భారతదేశంలోని అణు విద్యుత్ కేంద్రాలు

1. తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం (టీఏపీఎస్) (మహారాష్ట్ర):
- భారతదేశంలో ఏర్పాటు చేసిన మొదటి అణు విద్యుత్ కేంద్రం.
- 1969, అక్టోబర్ 28న దీన్ని స్థాపించారు.
- ఇక్కడ ఉన్న అణు రియాక్టర్ పేరు - అప్సర.
- ఈ కేంద్రం అణు విద్యుత్ సామర్థ్యం - 1400 మె.వాట్లు.

2. రావత్ భటా అణు విద్యుత్ కేంద్రం (ఆర్‌ఏపీఎస్) (రాజస్థాన్):
- ఈ కేంద్రాన్ని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించారు.
- 1973, డిసెంబర్ 16న రాజస్థాన్‌లో నెలకొల్పారు.
- 'కోటా అణు విద్యుత్ కేంద్రం' అని కూడా అంటారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 1180 మె.వాట్లు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ

3. కల్పకం అణు విద్యుత్ కేంద్రం (ఎంఏపీఎస్) (తమిళనాడు):
- 1984, జనవరి 24న తమిళనాడులోని కల్పకం వద్ద ఏర్పాటు చేశారు.
- మద్రాస్ అటామిక్ పవర్ స్టేషన్ (ఎంఏపీఎస్) అని, 'ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్' అని కూడా అంటారు.
- ఇక్కడ ఉన్న అణు రియాక్టర్ పేరు - కామిని, ఈ రియాక్టర్ ద్వారా ప్లాటినాన్ని ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.
- అణు విద్యుత్ సామర్థ్యం - 440 మె.వా.

4. నరోరా అణు విద్యుత్ కేంద్రం (ఎన్‌ఏపీఎస్) (ఉత్తరప్రదేశ్):
- ఉత్తరప్రదేశ్‌లోని నరోరా వద్ద 1991, జనవరి 1న దీన్ని ఏర్పాటు చేశారు.
- దీని ద్వారా ప్రధానంగా ఢిల్లీకి విద్యుత్‌ను అందిస్తున్నారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 440 మె.వా.

5. కాక్రపార అణు విద్యుత్ కేంద్రం (కెఏపీపీ) (గుజరాత్):
- గుజరాత్‌లోని కాక్రపార ప్రాంతంలో 1993, మే 6న నెలకొల్పారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 440 మె.వా.

6. కైగా అణు విద్యుత్ కేంద్రం (కెపీపీ) (కర్ణాటక):
- కర్ణాటక రాష్ట్రంలోని 'కైగా' ప్రాంతంలో 2000, నవంబర్ 16న స్థాపించారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 850 మె.వా.
- తమిళనాడులోని 'కూడంకుళం' వద్ద రష్యా సహాయంతో వేయి మెగావాట్లతో రెండు అణు రియాక్టర్లను నిర్మిస్తున్నారు.
- అణు విద్యుత్ కర్మాగారంలో మితకారిగా 'భారజలం'ను ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చు.
- భారతదేశంలో 1962లో మొట్టమొదటి 'భారజల కేంద్రాన్ని' 'నంగల్' (ఉత్తరప్రదేశ్)లో ఏర్పాటు చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. మొట్టమొదటి భారతీయ అణు రియాక్టర్ పేరు?
   1) ఊర్వశి 2) కామిని 3) రోహిణి 4) అప్సర
2. యురేనియం శుద్ధి ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) ట్రాంబే 2) తారాపూర్ 3) జాదుగూడ 4) కల్పకం
3. కామిని అణు రియాక్టర్ ఎక్కడ ఉంది?
   1) కల్పక్కం అణు విద్యుత్ కేంద్రం
   2) తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం
   3) కైగా అణు విద్యుత్ కేంద్రం
   4) నరోరా అణు విద్యుత్ కేంద్రం
4. సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్టీపీఎస్) అంటే?
   1) 4000 మె.వా. కంటే ఎక్కువ గల ప్రాజెక్టు
   2) 1000 మె.వా. కంటే ఎక్కువ గల ప్రాజెక్టు
   3) 1000 మె.వా. కంటే తక్కువ గల ప్రాజెక్టు
   4) ఏదీకాదు
5. 'ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్' ఎక్కడ ఉంది?
   1) మహారాష్ట్ర 2) ఉత్తరప్రదేశ్ 3) తమిళనాడు 4) గుజరాత్
6. వీటిలో ఏది సంప్రదాయ వనరు కాదు?
   1) బొగ్గు 2) ముడిచమురు 3) సౌర శక్తి 4) అణు శక్తి
7. మనదేశంలో మొట్టమొదటిసారిగా (1897) విద్యుచ్ఛక్తి ఏ ప్రాంతంలో ప్రారంభమైంది?
   1) శివ సముద్రం 2) డార్జిలింగ్ 3) తాల్చేర్ 4) నంగల్
8. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)ని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1948 2) 1962 3) 1980 4) 1975
9. 'రీహాండ్' సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ ఏ రాష్ట్రంలో ఉంది?
   1) ఉత్తరప్రదేశ్ 2) మధ్యప్రదేశ్ 3) ఛత్తీస్‌గఢ్ 4) కేరళ
10. దేశంలో నాలుగో అణు విద్యుత్ కేంద్రం 'నరోరా' ఎక్కడ ఉంది?
    1) గుజరాత్ 2) రాజస్థాన్ 3) తమిళనాడు 4) ఉత్తరప్రదేశ్
11. వీటిలో ఏ శక్తి వనరు సంప్రదాయేతర శక్తి వనరు కాదు?
    1) సూర్యరశ్మి 2) అణుశక్తి 3) పవన శక్తి 4) వేలా తరంగాలు
12. వీటిలో థర్మల్ పవర్ స్టేషన్‌ల్లో సరి కానిది?
    1) ఉత్తరప్రదేశ్ - దాద్రి
    2) పశ్చిమ బెంగాల్ - ఫరక్కా
    3) ఛత్తీస్‌గఢ్ - వూంచహార్
    4) కేరళ - కాయంకుళం
13. ససన్ థర్మల్ ప్రాజెక్టు ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మహారాష్ట్ర 2) మధ్యప్రదేశ్ 3) కర్ణాటక 4) ఒడిశా
14. భారతదేశంలో మొట్టమొదటి భారజల కేంద్రాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1975 2) 1948 3) 1962 4) 1972
15. 'కోటా' భారజల కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) రాజస్థాన్ 2) ఒడిశా 3) మహారాష్ట్ర 4) గుజరాత్

భారతదేశంలో భారజల కేంద్రాలు

భారజల కేంద్రం	రాష్ట్రం
1. కోటా	రాజస్థాన్
2. తాల్చేర్	ఒడిశా
3. థాల్	మహారాష్ట్ర
4. బరోడా	గుజరాత్
5. ట్యుటికోరిన్	తమిళనాడు
6. హజీరా	మధ్యప్రదేశ్
7. మణుగూరు	తెలంగాణ

సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 2; 5) 3; 6) 3; 7) 2; 8) 4; 9) 1; 10) 4; 11) 2; 12) 4; 13) 2; 14) 3; 15) 1.

The greatest capacity for data transmission..

BANK EXAMS
COMPUTER KNOWLEDGE

1. UNIVAC stands for:
   a) Universal Automatic Computer
   b) Universal Array Computer
   c) Unique Automatic Computer
   d) Unvalued Automatic Computer
   e) None of the above
2. The basic operations performed by a computer are ___
   a) Arithmetic operation
   b) Logical operation
   c) Storage and relative
   d) All of the above
   e) None of the above
3. The two major types of computer chips are ___
   a) External memory chip
   b) Primary memory chip
   c) Microprocessor chip
   d) Both b and c
   e) None of the above
4. Microprocessors as switching devices are for which generation computers?
   a) First
   b) Second
   c) Third
   d) Fourth
   e) None of the above
5. What is the main difference between a mainframe and a super computer?
   a) Super computer is much larger than mainframe computers
   b) Super computers are much smaller than mainframe computers
   c) Supercomputers are focused to execute few programs as fast as possible while mainframe uses its power to execute as many programs concurrently
   d) Supercomputers are focused to execute as many programs as possible while mainframe uses its power to execute few programs as fast as possible
   e) None of the above
6. ASCII and EBCDIC are the popular character coding systems. What does EBCDIC stand for?
   a) Extended Binary Coded Decimal Interchange Code
   b) Extended Bit Code Decimal Interchange Code
   c) Extended Bit Case Decimal Interchange Code
   d) Extended Binary Case Decimal Interchange Code
   e) None of the above
7. The brain of any computer system is ___
   a) ALU b) Memory c) CPU
   d) Control unit
   e) None of the above
8. Storage capacity of magnetic disk depends on:
   a) Tracks per inch of surface
   b) Bits per inch of tracks
   c) Disk pack in disk surface
   d) All of the above
   e) None of the above
9. The two kinds of main memory are:
   a) Primary and secondary
   b) Random and sequential
   c) ROM and RAM
   d) All of the above
   e) None of the above
10. A storage area used to store data to a compensate for the difference in speed at which the different units can handle data is ___
    a) Memory
    b) Buffer
    c) Accumulator
    d) Address
    e) None of the above
11. Bluetooth is a type of radio wave information transmission system that is good for about:
    a) 30 feet
    b) 30 yards
    c) 30 miles
    d) 300 miles
    e) None of the above
12. The telephone is an example of a(n) _____ signal.
    a) Analog b) Digital
    c) Modulated d) Demodulated
    e) None of the above
13. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is the ______.
    a) Internal modem
    b) External modem
    c) PC Card modem
    d) Wireless modem
    e) None of the above
14. A modem that is contained within the system unit is called a(n) ______ modem.
    a) External b) Internal
    c) Wireless d) Wi-Fi
    e) None of the above
15. A modem that doesn't need to be connected to a telephone line is the ______ modem.
    a) External b) Internal
    c) Wireless d) DSL
    e) None of the above
16. A special high-speed line used by large corporations to support digital communications is known as
    a) satellite/air connection service lines
    b) cable modems
    c) digital subscriber lines
    d) T1, T2, T3 and T4 lines
    e) None of the above
17. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ________.
    a) ISDN b) Microwave
    c) Cable modem d) DSL
    e) None of the above
18. The capacity of a communication channel is measured in ______
    a) Bandwidth b) Bit capacity
    c) Baud rate d) Data flow
    e) None of the above
19. Voice band _______
    a) allows the user to download messages
    b) is used for standard telephone communication
    c) is used in special leased lines to connect minicomputers and mainframes
    d) provides a high-speed communication channel
    e) None of the above
20. The greatest capacity for data transmission happens in ____ devices.
    a) Voice band b) medium band
    c) broadband d) mega-band
    e) None of the above
21. A page fault:
    a) Is an error in a specific page
    b) Occurs when a program accesses a page of memory
    c) Is an access to a page not currently in memory
    d) None of the above
    e) All of the above
22. The process of transferring data intended for a peripheral device into a disk (or intermediate store) so that it can be transferred to peripheral at a more convenient time or in bulk, is known as ____
    a) Multiprogramming
    b) Spooling
    c) Caching
    d) Virtual programming
    e) All of the above
23. An instruction in a programming language that is replaced by a sequence of instructions prior to assembly or compiling is known as
    a) Procedure name
    b) Macro
    c) Label
    d) Literal
    e) None

KEY:

1) a 2) d 3) d 4) d 5) c
6) a 7) c 8) d 9) c 10) b
11) a 12) a 13) c 14) b 15) c
16) d 17) d 18) a 19) b 20) c
21) c 22) b 23) b

Software

Software, simply are the computer programs. The instructions given to the computer in the form of a program is called Software. It is the set of programs, which are used for different purposes. All the programs used in computer to perform specific task is called Software.

Types of software

1. System software

a) Operating System Software
DOS, Windows XP, Windows Vista, Unix/Linux, MAC/OS X etc.

b) Utility Software
Windows Explorer (File/Folder Management), Windows Media Player, Anti-Virus Utilities, Disk Defragmentation, Disk Clean, Back Up, WinZip, Win RAR etc.

2. Application software

a) Package Software
Ms. Office 2003, Ms. Office 2007, Macromedia (Dreamweaver, lash, Free hand), Adobe (Page Maker, Photo Shop)

b) Tailored or Custom Software
SAGE (Accounting), Galileo/ World span (Travel) etc.

Computer Languages & Scripting:

a) Low Level Language
i) Machine Level Language
ii) Assembly Language

Machine language: These language instructions are directly executed by CPU.

Assembly language: The endeavor of giving machine language instructions a name structure that means bit strings of instructions of machine language are given name here.

b) High Level Language
It is the user friendly language, more natural language than assembly language. Assembler is needed to convert assembly language into machine language. Complier is needed to convert high level to machine language.

COBOL (Common Business Oriented Language), FORTRAN (Formula Translation), BASIC (Beginner's All-purpose Symbolic Instruction Code), C, C++ etc. are the examples of High Level Language.

Booting

The process of loading the system files of the operating system from the disk into the computer memory to complete the circuitry requirement of the computer system is called booting.

There are two types of booting:

1. Cold Booting:
If the computer is in off state and we boot the computer by pressing the power switch 'ON' from the CPU box then it is called as cold booting.

2. Warm Booting:
If the computer is already 'ON' and we restart it by pressing the 'RESET' button from the CPU box or CTRL, ALT and DEL key simultaneously from the keyboard then it is called warm booting.